Damage Book

UNIVERSAL LIBRARY

OU_206279

UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T294.592 P98B Accession No.

Author ప్రభుదత్త (బ్ర)హ్మచారి

Title భక్తచరితావళి

This book should be returned on or before the date last marked below

భాగవతకథ

బలిచక్రవర్తి

సప్తమ వైవస్వత మన్వంతరము

౫౮౫

శ్లో॥ మనుర్వివస్వతః పుత్రః శ్రాద్ధదేవ ఇతి శ్రుతః ।
సప్తమో వర్తమానో యస్తదపత్యాని మే శృణు ॥

—శ్రీభాగ. ౮ స్కం. ౧౩అ. ౧ శ్లో.

తే. నరవరాధీశ యిప్పు డుండుచు నున్న
వాఁడు సప్తమ మనువు వైవస్వతుండు
శ్రాద్ధదేవుఁ డనందగు జనవరేణ్య
పదురు నందను లాతనికిఁ బ్రకటబలులు ॥

...శ్రీమదాంధ్ర భాగవతము

ప్రపంచములో విశ్వకర్మచే నిర్మింపఁబడిన పదార్థము లన్నిటికి నేదియో ఒక సంజ్ఞ కలుగు. సంజ్ఞలేని పదార్థమే లేదు. సంజ్ఞావంతములగు పదార్థములుగా ధాయు నవస్థ పొందియే తీరును. చీఁకటిలో సమస్త వస్తువు లున్నను వాని సంజ్ఞ అజ్ఞాతముగ నుండును. ఘట, పట, వస్త్రాది భూషణాద

వివిధ పదార్థములున్నను నంధకారములో వాని వివేక
ముండదు. ప్రకాశము లేక ఛాయ వ్యక్తము కాదు. కావున
సంజ్ఞా ఛాయలకు స్వామి వివస్వంతుడగు సూర్యుడు. ఆతని
వలననే శ్రాద్ధదేవాది ధర్మ ప్రవర్తకుల యుత్పత్తియగును.

సముద్ర మంథన కథను సమాప్తమొనర్చి పూర్వ
కథను ప్రారంభించుచు శ్రీ శుకుడు పరీక్షిన్మహారాజుతో
నిట్లనెను :- "రాజా! నేను నీకు చతుర్దశ మన్వంతర కథ
లను గూర్చి చెప్పుచున్నాను. కృత, త్రేత, ద్వాపర, కలి
యుగములను నవి నాలుగు. ఇట్టి యుగ చతుష్టయములు
వేయి గడచిన బ్రహ్మకొక పగలగును. దీనినే కల్ప
మందురు. ఒక కల్పమునకు పదునాలుగు మన్వంతరము
లుండును. ప్రతి మన్వంతరమునను భగవంతునియొక్క ఒక
విశిష్టావతారముండును. ఇంతవఱకు నేను నీకాఱు కల్పముల
యొక్కయు, వానిలో వచ్చు నవతారముల యొక్కయు
వర్ణనమును గావించితిని ప్రథమ స్వాయంభువ మన్వంతర
మున యజ్ఞభగవానుడు [illegible]నావతారమయ్యెను.
ద్వితీయ మన్వంతరము స్వారోచిష మను. దానిలో విభుడవత
రించెను. తృతీయమగు నుత్తమ మన్వంతరమందు సత్య
సేనుడను భగవదవతారము వచ్చెను. చతుర్థమగు తామస
మన్వంతరమున గజమును గ్రాహమునుండి వదలించిన హరి
యవతారము వచ్చినది ఐదవదగు రైవత మన్వంతరమున

వైకుంఠ భగవానుఁడు వచ్చెను. ఆఱవదగు చాక్షుష మన్వంతరమున మన్వంతరావతారుఁడగు నజిత భగవానుఁడు సముద్ర మంథనమును విచిత్రలీల లొనర్చెను. ఈ సమయమున జరుగుచున్న మన్వంతరము వైవస్వత మన్వంతరము ఇంతవఱకు దీనిలో నిరువది యెనిమిది మహాయుగములు గడచినవి. ఈ యిరువది తొమ్మిదవ కలియుగాదియందే పూర్ణావతారుఁడగు నందనందనుఁ డవతరించి నాఁడు.”

అంతఁ బరీక్షిన్మహారాజిట్లడిగెను :- “ ఈ మన్వంతరము పేరేమి? దీని కధిపతియగు మను వెవఁడు? ఇందులో భగవంతుని మన్వంతరావతారము లేవి? ఇంద్ర, మనుపుత్ర, సప్తర్షి, దేవగణము లెవరు? దీనిని నీవు విస్తారముగఁ జెప్ప వలయును.”

ఇది విని శుకదేవుఁడిట్లనెను :- రాజా! వర్తమానమగు నీ సప్తమ మన్వంతరమున కధిపతి వివస్వంతుని పుత్రుఁడగు శ్రాద్ధదేవుఁడు. ఇతని ఇక్ష్వాకు, నభగ, ధృష్ట, శర్యాతి, నరిష్యంత, నాభాగ, దిష్ట, కరూష, పృషధ్ర, వసుమంతులను బదుగురు మనుపుత్రులుదయించిరి. వారి వంశజులే నేటివఱకు పృథివిని శాసించుచున్నారు. నీవు వీరి వంశజుఁడవే. ఆదిత, వసు, రుద్ర, విశ్వేదేవ మరుద్గణము, అశ్వని కుమారులు, ఋభుగణము వీరు దేవతాగణములు. ఈ మన్వం

తరపు ఇంద్రుని పేరు పురందరుఁడు. కశ్యప, అత్రి, వసిష్ఠ, విశ్వామిత్ర, గౌతమ, జమదగ్ని, భరద్వాజ వీరి మన్వంతరముల సప్తర్షులు. ఈ మన్వంతరమునందు కశ్యపభగవానుని వలన నదితియందు వామనుఁడను మన్వంతరావతారము వచ్చెను. ఇంద్రునకుఁ దమ్ముఁడగుటచే నితఁడుపేంద్రుఁడనియును బిలువఁబడెను. ఈ విధముగా నిట్లేడు మన్వంతరములు గడిచినవి. ఇప్పుడు నేను రాఁబోవు నేడు మన్వంతరముల వర్ణము నొనర్చెదను. దీనిని దివ్యదృష్టిచేఁ గాంచి పూజ్యులగు మా తండ్రియు' సర్వసమర్థుఁడునగు వ్యాసమహర్షి దీనిని లిఖించి యుండెను రాఁబోవు అష్టమమన్వంతరాధిపతియును వివస్వతుని పుత్రుఁడగు సావర్ణియే కాఁగలఁడు. ఈతఁడు శ్రాద్ధదేవ మనువునకుఁ దమ్ముఁడు. వీరికిఁ దండ్రి యొక్కఁడే. తల్లులు వేరు.

అంతఁ బరీక్షిన్మహారాజగుఁ బరీక్షిత్తు ఈ విధముగఁ బ్రశ్నించెను :— "స్వామీ! ఇద్దరు పుత్రులును మనువులైన వివస్వానుని భార్యలెవరు? పుత్రులెవరో నాకు తెలుపవలయును. ఈ విషయమును జెప్పినతరువాత నష్టమ మన్వంతరమును వర్ణించుడు."

ఇది విని శుకదేవుఁడిట్లనెను :— "రాజా! ఇది చాల పెద్ద కథ. నేను మన్వంతర ప్రసంగమున దీనినిఁ జెప్పుటకుఁ బ్రారంభించినచోఁ గథా ప్రవాహమాగిపోఁగలదు. కాని

నేను సంక్షేపముగ నీకు వివస్వంతుఁడగు సూర్యసంతతిని గూర్చి చెప్పెదను.''

కశ్యపుని భార్యయగు నదితి గర్భమునుండి పండ్రెండుగురు పుత్రులుదయించిరని నేఁడిది నటకే చెప్పియుంటి. వారు ద్వాదశాదిత్యులనఁబడిరి. వారి పేర్లు వివస్వంత, అర్యమ, పూష, త్వష్ట, సవితా, ధాతా, విధాతా, వరుణ, మిత్ర, శక్ర, వామనులనువారు. వివస్వంతుఁడు వీరందఱిలోఁ బెద్దవాఁడు, ఈతఁడు ప్రజాపతియగు విశ్వకర్మ పుత్రికయగు సంజ్ఞను బెండ్లాడెను.''

అంత శౌనకుఁడిట్లనెను :– ''సూత ! మేము పురాణకథల దు వివస్వంతునకు సంజ్ఞ, ఛాయ, బడబ యను మగ్గురు భార్యలుండినట్లు వినియున్నాము. మీరొకే భార్యయున్నట్లు చెప్పుచున్నారు. ఇదేమి?''

అంత సూతుఁడిట్లనెను :– ''స్వామీ! అది సత్యమే. వివస్వంతునకు ముగ్గురు భార్యలుండిరి. కాని ముగ్గురు నొక్కటే ఇవన్నియును సంజ్ఞాభేదము లే. సంజ్ఞయే వీనిన్నిటి నొందర్చెనని చెప్పవలసియుండును. ఆమెయే యీ మూఁడు రూపములను ధరించి మూటి వలనను సంతానోత్పత్తిని గావించెను.''

అంత శౌనకుఁడిట్లనెను :– 'సూతా! ఒక్క సంజ్ఞ మూఁడురూపముల నేల ధరించినది? ఈ కథా ప్రసంగమును

మాకుఁజెప్పవలయును. దీనిని వినుటకు మాకు మిక్కిలి కుతూహలముగ నున్నది."

సూతుఁడిది విని యిట్లనెను :– "మంచిది స్వామీ! వినుఁడు. వివస్వంతుఁడను నది సూర్యునకుఁ బేరు. ఈతఁడు మిక్కిలి ప్రకాశవంతుఁడు. ఈతని తేజస్సు సహింపరానిది. ఎవ్వఁడును నధికకాలమీతని వైపు కన్నులను దెఱచి చూడఁజాలఁడు. దేవతల శిల్పియగు విశ్వకర్మకు సంజ్ఞయను నొక పుత్రిక కలదు. ఆమెను వివస్వంతునకిచ్చి పెండ్లిచేసెను. వివస్వంతుఁడు తన భార్యతో నుండెను. భార్యాభర్తలు సమానులైనచోఁ బ్రేమ పరస్పరముండును. భర్త ధనికుఁడై భార్య దరిద్రపు యింటి పిల్లయైనను, భార్య భాగ్యవంతుని యింటిదై భర్త దరిద్రుఁడైనను బరస్పరము మనో మాలిన్యముండి తీరును. భర్త బాగు గాఁజదివినవాఁడై భార్య మూర్ఖురాలైనను, భార్య పూర్ణ విదుషీమణియై భర్త పేఁసుద్దయైనను వారికి మనస్సులు కలువవు. పతి అత్యంత సుందరుఁడై, పత్ని కురూపియైనను, పత్ని అప్సరస వలె సుందరియై పతి యనాకారుఁడైనను వారిద్దరికినిఁగలియదు. పతి అత్యంత తేజస్వియై పత్ని అమాయకురాలును దెలివి తక్కువదైనను వారిద్దరకను గలియదు. కావున సంబంధమును సమానకులములోఁ జేయవలయును. ఆశ చేత నాడు పిల్లలను గొప్పవారింట నిచ్చినచో నిర్ధన బాలికలకు

అడుగడుగున నెన్ని తిరస్కారములు కలుగుచుండునో ఆ విషయమును నా పిల్లలు తప్ప యింకెవరును దెలిసికొనఁజాలరు. విద్వాంసుఁడను లోభముచేఁదన చదువురాని పుత్రికను మంచి చురుకైన వాఁడును, విద్వాంసుఁడునైన వానికిచ్చి వివాహమొనరించినచో నామె పతికెంత దూరముగ నుండవలసివచ్చునో, యే విధముగ నప్పుడప్పుడు సంబంధవిచ్ఛేదముకూడ జరుగునో యట్టి సంఘటనలు పూర్వమునుండియును వచ్చుచునే యున్నవి.

విశ్వకర్మవలనను నీ పొఱపాటే జరిగినది. సంజ్ఞ అమాయకపు స్త్రీ. సూర్యుఁడు మిక్కిలి తేజస్వి, అతని తేజస్సును సంజ్ఞ సహింపఁజాలకపోయెను. ఆమె గర్భమున ముగ్గురుదయించిరి. వారిలో శ్రాద్ధదేవుఁడును, యమదేవుఁడును బుత్రులు, యమున యనునది పుత్రిక, ముగ్గురు సంతానము కలిగినను సంజ్ఞ సూర్యుని సమ్ముఖమునకు వచ్చుటకు భయభీతయగు చుండెను. అతఁడు గొప్ప తేజస్వి. మూఁడు లోకములను దపింపఁజేయువాఁడును, ప్రకాశమొసంగువాఁడునై యుండెను.

ఒక దినమున సంజ్ఞ యిట్లనుకొనెను:- "నాకీ యింటిలో నిర్వాహము కాఁజాలదు. తనపతియొక్క యింత తేజమును తాను సహింపఁజాలననుకొని తన ఛాయచేఁదన వలెనే ఒక స్త్రీని సృష్టించెను. విశ్వకర్మ యొక్క కూఁతురు

కావునఁదన తండ్రి యొక్క గుణములామెకు స్వాభావికముగనే వచ్చెను. సంజ్ఞా ఛాయలలో నే మాత్రమును భేదము లేకుండునట్లామె యేర్పడెను. ఈ విధముగ నామె ఛాయను నింటిలోనుంచి, తన సంతానమును బాగుగాఁజూడవలయునని ఆమెకుఁజెప్పి, ఒక దినమున నామె మెదలకఁదనయింటి నుండిబయలు దేరెను. భార్యభర్తయింటినుండి బయలు దేరి యెచ్చటికి బోవును. స్త్రీస్వాధీనములో నుండుట చాలా కష్టము. స్వతంత్రముగనుండిన నామె ధర్మమును రక్షించుకొనుట చాలాకష్టము. అందువలన నామెయుండుటకు రెండే యిండ్లుకలవు. ఒకటి భర్తగృహము; రెండవది పుట్టినిల్లు. కావున సంజ్ఞముందుగాఁ దండ్రియగు విశ్వకర్మ యింటికిఁ బోయి, తనతండ్రికి నిజవృత్తాంతము నంతను జెప్పెను.

తండ్రి కసరి యిట్లనెను:—' పుత్రీ! నీసంగతి నాకు బాగుండ లేదు. ఏమైనఁ గానిండు. బుద్ధిమంతురాలగు స్త్రీతన యింటిలోనే యుండవలయును. అచ్చటనేయుండవలయును. పొమ్ము. సూర్యనారాయణుఁడు వినినచో నాతఁడు నాపైఁ గోపపడఁగలఁడు.''

సంజ్ఞ యెంతో ఆశతో నింటికి రాఁగాఁదండ్రి తన్ను యింటిలో నుండనియక, లోపలికే రానియక పంపించుటను గ్రహించి, ఆమెతనపతి యింటికిని బోను, పుట్టినింటను నుండనని మనస్సులో నిశ్చయించుకొని ఆమె ఘోర వనమునకుఁ

బోయెను. యువతియగు స్త్రీ యేకాంతముగ వనములలో నుండుట యుచితము కాదు. అందువలన నామెకిష్టము వచ్చిన యాకారమును ధరించు శక్తియుండుటచే నామె గుఱ్ఱము రూపమును ధరించి యచ్చట నివసించు చుండెను. చూచువారలెవరో గుఱ్ఱము మేయుచున్న దనుకొనుచుందురు. ఈవిధముగ నామె యేకాంతమునం దన దినములను వెడలం బుచ్చుకొనుచుండెను.

ఇచ్చట ఛాయ వివస్వంతుని సేవను సంజ్ఞకు వలెనే చేయుచుండెను. ఆతనికి సందేహము కలుగలేదు. ఆతడు ఛాయను సంజ్ఞయనియే భావించుచుండెను. ఆకృతి ప్రకృతులన్నియును సంజ్ఞకు వలెనే యుండెను. ఆమె సంజ్ఞ పిల్లలను గూడ బాగుగాం జాలను పోషణమొనర్చు చుండెను. కాలాంతరమున నామె గర్భనుండియును ఇద్దరు పుత్రులును, నొక కన్యకయును మొత్తము ముగ్గురు సంతానము కలిగెను. పుత్రుల పేర సావర్ణి, శనైశ్చరులు కన్యక పేరు తపతి. ఈవిధముగ ముగ్గురు సంజ్ఞకును ముగ్గురు ఛాయకును మొత్త మారుగురు సంతతి కలిగిరి. పిల్లలందఱును ఛాయనే తమ తల్లిగ భావించు చుండిరి

ఎంతగా బ్రయత్న మొనర్చినను మానవునకు స్వపర భేదముండి తీరును. విశేషముగ స్త్రీలలో సవతి పిల్లలందు విరక్తి పూర్వము నుండియును వచ్చుచున్నది. కొందఱు తల్లులలో దీనికపవాదమును గలదు. అది నియమములేము

కాదు ఛాయయును దనపుత్రులకును సజ్ఞాపుత్రులకును భేదమెంచుచుండెను. ఆడపిల్ల లోర్చుకొందురు కాని మగపిల్లలు భేదభావము నోర్చుకొనఁజాలరు. సంజ్ఞాపుత్రులగు శ్రాద్ధదేవుఁడును యమధర్మరాజును, వారి చెల్లెలగు యమునయును ఛాయావర్తనమును సహింపఁజాలక పోయిరి. మంచి మిఠాయిలు గాని, మంచివస్త్రములు వచ్చినచో మొదలఁ దన పుత్రులకే ఛాయ యిచ్చుచుండెను చూచెడిది, ఆ ముగ్గురల్లే యుండిరి. యమున ఆడుపిల్లగాన అన్నిటిని నోర్చుకొనుచుండిరి. శ్రాద్ధదేవుఁడు పెద్దవాఁడు బుద్ధిమంతుఁడు ఆతఁడిట్టి విషయములలో మనస్సు నుంచలేఁడు. యముఁడు కొంచెము మిగులఁ గ్రోధస్వభావము కలవాఁడు. ఒకదినమున నేమో విషయమున వాదవివాదములు జరిగెను. విషయము చిన్నదే; కాని మనస్సు మొదటనే చెడియున్నది. హృదయము భావము లిదివఱకే దూషితములై యుండెను. అవి యిప్పుడు పెల్లుబికినవి. ఛాయ పరుషములాడి నాతని యశిష్టముగఁ గసరి గద్దించెను. యమరాజు కుఱ్ఱవాఁడు. నూతన రక్తము. అందువలనఁ గ్రోధోన్మత్తుఁడై ఆతఁడు తల్లినిఁదన్నుటకు పాదము నెత్తెను.

అంత మిక్కిలి కోపముగల ఛాయ యమున కిట్లు శపించినది:– ఏపాదములతో నన్నుఁజాపుటకు నీవెత్తితివో దానికిఁ బురుగులు పడుఁగాక. అవియూడిపడుఁగావుగాక!”

ఇప్పుడు యముఁడు భయపడి యేడ్చుచుఁ దన తండ్రి కడకుఁ బోయి యిట్లనెను:— "తండ్రీ! నాపాదములఁ బురుగులు పడుఁగలవనియు, ... యూడిపోఁగలనియు నాతల్లి శపించినది"

వివస్వంతుఁ డిట్లనెను:—"నాయనా! నీవును నేదియో యనియుండుదువు ఒకటికాని తీఁ జప్పుడురాదు. తప్పక నీవు గొప్ప యనిష్టకార్యము నేదో చేసియుందువు."

ఏడ్చుచు యముఁ డిట్లనెను:— "లేదు తండ్రీ! నే నేమియు ననలేదు. ఈమె యెల్లప్పుడును మా మువ్వురను జూచినఁ గసరుచుండును. మాయెడల విషమవ్యవహార మొనర్చుచుండును. మాకంటెను జనితులైన వారగు సావర్ణి, శనైశ్చరుఁడు, తపతి వీరలను మిక్కిలిగఁ బ్రేమించుచుండును. మంచి మంచి వస్తువులను వారికిఁ బెట్టుచుండును మమ్ముల నెప్పుడు నుపేక్షించుచుండును. ఎంగిలికూడు, పాసినకూడు పడవేయుచుండును. ఇంకెప్పుడు నిట్టి విషమ వ్యవహారమునే యొనర్చుచుండును నేఁడు మాటలలోనే ఆమె నాతోఁ దగవులాడుచున్నది. నేను బాల చాపల్యవశమున నామెను దన్నుటకుఁ గాలెత్తితిని. అప్పుడామె యీదారుణశాపము నొసంగినది. తండ్రీ! పుత్రుఁడు కుపుత్రుఁడైనను మాత కుమాత కాఁజాలదని మేము వినుచున్నాము. ఈమె యిదంతయును గుమాత చేయు కార్యమునే యొనర్చి

నది. దీనినిబట్టి యీామె మీాకు యథార్థముగు తల్లికాదని సందేహము వేయుచున్నది. ఈమె యింకొక యామెయై యుండనోపు."

ఇది వినఁగానే వివస్వంతునకు సందేహము కలిగెను. అతఁడు ధ్యానమునఁ జూడఁగా నీమె ఆమె ఛాయయని తెలిసెను. అప్పుడాతనికి మిక్కిలి కోపము వచ్చి ఆమె కడకుఁబోయి యిట్లనెను :-"దుష్టా! నీవెవతెవో నిజముగఁ జెప్పుము."

ఇది విని ఛాయ గడగడ వణఁకుచు, సూర్యుని యపార తేజమును సహింపఁజాలక పోవుటచే నత్యంత భయభీతయై ఆమె నిజమును వచించెను.

సూర్యనారాయణుఁ డిట్లడిగెను :- "ఇదంతయును నీవు నాకు మొదట నేలఁజెప్పలేదు?"

ఛాయ స్ఖలిత వాక్కులతోఁ గంపించుచు నాగియాగి యిట్లనెను :-"దేవా! ప్రాణముల మీాఁదకు వచ్చునంతవఱకీ విషయమును జెప్పఁగూడదని ఆమె ఒట్టు పెట్టుకొనినది. మీారు నన్ను భస్మమొనర్పనున్నవారుగు నంతలో నేను మీాకు సత్యవిషయమును నివేదించితిని. ఇప్పుడు నీకేది యుచితమని తోఁచిన దానిఁ జేయుము. నేను దండనార్హురాలనగుచో దండింపుము, కాని ప్రభూ! ఇందులో నా యపరాధ మేమియును లేదు."

సూర్యదేవుఁ డిట్లనుకొనెను :—"ఆవును, ఈమె అప
రాధమేమున్నది ? నా యథార్థపు భార్యను వెదుకవలెను"
అనుకొని వివస్వంతుఁడు విశ్వకర్మ లోకమునకుఁబోయెను.
తన యల్లుఁడు వచ్చుటను గాంచి విశ్వకర్మ ఆతనికి స్వాగత
సత్కారము లొనర్చి కుశల ప్రశ్నల నడిగెను."

విశ్వకర్మయొక్క కుశల ప్రశ్నలకు జవాబొసంగక
మిక్కిలి క్రోధముతో సూర్యుఁడిట్లనెను :—"మీరెంతటి
పెద్దమనుష్యులు. మీ పిల్లను మీయింటనే యుంచుకొనఁ
దలఁచిన నామెను నాకిచ్చి యేల వివాహ మొనర్చితిరి !
ఆమె యెన్నో దినములైనది నన్ను వదలి వచ్చి మీరు
నాకు కబురైనను జేయలేదేమి !"

విశ్వకర్మ వినయముతో నిట్లు ప్రత్యుత్తరమొసం
గెను :—"నాయనా! కోపగింపకుము. ముందుగా నామాటను
వినుము. నా పిల్లను బిలిపించుకొని తెచ్చుటకు నావసర
మేమున్నది ? ఆమె నాదగ్గఱకు వచ్చినమాట నిజమే కాని
నే నామెను ద్రిప్పి పంపివైచితిని. ఆమె తిరిగి నీకడకు
రాలేదా ? ఈసంగతి నే నిప్పుడే విను చున్నాను"

సూర్యదేవుఁడిట్లనెను :—"నాయింటఁ గొదువ యే
మున్నది ? ఆమె నాయింటిని వదలి వెళ్ళుట యెందులకు !"

అంత గంభీరుఁడై ధైర్యముతో విశ్వకర్మయిట్లనెను:—
"స్వామీ! అన్యథా తలంపకుఁడు. స్త్రీ ధన, వస్తు,

వాహన, వస్త్రాదులను గోరను. ఆమెకు కావలసినది పతి ప్రేమ. పతిప్రేమలేని యౌవన సమస్తవిశ్వములను సంపత్తును స్త్రీకి గ్రాసమగును. ప్రేమయు లేనిచో సాయంకాలమున నొక పూట గంజియున్నను నామె కమృతముతో సమానము. ఆమె నీయీ ప్రబల తేజమును సహింపలేకున్నది. నీవమునులో క్షేమముండదు. కావున నీ తేజమును కొంచెముగ దగ్గించుకొనుము. నే నామె జాడను నీకుఁ జెప్పెదను ఆమె ఘోరారణ్యములో గుఱ్ఱమై తపస్సు చేయుచున్నది.''

ఇది వినగానే వివస్వంతుడును గుఱ్ఱమై ఆమె సమీపమునకు పోయెను ఆడు గుఱ్ఱమైన తన పత్నిగా గుఱ్ఱమైన సూర్యుఁడు సంగమించెను ఆమె నుండి అత్యంత సుందరులును కవలపిల్లలు నరపురుష రిద్దరుత్పన్నమైరి. వారే అశ్వినీ కుమారులు. వీరిద్దరును గలిసి యుందురు దేవతలకు రాజవైద్యులైయుందురు

ఇద్దరును గలిసి విశ్వకర్మవద్దకు వచ్చిరి. సూర్యుఁడిట్లనెను:— ''నీవు ప్రపంచములో సర్వశ్రేష్ఠుఁడగు శిల్పివి. నా తేజస్సును దగ్గించుము.'' ఇదివిని విశ్వకర్మ సూర్యుని సాన బెట్టి ఆతని తేజస్సును దగ్గించెను. అయినను నింకను దగ్గక పోగా నాతనిఁ బ్రాదేశము శాణము లోనగ్చెను. అప్పటినుండి ద్వాదశాదిత్యులైరి. సానబట్టఁగా మిగిలిన తేజస్సుచే

సుదర్శన చక్రమును, శివుని త్రిశూలమును, ఆతని ఆజగవమను ధనుస్సును, ఇంద్రుని వజ్రమును జేసెను.

ఇది విని నవ్వుచు శౌనకుఁడిట్లనెను:—"సూతా! ఒక్కొక్కప్పుడు నీవు యూహాతీతములగు విషయములను జెప్పుచుందువే సూర్యుని విసుకతోఁ గొట్టుటకుఁ గాని, సాన మీఁదనో రిపిడి పెట్టుటకుఁగాని ఆయన మనుష్యుఁడు గాఁడు. ఆతఁడు దేవుఁడు. జాజ్వల్యమానమగు గ్రహము."

సూతుఁడిట్లనెను:—"స్వామీ! అన్ని విషయములును నాధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక భావములతోఁ జెప్పఁబడును అన్నింటియందును రూపక మున్నదును ఈ ప్రపంచమే కాలచక్రము. దీనిమీఁద కెక్కి పరోపకార కార్యములందే నెవఁడు తేజమును వ్యయమొనర్చెడునో ఆతని తేజము సఫలమగును దానిచేతనే సర్వాత్మయగు ప్రభువు సంతుష్టినిఁ జెందును. తాను తేజోగర్వమును జెంది, సదా పరులకవమానమొనరఁచు చేయుచుండునో, నమ్రముగా నెవఁడుండఁడో, విశ్వస్సృజనమొనర్చు వానిసమీపమునను స్రష్టఁడై ఆత్మసమర్పణ నెవఁడు చేయఁడో, తన తేజమును నెవఁడు విభాగింపఁడో అట్టివానినిఁగూర్చి యెవఁడును సంతుష్టినిఁ జెందఁడు. తనవారు పరాయివాండ్రగుదురు. ఆధిదైవిక రూపమందు దేవత లెట్లు కావలయునని నల్లుకాఁగలరు."

శౌనకుఁడిట్లనను:–"మంచిది, అయితే తరువాత నేమైనది? ఆతని సంతానమేమొనర్చిరి?"

సూతుఁడిట్లనను:– "వివస్వంతునకుఁ బెద్దకుమారుఁడగు శ్రాద్ధదేవుఁడీ మన్వంతరమునకు మనువయ్యెను. రెండవ పుత్రుఁడగు యముఁడు ఘోరతపంబొనర్చి లోకపాలుఁడయ్యెను. ఆతఁడు ప్రాణులకుఁ బుణ్యపాపఫలముల నొసంగుచుండును, యమరూపమునఁ బాపులను శిక్షించు చుండును. ఈతని చెల్లెలు యమున నదీరూపమునఁ బాపులను దరింపజేయును. ఆమె భగవానునకుఁ బట్టపురాణి యయ్యెను. ఛాయాపుత్రుఁడగుసావర్ణి యిప్పటికిని సుమేరువునందు తపము మొనర్చుచున్నాఁడు రాఁబోవు మన్వంతర మందాతఁడును మనుపదవియందుఁ బ్రతిష్ఠితు డగును, ఆతని రెండవకుమారుఁడు శనైశ్చరుఁడు గ్రహమయ్యెను. ఈతఁడు గ్రహములన్నిటిలో మెల్ల మెల్లగా గదలును, అందువలన శనైశ్చరుడనఁబడెను. కొన్నిగ్రహములు రెండుం బాతికదినములునుఁ కొన్ని నెలలుగను, కొన్నివర్షములుగను జ్యోతిశ్చక్రమునఁ బరిక్రమించును, కాని ఈతనికి రెం డున్నర సంవత్సరములు పట్టును. ఈతఁడెవరినిఁ జూచిన వానికి సర్వనాశనమగును. ఈతని చెల్లెలగు తపతి వివాహము సంవర్ణ మహారాజుతో నయ్యెనుఁ ఈతడును దరువాత నదియై ప్రవహించెను.

ఈసోదరులందఱును శాసకులును, కర్మానుసారముగ ఫలము లొసంగువారైరి. వీరందఱిలో యమున యొక్కతెయే పాపులను గూడ తరింపఁజేయు దయావతి యయ్యెను. ఈమె యమునకు సోదరి యగుటచేఁ గొంచెము సౌకర్యమేర్పఱచినది.''

అంత శౌనకుఁ డిట్లడిగెను :- ''వివస్వంతుని పుత్రియగు యమున తన సోదరుఁడగు యమునితోఁ బ్రాణుల కొఱకేయే సౌకర్యముల నేర్పఱచినదో మాకు చెప్పవలయును.''

అంత సూతుఁడిట్లనెను :- ''స్వామీ! యమున మిక్కిలి దయావతి. ఆమె అన్నయగు యముఁడతి కఠోర హృదయుఁడు. అతఁడు నిత్యమును బ్రాణులను జంపును, పాపులకుఁ గఠోరదండన మొనరించును. దీనినిఁగాంచఁగనే యమునకు జాలదయ గలిగెను. ఆమె తన సోదరునితోఁ జాలసార్లిట్లనెను :- ''అన్నా! ప్రాణుల నిట్లు వేధించుట ఉచితము కాదు''

యమరా జిదివిని యమునను గసరుచు నిట్లనెను :- ''నీవు చిన్నదానవు. నీకు బుద్ధిలేదు. కర్తవ్యపాలన మొనర్చుటయే ధర్మము.''

యమున మెదలకుండెను. ఆమె అనేకసార్లు యముని దన యింటికిఁ బిలిచెను. కాని యింకొకరి యింటికి వెడలు

టకు యమున కవకాశమెచ్చటిది? యమున భ్రాతృ స్నేహమున మాటి మాటికిని బిలుచుచుండును.

ఒకసారి యముఁడిట్లనుకొనెను :- "చిన్న చెల్లెలు మాటి మాటికినిఁ బిలుచుచున్నది. ఈమె యింటికి వెళ్ళి రావలెను." అనుకొని యముఁడామె యింటికి వెళ్ళెను. యమున తన సోదరునిఁగాంచి ఆతనికి గొప్ప సత్కార మొనర్చెను. అనేక విధములగు చక్కని వ్యంజనముల నొనర్చెను. మిక్కిలి ప్రేమతోఁ దన చేతులతోడనే చాల వస్తువులను జేసెను. మంచి యాసనములను బఱచి ఆతనికి భోజనము పెట్టెను. మాలలువైచెను. తాంబూల మొసంగెను. ఆతని మస్తకమునఁ దిలకమును బెట్టెను. యమరాజు సోదరికి కొంచెముగ దక్షిణ నొసంగెను. అంత నత్యంత ప్రేమతో యమున యిట్లనెను :- "అన్నా! నేనీ దక్షిణను గైకొనను. నీకేదైన నియ్యవలయునని నాకొక వరదాన మొసంగుఁడు."

యమరాజిట్లనెను :- "సరియే, అడుగుము. ఏ వరము కావలయును?"

యమున యిట్లనెను :- "నేను కోరునదేమనఁగా నేఁటిదినమున నే సోదరి తన సోదరునకుఁ బ్రేమపూర్వకముగ భోజనమొసంగి, ఆతని నుదుటఁ దిలకమిడునో, సోదరుఁడామెకు దక్షిణాదులచే సత్కారమొనర్చునో ఆ యిద్దరకును నీకడ యమయాతనలనుభవింపవలసినపని లేక పోవునుగాక!"

యమరాజు నవ్వి యిట్లనెను :– "సోదరీ! నీవు నన్ను వెరాసగించితివి. మంచిది, అట్లే అగుగాక! నేటినుండి యే సోదరి తన సోదరునకత్యంత ప్రేమతో భోజనమిడఁగా, సోదరుఁడామెకు హృదయపూర్వకముగ సత్కరించునో వారిద్దరును నాదండనమునకుఁ బాత్రులుకాకుందురుగాక !" ఇట్లు పలికి యముఁడు తన లోకమునకుఁ బోయెను.

అది దీపావళీ తరువాతఁ గార్తికశుక్ల విదియ. ఆ దినము నుండి ఆ ద్వితీయకు భ్రాతృద్వితీయ యందురు. అప్పటినుండి ప్రేమమయులగు సోదరీమణులు తమ సోదరులకు ఆ దినమునఁ బ్రేమతో భోజనమిడుచుందురు. ఏదో దక్షిణను గూడ గ్రహించెదరు. యమున దయచే యమయాతననుండి విడివడెదరు. కావున నాదినమున యమునాస్నానమవశ్యము చేయవలెను యమునాతీరమున నున్నచో సోదరునకు భోజనమిడవలెను. యమునా తీరము దొరకకున్నను నింటిలోనైనను జేయవచ్చును."

సూతుఁడిట్లనెను :– "మునులారా ! నేను సంక్షేపముగ వివస్వంతుఁడగు సూర్యుని యొక్కయు, ఆతని సంతానము యొక్కయు కథను జెప్పితిని. మీరు రాబోవు సప్త మన్వంతరముల వృత్తాంతమును వినుఁడు."

ఆగామి సప్త మన్వంతరముల కథ

౫౮౬

శ్లో॥ రాజంశ్చతుర్దశైతాని త్రికాలానుగతాని తే ।
ప్రోక్తాన్యేభిర్మితః కల్పో యుగ సాహస్ర పర్యయః॥

—శ్రీ భాగ. ౮ స్కం. ౧౩ అ. ౩౬ శ్లో॥

క. జగతీశ త్రికాలములను
బాగడొందుమను ప్రకారములు సెప్పఁబడెం
దగఁబదునలుఁవురు మనువులుఁ
దెగయుగములు వేయి నడవ దివమజునకగున్.

—శ్రీ మదాంధ్రభాగవతము,

సాధారణముగఁ గథాప్రసంగమున శ్రోతలకు వంశావళిని గూర్చి వినవలయునను కుతూహలముండదు. ఆతని కీతఁడు పుత్రుఁడయ్యెను. ఈతఁడు మంత్రియయ్యెను ఈతఁడు పురోహితుఁడయ్యెనను సంగతులను వినుటవలనఁ బ్రయోజనమేమున్నది? ఏదైన విశిష్టసంఘటనమున్నచో నందు రుచి వృద్ధిపొందును, విశేషఘటనము లేకున్నచో దానియందుఁ బ్రవృత్తియుండదు. ఈ వంశావళిని వినుటచేతను, వీరినామములను వినుటచేతను స్వర్గము కలుగును, పుణ్యములు వృద్ధి పొందునను ఫలశ్రుతిని జెప్పుట కథయందు బ్రవృత్తినిఁ గలిగించుటకే. ఏలననఁగా వంశావళినిఁ జెప్పుచున్న తరువాత కథ నడుచునట్లు? బీజముండిన దానియొక్క విస్తారముండును. కావున వంశాదప్రకరణము నీరసమైనను దానిని

ధైర్యపూర్వకముగ, బుణ్యప్రదమని భావించి శ్రద్ధతో విన వలయును.

శ్రీశుకదేవుఁ డిట్లనెను :- "రాజా! నేనీ కల్పమునఁ గడచిన ఆఱు మన్వంతరముల కథను జెప్పితిని. ఇప్పుడు జరుగుచున్న యేడవ మన్వంతర కథ విషయమును జెప్పితిని."

అంతఁ బరీక్షిన్మహారాజిట్లనెను :- "స్వామీ! వర్తమాన మన్వంతరకథను నీవత్యంత సంక్షేపముగఁ జెప్పితివి. వైవస్వతమను వంశమును వర్ణించియుండ లేదు. ఈ మన్వంతరావతారమగు వామనచరిత్ర విశేషములను జెప్ప లేదు. ఈ అన్ని విషయములను విస్తారముగఁ జెప్పవలయును జరిగిన దేమో జరిగినది. రాఁబోవునవి ఇంకను భవిష్యగర్భమున దాగియున్నవి. మనకు వర్తమానముతోఁ బనియుండును."

శ్రీశుకుఁడిట్లనెను :- "రాజా! నేను వైవస్వతమను వంశవర్ణనమును విస్తారముగ నొనర్చెదను. వామనచరిత్రమును జెప్పెదను. కాని యీ కథా ప్రసంగమును బూర్తి చేయుటకై సంక్షేపముగ నీవీకల్పములోని భూత, వర్తమాన, భవిష్యద్మనువుల వృత్తాంతమును వినవలయును. భూతవర్తమాన మనువుల విషయమునుగూర్చి నేనిదివఱకు చెప్పితిని. ఇప్పుడు రాఁబోవు నేడుగురు మనువులనుగూర్చి వినుము."

రాజిట్లనెను :- "మంచిది స్వామీ! సంక్షేపముగఁ జెప్పుఁడు. భవిష్యము భవిష్యమేకదా!"

అంత శ్రీశుకుఁడిట్లనెను :- "సగరా వినుము. ఎనిమిదవ మనువు వివస్వంతుని పుత్రుఁడగు ఛాయాసుతుఁడు సావర్ణి యగును నిర్మోహ విరజస్కులనువారాతనికిఁ బుత్రుఁ లగుదురు. విరోచన పుత్రుఁడగు బలి ఆ మన్వంతరమున నింద్రుఁడగును. తరువాత నీతఁ డింద్రపదవినిగూడ వదలి ముక్తుఁడగును. ఆ సమయమున గాలవ, దీప్తమంత, పరశు రామ, అశ్వత్థామ, కృపాచార్య, ఋష్యశృంగ, మా తండ్రి యగు వ్యాసభగవానుఁడు వీరందఱును సప్తర్షులయ్యెదరు. వారిప్పుడు వారి వారి ఆశ్రమములందు సమాధులలో నున్నారు. ఈ మన్వంతరమున భగవానుఁడు సార్వభౌముఁ డను పేర నవతరించును. ఆతని తల్లిపేరు సరస్వతిఁ ఆతనికి తండ్రి దేవగుహ్యముని కాఁగలఁడు. ఈతఁడిప్పటి యింద్రుని నింద్రాసనమునుండి లాగివైచి బలిని నింద్రాసనమునఁ గూర్చుండఁ బెట్టును.

తొమ్మిదవ మనువు వరుణుని పుత్రుఁడగు దక్షసావర్ణి కాఁగలఁడు. ఆతనికి భూతకేతువు, దీప్తికేతువు మొదలగు వారు పుత్రులగుదురు. పార, మరీచగర్భాదులు దేవతాగణ మయ్యెదరు. అద్భుతుఁడనువాఁడింద్రుఁడుగను, ద్యుతి మంతాదులు సప్తర్షులయ్యెదరు. ఆ మన్వంతరమందు భగ వానుఁడు ఆయుష్మంతుఁడనువానికి అంబుధార యను పత్ని యందు ఋషభనామమున నవతరించును. ఆతఁ డింద్రునకుఁ త్రైలోక్యరాజ్య ప్రదానమును గావించును.

పదవ మనువు ఉపశ్లోకుని పుత్రుఁడగు బ్రహ్మసావర్ణి యగును. అతనికి భూరిషేణాదులు పుత్రులగుదురు. హావిష్మంతుఁడు, సుకృతి, సత్య, జయ, మూర్త్యాదులు సప్తర్షులయ్యెదరు. సువాసన, విరుద్ధాదులు దేవగణములుగను, శంభుడనువాఁ డింద్రుఁడుగను నగును. ఈ మన్వంతరమందు భగవానుఁడు విష్వక్సేన నామమున విశ్వస్రష్టయొక్క గృహమున విషూచియను నాతని పత్ని గర్భమున నవతరించి శంభునకు సహాయమొనర్చి, ఆశతక్రతువును సుఖగా నొనర్చును.

పదునొకండవవాఁడు మహామనస్వియగు ధర్మసావర్ణి మనువు కాఁగలఁడు. అతనికి సత్య, ధర్మాదులను వారు పదుగురు పుత్రులుదయించెదరు. ఆసమయమున దేవగణముల పేరు విహంగమ, కామగమ, నిర్వాణరుచి అను వారు, ఇంద్రుని పేరు వైధృతుఁడు. ఆర్యకుని వీర్యమున వైధృతయను నామె గర్భమున నాసమయమున భగవానుఁడు ధర్మసేతువను పేర మన్వంతరావతార మెత్తును. ఆ మన్వంతర పర్యంతము ఇంద్రపాలనమా యంశావతారము ద్వారముననే జరుగును.

పంౘ్రెండవ మనువుపేరు రుద్రసావర్ణి. అతనికి దేవతానుఁడు, ఉపేక్ష, దేవశ్రేష్ఠాదులు మనుపుత్రులగుదురు. వారా మన్వంతరము పర్యంతము పృథివీపాలన మొనర్చి

దరు. ఆసమయమున బుతధాముఁడను నింద్రుఁడు వచ్చును. హరితాదులు దేవతాగణమయ్యెదరు. తపోమూర్తి తపస్వి, ఆగ్నీధ్రకాదులు సప్తర్షులయ్యెదరు. సత్యసహుఁడను ముని వలన సూనృతయను పత్నిగర్భమున భగవానుఁడు శ్రీహరి అంశావతారము కలుగును. ఆతఁడు సుధాముఁడను పేర నామన్వంతరమును బాలించును.

పదుమూఁడవ మనువు దేవసావర్ణియగును. చిత్రసేన విచిత్రాదులాతనికి మనుపుత్రులగుదురు. ఆసమయమున సుకర్మ, సుత్రామాలనువారు దేవతాగణమయ్యెదరు. ఇంద్రుని పేరు దివస్పతి, నిర్మోక. తత్త్వదర్శ్యాదులు సప్తర్షి పద మందు బ్రతిష్ఠితులగుదురు. ఆ సమయమున దివస్పతి నింద్ర పదము నందుంచి, ఆమన్వంతర మంతయును బాలింపఁ జేయుటకై యోగేశ్వరుఁడను పేర భగవంతుఁడవతరించును. ఆతని తల్లి పేరు బృహతి. తండ్రిపేరు దేవహోత్రుఁడు కాఁగలఁడు.

పదునాల్గవ మనువుపేరు ఇంద్రసావర్ణి. ఉర, గంభీర బుద్ధ్యాదులాతనికిఁ బ్రసిద్ధపుత్రులయ్యెదరు. ఆ సమయమునఁ బవిత్ర, చాక్షుపాదులు దేవగణ మయ్యెదరు. శుచి యను వాఁడింద్రుఁడగును. అగ్నిబాహు, శుచి, శుద్ధ, మాగధాదులు సప్తర్షి గణమయ్యెదరు రాజా! ఆమన్వంతరమున వితాన యను మహా భాగ్యవతియగు తల్లి గర్భమున

సత్రాయణ పుత్రుఁడగు బృహద్భానుఁడను పేర భగవంతుని అంశావతారము కలుగును. ఆతఁడా మన్వంతరమును పాలించి, ప్రపంచమునఁగర్మకాండను ప్రవర్తింపఁజేయును.

శ్రీశుకదేవుఁడిట్లనెను:- నేనివిధముగ జరిగిన నాఱు మన్వంతరములను, వర్తమాన మన్వంతరమును, రాఁబోవు నేడు మన్వంతరములను గూర్చియు వర్ణించితిని. బ్రహ్మయొక్క ఒక్క పగట పదునల్గురు మనువులు, పదునలుగు రింద్రులు, పదునలుగురు సప్తర్షులు పదునాలుగు దేవతాగణములు, పదునాలుగు మనుపుత్రవంశములు; పదునాలుగు భగవంతునియొక్క మన్వంతరావతారములు కలుగును. అప్పుడు బ్రహ్మకొక్క పగలగును దానికి కల్పమను పేరునుగలదు. కల్పాంతమందు త్రిలోకములు నశించును. నైమిత్తిక ప్రళయము సంభవించును అట్లేఅదే కాలము బ్రహ్మకు రాత్రియు నగును. ఇట్లుమూడువందల అఱువది దినములు బ్రహ్మకొక సంవత్సరము. ఆతని సంవత్సర మానమున నాతనికి నూఱేండ్లాయుస్సగును నూఱు సంవత్సరములైన తరువాతనింకొక బ్రహ్మరాఁగలఁడు. మరల నిట్లే సృష్టిక్రమము జరుగుచుండును. మరల సృష్టియగుచుండును. మరలఁగల్పము తీర్పుచుండును. ఈ చక్రము నానాదియై నడచుచున్నది. అనంతకాలమునందిట్లు జరుగుచునే యుండును. దానికంతము లేదు. ఈ కాలచక్రములో మానవుఁడు తన నూఱేండ్ల

ఆయుర్దాయమును జూచుకొని హెచ్చించుచు ననేక పాపము లొనర్చుచుండును. ఈ నూరేండ్లు అనంతాగాధ సముద్రములో రెండు బిందువులంత లేదు. కావున నభిమానమును వీడి కాలరూపుడగు కృష్ణుని జింతింపవలయును.

మన్వంతరము లందు మన్వాదుల కార్యములు

(౫౪౭)

శ్లో॥మన్వంతరేషు భగవన్ యథా మన్వాదయ స్త్విమే।
యస్మిన్ కర్మణి యేయేన నియుక్తా స్తద్వదస్వ మే॥

శ్రీభాగ. ౮స్కం ౧౪అ. ౧ శ్లో॥

ఆ॥ ఈపదంబులందు నీమను ప్రముఖుల
నెవ్వరనుచు వార లేమి కతన
నధిక విభవు లైరి హరి యేల జనియించె
దెలుపఁగఁబలుకు నాకు సిద్ధచరిత

శ్రీమదాంధ్ర భాగవతము

ఈ జగత్తంతయును నొక నియమమున నున్నది అందలి కార్యములు నిశ్చితములై యున్నవి. సమస్త కార్యములకును గార్యగాలములును నిశ్చితమై యున్నవి అందలి యాయువు సుఖదుఃఖాదులు మొదటనే లిఖింపఁబడియున్నవి. అట్లు కానిదినచో భవిష్యత్తును జెప్పుజ్యోతిషాది శాస్త్రము

లన్నియును వ్యర్థములగును అజ్ఞానులమగుటచే భవిష్యద్విష
యములు మనకుఁ దెలియుటలేదు. అందువలనఁ జీకటిలోఁ
దిరుగాడుచున్నాము. మనకుఁ ద్రికాల జ్ఞానముండి యుండి
నచో నాశ్చర్యమును జెందవలసిన పనిలేదు. ఇంద్రుని
కార్యము నిశ్చితమై యున్నది. ఆతని కార్యకాలమును
నిశ్చితమైయున్నది. ఇదేవిధముగ నన్నియును నిదివఱకే
నిర్ణయింపఁబడి యున్నవి. జీవుఁడు భ్రమవశమునఁ దిరుగు
చున్నాఁడు. అజ్ఞాన వశమున దుఃఖితుఁడగు చున్నాఁడు.
ఈసృష్టిరహస్యమును బాగుగఁ దెలిసికొని, హృదయపటల
మున నంకిత మొనర్చుకొనిన చోఁ జింతింపవలసిన యవసరమే
యుండదు. అందువలన శాస్త్రములందు సృష్టియొక్కయు,
దాని నియమములయొక్కయు వర్ణనము చేయఁబడుచుండును.
దానినిఁ దెలిసికొని జీవులు శోకమోహ, విస్మయాదుల
నుండి సర్వదా ముక్తుఁడగును.

భూత భవిష్య ద్వర్తమానములలోని పదునాల్గు
మన్వంతరములలో నగు మనువులు, మనుపుత్రులు, ఇం
ద్రుడు; దేవగణము, సప్తర్షులు, భగవంతుని యొక్క
మన్వంతరావతార వర్ణనను శ్రీశుకుఁడొనర్చెను. అప్పు
డంతయును విని పరీక్షిన్మహారాజిట్లనెను:—"ప్రభు ! మీరు
వేర్వేరుమన్వంతరములలోని మన్వాదులవర్ణనము గావించి
తిరి; కానినాకొకశంక అట్లేనిలిచియున్నది. ఈ చెప్పఁబడినవారం

దలును భగవదవతార భేదములే వీరందఱు నేమేమికార్యము లొనర్చెదరు ? మన్వంతరములలోని మనువులే యేకార్యము లొనర్చుచుందురు వారికిఁ బుట్టిన పుత్రులు వారికే యే కార్యములలో సహకరించుచుందురు ? ఇంద్రుఁడేమి చేయును. ఇంతమంది దేవతాగణముల సృష్టియెందులకు ? సప్తర్షులందఱును గలిసి యేకర్తవ్యపాలన మొనరించెదరు? ప్రతి మన్వంతర మందును భగవానుని అంశావతారము యొక్క ఆవశ్యకత యేమున్నది ! భగవానుఁ డవతరించి యేయే కార్యము లొనర్చును ?''

పరీక్షిన్మహారాజు యొక్క యీవాక్యములను విని శ్రీశుకుఁడు గంభీరుఁడై యిట్లనెను :—"రాజా ! ఈయాఱుగురును నామములను వేలువేలుగఁ గనఁబడుచుందురు కాని వాస్తవమున వీరందఱొక్కటే. శ్రీహరియే సృష్టి రక్షణము కొఱకు ఆఱురూపములను ధరించుచుండును. ప్రజాపాలకుఁడగు ప్రభువు తనకళాంశములచే నన్నిటియందును ప్రవేశించుచుండును. మరలనాతఁడు వీటికన్నిటికిని శాసకుఁడై శాసించుచుండును. మన్వంతరమును గ్రహించి మనువు ఇంద్రాదులను రక్షించుచుండును వారిని సంకటములనుండి రక్షించును. అసురులను దండించును సంసారయాత్రా నిర్వాహమును గావించును.

మన్వంతరాధిపతియగు మనువు బ్రహ్మచే సృజింపఁబడి, శ్రీహరిచేఁ బ్రచలితము గావింపఁబడిన యీసృష్టియొక్క

ప్రజాజనుల ధర్మముల నాచరింపఁ జేయుచుందును. నాల్గు పాదముల ధర్మమును స్థాపించును. కృత, త్రేతాదిధర్మ ప్రధానయుగములందు భూమిపై నుండును. అధర్మ ప్రధాన మగు కలియుగాది యుగములందు గుప్తరూపమున నన్య వర్షములందుననో లేక అన్యలోకము లందో ధ్యానమగ్నులై యుందురు. మనుపుత్రులు మన్వంతర పర్యంతము పుత్ర పౌత్ర ప్రపౌత్రాది క్రమమున నీసమస్త భూమండలమందు భూపతులై శాసించెదరు.

ఇంద్రుఁడు స్వర్గమునకు రాజగును. ఆతఁడు సమస్త దేవతలకును శాసకుఁడు నధిపతియగును. భగవంతుఁడొసంగిన త్రిభువనలక్ష్మి నుపభోగించుచు స్వర్గమం దలి అత్యుత్కృట సుఖముల నుపభోగించుచుఁ త్రిలోకములను బాలించుచుండును. ఆతని వెంట నిత్య దేవతల యొక్క వేలు వేలు గణము లుండెదరు. పంచమహా యజ్ఞకర్మలందు భోక్తలరూపమున నున్న ఋషి పితృ, భూత మనుష్య, దేవాదులు యజ్ఞ భాగములను గ్రహించుచు మన్వంతర పర్యంతముండెదరు. మనుష్యయజ్ఞము ద్వారా దేవతా భజన మొనర్చుచుందురు దీనిచేఁ బ్రసన్నులై దేవతాగణము వారి సమస్త మనోరథములను బూర్ణము కావించెదరు. పరస్పర భావములచే భావితులై పరమశ్రేయమున కధికారు లయ్యెదరు.

ఆమన్వంతర మందుండు సప్తర్షిగణము వేదోద్ధార మునుగావించు చుందురు. శాస్త్రప్రచార మొనర్చెదరు. భిన్న భిన్న రూపములను ధరించి ధర్మ సంస్థాపన మొనర్చెదరు. జ్ఞాన ప్రచార మొనర్చుటకై సనకాది సిద్ధుల రూపములను ధరించు నట్లు ప్రజలకు జ్ఞానోపదేశ మొనర్చు చుందురు. కొందఱు మునులు స్మృతి కారులై కర్మకాండ నుపదేశించె దరు. యాజ్ఞవల్క్యాది రూపములందు స్వయముగఁ గర్మ కాండా చరణ మొనర్చెదరు. ఇతరగృహస్థులను మొదల గు వారినిఁ బ్రేరేపించెదరుఁ దత్తాత్రేయ కపిలాది యోగే శ్వరుల రూపమును ధరించి యోగమార్గప్రచార మొనర్చె దరు. నారదాది రూపములతో నారద పాంచరాత్రాది శాస్త్రములను బ్రచార ప్రసారము లొనర్చెదరు.

వీరందఱును శ్రీహరి స్వరూపములే. ఆతఁడే స్వయ ముగఁ బ్రజాపతి రూపమును ధరించి అండజ, జరాయుజ, స్వేదజ, ఉద్భిజాది రూపమున సమస్త సృష్టి నుత్పన్నము గావించెదరు. సామ్రాట్టై దస్యులనుండి ప్రజలను రక్షించును వారిని నోచుకొనకుండునట్లు రక్షించును. ఆతఁడే వసంత, గ్రీష్మ, వర్ష, శరద్ధేమంత శిశిరాదిఋతు రూపములు ధరించి శీతోష్ణముల నేర్పఱచును. ప్రాణుల ఆయుస్సును నశింపఁజేసి కాల రూపమును ధరించి వారిని సంహరించును, మణిమాలలో సూత్రమట్లాతఁడీ ప్రపంచమున నోతప్రోతమై యున్నాఁడు.

సమస్త జీవులను భగవంతుని యొక్క నామ రూపాత్మక మాయచే మోహితులై కొందఱు భగవంతుఁడు లేఁడని యును. కొందఱు ఏకైతుఁ డనియుఁ గొందఱు విశిష్టాద్వైతుఁ డనియుఁ గొందఱు ద్వైతాద్వైతుఁడనియుఁ గొందఱు శివాద్వైతుఁడనియు నిట్లనేకములుగఁ జెప్పుచు నాతని నిరూపించుచుందురు. భిన్న భిన్న శాస్త్రముల ద్వారా భిన్న భిన్న రూపములందు నిరంతరము నిరూపణ మొనర్చినను వాస్తవిక రూపమున నెవరికినిఁ దెలియఁ బడఁడు మహారాజా! నేను నీకత్యంత సంక్షేపముగఁ బదునాల్గు మన్వంతరముల వృత్తాంతమును, మనువు యొక్కయు, మనుపుత్రుల యొక్కయు, ఇంద్ర, దేవగణ, సప్తర్షి, మన్వంతరావతారములయొక్కయు నామములను, గార్యములను వర్ణించితిని. ఇప్పుడు నీవేమదుగఁ దలఁచు చున్నావు?"

అంత పరీక్షిన్మహారా జిట్లనెను.—స్వామీ! మీరీ వర్తమాన మన్వంతరమును వైవస్వత మన్వంతర మంటిరి. ఈ మన్వంతరావతార నామము వామనుఁడు లేక ఉపేంద్రుఁ డంటిరి. ఈయుపేంద్రుఁ డేయే విశేష కార్యము లొనర్చినాఁడు? వామన చరిత్ర శ్రవణ మొనర్చుటకు నాకు మిక్కిలి యభిలాష కలదు."

అంత శుకుఁడిట్లనెను:—"రాజా! ఈవామనుఁడు ఛల కపట మొనర్చి బలిని మూఁడడుగులడిగెను. రాజగు బలి దాని నేయఁజాలక పోఁగా బంధించెను."

ఇది రాజత్యంతాశ్చర్యముతో నిట్లనెను:-"ప్రభూ మీరొక దానికంటె యొకటి విచిత్రమును, నద్భుతమునగు విషయములను జెప్పుచున్నారు స్వామీ! ఎవ్వరైనను లేని వస్తువును యాచింపవలయును. భగవంతున కేవస్తువుకొదువ యున్నది? అతఁడడిగినను నెవరి నడుగును? అతఁడు సమస్త జగత్పోషకును స్వామి. విశ్వనాథుఁడు. ఒకవేళ భగవానుఁడు మర్యాదా రక్షణము కొఱకడిగినాఁడే యనుకొనుఁడు. మూఁడడుగులు లేలయడిగినాఁడు. ఇంతటి గొప్పచక్రవర్తి మూఁడడుగుల భూమినేల నీయఁజాలక పోయినాఁడు. ఒకవేళ నేకారణముచే నైనను నీయఁజాలకున్న నాతఁడు ఋణమును గొన లేదుకదా! భగవానుఁ డాతని బంధించు టెందులకు? ఇట్లు ఋణవిముక్తినిఁ జెందకున్న చోఁ గృపణుఁడును,లోభియు నగువాఁడు వాని యొక్క యిల్లు వాఁకిలి నమ్మించ నైన నమ్మించును. లేదా కారాగృహమున కైనను బంపును. భగవానుని కిది శోభించదే తనకోరికను నెఱవేర్చు కొనుట భగవానుఁడు విశ్వంభరుఁడు పూర్ణకాముఁడు, నిరీహుడు, నిస్పృహుడు తన భూమికొఱకై తన ధనముకొఱకై యెవరి నైనను యాచించు టుచితముఁగ నఁబడుట లేదు. ఈ విషయ మున [illegible]హాల నూహాల మేర్పడుచున్నది. ప్రభూ! ఈ చరిత్రనంతయును జెప్పి నా సమస్త సందేహములకును సమాధానమును జెప్పుడు. నాయుత్సుకతను దూర మొనర్పుడు."

సూతుఁడు శౌనకాది మునులతో నిట్లనెను.:- ఋషులారా! అభిమన్యుసుతుఁడును, నుత్తరానందవర్ధనుఁడును నగుఁ బరీక్షిన్మహారాజీ విధముగఁ బ్రశ్నింపఁగా నాతనికిఁ బ్రత్యుత్తరమొసఁగుచు శుకుఁడు వామన చరిత్రమును జెప్ప నుద్యుక్తుఁడయ్యెను.

బలి మరల స్వర్గము కొఱకు యత్నించుట

౧౮౮

శ్లో॥ పరాజితశ్రీ రసుభిశ్చ హాపితో
హీంద్రేణ రాజన్ భృగుభిః స జీవితః।
సర్వాత్మనా తానభజద్భృగూన్ బలిః
శిష్యో మహాత్మార్థ నివేదనేన॥

శ్రీ భాగ. ౮ స్కం. ౧౫ అ. ౬౪ శ్లో॥

సీ॥ పురుహూతుచే నొచ్చి పోయి భార్గవులచే
బలిమెట్ట కేలకు బ్రదికి వారి
చిత్తంబు రాఁగొల్చి శిష్యుఁడై వర్తింప
వారు నాతని భక్తివలన మెచ్చి
విశ్వజిద్యాగంబు విధితోడఁ జేయింప
ధన్యకాంచన పట్ట బద్ధ రథము
నర్కవాజులఁ బోలు హరులఁ గంగరవ
ధ్వజము మహాదివ్య ధనువుఁ బూర్ణ.

తే॥ తూణయుగళంబుఁ గవచంబుఁ దొలుత హోమ
పావకుం డిచ్చె సన్నాహ పద్ధమాలఁ
గలువ హరుఁ డగు తన తాత కరుణ నొసంగె,
సోమ సంకాశ శంఖంబు శుక్రుఁ డిచ్చె॥
—శ్రీమదాంధ్రభాగవతము

తన్నుఁ దాను గురు చరణములకు సమర్పించుకొనినచో వాని కన్ని మనోరథములును సిద్ధించును. ప్రపంచములో సమస్త కార్యములును బురుషార్థమున జరుగును. ప్రయత్న పరుఁడు తన ప్రయత్నమువలన నెన్ని సంకటములు కలిగినను విచలితుఁడు కాఁడు. కార్యమొనర్చుటలో విఘ్నములు కలుగును. కాని మనస్వియగువాఁడా విఘ్నములను దుచ్ఛములుగ భావించి సర్వధా వానిసవహేళన మొనర్చుచుండును. పురుషార్థము అహంకార పూర్ణమె యుండును. దాని సిద్ధిలో సందేహము కలదు. ఏలననఁగా ప్రాణి అపూర్ణుఁడు. కాని యే పురుషార్థము శ్రద్ధాసహితముగ – గురుజన శుశ్రూషా సేవలొనర్చుచుఁ జేయఁబడునో అది యెన్నటికి సఫలము కాదు. దాని సిద్ధిలో నేవిధమగు సందేహమును లేదు. దానిలో సఫలము కలుగుట ధ్రువము.

శుకదేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను:— ''రాజా! నీవు నన్ను వామనావతారకారణము నడిగితివి. నేను దానిని నీకు జెప్పెదను. సముద్రమునఁ బుట్టిన యమృత

మును మోహినీరూపుఁడగు భగవానుఁడు దేవతలకే పోయఁగా నప్పుడు ఘన ఘోర దేవాసుర సంగ్రామము జరిగినది. భగవత్కృపచే నాయుద్ధమందసురులకుఁ బరాజయము కలిగెను. విజయశ్రీ సురలను వరించెను. అసురుల రాజగు విరోచనపుత్రుఁడు బలి యాయుద్ధమందు మృతప్రాయుఁడయ్యెను. ఇంక ననేకులగు నసురులు మడసిరి. మిగిలినయసురులు వారినందఱను వస్త్రాచలమునకుఁ గొంపోయిరి అచ్చట శుక్రాచార్యుఁడు వారి నందఱను దన మృతసంజీవనీ విద్యచే బ్రతికించెను. శుక్రాచార్యుఁడు కాఁగఁగనే బలి బ్రతికెను. శ్రీహీనుఁడును, ప్రాణహీనుఁడు నగు బలికి భృగువందనుఁడగు శుక్రాచార్యుఁడు జీవన దాన మొనర్చెను.

బలిచక్రవర్తి గొప్ప ధర్మాత్ముఁడునా, కృతజ్ఞుఁడునై యుండెను. ఆతఁడిట్లనుకొనెను "గురుదేవుఁడు మమ్ముల నెంతో అనుగ్రహించినాఁడు. చచ్చిపోయిన మమ్ము గురుదేవుఁడే జీవనాదాన మొసఁగి బ్రతికించినాఁడు. ఇప్పుడు మేమైన నున్నతినిఁ బొందవలయునన్నన గురుకృపచేతనే పొందవలయును. మానవాభ్యుదయమునకు ముఖ్యకారణము గురుసేవయే. సేవ చేయువాఁడు దానిఫలమునను భవించును. గురుపూజన మొనర్చువాఁడు ప్రపంచమున సర్వత్ర పూజితుండగును. గురువునకు సర్వస్వమర్పించువాఁడు సర్వస్వమును

బొందఁగలఁడు." అని యిట్లాలోచించుకొని ఆతఁడు తను, మన, ధనములచే సర్వవిధములను శుక్రాచార్యులను సేవించుచుండెను. ఆతఁడు తన సర్వమును గురుచరణముల కర్పించెను శుక్రాచార్యుఁడేది చెప్పిన నాతఁడది చేయును. ఆతని సుఖము కొఱకై సమస్తములైన యేర్పాటులను గావించును ఆతని కేవస్తువు కావలసి యుండిన దాని నెచ్చటనైనఁ దక్షణము తెచ్చియిచ్చును ఆతని కెంతటి సామగ్రి ఆవశ్యకమగునో దానికి రెట్టింపుగఁ దెచ్చియిచ్చుచుండెను. ఈవిధముగ నాతఁడు తన జీవిత ధ్యేయమును గురుశుశ్రూషగనే యేర్పఱచుకొనెను.

సూతుఁడిట్లనెను :- "మునులారా! సేవ మానవునిఁ దన వశము గావించుకొను నట్టి వస్తువు. పాషాణ హృదయము మీఁదనైనను దాని ప్రభావము పడును. సహృదయుడగు సాధు పురుషుఁడు సేవద్వారా అనుచిత కార్యమొనర్చుటకైన వివశుఁడగును సేవా భారమున నాతఁడు కృతజ్ఞతా వశమున నాతని యభ్యుదయము కొఱకు సమస్తమును జేయుటకుఁ దత్పరుఁడగును. దుర్యోధనుఁడు క్రూరస్వభావుడైనను గురువగు ద్రోణాచార్యుని, భీష్ముని, శల్యుని భక్తితో సేవించుటచే వారికి పాండవులు ప్రాణాధిక ప్రియులైనను వారికి విరుద్ధముగ నస్త్రశస్త్రములను గైకొని యుద్ధార్థమై రణాంగణ భూమికి వచ్చిరి. సహజ స్నేహమును, ప్రాణము

లపై మోహావేశమును ద్యజించి యుద్ధమున మడసిరి. దుర్వాసుని వంటి కోపిష్ఠియగు ముని దుర్యోధనుని సేవాశుశ్రూషలచే సంతుష్టుఁడై పాండవులను సర్వనాశ మొనరింప సమకట్టెను. శివుఁడు సేవాకారణమున బాణాసురునకు బురరక్షకుఁ డయ్యెను. మనము సేవ చేయువారి యొక్క హృదయము సర్వదా మన శ్రేయస్సుకొఱకే వ్యగ్రమై యుండును. సతి యగు స్త్రీ తన సేవమూలముననే సత్పతిని వశపఱచుకొనెను. ఒకరి సంగతి యెందులకు? స్వయముగ భగవానుఁడును సేవకధీనుఁ డగును. భక్తుఁడగు నంబరీషునిపై దుర్వాసుఁడు కృత్యను బ్రయోగింపఁగా సుదర్శనము దానిని నశింప జేసి దుర్వాసుని వెంట, బడెను. ఆతనికి సమస్త లోకములు తిరిగినను శరణము లభింపక పోఁగా భగవంతుని సమీపమునకు బోయెను. అప్పుడు భగవంతుఁడు స్పష్టముగ నిట్లనెను:—నేను భక్తపరాధీనుఁడను. భక్తుఁడు నన్నెట్లాడించిన నట్లాడెదను. ఏమి చేయించిన దానినిఁ జేసెదను. నేను స్వతంత్రుఁడను గాను. భక్తాభీష్టము ననుసరించి యాడెదను. కావున వశ మొనర్చు కొనుటకు సేవ తప్ప వేఱొక యుపాయము లేదు.

శ్రీశుకదేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను:—

"రాజా! బలిచక్రవర్తి యీ విధముగ శుక్రాచార్యుని, నితర బ్రాహ్మణులను సేవింప మొదలిడెను. అప్పుడు

శుక్రాచార్యుఁడు బ్రాహ్మణులందఱను బిలిచి వారి నాలోచించి యిట్లనెను:- "బ్రాహ్మణులారా! ఈవిరోచన నందనుఁడగు బలి తన సర్వస్వమును సమర్పించి యెట్లు బ్రాహ్మణులను సేవించుచున్నాఁడో చూచుచున్నారుకదా! కావున మన మీతనికిఁ గల్యాణాభ్యుదయములు కలుగు కార్యముల నొనర్పవలయును. ఈతనిని మరల రాజ్యశ్రీ వరింప వలయును. ఈతఁడు మరలఁ ద్రిలోకాధిపతి కావలయును."

బ్రాహ్మణులిట్లనిరి :-"ప్రభూ! మేము బలిచక్రవర్తి సేవలచే మిక్కిలి సంతుష్టులమైతిమి. మీరేది యాజ్ఞాపించినా దానిని మేము ప్రాణపణముగ నొనర్ప నుద్యుక్తులమైనాము."

అంత శుక్రాచార్యుఁడిట్లనెను:- "నాశిష్యునిచే విద్యుక్తముగ విశ్వజిద్యాగమును జేయింపవలయునని నా హృదయపూర్వకమగు గోరికయై యున్నది. ఆ యజ్ఞము విధిపూర్వకముగ నెఱవేరినదా, ఈతనికి నిశ్చయముగ మరలఁ ద్రిలోక రాజాధిపత్యమును నైశ్వర్యమును బ్రాప్తింపఁ గలదు.

బ్రాహ్మణులుత్సాహముతో నిట్లనిరి:- "స్వామీ! మేమైనఁ జేయుటకుఁ దత్పరులమై యున్నాము. మీరవశ్యము సురేంద్రుని విశ్వజిద్యాగమునకై అభిషిక్తు నొనర్పుఁడు."

బ్రాహ్మణుల యనుమతినిఁబొంది శుక్రాచార్యుఁడు విధి విధాన పూర్వకముగ బలిని భృగువంశ బ్రాహ్మణ

సహితముగ స్వర్గ కామనచే నైంద్ర మహాభిషేకముచే నభిషిక్తుఁగావించెను. అనంతరము వైదిక విధిచే విశ్వజిన్మహాయాగానుష్ఠానము నొనరింపజేసెను. దేవతలుమంత్రాధీనులు. శుద్ధ, పవిత్ర, న్యాయోపార్జితమైన హవనీయ సామగ్రుల ద్వారా బలిచేఁ బూజితుఁడై అగ్నిహోత్రుఁడు ప్రసన్నుఁడయ్యెను. యజ్ఞకుండమునుండి మూర్తిమంతుఁడగు నగ్ని యుత్పన్నుఁడై బలిచక్రవర్తికి దర్శనమొసంగెను. వాయువేగ మనోవేగములతోఁ బోఁగలిగిన హరిత వర్ణముగల హయములు పూన్పఁబడి, సింహచిహ్న చిహ్నితమగు దృఢధ్వజము విరాజిల్లుచుండు సువర్ణ మండితమగు రథమును నగ్నిహోత్రుఁడు ప్రసన్నుఁడై బలిచక్రవర్తి కొసంగెను. దీనికితోడుగా సువర్ణ జటితమగు దివ్యధనుస్సును, నెన్నటికినిఁ దరిగిపోని రెండక్షయ తూణీరములను, నెన్నటికిని భగ్నముకాని కవచమును నిట్టి యుద్ధోపయోగకరములును, విజయప్రదాన మొనర్చునట్టియు వస్తువుల నొసంగెను.

బలిచక్రవర్తికిఁ బితామహుఁడగుఁ బ్రహ్లాదుఁడు పౌత్రునకు మంగళకామన కొఱకెన్నడును వాడని దివ్యపుష్పమాల నొసంగెను. తాతగారొసంగిన మాలను ధరింపఁగనే బలియొక్క శోభ ద్విగుణితమయ్యెను. అతఁడు మూర్తీభవించిన వీరరసము వలె శోభించెను. మ్రోగింపఁగనే ఆశబ్దమునకే శత్రువుల ధైర్యము సడలిపోవునట్టి దివ్యమును

నద్భుతమును నగు శంఖమును శుక్రాచార్యుఁడు ప్రస న్నుఁడై శిష్యునకొసంగెను. దానిశబ్దమును వినఁగానేవారు రణాంగణమును వీడి పాఱిపోవలసినదే. ఈవిధముగ నందఱ వలన విజయాను రూపములును. యుద్ధోప యోగములునగు సామగ్రులను బొంది బలి మిక్కిలి సంతసించెను. ఇప్పుడు మరల నాతఁడు స్వర్గమును జయింప సంకల్పించెను. ప్రస న్నులైన భృగువంశ బ్రహ్మణులు స్వస్తివాచన మొనరిచి విజయసంబంధములగు మంత్రములను బఠించిరి. ఈవిధముగ సమస్తసామగ్రులచే సన్నద్ధుడై, బ్రాహ్మణుల యాశీర్వా దములను బొంది బలి తన చతురంగ సేనలను దీసికొని యుద్ధమునకు సిద్ధుఁ డయ్యెను అతఁడు బ్రాహ్మణులకుఁ బ్రద క్షిణ మొనరించి అందఱకును బ్రణామమును గావించెను. అంతఁదన పితామహుఁడగు ప్రహ్లాదుని సమీపమునకువచ్చి, అతని చరణములకెఱగి యిట్లనెను:— "పితామహా! మాకు విజయము కల్గునట్లాశీర్వదింపుఁడు." అప్పుడు ప్రహ్లాదుఁ డాశీర్వదించుచు నిట్లనెను: "నీమార్గము నిష్కంటక మగుఁగాక! నీవు నిశత్రువులపై విజయమును బొందుము."

బ్రాహ్మణులయొక్కయు, వృద్ధులయొక్కయు నాశీ ర్వచనానుమతులను బొంది బలిచక్రవర్తి అగ్నిదత్తమైన సువర్ణమయమగు రథముపైఁ గూర్చుండెను. అతఁడు దివ్యకవ చమును ధరించెను. ధనుస్సును ధరించి పృష్ఠభాగమందు

అక్షయ తూణీరములను రెంటిని వ్రేలాడగట్టుకొనెను. యుద్ధోపయోగకరములగు ఖడ్గమును, కవచాదులను శస్త్ర శస్త్రములనుధరించి, విశ్వవిజయుండగు నాసీరుండని యిప్పుడే తోఁచుచుండెను ఆతని బాహువులకు సువర్ణముతోఁ జేయఁ బడిన బాజు బందులు శోభించుచుండెను. కర్ణములందుగల మకరకుండలములయొక్క కాన్తికాంతులచేఁ గపోలముల యొక్క శ్రీవృద్ధి యగుచుండెను ఆతఁడు వస్త్రాభూషణము లనుధరించి, సుసజ్జితుండై దివ్యరథమందుఁ గూర్చుండెను. గాన భూమిపైన పరసూర్యుఁడుదయించినట్లుండెను. హోమగుండము ములో మూర్తీభూతుండగు నగ్ని ప్రజ్వలించుచున్నట్లుం డెను.''

శ్రీశుకదేవుఁడిట్లనెను.—''రాజా! ఈవిధముగ బలి చక్రవర్తి సుసజ్జితుండై స్వర్గమునకు మరల విజయమును బొందుటకై సేనాసహితముగ బయలుదేరెను.''

క్షయిష్ణువగు స్వర్గముపై బలి దండెత్తుట

(౫౮౬)

శ్లో॥ తాందేవధానీం స వరూథినీ పతిః
బహిః సమన్తాద్రురుధే పృతన్యయా।
ఆచార్యదత్తం జలజం మహాస్వనమ్
దధ్మౌ ప్రయుంజన్భయమింద్రయోషితామ్।

—శ్రీభాగ. ౮ స్కం. ౧౫అ. ౨౩ శ్లో

జీవుని ప్రయత్నములన్నియును సుఖము కొఱకే; సుఖముకొఱకే సామగ్రులను ప్రోవుచేయును. యుద్ధమొనర్చి సుఖదవస్తువులను బలులనుండి లాగుకొని తనకడనుంచుకొనును; కాని యనిత్యములు నశ్వర వస్తువులందు సుఖమెక్కడిది? సంతోషమెక్కడిది? మాటిమాటికిని వానిని బొంది సుఖస్థానమున సుఖమును బొందును అయినను నాతఁడు లోభమును విడువఁజాలఁడు; దీని నే భగవానుని మాయయందురు. మాయ మోహితుఁడగు జీవుఁడీ యనిత్య భోగముల కొఱకు హింస నొనర్చుచుండును. ఈర్ష్యను వహించుచుండును. అయినను నివి సదా వెంటనుండవు. అవి నిమిషములోఁ గుమిలి పోవును; తన్ను విడిపోవును. నిశావసానమున నాయికా కంఠముననున్న మాల కుమిలిపోవునట్లు శరీరమునుండి వేఱగును. కావుననే జ్ఞాని యీ లౌకిక పారలౌకిక భోగములందు స్పృహను వదలు వారు వీని నుపభోగించుచుండియును వీనియెడల నుదాసీనముగ నుందురు.

శ్రీ శుకదేవుఁడిట్లనెను:—"రాజా! బలిచక్రవర్తి తన గొప్ప చతురంగ అసురసేనను వెంటఁగొని భూమ్యాకాశమండలములను గంపింపఁజేయుచు స్వర్గమునకు పైకెక్కెను. సేనలోని సైనికులందఱును దమ లంబజిహ్వాలతో మాటిమాటికిని పెదవులను నాకుచుండిరి. వారు విశ్వబ్రహ్మాండమును గబళింప నుంకించుచుండిరి. వారు తమరక్త నేత్ర

ముల నురుముచు నాకలోకమును జూచుచు దశదిశలను దగ్ధమొనర్చుటకు దురాగ్రహ మొనర్చుచున్నట్లుండెను. వారందఱును నతులైశ్వర్యావేగమునఁ దమద్వితీయుల మనుకొనుచుండిరి అందఱును దాము బలివలె బలవంతుల మనుకొనుచుండిరి. అసుర సామ్రాజ్య విభూతి మదమున మదోన్మత్తులైన దైత్య యూధపతులు తమయొక్క అమిత ప్రభావముచేఁ దమకుఁ దామె యజేయుల మనుకొనుచుండిరి. వారింద్రుని, నింద్రుని యమరావతీ పురినిఁ దిరస్కరించుచు దానిపై కెక్కి, నలువైపులను దానిని ముట్టడించిరి. క్రోధముచేఁ గన్నులెఱ్ఱఁగఁ జేయుచు నసురులచే ముట్టడింపఁబడిన నా దివ్య స్వర్గపురి కమలకోశములచేఁ జుట్టుకొనఁబడిన కర్ణికవలెఁ దోచుచుండెను. దానికి నలువైపులను నందనాది దివ్యకాననములుకలవు. దానిలోఁ గల్పవృక్షము తన శోభను వెదఁజల్లుచుండెను. యోజనముల కొలఁది సుగంధమును వెదజల్లు పుష్పము లందుండెను. వానిమీఁద మధులోలుపులగు మత్తమధుపము లెగురుచు మధుమకరందమును గాన మొనర్చుచుఁ బంకములందు పరాగమంటుటచే బచ్చగ నుండెను. కలరవ మొనర్చుచు విహంగ బృందములా నీలు వృక్షముల నిమిత్తమై శాఖల దు దుముకుచుండెను తమ ప్రియులతోఁ గిలకిలారవము లొనర్చుచుండెను. కొన్ని వృక్షములపైన చక్కని వివిధ వర్ణముల పచ్చివి పండువగు

ఫలములు గుండ్రడ గుండ్రగ శోభించు చుండెను. తీగెల
చిగురుటాకులందు ఫలములు ముఖమల్లుపరుపునందు బరుండి
నట్లుండెను. కొన్నిటియందు చిన్నవి, పెద్దవి పుష్పగుచ్ఛ
ములు శోభించు చుండెను. యౌవనము వృక్షములనుండి
బయలు వెడలు చున్నట్లుండెను. వాయువేగమున నవి
కదలు చున్నప్పుడు వానిని కదిలించు వాయువునకుఁ దమ
సుగంధము నొసంగుచుండెను. ఇంతటి సుగంధమును గొని
పోవుటకు వాయువసమర్థమై యుండెను. అది పరువిడుచు
నా సౌరభమును మార్గమున వెదజల్లుచుఁ బోవుచుండెను.
దాతనునలువైపులను యాచకులు మూగినట్టుల భ్రమరము
లా పుష్పముల చుట్టును మూగుచుండెను.

ఉత్తమ శోభాయుక్తములగు నా స్వర్గోపవనము
లందు స్వచ్ఛసలిలముగల సరోవరములుండెను. ఆ జలము
పద్మపరాగముచే సుగంధితమయ్యెను. కమల నాళములు
పత్రములచే నాజలము కప్పఁబడియుండెను. వాని తీరము
లందు హంస, సారస, చక్రవాక, చక్రవాకి, కారండవ,
జలకుక్కుట, బకాది జలజంతువులటునుండి యిటు ముక్కు
లను ద్రిప్పుకొనుచుఁ దిరుగుచుండెను. పెద్ద పెద్ద సరస్సు
లలో సురసుందరులు తమ చెలికత్తెలతోఁ గమనీయ క్రీడ
లొనర్చుచుండిరి. వారి శరీరమున కంటుకొనియున్న దివ్యాంగ
రాగ గంధముచే సువాసిత జలమింకను నధికముగ సుగం
ధితమయ్యెను.

ఇంద్రుని అమరావతి కోటగోడలు జాంబూనద సువర్ణముచేఁ గట్టఁబడియుండెను. ఆకాశగంగ దానికి నాల్గు వైపులను జుట్టుకొనియుండెను. అది యాకోట కగడ్తగ నుండెను. ఆ కోటకు మిక్కిలి యెత్తునఁ శిఖరగోపురాట్టాలికముల మీఁద పతాకలెగురుచుండెను. అవి యసురుల నింద్రాసనమునకాహ్వానించుచున్నట్లుండెను. ఆ దేవపురీ ద్వారములు స్ఫటికమణిమయములై శోభాయమానములుగ నుండెను. వాని పెద్ద పెద్ద సువర్ణమండిత గడియలు వేయఁబడియుండెను. పురినుండి బయటకు వెడలు ద్వారముల కెదురుగా విశాలములగు రాజపథము లుండెను. అందునిరు నాటఁబడిన వృక్షములు కలిసికొనియుండెను ఆకారణమున మార్గమంతయును సదా శీతలముగ నుండెను పెద్ద పెద్ద రహదారులనుండి చిన్న చిన్న రహదారులు చీలిపోవుచుండెను. అవియును సుందరములును రమ్యములుగనుండెను. రెండు రహదారులు కలిసినచోటఁ జిన్న చిన్న యుద్యానవనములు వేయఁబడి యుండెను. దగ్గఱనే సభాభవనములును సమోద ప్రమోద గృహములును గలవు

ఇంద్రపురియందసంఖ్యాకములగు విమానములు తిరుగుచుండెను కొన్ని క్రింద నిలిచి యుండెను. కొన్ని ఆకాశమున నెగురుచుండెను. వానినుండి నిరంతరము గాన, వాద్య, నృత్యములయొక్క సుమధుర ధ్వనులు వెలువడు

చుండెను. వనములందును, ఉపవనములందును, విమానములందును, సరస్సులందును, గృహములందును, భవనములందును సర్వత్ర వశించి యెనలేని సౌందర్యయుక్తులును, నవయౌవన మదమత్తలగు నత్యంత సుందర రమణులు సుందర స్వచ్ఛ వస్త్రాలంకారములతో భూషితలై స్వచ్ఛంద విహార మొనర్చుచుండిరి వారు దేదీప్యమానమగు నగ్నిశిఖలవలెను, సాకార శోభవలెను, సజీవ సుందరతవలెను, అమ్లాన చంపకకలికవలెను, యౌవన కాంతివలెను దోచుచుండెను.

అచ్చటి వాయువును రసిక శేఖరుడై సురసమ్మానిత సురాంగనల పైటలను దొలిగించి, వారి కేశపాశములందు తురిమికొనిన సుగంధ పుష్పముల నవీనమాలల మనోహర మోదమును గొంగిలించుచు మార్గమునందున్న వారితో బరిహాసమాడుచు బోవుచుండెను. ఆతని యీ యశిష్టతకు టీకాటిప్పణి చేయువారెవరును లేరు. సురసుందరులందఱును నాతని నుపేక్షించుచుండెను. క్రీడాభావమును బ్రదర్శించుచు మరల దమయొక్క పూవులు తురుమబడిన కేశపాశములను దాచుకొనుచుండెను.

ఆ పురిని సౌగంధిక పురి యనిన నది యత్యుక్తి కాదు ఏలననగా నచ్చటి వస్తువులన్నియును సుగంధములు. పారిజాతపుష్పములు యోజనముల కొలది గంధము వ్యాపించి

యుండెను. సురలలనల ముఖములనుండియు, అంగముల నుండియు, కేశపాశముల నుండియు, వారి వస్త్రభూషణ ముల నుండియు నిరంతరము సుగంధము వెలువడు చుండెను. రాజపథములందు సుగంధజలములు కలయంపి చల్లఁబడు చుండెను. భవనములనుండి వెలువడు సుగంధ ధూపము ఆకాశమందెగురుచు స్వర్గీయ పారావతములుగఁ దోఁచు చుండెను. విమాన వితానములన్నియును ముక్తాదామ మండితములై శుభ్రములుగను స్వచ్ఛములుగను నుండెను. వాని కేర్పఱుపఁబడిన ధ్వజములు సువర్ణజటితములై మణి ముక్తామండితములై యుండెను. అనేక రంగుల చిత్రవిచిత్ర ధ్వజములతో నాపురి నవ వివాహిత వధువువలె నలంక రింపఁబడి నట్లుండెను.

ఆ యమపురీ భవనములందును, విమానవితానము లందును గూర్చుండిన మయూర, కపోతాది పక్షులు కలరవ మొనర్చుచుండెను. స్థానస్థానములందు వికసించిన కుసుమ ములమీఁద భ్రమరగణము గీతములు గానము చేయుచుం డెను. అప్సరసల నూపురకర కంకణధ్వనులచేతను, క్షుద్ర ఘంటికల శబ్దములచేతను: వారి కలకంఠ కూజితములచేతను దుందుభి స్వనముచేతను నాపురి మాటలాడు చున్నటుం డెను. తన ప్రజలు దర్శకులను స్వతః తనవైపున కాకర్షించు కొనుచుండెను. దేనిలోఁ బాపులెప్పుడును బ్రవేశింపఁజాలరో,

అధర్ములును, భూతద్రోహులును, దంభాహంకారులును, కాముకులును, లోభులును దేనిలోనికిఁ బ్రవేశించుట అసంభవమో అట్టి స్వర్గపురినసురులు గురుకృపచే ముట్టడించిరి.

బలి గుర్వనుగ్రహముచే దైవీసంపత్తినిఁ బొందెను. ఇంద్రపురిని ముట్టడించి యాతఁడు శుక్రదత్తమగు శంఖమును బలము కొలఁది యూదఁగా దేవతలదరిపోయిరి. అప్సరసలు మూర్ఛితలై క్రిందఁబడిరి. ఇంద్రుఁడు మిక్కిలి భయభీతుఁడయ్యెను. క్షణము క్రిందట నేపురిలో నామోదప్రమోదములు సర్వత్ర జరుగుచుండెనో, యిప్పుడచ్చట సర్వత్ర హాహాకారములు వ్యాపించెను. అందఱును నసురుల ప్రయత్నమును గాంచి భయభీతులైరి.

(శ్రీ) శుకదేవుఁడిట్లనెను :- "రాజా! ఈక్షయిష్ణువులును వనిత్యములునగు స్వర్గసుఖములందు శాంతియును లేదు, సుఖమును లేదు. త్రిలోకేశుఁడగు నింద్రుఁడు బలియొక్క శంఖధ్వనిని విని మిక్కిలి భయపడి, దేవతలను వెంటఁబెట్టుకొని తన కులగురువగు బృహస్పతి సమీపమునకుఁబోయెను.

[7]

దేవగురుని సమ్మతితో సురలు స్వర్గమును త్యజించుట

౫౫౦

శ్లో॥ ఏవం సుమంత్రితార్థాస్తే గురుణార్థానుదర్శినా ।
హిత్వాత్రివిషపం జగ్ముర్గీర్వాణాః కామరూపిణః॥

—శ్రీభాగ. ౮ స్కం. ౧౫ అ. ౩౨ శ్లో॥

"రాజా! స్వార్థమర్మము నెఱింగిన దేవగురువగు బృహస్పతి వారికి సమ్మతినొసంగఁగా దానినిమన్నించి దేవతాగణము దివమును వీడి వెడలిరి వారందఱును గామరూపములను ధరించువారై యుండిరి."

—శ్రీమదాంధ్రభాగవము.

ఉన్నతికి వెంట నవనతియు, జయము వెంటఁ బరాజయమును, జన్మవెంట మృత్యువును, ఉత్థానము వెంటఁ బతనమును వచ్చుచునే యుండును. అజ్ఞానులీ దుఃఖములకు సంతప్తులై దుఃఖితులగుచుందురు, జ్ఞానులు రెంటియందును సమముగనుందురు. వారు భగవత్సేవాభావముతోఁ గర్తవ్యబుద్ధితోఁ గార్యములొనర్చుచుందురు. జయపరాజయముల రెంటియందును హరి యిచ్ఛను భావించుచుందురు. వాస్తవమున నీక్షణభంగురములును, నాశవంత పదార్థములందును జయమేమి పరాజయమేమున్నది ? గంగాద్వారమున గంగాగర్భమందుండిన వసంఖ్యాకములగు చిన్నవి పెద్దవి

గుండ్రాళ్ళను. నున్నని రంగు రంగుల రాళ్ళతోఁ బిల్ల లాడుకొనుచుందురు. గంగాప్రవాహమునఁ గొట్టుకొని వచ్చునఁ బాషాణఖండములను గొందఱు పిల్లలు తమవను కొనుచు, వీనికి ఇతరు కొందఱు పోరాడుకొనుచుందురు. ఏడ్చుచుందురు. దుఃఖించుచుందురు. దెబ్బలాడుకొనుచుందురు వాచ్యకు వాచ్యములను బలుకుదురు కాని ఆట పూర్తికాఁగానే పిల్లలు వట్టిచేతులతోఁ దమ తమ గృహములకుఁ బోవుదురు. పాషాణఖండము లచ్చటనే పడియుండును. మరల మఱునాఁడు బాలకులచ్చటనే మరల నాడుకొందురు. మరల నచ్చట నేను నాది నీవు నీది యను పోట్లాటయే. వర్షాకాలము రాఁగానే అన్నియును గంగాజలమందు మునిఁగి పోవును. బాలురిప్పుడు గంగాగర్భమునకుబోక యింటిలోనే ఆడుకొందురు. వర్షాకాలముపోయి మరల శరదృతువు రాఁగానే నీరు తగ్గిపోఁగా నలల రాళ్లు మెఱయుటకుఁ బ్రారంభించును. అప్పుడు మరల నాట ప్రారంభమగును(తండ్రి ఆడియాడి పెద్దవాఁడు కాఁగాన పిల్లవాఁడాడును. ఆపాషాణ ఖండములకును నంతము లేదు, ఆయాటకును నంతము లేదు. ఈప్రవాహ మనాదినుండీ వచ్చుచున్నది. అత్యంత కాలము వఱకును నడచుచుండునుఁ పెద్దవారైనవారు దీనినుండి విగమించెదరు. చిన్నవారు దానియందే యుందురు. దీనినే భగవన్మాయయందురు. ఆ భగవానుఁడు కాలరూపమున

వ్యాపించియున్నాడు ఎవని కెప్పుడెట్టి కాలమువచ్చునో వాని కప్పుడట్టి అనుభవమగుచుండును. దీనిలో నెవరు బలపౌరుష ములును బనిచేయఁజాలవు. అన్నియును ప్రభుని యిచ్ఛాను సారముగనే జరుగుచుండును.

(శ్రీ) శుకదేవుఁడు పరీక్షిన్మహారాజున కిట్లనెను :- "రాజా! అసురులు నలువైపులను నింద్రుని యమరావతీ పురిని ముట్టడించి మహాకోలాహలమును గావించిరి. అప్పుడు వారియొక్క ఉత్సాహవర్ధక శబ్దములను వినఁగానే యింద్రు నకు మిక్కిలిభయము కలిగెను. ఆతఁడు తన ముఖ్య ముఖ్య దేవతలను వెంటఁబెట్టుకొని దేవగురువగు బృహస్పతి సమీ పమునకుఁబోయెను. అచ్చటికిఁబోయి అందరును వినమ్ర ముగ గురుచరణములకు ప్రణామముగావించి వారి యాజ్ఞచే నాసనములు మీఁదఁ గూర్చుండిరి అప్పుడు దేవగురువగు బృహస్పతి యిట్లనెను:- "దేవరాజా! నేఁడు మీముఖము మలినముగ నున్నదేల? ఏ బాధక చింతచేఁ జింతితులై యున్నారు?"

ఇదివిని వినీత భావముతోఁ నింద్రుఁ డిట్లనెను :- "ప్రభూ! మీరు వినలేదా? పురమునకు నలువైపులను జతురంగసేనాసహితముగ రణరంగ దుర్మదులగు నసురులు కోలాహల మొనర్చుచున్నారు. వారి స్వరములో నుత్సా హము కనఁబడుచున్నది. జయఘోషయందు విజయము నిశ్చయమై యున్నది."

బృహస్పతి యిట్లనెను :- "అవును, నేను వినుచునే యున్నాను. మీ పూర్వశత్రువగు బలి మరల మీమీఁద దండెత్తినాఁడు."

ఇంద్రుఁడిట్లనెను :- "దండెత్తుట యనునది క్రొత్త విషయముకాదు. తన పూర్వశత్రువును సదా పరాజితు నొనర్చుటకు ప్రయత్నించుటయే శత్రువుయొక్క కార్యము; కాని యీసారి యీ యసురుల కింతటి యుత్సాహమెట్లు వచ్చినదో యెఱుఁగఁ దలచుచున్నాను. వీరికిట్టి సహింపరాని తేజమే కారణముచే వచ్చినది. ఎట్టి సిద్ధినిఁబొంది యింతటి బలవంతులును ప్రతాపులు నైనారు? బలితో మనమిదివఱకే పోరాడుచుంటిమికదా. ఈ మధ్యనే అమృతమును బంచునపుడు నేను నావజ్రముచే బలినిఁ గొట్టితిని; కాని శుక్రాచార్యులకృపచే నాఁతఁడు మరలజీవించినాఁడు. నేనింతవఱకు వీరి కింతటి యుత్సాహమును యుద్ధోత్సాహమును నేను జూడనేలేదు. నేఁడిది ప్రజ్వలితాగ్నివలెను, సంవర్తక మేఘములవలెను, రుద్రుని మూఁడవ కన్నువలె సమస్త ప్రపంచమును సంహరింపనున్నట్లు వచ్చినారు.

దీపము మీఁదఁబడిన కాగితమును నదియెట్లుతగులఁ బెట్టునో అట్లే యిది జగత్తును బీల్చివేయుచున్నట్లు తన జిహ్వను జప్పరించుచున్నట్లుండెను. నేను దూరమున నుండి కోపముచే నురుమబడి యెత్తుగానున్న బలియొక్క నేత్రము

ములను నేను జూచితిని. ఆతనిలోని దుస్సహదుర్ధర్ష తేజము దశదిశలను దగ్ధము చేసి యసమ రూపమునఁ బ్రళయ మొనర్పఁ బోవుచున్నట్లుండెను. ప్రభూ! బలికింతటి తేజమెట్లు ప్రాప్తించినది. ఆతఁడింతటి నిర్భయుఁడెట్లయ్యెను? వాని కే సాధనముచే నిట్టి ఓజోబల సాహసములు ప్రాప్తించినవి. నేఁడితని యుద్యమమందు శక్త్యుత్సాహములున్నవి. కార్యమందు సజీవతకలదు. రోమరోమమునను విజయప్రాప్తికి దృఢత్వము కలదు.

బృహస్పతి యింద్రుని వచనములను విని గంభీరుఁడయ్యెను. కొంచెము సేపు మౌనముగ నుండెను. అంతఁ గొంత ఆలోచించి మెల్లమెల్లఁగా నిట్లనెను:— "శచీపతీ! బలి యున్నతినిఁ జెందుటకు కారణము నాకు తెలిసినది. నీ వీతని నోడింపఁజాలవు."

ఇంద్రుఁడాశ్చర్యమును నిరాశను జెందిన స్వరముతో నుత్సుకతాపూర్వకముగ నిట్లడిగెను:— "ఏల నేల! నే నీతని నేల నోడింపఁజాలను. ఆతఁడిప్పుడు విజయమును జెందుటకుఁ గారణమేమి?"

దేవగురువ దే గంభీరతతో నిట్లనెను:— "ఈ సమయమున నీతఁడు బ్రహ్మతేజ సమృద్ధుఁడై యున్నాఁడు పరమ పరాక్రమవంతుడైనాఁడు. ఈతని శుక్రాచార్యుఁడు తన సజాతీయ బ్రాహ్మణులతోఁ గూడి ఈతనికి మహాతేజ

మును ప్రసాదించినాడు. శిష్యవత్సలుఁడగు భార్గవుఁడు తన సంపూర్ణమగు బలముతో వాని విజయముకొఱకు విశ్వజిద్యాగము నొనర్చెను ఈ కారణముచే నితఁడిప్పు డపరాజితుఁడైనాఁడు"

ఇంద్రుఁడిట్లడిగెను :- "అయితే భగవాన్! ఈతని నిప్పుడెవరును జయింపజాలరా?"

బృహస్పతి యిట్లనెను :- "... ...అవును ఈ సమయమునకంతే భగవానుఁడు సర్వజ్ఞుఁడు, సర్వసమర్థుఁడు. ఆతఁడేది కావలయుననిన దానినిఁ జేయఁగలఁడు. ఆతని కసంభవమనునది లేదు. ఆహరి తప్ప యిప్పుడీతనిఁ గొట్టువాఁడెవఁడును లేఁడు. కాలమును దప్పించుకొనఁ గలవాఁడెవఁడును లేఁడు కదా!"

అంత నింద్రుఁడిట్లనెను :- "అయితేస్వామీ! మన మేమి చేయవలయును? శక్తి యుండి యుద్ధము నొనర్పుఁడు. బృహస్పతి యిట్లనెను. "నాయనా! నా యభిప్రాయమేమనఁగా నీ సమయమునఁ దెలిసి తెలిసి కాలముఖమున దుముకుట ఉచితముకాదు ఇప్పుడీతనితో యుద్ధమొనర్చుటవ్యర్థము. ఇప్పుడు మీరు స్వర్గమును వదలిపోవుటయే మంచిదని నా యభిప్రాయము. సమయానుసారముగ క్షేత్రమునువీడి పాఱిపోవుట అనుచితముకాదు. నేఁడీతనికి వృద్ధికాలము. ప్రపంచములో మానవులు బలవంతులుకారు. కాలమే బలవంతమై

నది ఇప్పుడీతనిని సుఖములను భోగింపనిండు మీరు మీ యభ్యుదయ కాలము కొఱకు ప్రతీక్షించుచుఁ బృథివిపై నేదో విధముగ దినములు గడుపుకొనుఁడు."

ఇంద్రుఁడిట్లనెను :— "అయితే స్వామీ ! మేము శాశ్వతముగ స్వర్గసుఖములను వీడవలసిన దేనా ?"

తన మాటను సమర్థించుకొనుచు బృహస్పతి యిట్లనెను :— "ప్రపంచములో దేనికిని శాశ్వతస్థితి యుండదు. చక్రములోని యాకు లెట్లు పైకిఁ గ్రిందకును తిరుగుచుండునో ఉన్నతియు నవనతియు నిరంతరము తిరుగుచుండును. నేఁడాతని కభ్యుదయ సమయము. ఎప్పుడో మీకును నట్టి సమయము రాఁగలదు."

ఇంద్రుఁడిట్లనెను :— "వీని కధఃపతన మెప్పుడు జరుగును స్వామీ!" బృహస్పతి యిట్లనెను. "వీరైశ్వర్య మదమత్తులై వీరి గురువు నెప్పుడవమానించెదరో అతనిని దుష్టునిగా భావించుచుఁదామే కర్తలుగను, భర్తలుగను భావించెదరో వీరు పరివార సమేతముగఁ గుటుంబ సమేతముగ మరల పాతాళ వివరములోనికిఁ బోయెదరు. ఈ సమయమున వీరితోఁ బోరాటము పనికిరాదు.

శ్రీ శుకదేవుఁడిట్లనెను :— "రాజా! ఇంద్రుఁడు చాల తెలివైనవాఁడు. ఆతఁడు తన గురుని సమ్మతినంగీకరించెను.

గురువు తమకు హితమైన దానినే చెప్పుననియు, బలియగు శత్రువుతో వెంటనే యుద్ధమునకు దిగుట యుచితము కాద నియు, నీతితోఁ బనిని సాధింపవలయుననియుదలఁచి యాతఁడు దేవతలకు యుద్ధము నర్చుటకు సమ్మతింప లేదు. మీరంద ఱును రోజులు మారి అభ్యుదయకాలము వచ్చువఱకును ప్రతీక్షించుచుండుఁడని చెప్పెను.

తన శిష్యుల యొక్క యీ యభ్యుదయమునుగాంచి శుక్రాచార్యుఁడు సంతసించెను. ఇంద్రాసనమున బలికూర్చు చుటను గాంచిన నాతని రోమములు నిక్కబొడిచెను అతఁడు సంతోషమును ప్రకటించుచు బలితో నిట్లనెను :- "వత్సా! నేఁడు నీవు త్రైలోక్యాధిపతి పదవియందుఁ బ్రతిష్ఠితుఁడగు టను గాంచి మిక్కిలి సంతసించుచున్నాను. నాహర్షమునకు మేర లేదు. నేను నిన్నభినందించుచున్నాను."

బలిచక్రవర్తి యిట్లనెను :- "గురుదేవా! ఇదంత యును మీ చరణముల ప్రతాపమే."

శుక్రాచార్యుఁడిట్లనెను :- 'వత్సా! ఈ యింద్ర పదవి నీకు శాశ్వతమగునట్లు కోరుకొనుచున్నాను."

బలియిట్లనెను - "గురుదేవుని యనుగ్రహమున్నచో ప్రపంచమున నసంభవమేమియును లేదు. మీరన్నిటినిఁ జేయుటకును సమర్థులరు"

శుక్రాచార్యుఁడిట్లనెను :- "ఇదియే నేను గోరు చున్నాను. ఇంద్రుఁడెప్పుడును శాశ్వతుఁడు కాఁడు. ఎవరు

నూఱుయజ్ఞముల నొనర్చెదరో ఆతఁడే యింద్రుఁడగును. నీవింద్రాసనమును నీ బలపౌరుషముచేఁ బొందితివి; కాని యిది అస్థాయియైనదే. ఇది స్థాయియైనది కావలయునని మా కోరిక. నీవు మన్వంతరము వఱకును నింద్రాసనమున నిదేవిధముగ నవస్థితుఁడవు కమ్ము.''

బలియిట్లనెను :- ''మీరు యాజ్ఞనొసంగిన దానినిఁ జేసెదను.'' శుక్రాచార్యుఁడిట్లనెను – నా కోరిక నీ చేత నూఱశ్వమేధ యాగములను జేయింప వలయుననియే. నేఁడే నీవు నూఱశ్వమేధ యాగము లొనర్చుటకు దీక్షను బూనుము.''

శ్రీ శుక దేవుఁడిట్లనెను:- రాజా! తన గురువగు శుక్రాచార్యుని యీ యాజ్ఞను విని బలి అత్యంత ప్రసన్నుఁడయ్యెను ఆతఁడు శుక్రాచార్యుని యాజ్ఞచే నూఱశ్వమేధ యజ్ఞము లొనర్చుటకు దీక్షను బూనెను. శిష్యవత్సలుఁడగు శుక్రాచార్యుఁడు తనకు పరివారముగు బ్రాహ్మణులతోడుగాఁగొని బలిచక్రవర్తిచే యజ్ఞములు చేయించెను. బలియును మిక్కిలి యుదారముగను. దాతగనుండెను. ఆతఁడును నిష్టమువచ్చినట్లు ద్రవ్యమును వెచ్చించి, చాల వైభవముగ యజ్ఞము నొనర్చుచుండెను. నల్దిశలను నాతని యజ్ఞమును గూర్చిన ఖ్యాతివ్యాపించెను. ఇచ్ఛానుసారముగ దానమును బొంది బ్రాహ్మణులును భిక్షుకులును నాతని కనేకాశీర్వచ

నమ లోనఁగిరి. త్రిలోకములందును నాతఁడు చంద్రుఁడు వెలిఁగినట్లు వెలిఁగెను. దశదిశలను నాతనికీర్తి వ్యాపించెను. త్రైలోక్యైశ్వర్యమును బొంది ఆతఁడు తాను కృతకృత్యుఁడ ననుకొనుచుండెను

పుత్రపరాభవముచే నదితి దుఃఖము

(౫౫౧)

శ్లో॥ ఏవం పుత్రేషు నష్టేషు దేవమాతా దితి స్తదా।
హృతే త్రివిష్టపే దైత్యైః పర్యతప్య దనాథవత్॥

—శ్రీ భాగ. ౮ స్కం. ౧౩ అ. ౧ శ్లో॥

సీ॥ తన తనూజుల ప్రోలు దనుజులు గొనుటయు
వేల్పు లెల్లను డాఁగ వెడలుటయును
భావించి సురమాత పరితాపమునఁ బొంది
వగ న నాథా కృతి వనరుచుండ.

—శ్రీమదాంధ్ర భాగవతము.

ఈ కుతూహలపూర్ణమగు ప్రపంచమున భగవాను డెన్నో యద్భుతాద్భుతవస్తువుల నొనర్చినాఁడు. ఈ ప్రాణి నాటకమును, తన యొక్కయు, నితరుల యొక్కయు ఖేలనములను జూచుట కుత్సహించుచుండును; కాని ధ్యానపూర్వకముగఁ జూచినచోఁ బ్రపంచములోని సమస్త వస్తువులును, సమస్త సంఘటనలును నొక మహాకుతూహలమునకు

సంబంధించిన వస్తువులు. అతి సూక్ష్మమైన వట బీజమునుండి యెంతో మహావృక్షము వచ్చును. ఆ యావగింజంత బీజములో నింతటి గొప్పవృక్ష మెచ్చట నిమిడియున్నది? దానిని బగులఁగొట్టి చూచిన దానిలో వృక్షము కనఁబడనే కనఁబడదు. కాని సత్యమేమనఁగా దానిలో వృక్షమిమిడి యున్నది. రజోవీర్యముల రూపమునయున్న రెండు జల బిందువులనుండి యింతటి గొప్పబలముగల దేహమెట్లైనది? ఇవన్నియును గల్పనాతీత విషయములు. వీని నన్నిటిని మానవుఁ డాలోచించి చూచినచో వానికి బాహ్యనాటకమును జూడవలసిన ఆవశ్యకముండదు. ఇంకొక చోటునకుఁ బోవలసిన పనియును లేదు. ఆతఁ డెచ్చటఁ గూర్చుండిన నచ్చట వానికొక దానికంటె నొకటి యద్భుత వస్తువులు గోచరించుచుండును.

ప్రపంచములలో నసంఖ్యాకములగు నద్భుతవస్తువులందొక పరమాద్భుత వస్తువు మాతృహృదయము. బ్రహ్మ మాతృహృదయము నే ధాతువుల సమ్మిశ్రణమున నొనర్చినాఁడో దాని నింతవఱకెవఁడును నెఱుఁగజాలకుండిరి. ముందు ముందెఱుఁగుటకును సంభవముకాదు. దానిలో రక్తమాంసాదులు కాక నేదో విచిత్రవస్తువుకూడ కలదు. తన సంతానము కొఱకు తల్లి యేమిచేయునో, ఆమెకు తన సంతానము నెడల నెంతటి మమత్వము కలదో దాని యనుభవమును

దల్లి తప్ప యింకెవరును నెఱుఁగఁజాలరు. ఆమె తన సంతానముయొక్క మంగళకామన కొఱకు ఉచితానుచితములగు సమస్త కార్యముల నొనర్చుటకుద్యుక్తుఁడగును. సంతానమునకన్నము పెట్టుటలో నున్న సంతోషము తాను తినుటలోఁ దల్లికుండదు. తన సంతానము సుఖముగా నుండవలయుననియే సదా ఆమె రోమరోమమునుండి భావము వెలువడు చుండును. కామవాసనా పూర్తియే జీవితమున కేకైక లక్ష్యము కలదియును, కామతృప్తికొఱకు వివిధోపాయములచే గర్భాశయమును దీసివైచుకొనువారును, లేక వికృత మొనర్చుకొనువారును, కామజన్య సంతానమును హత్యచేయుటలో వెనుకాడనివారును, నగు రాక్షస స్త్రీల సంగతిని వదలివేయుదము. కాని యట్టి తల్లులు సంతానము కొఱకెంతగాఁ బరితపించుచుందురో, వారిని సాకుటకై యెంతటి క్లేశముల ననుభవించెదరో, వారికి రుగ్ణత కలిగినప్పుడెన్ని భూత, ప్రేత, పిశాచములను పూజించెదరో, యంత్రమంత్ర తంత్రాదులను గట్టించెదరో, ఇంతెందులకు దేవదేవతల కొఱకు వారి సమ్ముఖమునఁ బశువులను గూడ బలినిచ్చుచుందురు. ఏ ప్రాణములను బలితీసి తమ సంతానమును రక్షించుకొనఁదలఁచుచున్నారో అవి యన్నియు నొక్కొక తల్లికి సంతానములను సంగతిని మఱచిపోయెదరు. వీనికిని దల్లి కలదు. ఇవి చచ్చిన మనకువలెనే వీని తల్లులును

దుఃఖమును జెందెదరను జ్ఞానమే యుండదు. కాని వారికి తమ సంతానమును గూర్చియే చింత. ఒక కథకలదు. ఒకానొక పాఠశాలలోఁ జాలమంది పిల్లలు పఠించుచుండిరి. దానిలో గొప్ప గొప్ప ధనికులు, గుణులు, విద్వాంసులు, శ్రేష్ఠులు సాహుకారులకు సంబంధించిన పిల్లలు కలరు. వారిలో నొక వృద్ధ విధవయొక్క పిల్లవాడును జదువుచుండెను. అతఁడు బీదవాఁడగుటచే నాతని వస్త్రములు సదా మలినములై యుండును. కన్నులలోను. ముక్కులలోను, శరీరమందును మురికి చేరియుండుటచే నీగలు కూడ ముసురుచుండును. ఆతని శరీర ఛాయయును బాగుండదు. ముఖమున స్ఫోటకపు మచ్చలు, స్ఫోటకముచే నొక కన్ను కాయకాచినది. ఒక దినమున నధ్యాపకుఁడు నాల్గులడ్డుల నొసంగి ఆమెతో నిట్లనెను :- ఆ ముసలిది ఆ లడ్లను దన కుమారున కొసంగి యిట్లనెను :- "నాకు వీనిని మించిన సుందరుఁడును. ప్రియమైనవాఁడును నీ పిల్లలలో నింకొకఁడు కనఁబడుట లేదు." ఈ మమకారమే మాతృహృదయమునఁ గల విశేషము ఇట్టివారి సంతానమైనను సరియే తన సంతానము సుఖముగ నుండవలయు ననుకొనును తల్లికి హృదయపూర్వకమగు నిచ్ఛయిదియేయుండును తాను దుఃఖపడినదైనను తల్లి తన సంతానమును సుఖపెట్టఁజూచు చుండును. ఒక ప్రాచీనమగు కథ కలదు ఒక పుత్రుని విషయములో నిద్దరు

స్త్రీలకు తగాదావచ్చెను. వాస్తవముగ నాపిల్లవాని తల్లి అనాథ. రెండవ స్త్రీ ఆమెను హీనముగఁ జూచుచుండెను. ఆమెను బుత్రహీనముగఁ జేయ జూచుచుండెను. ఆమె రాజు కడ పుత్రుఁడు తనవాఁడని అభియోగమును వైచెను. న్యాయాధీశుఁడిద్దరినిఁ బిలిపించి యిద్దరి నడిగెను. రెండు వైపులను సాక్ష్యము కలదు. కొందఱీమె పుత్రుఁడనిరి. కొందఱామె పుత్రుఁడనిరి. న్యాయాధీశు డేమియు నిర్ణయింపఁ జాలక పోయెను. మఱునాఁడు న్యాయాధీశుఁడందఱ సమ్ముఖమున నస్త్రీలతో నిట్లనెను :— "ఈ పిల్లవాఁడెవరివాఁడో మీ మాటలవలన నిర్ణయింపఁ జాలకున్నాను. ఇద్దరకును నధికారము కలదని తోఁచుచున్నది. చివరకు నేనీతీర్పునకు వచ్చినాను. ఈ పిల్లవానిని రెండు భాగములుచేసి యిద్దరకును జెరియొక భాగము నిప్పించెదను. ఇది వినఁగానే యథార్థమగు తల్లి యిట్లు మొత్తుకొనెను :— "నాపిల్లవాఁడుకాఁడు వీఁడు. వీనినిఁ జీల్చకుఁడు ఆమెకే యొసంగుఁడు. నేనుసత్యవంతురాలను." న్యాయాధీశుఁడు చీల్పఁ దలఁచలేదు. అతఁడు మాతృహృదయమును గుర్తింపఁ దలఁచెను. పిల్లవాని నసలు తల్లికే యిప్పించి రెండవయామెను శిక్షించెను. ఇంతకు చెప్పవలసిన దేమనఁగా బుత్రుని మంగళకామనకై తల్లి యేమైనను జేయును.

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా! బృహస్పతి ఆజ్ఞచే దేవతలు స్వర్గమును వదలి పాఱిపోఁగా నసురేంద్రుఁడగు బలి త్రిలోకేశుఁడయ్యెను. అప్పుడు దేవతలు పృథివిపై వివిధ వేషములను ధరించి దుఃఖముతో దినములను గడుపుకొనుచుండిరి. ఒకానొకప్పుడు దేవతలు స్వర్గసుఖముల ననుభవించి యిప్పుడు కాలము విపరీతమగుటచే సాధారణప్రాణులవలె నటునిటుఁ దిరుగుచుండిరి. దీనివలన దేవతలకు దుఃఖముకలుగుటయేగాక దేవతలకు తల్లియగు నదితికి అత్యంతదుఃఖము కలిగెను. ఆమెకాకలిఁ నిద్రలు లేకుండెను. సదాతనపుత్రుల పరాభవమునకు దుఃఖితయై కన్నులనీరు గార్చుచుండెడిది. సంతానము యొక్క పరాజయమునకు ఆమెదుఃఖమునకు మేఱలేకుండెను. "అయ్యో నాబిడ్డలు సదా సుఖోపభోగములలో నర్చినవారు పృథివి మీఁదనెచ్చట మారువేషమునఁ దిరుగుచున్నారో? వారికిప్పుడు యజ్ఞభాగములు లభించియుండవు. కులీనవంశములోనివారు మఱెవరినీ వెంటనే అడుగఁజాలరు. చిన్నపనియుఁ బెద్దపనియుఁ బదప్రతిష్ఠకు వ్యతిరేకముగ నడుగుకొనఁజాలరు. నేనెచ్చటికిఁ బోవుదును. ఎట్లు చేయుదును? ఏయుపాయముచే నాపిల్లలు సుఖపడెదరు? ఏ జప, తప, తంత్ర, మంత్ర, యజ్ఞానుష్ఠానము లొనర్చుటచే నాపిల్లలకు శ్రీవృద్ధికలుగఁ గలదు!' అని దేవతలమాతయగు నదితి రాత్రింబవళ్ళు దే యాలోచించుచుండును.

ఆమె సుమేరువునందు సుందరోపత్యకయందొంటరిగ నివసించుచుండెను. ఆమె పతియగు కశ్యప ప్రజాపతి తపం బొనర్చుటకై యేకాంతముగ వనమునకుఁబోయెను. ఆతఁడు చాలకాలము సమాధిస్థుఁడై యాసర్వాత్మయగు ప్రభువు నారాధించుచుండెను. అప్పుడప్పుడాతనికి సమాధి భంగమైనపుడాతఁ డదితి సమీపమునకు వచ్చి, ఆమెకుశలమునడిగి, ఆవశ్యకవస్తువులను సేకరించి పెట్టి మరలఁ దపస్సునకు వెళ్ళుచుండువాఁడు.

ఇప్పుడు సమాధి భంగము కాఁగానే కశ్యపుఁడదితి ఆశ్రమునకువచ్చి చూడఁగా నాయాశ్రమమునకు నలువైపులను నొక విషాద పూర్ణమగు వాతావరణము వ్యాపించియుండెను. ఆయాశ్రమము నిరుత్సవముగను, నిరానందముగను దోఁచుచుండెను. అచ్చటివృక్షములు వాడినట్లుండెను. స్వచ్ఛతనామమాత్రమైన లేదు. అదితి మలిన ముఖయై, విచారముతో నుత్సాహహీనముగ నెట్లోదినములు గడుపుచుండెను.

తనపతి దేవుఁడగు కశ్యపభగవానుడు వచ్చుటను గాంచి అదితి మోకరించి, చేతులు జోడించుకొని మిక్కిలి కష్టముతో విషాదానుభవమును బొందుచు లేచి, కృత్రిమ నవ్వును నవ్వి ఆమె పతికి స్వాగత మొసంగెను. పాద్యార్ఘ్యాసనాదుల నొసంగి ఆమె సత్కారపూర్వకముగఁ బతినిఁ

కూర్చుండఁబెట్టి, ప్రణామమొనరించి దీన వదనయై, దుఃఖితయై అదితి అతని సమీపమునఁ దలవంచుకొని కూర్చుండెను.

ఆమెయొక్క యీస్థితిని, నవశతను గాంచి కశ్యపుఁడు తన ప్రాణప్రియయగు పత్నితోఁ బ్రేమ పూర్వకముగ స్నేహభరితవాక్కులతో నిట్లనెను :– "ప్రియా! అందఱును కుశలముగనున్నారా? చెప్పుము."

"స్వామీ! కుశలమే" అని విషాదస్వరమున నదితి యనెను. మమకారమును బ్రదర్శించుచుఁ గశ్యపుఁడిట్లనెను :– "నీవేల నిట్లున్నావు? నీదుఃఖకారణమును నాకు జెప్పుము. నీవు లోకమాతవు. లోకమందేమైనను దుర్ఘటనము జరిగినదా? బ్రాహ్మణులు సుఖముగనున్నారా? మర్త్యధర్మము గల నీభూలోకమునగల ప్రాణులందఱును మంగళప్రదముగ నున్నదా?"

అదితి విషణ్ణవదనయై యిట్లనెను :– "స్వామీ! అంతయును బాగుగనే యున్నది. ప్రపంచములో నంతటను శాంతిగనే యున్నది."

కశ్యపుఁడిట్లనెను :– "నీగృహస్థ ధర్మములో నేవిధమగు వ్యాఘాతమును లేదు కదా! నీయొక్క ధర్మార్థ కామ సంబంధములందే లోపమును లేవుకదా?"

అదితి తలవంచుకొని యిట్లనెను :- "అదియును నన్నియును మీరాకృపవలన నన్నియును జక్కఁగ జరుగుచున్నవి."

కశ్యపుఁడు తనమాట మీఁద బలము నొసఁగునిట్లనెను :- "అయితే నీదుఃఖమునకుఁ గారణమును జెప్పుము. ఒక్క విషయ మింకయును గలదు గృహస్థునియింటికి భోజన సమయమున నాశతో నెవఁడైన నతిథి వచ్చినచో, వానికి వివిధములగు స్వాగతసత్కారములు జరుగకున్నచో నా గృహస్థునకు తప స్తేజములు నశించును. పొరపాటుననైనను నిట్టి యపరాధము నీవలన జరుగ లేదు కదా! ఎప్పుడైనను నీవు గృహస్థకార్యములందు మగ్నురాలవై యున్నపుడు, ఏగృహస్థుఁడైనను నాశాన్వితుఁడై వచ్చిన, నతనికి ప్రత్యుత్థానాదులు చేయక, పాద్యార్ఘ్యము లొనర్చి ఆతనినిఁ బూజింపకుండిన నాతఁడు నిరాశుఁడై నీవద్దకు వచ్చిన దాని మూలమున నీవు దుఃఖితురాలై తిరిగితివా? అది యట్లు జరిగియుండినచో నది అత్యంత చింతాకలితమైనవిషయము మే గృహస్థాశ్రమమందు నిత్యమును నూతన పాపములు జరుగుచుండును. గృహస్థాశ్రమము చింతాగృహము. దీనిలో సర్వశ్రేష్ఠమైన దొకటియే కలదు అది వచ్చిన అతిథులకు స్వాగత సత్కార మొనర్చుట. అతిథులు నిరాశులై వెడలినగృహము గబ్బిలములకొంపయే. నక్కలగూడే. నీవలన నిట్టిది జరిగి యుండదు."

అదితి యులికిపడి ఆగి యాగి చెప్పుటకారంభించెను.- "లేదు స్వామీ! త్రిలోకములచేఁ బూజింపఁబడు మీవంటి సర్వజ్ఞుఁడగు ప్రజాపతి భార్యావిషయములో నిట్టి యపరాధము జరిగి యుండదు."

అంత కశ్యపమహాముని యిట్లనెను:- తేజోహీనము నకుఁ గారణ మిదియునై యుండవచ్చును. మనమగ్ని హోత్రము లొనర్చు గృహస్థులము. నిత్యనియమమున నగ్ని పూజమొనర్చుట మనకు ధర్మము. పతి లేని సమయమునఁ బత్నియే అగ్నిలో హోమమొనర్చును. నేను లేకున్నసమయమున నెన్నడైన నీవు ఉద్విగ్నమానసవై హోమమును జేయకుంటివేమో? ఏలననఁగా బ్రాహ్మణముడును, నగ్నియు విష్ణుముఖముగఁ జెప్పుదురు.

అదితి యిట్లనెను:- "లేదు స్వామీ! నేను మీరు లేనిసమయమందు రెండువేళలందును హోమకాలమందగ్నిలో హవనమొనర్చు చుంటిని."

కశ్యపుఁడిట్లనెను:- "అట్లైనచో నీవు దుఃఖితవగుటకు నాకు కారణ మగుపడుట లేదు. నీవు చెప్పవేమి? నీపుత్రులే కాద కాదిత్యులందఱును కుశలముగ నున్నారా?"

ఇది విని అదితి గోమియును జెప్పక, మెదలక తల వంచుకొని కూర్చుండి కన్నులు నీరు నించుచు నాంతరంగిక వేదనను వ్యక్తమొనర్చుచుండెను. ఆమె తన సఖముపై

నేలను గీరుచుండెను. చింతాసాగరములో మునింగియుండెను. పతియొక్క యీ ప్రశ్నను వినఁగానే ఆమె హృదయములోని దుఃఖము నీరునిండి కన్నుల ద్వారా వెలువడుచుండెను.

శ్రీశుకదేవుఁ డిట్లనెను:– రాజా! కశ్యపుఁడు మాటిమాటికిని దన పత్నిని దుఃఖకారణము నడుగఁగాఁ నామె ధైర్యమును వహించి తన ప్రాణనాథునితోఁ దన దుఃఖకారణమును జెప్పుటకుఁ బ్రారంభించెను.

అదితికి కశ్యపుని యుపదేశము

(౫౫౨)

శ్లో॥ ఉపతిష్ఠస్వ పురుషం భగవంతం జనార్ధనమ్
సర్వభూత గుహావాసం వాసుదేవం జగద్గురమ్।
సవిధాస్యతి తే కామాన్ హరిర్దీనానుకంపినం।
అమోఘా భగవద్భక్తి ర్నేతరేతి మతిర్మమ॥

శ్రీభాగ. ౮స్కం ౧౬అ. ౨౦, ౨౩ శ్లో॥

మ॥ భగవంతుం బరముం జనార్దనుఁ గృపాపారీణు సర్వాత్మకున్
జగదీశున్ హరి సేవ సేయు మతఁడున్ సాంగత్యముం బొంది నీ

కగు నిష్టార్థములెల్ల నిచ్చు నిఖిలార్థావాప్తి సేకూరెడిన్
భగవత్సేవలఁబొందరాదెబహుసౌభాగ్యంబులంబ్రేయసీ॥
శ్రీమదాంధ్రభాగవతము.

భగవంతుని యొక్క మోహినీ మాయ చాలఅసాధ్య మైనది. గొప్పగొప్ప జ్ఞానులును, ధ్యానులునుదినిలోఁబడి తమ కర్తవ్యమునుమఱచిపోవుచుందురు. ప్రపంచమునెడల వైరాగ్యమును జెంది, శ్రీహరినేచూడవలయును, మనస్సులో నేవిధమగు సాంసారిక కోరికలుద్భవింప రాదను కొనుట సర్వోత్తమ విషయము అట్లుకాక యేదైన దుఃఖము కానిండు, ధనము విషయమునఁగష్టము కానిండు, ఇంకేవిధమగు జిజ్ఞాసయైనను గానిండు దానిని వృత్తికొఱకు సాధారణ జనముల నాశ్రయింపక భగవంతుని శరణు వేఁడినచో, ప్రభువు వలననే తన దుఃఖములను నివారించుకొనుటకు బ్రయత్నించినచో వారును కృతిపురుషులే సాధారణుల కంటె వారుచ్చకోటివారే. ఏలననఁగా భగవద్భక్తి అమోఘమైనది.

శ్రీ శుకదేవుఁడిట్లనెను :—"రాజా! కశ్యపప్రజాపతి తనపత్నియగు నదితిని దన విపత్తు విషయమై యడుగగా నామె మెల్ల మెల్లగా వేదనాస్వరమున దన పతితో నిట్లనెను:—స్వామీ! నాకు లోకములందెచ్చటను నకల్యాణముకనబడుటలేదు. నేను యథాశక్తిగ ధర్మపాలనమొనర్చుచున్నాను అతిథులను, అగ్నిని, దేవతలను, పూజ్యులను

యథాశక్తిగ సేవించుచున్నాను. మీవంటి ప్రజాపతి పతులు నాకు సర్వదా ధర్మోపదేశ మొనర్చుచుండ నామనోరథము పూర్తికాక యెట్లుండఁ గలుగు? నాకు వేఱుగ నేకారణము వలనను క్లేశము లేదు నాకు నాసంతానమును గూర్చియే దుఃఖము. నేను నాపుత్రుల పరాభవము కారణమున వ్యధితనై యున్నాను.

శ్రీ కశ్యపుఁడిట్లనెను:–"నీ పుత్రులకే సంకటము వచ్చిపడినది?"

అదితి యిట్లనెను:–"మీరు సమాధిలోనుంటిరి మీకు ప్రపంచస్పృహయే లేదు. అంత నాకు పుత్రులగు నింద్రాదులను నాసవతియగు దితి పుత్రులు స్వర్గమునుండి వెడల నడిపిరి. ఇప్పుడసురగణము మరపురి సుఖముల ననుభవించుచున్నారు. నాపుత్రులగు దేవతలు పృథివిపై మారు వేసములఁ దిరుగు చున్నారు"

కశ్యపుఁడు సరళతాస్వరమున నిట్లనెను: "ఏమియును ఫరవా లేదు. స్వర్గమున నుండిన నేమి? పృథివిపైనుండిన నేమి? ఇందులో భేదమేమున్నది. సర్వత్ర సుఖదుఃఖములుండియే యుండును. పైఁగా దైత్యులును నాకు బుత్రులే. అన్నదమ్ములలో నెవరు స్వర్గసుఖములను భోగించిన నేమి? ఇందు దుఃఖింపవలసిన అవసర మేమున్నది?"

అదితి దీనతాస్వరమున నిట్లనెను.- "స్వామీ! మీకేమియును దుఃఖము లేదు. సత్త్వ, రజ, స్తమోగుణాత్మక

మగు నీసృష్టియంతయును మీ వలన నుత్పన్నమైనదే. మీకెవరును బరాయివారు లేరు. అందఱును మీకు సంతానమే. కాని నేను స్త్రీని, నాకట్టివిశాలబుద్ధి యెట్లురాగలదు? నాకు స్వపరభేదము కలదు. వీరు నాపుత్రులను భేదముకలదు. వీరు నాపుత్రులు, వీరునాసవతిపుత్రులను భేదబుద్ధి నా మనస్సులోఁ బ్రవేశించి యున్నది. మీరు సమభావమును వహించుట యుచితమే. కాని ప్రభూ! నేనట్లొనర్చుట కసమర్థురాలను. పుత్రులయెడల మీరు పక్షపాతము నువహింపకున్నను నాయెడల మాత్రమీపక్షపాతము వహింపవలసి యుండును."

నవ్వి కశ్యపుఁడిట్లనెను:—"నీయెడల నేల పక్షపాతము వహింపవలయును?"

తనమాట మీద నిలువఁబడుచుఁ నదితి యిట్లనెను:—"ఏలననఁగా నేను మీకు భక్తురాలను. మీయందనురక్తను మీకుదాసిని. చరణసేవకురాలను కల్పవృక్షము సమదర్శియైనను, దానికి భేదభావము లేకున్నను, నది దానినాశ్రయించినవారి, దానిఛాయనుఁగూర్చుండినవారి మనోరథములనుబూర్తిగావించును. నేను మీచరణములనాశ్రయించితిని. ఆశ్రితుల కోరికలను మహేశ్వరుఁడు నెఱవేర్చును."

కశ్యపుఁడు ప్రేమతో నిట్లనెను:="నావలన నీవు కోరినదేమియో నాకు ముందు చెప్పుము."

అదితి యిట్లనెను:—"నేను మీకృపను గాంక్షించుచున్నాను; మీరు నన్ననుగ్రహింపవలయును. శత్రువుల

వలన శ్రీహీనులైన నాసుతులను రక్షింపుము. వారి నేదో విధమున స్వర్గమునఁ బ్రతిష్ఠింపుండు. ప్రబల పరాక్రమవంతు లగు నసురులు నా పుత్రుల యైశ్వర్యమును ధనమును, యశ మును, పదవిని నపహరించిరి వారి నసురులనుండి లాగుకొని మరల నాపుత్రులకిప్పింపుడు. శోక సాగరమున నిమగ్ననై యున్న నబలనగు నన్నుఁగరావలంబన మొనర్చి యుద్ధ రింపుఁడు. దుఃఖితయు, దీనయు, నిరాశ్రితయు నగు నా కా శ్రీయప్రదాన మొనర్పుఁడు. మాసంపత్తిని దైత్యులనుండి తీసికొని మరల మాకిప్పింపుఁడు. కృపాళూ! అశరణశరణా! భక్తవత్సలా! భగవాన్! నామనోరథము పూర్తియగు వ్యర్థము కాని యత్నము నొనర్పుఁడు. నే నీ దుఃఖమునుండి బయటపడి సుఖిని కావలయును.''

శ్రీశుకుఁడిట్లనెను :- ''రాజా! ఈవిధముగఁ బలికి అదితి మెదలకుండెను. మిక్కిలి ఆశాభరితదృష్టులతోఁదన పతివైపుచూడసాగను. ఆసమయమునఁ గశ్యపుఁడు గంభీరుఁ డయ్యెను. ఆతని సమ్ముఖమున సాంసారిక మహామోహినీ మాయ మూర్తిభవించి నిలుచున్నట్లుండెను. ఆతఁడిట్లను కొనెను :- ''భగవానుని మాయ యెంతటి విచిత్రమైనది! క్షణకాల సాంగత్యము నీతఁడు న పుత్రుఁడు. ఈతఁడు నా సోదరుఁడు, ఈమె నాపత్ని, ఈతఁడు నా స్నేహితుఁడు, ఈతఁడు సంబంధి, ఈతఁడు శత్రువు, ఈతఁడు మిత్రుఁడనుచు

నను కొనుచుందురు. వాస్తవమున మిత్రుఁడెవఁడు శత్రుఁడెవఁడు? పాంథులు సత్రములోఁ జేరినట్లు అందఱును జేరుదురు. ఎండలోఁ బ్రయాణ మొనర్చుచు వృక్షచ్ఛాయను గూర్చుండినప్పుడు, పరిచయమైనట్లు, మంచి, చెడ్డమాటలు వచ్చినట్లుండును. క్షణములో నెండ తగ్గిపోగానే యెవరిత్రోవ వారిదే. అనంతజన్మలలో మనకెందఱు తల్లులు, భార్యలు, తోబుట్టువులు, పుత్రులు, మిత్రులు, సోదరులైరో తెలియదు. ఈ ప్రవాహమనాది అయినను జీవి మమత్వమును వహించును. అందఱు నేదో సంబంధమున బంధింపబడి యున్నారు. నానారూపములలోఁ గనఁబడుచున్న సర్వాత్మ యగు ప్రభువునకే పదార్థములతో సంబంధ మొక్కటిది!”

కశ్యపుఁ డిట్లనుకొనునంతలో [illegible] నదితి దీన వాక్యములతో నిట్లనెను :- ప్రభూ! అయితే నేనేమి యాశింతును? నాపుత్రు లిట్లు తిరుగుచు నవలసిన దేనా?”

కశ్యపుఁడిట్లనెను :- ప్రియా! నీవింతటి విదుషీమణి వయ్యు నిట్టి పొరపాటు మాటలు పలుకుచుంటివేల? ప్రపంచములో నెవరెవరికి పుత్రులు, ఎవరెవరికి పతి? ఇదంతయును మోహజనిత సంబంధము భగవద్భజన మొనర్పుము. దీనానుకంపియగు భగవంతుఁడు సమస్తమును మేలుచేయఁ గలఁడు”

అదితి దుఃఖితమనస్కయై యిట్లనెను :- “స్వామీ! ఈసమయమున నాకేమియును దోఁచుటలేదు. హృదయమునఁ గోరికయుండుటచే కింకర్తవ్య విమూఢనైతిని.”

కశ్యపుఁ డిట్లనెను :– శ్రీహరి వాంఛాకల్పతరువు. ఆతఁడు సమస్తకోరికలను నెఱవేర్చువాఁడు. ఆతని చరణ ఛాయ నుండుండిన సమస్తకోరికలు నెఱవేరితీరును. ఇంకొకరికి భక్తియొనర్చినచో దాని ఫలము విపరీతము కావచ్చును. కాని భగవానుని భక్తి అమోఘము, అది యెన్నటికిని వ్యర్థముకాదు. నీవు కోరికలోనైనను సరియే సర్వాత్ముఁడగు శ్రీహరి నుపాసింపుము ఆతని శరణు జొచ్చినచో నిశ్చయముగ నీమనోరథము నెఱవేరఁగలదు.'

అదితి యిట్లనెను :– "అయితే స్వామీ! భగవదారాధనమెట్లు చేయవలయునో నాకుఁ జెప్పుఁడు. నియతి సమయము వఱకు జేయుటచే నభీష్టసిద్ధికలుగు నేదైన వ్రత, నియ మనుష్ఠానమును జెప్పుడు మనోభిలాష పూర్తికావలయును."

అంతఁగశ్యపుఁ డిట్లనెను :– భగవద్భక్తి యెట్లొనర్చినను మంగళ ప్రదమైనదే; కాని యేదైన కోరికతో భక్తియొనర్చినచో, నియమపూర్వకముగ, విధివిధానముగఁ జేయవలయును. నీవు పయోవ్రతము నొనర్చుచో నీ కోరిక అవశ్యము నెఱవేరును. ప్రభువు స్వయముగఁ బ్రకటమై నిన్నాశీర్వదించును."

ఉత్సాహముతో నదితి యిట్లనెను:–"స్వామీ! ఆ పయోవ్రతమును జేయుటెట్లు? నాకా యుపాసనమును

విధ్యుక్తముగ విస్తరముగ నుపదేశింప వలయును. ఈసమయమున నేను నాపుత్రుల కొఱకత్యంత దుఃఖితనై యున్నాను. నేనీ దుఃఖసాగరమునుండి శీఘ్రముగఁ బయట బడు నుపాయమును జెప్పుఁడు.''

అంత కశ్యపుఁ డిట్లనెను:—''ప్రియా! హృదయములో గోరిక లుత్పన్నము కాకుండుటయే సర్వశ్రేష్ఠము. ఒకవేళ యుత్పన్నమైనచో భగవత్ప్రార్థన మొనర్ప వలయును. పూర్వకాలమున నామనస్సు నందును ప్రజాపతి కావలయును కోరిక కలిగినది అప్పుడీ వ్రతమొనర్చఁగా నది నెఱవేరినది ''

ఇప్పుడదితి ముఖమున నాశా రేఖలు కనఁబడెను. ఆమెమిక్కిలి యుత్సాహముతో నిట్లనెను:—''స్వామీ! ఇది మీయనుభూత వ్రతమన్నమాట. మీరే కోరికతో నీవ్రతము నొనర్చితిరి? మీకీవ్రతము నెవరు చెప్పిరి?''

అంత కశ్యపుఁ డిట్లనెను:—''సృష్ట్యారంభమున భగవత్ప్రేరణముచేఁ బ్రజా కామన నామనస్సులో నుత్పన్నమైనది. ఆసమయమున లోక పితామహుఁడగు బ్రహ్మ నాకీ వ్రతము నుపదేశించినాఁడు. దీని నొనర్చుటచే నాకోరిక నెఱవేరినది.''

అదితి పిల్లలవలె నత్యంతోత్సుకతో నిట్లనెను:— “అయితే స్వామీ! ఆవ్రతమును నాకవశ్య ముపదేశింపుఁడు ఇప్పుడే యుపదేశింపుఁడు.”

శ్రీశుకదేవుఁ డిట్లనెను:—“రాజా! అదితి యుత్సాహమును గాంచి కశ్యపుఁ డావ్రతము నుపదేశించెను.”

పయోవ్రత విధి

సె౨౩

శ్లో॥ ఫాల్గుణస్యామలే పక్షే ద్వాదశాహ పయోవ్రతః ।
అర్చయే దరవిందాక్షం భక్త్యా పరమయాన్వితః॥

—శ్రీభాగ. ౮ స్కం. ౧౬ అ. ౨౫ శ్లో॥

వ. అనినఁ గశ్యపప్రజాపతి సతికిఁ బయోభక్షణంబను వ్రతం బుపదేశించి తత్కాలంబును తన్మంత్రంబును దద్విధానంబును దదుపవాసదానభోజన ప్రకారంబులును నెఱింగించిన నదితియును ఫాల్గునమాసంబున శుక్లపక్షంబునఁ బ్రథమదివసంబుననే దొరఁకొని పండ్రెండు దినంబులు హరిసమర్పణంబుగా వ్రతంబు సేసెను.

—శ్రీమదాంధ్రభాగవతము.

విధివిధానమునఁ జేయఁబడిన వ్రతము కోరిన కోర్కెలను బూర్తి కావించును. విధిహీనముగ నేపనినైనఁ జేసినచో దానికి సిద్ధిలేదు. అదివిపరీతఫలము నొసగునది యగును. గోధుమపిండి, చక్కెర, నేయియు డిన, వానిని విధ్యుక్తముగఁ దగినపాళ్లలో యథోచిత రీతిని వస్తువులు నొనర్చుచో, వానితో హలువా, జిలేబి, మాల్పువా మొదలగు రుచిగల వస్తువులు తయారగును. వానినిఁ దినుట చేఁజిత్తము ప్రసన్నమగును. మనస్సు తుష్టినిఁ జెందును శరీరము పుష్టినిఁ జెందును. ఆఁకలి తీరును. ఈవస్తువులను విధిప్రకారము చేయకున్నను, పిండిపచ్చిగానున్నను చేయునపుడు మాడినను, నీరుకలుపుటలో నెక్కువ తక్కువలైనను. ఇంక నితర లోపములు జరిగినను వస్తువులు చెడిపోవును. కాని వాని యందంతటి మంచిరుచిపుట్టదు. చిత్తముప్రసన్నము కాదు. పొట్టలోనికిఁబోయి వికారమును గలిగించును. దానివలన నానారోగములు పుట్టవచ్చును.

శ్రీశుకదేవుఁ డిట్లనను :- "రాజా! దేవమాతయగు నదితి తన సర్వసమర్థుఁడగు పతి కశ్యపుని పయోవ్రత విధిని గూర్చి యడుగఁగా నాతఁడిట్లనెను :- "ప్రియా నేను నీకు పయోవ్రత విధిని గూర్చి చెప్పెదను. దానిని నీవు శ్రద్ధగా విననలయును. విధి విధానమందు గడబిడ నొనర్పకుము. ఈ వ్రతము పండ్రెండు దినములు జరుగవలెను

ఫాల్గుణ శుద్ధపాడ్యమినాఁడు దీని నారంభించెదరు. ముందు రోజున ననఁగా మాఘ బహుళ అమావాస్యనాఁడు పవిత్రమై వ్రతదీక్షను గ్రహింపవలయును. దీనిలోఁ బండ్రెండు దినములు కేవలము పాలనే పుచ్చుకొనవలయును. పాలను దప్ప యింకొకటి గ్రహింపరాదు. విధివిధానము ననుసరించి భగవదారాధనము జరుగవలెను.

అదితి యిట్లడిగెను :- "అయితే స్వామీ! అమావాస్యనాఁడు చేయునది యేమో చెప్పుఁడు."

కశ్యపుఁ డిట్లనెను.-"ఆ దినమునఁ బ్రాతఃకాలమున లేచి, దొరకినచో వరాహముండి అడవి పంది త్రవ్విన మట్టిని తేవలయును. అది దొరకక పోయినచో గోశాలలో నిది కాని, గంగలోనిది కాని, తీర్థమందలిది కాని, తులసిలోనిది కాని, గురు బ్రాహ్మణుల పాదముల క్రిందది గాని మృత్తికను గ్రహింప వలయును కాలువ నదికిఁ గాని, చెఱువునకుఁగాని బావికి గాని పోయి స్నానమొనర్చుచు శరీరమంతను మృత్తికతో నలఁదవలయును. అప్పుడీ మంత్రమును బఠింపవలయును.

శ్లో॥ త్వం దేవ్యా వరాహేణ రసాయాః స్థానమిచ్ఛతా
ఉద్ధృతాసి నమస్తుభ్యం పాప్మానం మే ప్రణాశయః॥

ఓ దేవీ! ప్రాణులందఱును నివసించుటకై ఆదివరాహమూర్తి నిన్ను రసాతలము నుండి యుద్ధరించినాఁడు. నీవు నా పాపములను నాశన మొనర్పుము. నీకు నమస్కారము.

మృత్తిక నలందుకొని విధి పూర్వకముగ స్నాన మొనర్పవలయును. స్నానమొనర్చి, తన నిత్యకార్యములను నెఱవేర్చుకొని, భగవత్పూజన మొనర్పవలయును"

అదితి యిట్లనెను:—"భగవానుని పూజనము దేని మీఁదఁ జేయవలయును భగవంతుఁడు సర్వవ్యాపకుఁడు కదా!"

కశ్యపుఁ డిట్లనెను:—"ఇది నీ యిచ్ఛ ననుసరించి యుండును. భావనముపైన నాధారపడియున్నది. ఎవనికెచ్చట శ్రద్ధకలదో దానియందు భగవద్బుద్ధితో భగవత్పూజన మొనర్పవలయును. భగవంతుని అర్చావిగ్రహము కలదు. ఆతని మూర్తిత్వము కలదు. దానియందు పూజింపవచ్చును. కాకున్న నొక్క వేది నొనర్చి దానియందు బూజింపవచ్చును. సూర్యుని యందీశ్వర బుద్ధినుంచి చేయవచ్చును జల మందుగాని, అగ్నియందు గాని తన గురుదేవునకుఁగాని షోడశోపచారములతో బూజింపవలయును. ముందుగాఁ బౌరాణిక మంత్రములనుబఠించి భగవానునాహ్వానించి పాద్యార్ఘ్యాచమనములొసంగవలయును. దుగ్ధముతో భగవంతునకు స్నాన మొనర్పవలయును. తరువాత శుద్ధజలముతో స్నానమొనరింపఁ జేసి వస్త్రయజ్ఞోపవీతముల ధరింపఁ జేయవలయును. తరువాతగంధ, ధూప, దీప, పుష్ప, తులసీ, మాలా, దుర్వా, బిల్వాదుల నర్పింపవలయును. ప్రతి వస్తువును నర్పించునపుడు

ద్వాదశాక్షర మంత్రమును బఠింపవలయును. పూజనంతను నీమూలమంత్రము తోడనే చేయవలయును పాలలో వరి బియ్యమును వైచి క్షీరాన్నమును దయారుచేసికొని, దానిలో నేయి, చక్కెరలను వేయవలయును. చక్కెర లేకున్న బెల్లమును వేయవలయును. దానిని ద్వాదశాక్షర మంత్రముతో నగ్నిలో హోమమొనర్పవలయును. మిగిలిన క్షీరాన్నమును యథాశక్తిగ బ్రాహ్మణులకు భోజనమిడవలెను. హోమమునకు బూర్వమా క్షీరాన్నము చేతనే భగవంతునకు నివేదన మొనర్పవలయును. నివేదనము కావించి, ఆచమన మొనర్చి ఫలార్పణ మొనర్పవలయును మరల ఆచమన మొనర్చి తాంబూల పూగీఫల దక్షిణలను సమర్పింపవలయును. ద్వాదశాక్షర మంత్రమును ౧౦౮ సార్లు జపింపవలయును. మంచి మంచి స్తోత్రముల ద్వారా భగవంతుని స్తుతింపవలయును భూమి మీదబడి సాష్టాంగ ప్రణామము కావింపవలయును. స్త్రీలు పంచాంగ నమస్కారమునే చేయవలెను. భగవానుని చందన ప్రసాదములు మస్తకమున ధరింపవలయును. చరణామృత తీర్థమును గైకొనవలయును పుష్పమాలను శిరస్సున ధరింపవలయును. తదనంతరము విధిపూర్వకముగ విసర్జన మొనర్పవలెను.

బ్రాహ్మణభోజనమిడి, వారికి విధ్యుక్తముగ సత్కారము కావించి వ్రతసమాప్తిని గావించి, మిగిలిన నైవేద్య

మును స్వయముగ గ్రహింపవలెను. భగవంతుని స్మరించుచు రాత్రియందు నిద్రింపవలెను. ఈవ్రతమునకు పూర్వదినమునవచ్చు నమావాస్యకృత్యము ముగిసినది.

మఱునాఁడు ప్రాతఃకాలమున లేవవలయును, అంత నిత్యనియమము ననుసరించి కాలకృత్యము లను బూర్తిగావించుకొని,విధ్యుక్తముగ భగవానునిబూజింప వలయును; హావనమొనరింపవలయును; బ్రాహ్మణులకు భోజనమిడవలయును. భగవంతునకు నివేదన మిడి కేవలము పాలనేత్రాగియుండవలెను. ఈ విధముగఁ బన్రెండు దినముల వఱకు నిత్యము కేవలము పాలనే త్రాగుచు, హోమః పూజన, బ్రాహ్మణభోజన మొనర్పవలయును. పాడ్యమి మొదలు త్రయోదశివరకునియమముతో నుండవలయును బ్రహ్మచర్యవ్రతమును సావధానముగఁ భావింప వలయును. అంతట విధ్యుక్తముగ వ్రతోద్యాపనము గావింపవలయును. ఉద్యాపన సమయమున విత్తశాఠ్య మొనర్పరాదు. తనశక్తి ననుసరించి వైభవముగ మహోత్సాహ పూర్వకముగ మహోత్సవ మొనర్పవలయును. ప్రతిదినమును గానవాద్యము లుండవలయును, నృత్యమొనర్పవలయును. కథా కీర్తనాదులుండవలెను. వచ్చిన అతిథులకు భక్తి పూర్వకముగ నీశ్వర బుద్ధితో స్వాగతసత్కారము లొనర్పవలయును.

కశ్యపుఁడదితితోనిట్లనెను 'దేవి! ఈవ్రతమునకేప యోవ్రతమని పేరు. నాకీ యుపదేశమును పితామహుఁడగు బ్రహ్మ

చేసినాఁడు. నీవీవ్రతమును మిక్కిలి శ్రద్ధాభక్తులతో విధి విధానపూర్వకముగ శ్రీహరినాకనినేచింతించుచోనవశ్యము నీయిష్టవస్తువును బ్రాప్తింపఁగలవు. నీవు భగవంతునిఁగాంక్షించినను నీవాతనిఁ బొందగలవు. ఈవ్రతము వలన భగవంతుఁడు శీఘ్రముగ సంతుష్టుఁడు కాఁగలఁడు దీనికి సర్వవ్రతమను పేరును గలదు. కొందరు దీనిని సర్వయజ్ఞమనియు నందురు. ఇది తపస్సులకు సారము. విష్ణుభగవానుని వశపఱచుకొనుటకు సర్వోత్తమ, సుందర, సరళ సర్వశ్రేష్ఠమగు సాధనము. ఇట్లు వ్రతములనేకములు గలవు కాయమునకుఁ గ్లేశమును గలిగించు కఠినాతి కఠినవ్రతములు గలవు; కాని నిజముగ విచారించిచూచినచో దీనిని జేయుటచే వాసుదేవ భగవానుఁడు ప్రసన్నుఁడగునో అదియే నిజమగు వ్రతము. భగవత్ప్రీత్యర్థము జేయబడిన దానమే నిజమగు దానము. ప్రభుప్రసన్నత కొఱకు చేయబడిన నియమము యథార్థనియమము. దేనిచేఁ దపోమూర్తియగు ప్రభువు ప్రసన్నుడగునో అదియే వాస్తవిక తపము. నీవు శ్రద్ధా, సంయమ సదాచార సరళతా పూర్వకముగ నీ వ్రతాచరణము నొనర్పుము. నీ కోరిక, నెఱవేరును, భగవానుఁడు నీఁమీఁద బ్రసన్నుడగును. నీకేది కావలయునో దానినడుగుము. భగవానుఁడు సర్వసమర్థుఁడు. ఆతనికడనాశ్రితుల కీయరాని దేదియును లేదు.''

శ్రీశుక దేవుఁ డిట్లనెను —"రాజా! తనపతి యొసంగిన శిక్షణమును విని అదితి మిక్కిలి శ్రద్ధతో నీవ్రతము నొనర్చుట కుద్యుక్తురాలయ్యెను.

———

పయోవ్రతముచేఁ బ్రసన్నుఁడై ప్రభువు ప్రత్యక్షమగుట.

(౫౫౪)

శ్లో॥ తస్యాః ప్రాదుర భూ త్తాత భగవానాది పూరుషః।
పీత వాసాశ్చతుర్బాహుః శంఖచక్రగదాధరః॥
తం నేత్ర గోచరం వీక్ష్య సహసోత్థాయసాదరమ్।
ననామ భువి కాయేన దండవత్ప్రీతి విహ్వలా॥

శ్రీభాగ. ౮స్కం. ౧౭అ. ౪౫శ్లో॥

చతుర్బాహుండును, పీతవాసుండును, శంఖచక్రగదాధరుండునునై నేత్రంబుల కగోచరుండైన నారాయణ దేవుండు ప్రత్యక్షుండై నంగనుంగొని

క॥ కన్నుల నంతోషాశ్రులు
చన్నులపై బఱవఁబులక జాలము లెసఁగన్
సన్నతులును సన్నుతులును
నున్నతరుచిఁ జేసి నిటల యుక్తాంజలియై॥

—శ్రీమదాంధ్ర భాగవతము.

ప్రేమపాశమతి ప్రబలమైనది. ప్రభువు దానికి కట్టుబడి వశబడిపోవును. అపరాజితుఁడగు ప్రభువును తనభక్తిచే భక్తుఁడే పరాజితు నొనర్పగలడు. సర్వతంత్రస్వతంత్రుఁడగు సర్వేశ్వరుని భగవద్భక్తుఁడే వశ మొనర్చుకొనఁగలఁడు. ప్రభువు ప్రేమచేతనే జయింపఁ బడఁగలఁడు. ఆతడు భక్తకల్పద్రుమముఁ ఆశాలత కాఘనశ్యాముఁడే అమృతవృష్టి నొనర్చు సజల శ్యామఘనము. ప్రేమతోఁ బిలువఁబడిన పిలుపెన్నటికిని వ్యర్థము కాఁజాలదు. స్నేహముతో నొనర్పఁబడిన నాహ్వానము సదా సఫలమగును. కావున నా శ్రీకృష్ణుని చరణకమలములను కోరికతోనైనను నాశ్రయింపవలయును.

శ్రీశుకదేవుఁడిట్లనెను :—"రాజా! దేవమాతయగు నదితి తనపతియగు కశ్యపమహాముని ముఖమునఁ బయోవ్రత ప్రశంసను విని పరమ ప్రసన్నుడయ్యెను. మాఘబహుళ అమావాస్య రాగానే ఆమె సర్వవ్రతస్వరూపమును సర్వయజ్ఞసారముసగు నీ మహావ్రతము నారంభము కావించెను. ఇది వైష్ణవవ్రతము. నిత్యమును విధివిధానముతో విష్ణువు నారాధించుటయే దీని ముఖ్యోద్దేశ్యము. శ్రద్ధాసహితముగ బూజింపఁబడిన ప్రభువు సమస్త మనోరథములను బూర్తి కావించును. ఈ భావముతో నామె యీ వ్రతదీక్షను గొనినది. ఆమె మిక్కిలి జాగ్రత్తగా వ్రతము నకు సంబంధించిన సమస్త నియమములను బాలించుచుండెను.

వ్రతసమాప్తి కాఁగానే ఆమె ఒక దినమునఁ దనసమ్ముఖమునఁ బీతాంబర ధారియును, వనమాలియునగు భగవానుడు ప్రత్యక్షముగ నిలిచి మందహాస మొనర్చుచుండెను. అతనికి సుందరములును, విశాలములునగు నాలుగు భుజములుండెను. వానిలో శంఖచక్రగదాపద్మములు విరాజిల్లుచుండెను. భక్తానుగ్రహదీక్షా పరతంత్రుఁడును నాదిపురుషుఁడును, నచ్యుతుఁడునగు భగవంతుఁడకస్మాత్తుగ నదితి సమ్ముఖమున నావిర్భవింపగా నామె వెంటనే యులికి పడెను. ఆనందాతిరేక కారణమున నామె కింకర్తవ్య విమూఢ యయ్యెను. ఏదో యంత్రమామెను లేవఁదీసినట్లామె సంకల్పములేకయే శీఘ్రముగ లేచి, ప్రేమ విహ్వలమైన తదేక దృష్టితో నాత్రైలోక్య వందిత అనవద్య సౌందర్యసుధను తెప్పలార్పక పాన మొనర్చుచుండెను. అత్యంత పిపాసతో నంతను పాన మొనర్ప దలఁచినదానివలె నతని రూపమును జూచుచుండెను. ఇంతలో నామెకు స్మరణము కలిగెను "నేను నాయిష్టదైవమును మనన మొనర్పలేదు, నాప్రభువు పాదపద్మములకు ముందుగా ప్రణామ మొనర్పవలయును" అను విచారము రాఁగానే ప్రేమ విహ్వలమై పృథివిపై దండమువలెఁబడెను. ప్రేమ భరిత హృదయముతో నామె ప్రభుపాదపద్మముల సమీపమున లంబాయమానమై యుండెను. స్త్రీలకు సాష్టాంగప్రణామ మొనర్చుట నిషేధమను విషయము నామె మఱచెను.

ఆమె పయోధరములు భూమికి తాఁకుట నిషేధింపఁబడినది. ప్రేమలో నియమమెక్కడిది? ఆవేశములో స్మృతి యుండదు ఆత్మ విస్మృతి విహ్వలతకు చిహ్నము.

కొంతకాలము నేలమీఁదఁబడిన మీఁదటఁ దన జీవన సర్వస్వమును, ప్రాణధనమును నిలుచున్నాఁడని యును, దాను బడియుండెననియు, నాతఁడు విచ్చేసినప్పుడు స్తుతియొనర్ప వలయుననియు, జ్ఞాపకమునకు వచ్చెను. వినయ వచనములు పలికి ఆతనికి స్వాగత మిడవలయును. ఈ విచారము రాఁగానే ఆమె ఒదటున లేచి నిలుచుండెను. స్తుతి వినయము లొనర్చుటకై ఆమె రెండుచేతుఁ తోడను నంజలిని బంధించెను. కన్నులనుండి నిరంతర మశ్రుప్రవాహము ప్రవహించుచుండెను. అత్యంతోల్లాసమున హృదయ ముత్సహించుచుండెను. శరీరమంతయును రోమాంచ పరిపూర్ణమగుచుండెను. వాక్కు రుద్ధమయ్యెను. స్తుతియొనర్ప జూచుచుండెను; కాని వాక్కు వచ్చుటలేదు కంఠము రుద్ధమయ్యెను. తన ప్రయాస మసఫలమగుట వలన నామెకు సిగ్గువైచెను. ఆమె తలవంచుకొని ప్రభు సమ్ముఖమున మూఁగదానివలెఁ బలుకక, కదలక మెదలక అట్లే నిలుచుండెను. మరల తాను సంభాళించుకొని, ధైర్యము నాశ్రయించి, కన్నులను దెఱచెను నేత్రముల శ్యామసుందర సౌందర్యమునందు లీనమయ్యెను. చైతన్యమునుండి జడము

వలె నయ్యెను. ఆమె నిమేషోన్మేష వ్యాపార రహిత యయ్యెను. చిరకాలమునుండియును దృషితములైన నయనములతో నాతని సౌందర్యపానము నొనర్చుచున్నట్లుండెను. ఉత్కంఠయొక్క పరాకాష్ఠను జెందినట్లుండెను. అయినను మెల్లమెల్లగాఁ జిత్తమును స్థిరమొనర్చుకొని మంద మంద స్వరమున నామె విశ్వంభరుని వినతిచేయ నారంభించెను. అదితి యిట్లనెను:-"యజ్ఞేశ్వరా! అచ్యుత! యజ్ఞస్వరూపా! పవిత్రపాదా! పవిత్రకీర్తిశాలీ! శ్రవణ మంగళనామా! శరణాగత దుఃఖభంజనా! ఆర్తత్రాణ పరాయణా! ఆదిపురుషా! దీననాథా! సర్వసమర్థా! పరాత్పరప్రభూ! విశ్వోత్పత్తి స్థితిలయ కారణా! పరమాత్మా! స్వేచ్ఛచేనానాశక్తులను స్వీకరించు భూమా! అనంతా! అచ్యుతా! అజ్ఞానంధకారమునకు సూర్య స్వరూపా! నీయొక్క పరమపావన పూజనీయ పాదపద్మములకు పునః పునః ప్రణామములు. నీవు మాకు కల్యాణమొనర్చుము. మేము కోరినవరముల నొసంగుము. మామనోరథమును బూర్తి కావింపుము.

నీవు ప్రసన్నుఁడవైనచో నాతనికేవస్తువు దుర్లభమైన దుండును. నిన్ను దీర్ఘాయువును గోరినచో బ్రహ్మయువు వలెను వారికాయుస్సు నొసంగెదవు. వారుసుందర శరీరమును గోరుచోఁ గామదేవునివంటి సుందర దేహము నొసం

గెదవు. వారైశ్వర్యమును గోరుచో బ్రపంచమందలి సమస్తై శ్వర్యమును బొందగలరు. వారాధిపత్యమును గోరుకొని నచో బృథివి, పాతాళము, స్వర్గాది. భువన సామ్రాజ్యము నీయఁగలవు. సిద్ధులు కావల యునను నభిలాష యున్నచో నీయనుగ్రహముండిన నసంఖ్యాకములగు మూర్తి మంతములగు సిద్ధులు చేతులు జోడించుకొని సమ్ముఖమున నిలుచుండఁగలవు వారికి త్రివర్గేచ్ఛ యున్నచో ధర్మార్థ కామములను మీరు బ్రసాదింపఁగలరు. మోక్షేచ్ఛ యున్నచో వారికి సాధనస్వరూపమగు జ్ఞానమును నీవు వారి హృదయప్రదేశము లందుద్భవింపఁ జేయిదువు. ఆశ్రితులకు మీరన్నిటినిఁ బ్రసాదించుచున్నప్పుడు నాకోరిక అతితుచ్ఛమై నది. చెప్పుటకుగూడ నాకు సిగ్గగుచున్నది. ఇది చక్రవర్తినిఁ బ్రసన్నునిఁ గావించుకొని, గుప్పెడుగడ్డినడిగి నట్లున్నది. నేను కేవలము నాశత్రువుపైన విజయమునుబొందఁగోరుచున్నాను. స్వర్గభ్రష్టులైన నాసుతులు మరల స్వర్గమునందు బ్రతిష్ఠింపఁ బడవలయును. కాని చేయునది యేమున్నది ! కోరిక హృదయమున నుదయించినప్పుడు మానవునకది తప్ప వేఱొకటి అక్కఱయుండదు. ఆఁకలి గొన్నవానికి మంచిచందనము నలఁదుము. అత్యుత్తమమగు పుష్పహారాలను మెడలో వేయుము మెత్తమెత్తని పరుపులందుఁబరుండబెట్టుము. సుర సుందరుల కోకిల కూజిత కమనీయ కంఠములతో సుందర

సుఖద సంగీతమును వినిపింపఁజేయును. ఈసుఖప్రదవస్తువు లన్నియును నాకిని కానము దుఃఖమున సుఖప్రదములుగనుండవు. సరిగదా దుఃఖదములుగ నుండును. అసమయమున వానికి భోజనము కావలయునా. పిపాసితునకు పేయము కావలయును అదేవిధముగ నేఁడు నేను మోక్షమునుఁ గోరను. సర్వజ్ఞుఁడవును సర్వాత్మకుఁడవునగు నిన్నుఁ సన్ను నొనర్చుకొనియు నేఁడు నేను కేవలము అసురుల పరాభవమును నా కన్నులతోఁ జూడఁ గోరుచున్నాను. ఇదియే నాకత్యంత కోరికమగు నభిలాష.''

అదితి యొక్క యిట్టి వినమ్రవచనములను విని సర్వాంతర్యామియును, సర్వజ్ఞుఁడును. సచ్చిదానందమయుఁడునగు భగవానుఁడిట్లనెను:—'' దేవమాతా ! నేను నీమనోగత భావముల నిదివఱకే యెఱుఁగుదును. నీవు అసురుల పదచ్యుతిని, శ్రీహీనతను గాంచఁగోరు విషయము నాకు తెలియకపోలేదు. అసురులను స్వర్గమునుండి పాఱఁద్రోలి సురలను నందు మరలఁ బ్రతిష్ఠితులఁ జేయింప సముత్సుకతను వహించుచున్నావని నాకుఁ దెలియును. నీచిత్తము నేఁడు పరిహింసాగ్నిచే మండి పోవుచున్నది.''

ఇదివిని అదితి కొంచెముగ లజ్జితయై క్రిందఁజూచుచుండెను. అంతభగవానుఁడు మేఘగంభీర స్వనమున నిట్లనెను:—'' దేవీ ! నేఁడు నీకోడండ్రు పతివిహీనలై శృంగార

మొనర్చుకొనక, జడవైచుకొనక యెట్లేడ్చుచుండిరో నీ శత్రువుల భార్యలు నట్లే యుండుటను గాంచc గోరుచున్నావు. యుద్ధములో మరణించిన నసుర స్త్రీలు వైధవ్య దుఃఖమైన దుఃఖించుటను గాంచవలయునని యువ్విళ్లూరుచున్నావు. నీవు కోల్పోయిన యశస్సును, నైశ్వర్యమును, పదప్రతిష్ఠను, మరల సంపాదింపc జేసి నీపుత్రులను సుఖసమృద్ధిశాలురుగc జేయ జూచుచున్నావు. ఆయానందమును సంతోషముతోc గాంచc దలcచు చున్నావు కాని నేనేమి చేయcగలను! రెండువైపులను సంకటముకలదు. బ్రాహ్మణభక్తిని నేనేయిచ్చితిని. వారును నాస్వరూపులే. నీశత్రువులు నా రెండవ స్వరూపమగు గురురూపము నారాధించుచున్నారు. నీవును నన్నారాధించు చున్నావు. కావున వారి పరాభవము కఠినమే. నీమనోరథమును పూర్ణమొనర్పక పోవుటయును ననుచితమే. అయినను నాయుపాసనము వ్యర్థము కాcగూడదు. కావున నేనన్యమగు నుపాయము నాలోచింతును నేనుమధ్యలోc బడిపోయి యున్నాను.

అదితి దీనతతో నిట్లనెను:—"కాదు, స్వామి! నాకోరికను నీవు తీర్చితీర వలసియుండును, నాకేకైకాశ్రయము నీవే, నీవేగతి."

శ్రీశుకదేవుcడిట్లనెను:—"రాజా! అదితియొక్క యీ వచనములను విని శ్రీహరి యింకొక యుపాయమును గూర్చి ఆలోచించు చుండెను.

అచ్యుతుఁడదితికి పుత్రుఁడగునట్లు వరమొసంగుట.

(౫౫౫)

శ్లో॥ త్వయార్చితశ్చాహమపత్యగుప్తయే
పయోవ్రతే నానుగుణం సమేధితః॥
స్వాంశేన పుత్రత్వముపేత్య తే సుతాన్,
గోప్తాస్మి మారీచతపస్యధిష్ఠితః॥

శ్రీభాగ. ౮స్కం. ౧౭అ. ౧౮శ్లో॥

శా॥ నీకోడండ్రును నీకుమారవరులున్ నీనాథుఁడున్ నీవు సం
శ్లోకింపన్ సతులుం బతుల్ మిగుల సమ్మోదింప రాత్రించరుల్
శోకింపన్ భవదీయ గర్భమునఁ దేజోమూర్తి జన్మించెదన్
నాకున్ వేడుక పుట్టు నీసుతుఁడనై వర్తించి వర్తింపగాన్

శ్రీమదాంధ్రభాగవతము.

ఇద్దరు భక్తులొకే వస్తువును గావలయునని కోరుకొనిన యెడల స్వామి స్థితిశోచనీయముగ నుండును. ఇద్దరును దనకు కావలసిన వారే ఇద్దరిలో నెవరినిఁ ద్యాగము చేయ జాలడు ఇద్దరకును నావస్తువు కావలయునని యే పట్టుదల ఇట్టిస్థితిలో స్వామి చిన్నవాఁడు కావలసి వచ్చును. అతఁడు దీనతతో సబల పక్షమునఁ జెప్పును. వారిని వదలుఁడు. నేను నిన్ను భిక్షమడుగుచున్నాను. నాకు నీ వొసంగుము.'' శత్రువున

కొసంగుటలో నవమానము కలదు. లఘుత్వము కలదు. కాని స్వామియే యాచించి నపుడు వానికిచ్చుటలో గౌరవము కలదు. ప్రతిష్ఠకలదు. పెద్దలు పెద్దవారే. ఆతఁడాజ్ఞాపించుచు వదలుకొనుమని చెప్పవచ్చును, లేక నమ్రతతో యాచింప వచ్చును. ఇట్టిస్థితిలో స్వామి రెండు పక్షములను సంతుష్టిపరు వలయును. క్రమముగ నిద్దరకును నావస్తువు ననుభవించుట కవకాశ మొసంగును.

శ్రీశుక దేవుఁడిట్లనెను:– "రాజా! అదితి మాటిమాటికిని భగవంతుని తన పుత్రులకు స్వర్గము నిప్పిపుఁడని ప్రార్థన మొనర్పఁగా భగవంతుఁడిట్లనెను:– "దేవీ! దుష్టుడై యన్యాయములను జేయుచుండినచో నేను దండింపఁగలను పదభ్రష్టునొనర్పఁగలను. బలిచక్రవర్తినాభక్తుఁడు. గురుసేవాపరాయణుఁడు యజ్ఞముల ద్వారా నన్నుఁబూజించుచున్నాఁడు. ఆతనితో నేను యుద్ధమునుఁ జేయఁజాలను. చంపఁజాలను. బలవంతముగ స్వర్గమునుండి వెడల నడుపఁజాలను. నేనాతని కడ చిన్నవాఁడనుగావలయును. తగ్గనిది పని జరుగదు"

అదితి యిట్లనెను:–"ప్రభూ! నీవు చిన్నవాఁడవుకమ్ము, పెద్దవాఁడవుకమ్ము. నీవు నాకోరిక నెట్లైనను నెఱవేర్ప వలయును. నీవు చిన్నవాఁడవైనను బెద్దవాఁడవుగనే యుందువు. నీ పెద్దతనమున కేవిధమగు త్రుటియును రాఁజాలదు."

భగవానుఁడిట్లనను — 'దేవీ! నాకీ ధర్మసంకటము పట్టుకొనినది. నీవును నాభక్తురాలవు. బలియును నాయం దను రక్తుఁడు. కావున నేను దేవతల కంటెను జిన్నవాఁడను గావలసి వచ్చినది. దైత్యుల కంటెను జిన్నవాఁడను గావలసి వచ్చెను. అతనికంటెను గుజ్జలుదుకవలయును. అందువలన నేను దేవతలకు తమ్ముఁడను గావలసియున్నది. ఇప్పటికి నీకు పదునొక కుమారులు కలరు. పండ్రెండవవాఁడనగు నేనును నీకు బుత్రుఁడ నయ్యెదను. నేను నాయుకచే నీపతి యగు కశ్యప ప్రజాపతి వీర్యము నుండి నీగర్భమునఁ బుట్టె దను. ఈవిధముగా నాయన్నలకు సేవచేయుట నాకర్తవ్య ము కాఁగలదు. వేఱొక వంక నేను దైత్యులకంటెఁ దిగువా డను గావలయును ప్రపంచములోన నెల్లరకును దేలిక భిక్షుకుఁడు. అందఱును దృణము తేలికని పలుకు చుందురు. కాని దృణము కంటెను తేలికైనవాఁడు భిక్షుకుఁడు. వీఁడు తన్నుగూడ నడుగునని వాయువును పెనుదు తనవైపునుజేయి చాచకుండ జూచుకొనును. దేవీ! చేయి చాచినవాఁడుజీవి తుఁడనుకొనుము. మృతతుల్యుఁడే అందరకంటెను హీనుడు. కావున దైత్యులకడ నేను భిక్షుకుఁడనై వసిచి నెఱవేర్చు కొందును. ఈ విధముగ నీవిషమ గ్రంథి నూడఁదీసెదను.''

అదితి ఆశ్చర్య చకితయై యిట్లనెను:—''స్వామీ! నీవు త్రైలోక్య నాథుఁడవు. నాగర్భములోనికెట్లు రాఁగలవు?

నీవు భాగ్యవంతులగు మహిళలపైఁ గృపను జూపి భక్తవత్స లతచే నప్పుడప్పుడు లీలతో నజన్ముఁడవయ్యు వారి గర్భమున నవతరించెద వని వినియున్నాను. నేనంతటి యోగ్యురాలను గాను. కాని నీవు నాపైఁ గృపఁజూపఁదలఁచుచున్నావు. నేనేమి సేయవలయునో నాకాజ్ఞాపింపుము."

భగవానుఁ డిట్లనెను:-"దేవీ! నీవు సర్వసమర్థుఁడగు నీపతియందిట్లు విరాజమానుఁడనై యున్నానని తెలిసి కొనుము. ఆతని నిశ్చలబుద్ధితో నారాధించుము. భగవద్భావముతో నాతని బూజింపుము. ఆతని రూపమందు నిరంతరము నన్నే చింతింపుము. నీకు మేలు కలుగఁ గలదు. కాని ఒక్క విషయము మనసునందుంచుకొనవలయును."

అదితి యిట్లనెను:-"అదియేమి స్వామీ!"

భగవానుఁ డిట్లనెను:-"నేను నీకు దర్శనమొసంగి, యీవిధమగు వరమొసంగితిని. ఈవిషయమును బొరపాటుననైన నెవరికిని జెప్పరాదు."

అదితి సతర్కయై యిట్లనెను:-"స్వామీ! నన్నెవరైన నడిగిననో?"

భగవానుఁ డిట్లనెను:-"ఎవరైన నడిగినను జెప్పరాదు. అది యిది చెప్పి తప్పించుకొనవలయును."

అదితి యిట్లనెను:-"ఏల స్వామీ! ఇందులో దోషమేమున్నది? నిజము చెప్పిన నేమి హాని యుండును?"

భగవానుఁ డిట్లనెను:—"హానియేమియును లేదు. సాంసారిక విషయములను జెప్పిన బాధలేదు కాని యీ భగవద్దర్శన విషయముల నెంతగా దాచిన నంతయుత్తమము. దేవతలను బరోక్ష ప్రియులందురు. కావున దేవతా కార్యముల నన్నిటిని గోపనీయముగ నుంచుటచేతనే బాగుగా సిద్ధించును."

అంత శౌనకుఁ డిట్లడిగెను:—"సూతా! భగవానుఁడు అదితి నేలవలదనినాఁడు మనకు భగవద్దర్శనమైనదని పదుగురతోఁ జెప్పిన వారికిని నుత్సాహము కలిగి, ప్రచారమైన నుత్తమమే కదా! దాఁచిన నేమిలాభము?"

అంత గంభీరుఁడై సూతుఁ డిట్లనెను:—"మునివరులారా! మీరు కస్తూరి నెంతగా దాఁచినను దాఁగదు. అదే విధముగఁ బాపపుణ్యముల నెంతగా దాఁచినను నేదో యొక దినమున సవశ్యము ప్రకటమై తీరును అయినను దనకుదాను బుణ్యమును బ్రకటించుట చేతను, నితరులకు చెప్పుట చేతను. క్షయించును, మన పాపముల నితరులకుఁ జెప్పినచో నితరులు మనలను నిందించెదరు. మన పాపమా నిందకులకుఁ బోవును. కావునఁ బాపము చేసిన దానినిఁ జెప్పవలయును. ఇదే విధముగ మనము చేసినపుణ్యము నితరులకుఁ జెప్పినచో నదియంతయును బ్రశంసించువారలకుఁ బోవును కావునఁ బుణ్యకార్యము నెంతగాఁదాచిన నంతటి వృద్ధిగలుగును.

ఒక మహారాజు స్వర్గమునకుఁ బోగానే యింద్రుఁడా తని పుణ్య ప్రభావముచేఁ బ్రభావితుఁడై ఆతని కర్ధాసన మొసంగెను. ఇంద్రుడు గొప్ప కూట నీతిజ్ఞుఁడు ఆతఁడు రాజు నిట్లడిగెను:—"రాజా! నీవు గొప్ప ధర్మాత్ముఁడవు. నీవు భూమి మీఁదనుండి యేయేపుణ్య కార్యము లొనర్చితివి?'

రాజహంకారపూరితుఁడై యాతనితో నిట్లనెను:— "దేవేంద్రా! నేను నాపుణ్యము నేమని వర్ణింపగలను? నేనది చేసితిని, ఇది చేసితిని. వాని కింతయిచ్చితిని. ఇట్టియజ్ఞము లొనర్చితిని. ఇన్ని గొప్పగొప్ప దానము లొనర్చితిని నా రాంశ మేమనఁగా నేను జేసినన్ని పుణ్యము లెవరును జేయనే లేదు."

ఇది విని యింద్రుఁడు నవ్వి యిట్లనెను:—' రాజా! నీపుణ్యమంతయును నాశనమైనది. ఇప్పుడు నిను దలక్రిందు లుగ భూలోకమునకు బడవేయుదుము."

ఇది విని రాజు మిక్కిలి భయపడి యిట్లనెను:— "మంచిది, నేను బతితమైన బతిత మగుదును గాక, నేను నిన్నొక వరమడుగుచున్నాను నేను సాధుపురుషుల మధ్య లోఁ బడవలయును."

ఇంద్రు డిట్లనెను:—"అట్లేజరుగఁగలదు' అహంకారాత్మకమను నవనే పుణ్యము క్షీణించినవాఁడై తలక్రిందులుగ భూమిపైఁ బడెను. తనవారు యజ్ఞముచేయుచున్న చోటున బడుటచే వారి పుణ్య ప్రభావముచే మరల స్వర్గమునకుఁ బోయెను."

సూతుఁడిట్లనెను:—"కావున మునులారా! తననోటఁ బుణ్యకార్యములను జెప్పుకొనరాదు. తన కర్మముల ప్రశంసను దానుగాఁ జేసికొనరాదు. తన్నుఁ దాను బొగడుకొను వాఁడు బ్రదికి యుండియును జచ్చినవాఁడే. నా గాండీవమును నిందించిన వానినిఁ జంపెదనని అర్జునుఁడు ప్రతిజ్ఞ చేసినాఁడు."

కర్ణుని బాణములచే వ్యథితుఁడైన ధర్మరాజు అర్జునుని ఆతని గాండీవమును నిందించెను అప్పుడర్జునుఁడు ఖడ్గమును గైకొని ఆతనిఁ జంపనురికెను. అప్పుడు భగవానుడు మధ్యలో నాపి యిట్లనెను:—"నీవు చేయుచున్న దేమి?"

అర్జునుఁడిట్లనెను:—"గాండీవమును నిందించిన వానినిఁ జంపుదునని నా ప్రతిజ్ఞ. ధర్మరాజు గాండీవమును నిందించి నాఁడు ఆతనిఁ జంపి ప్రతిజ్ఞాపాలన మొనర్చుట నా ధర్మము. నేను నా ప్రతిజ్ఞను వదలి భ్రాతృమోహమున సత్యవాదినై ప్రతిజ్ఞను వీడుదునా?

భగవానుఁడు సస్మితుఁడై యిట్లనెను:—"ప్రతిజ్ఞను విడువ వలసిన పని లేదు. నీవు ధర్మరాజు నవశ్యము చంపుము. కాని అశస్త్రుఁడవై వధింపుము."

అర్జునుఁడిట్లనెను:— అశస్త్రముచే వధ యెట్లు జరుగఁ గలదు?

భగవానుఁడిట్లనెను:—"సేవకుఁడు రాజాజ్ఞను మన్నింప కున్నచో నది రాజును వధించుటే. పత్నిని బక్కలోనికి రాని యు

కన్న నామెను వధించుటయే. తనకంటె బెద్దలను వారియెదుఁ టనే నిందించుటయును, వారిని నీవు నీవని పిలుచుటయును వారిని శస్త్రముతో వధించుటయే. నీవు ధర్మరాజును నీవు నీవనుచు నిందించుము. అతని వధ కాఁగలదు.''

భగవదాజ్ఞననుసరించి అర్జునుఁడట్లే యొనర్చెను. ధర్మరాజును నాతని ముఖమున నిందించి తన ప్రతిజ్ఞను బూర్తి కావించెను.

అంత ఖడ్గమును గైకొని తన శిరస్సును స్వయముగ ఖండింపఁ బూనుకొనెను. అంత మరల భగవానుఁడాతని నడ్డగించి యిట్లనియెను:—''ఇప్పుడు నీవేమి చేయుచున్నావు?''

అర్జునుఁడిట్లనెను:—''ప్రభూ! పెద్దల నవమానమొనర్చి నచో దానికిఁ బ్రాయశ్చిత్తము తన చేతులతోఁ దానాత్మ హత్య నొనర్చుకొనుటయే కావున నేనిప్పుడు జీవింపను.''

భగవానుఁడిట్లనెను:—'మంచిదే. నీవు చావఁదలఁచిన యెడల ఖడ్గమెందుకు? నీవు చేసిన పనులను నినోటనే ఆత్మ స్తుతి నొనర్చుకొనుము. తనను దాను ప్రశంసించుకొనుట మృత్యు సమానమే''

సవ్యసాచియు నట్లే కావించెను. తన్నెంతో గొప్పగాఁ బ్రశంసించుకొనెను.

సూతుఁడిట్లనెను:— 'మునులారా! నారాంశ మేమనఁగా మీరెవరితోడను మీగొప్పతనమును గూర్చి చెప్పుకొనకుఁడు

పండ్రెండు దినములలో భగవంతుని యొక్క దర్శనమగుట యుఁ దాను పుత్రుఁడగునట్లు వరమొసంగుటయును నదితికి మిక్కిలి గౌరవకరమగు విషయము. దానినామె అందఱకుఁ జెప్పుచుండినచో దానివలన నామె సుకృతసంతతియును నశించును. ఇట్టి దృష్టాంతము లెన్నియో కలవు మొదట నెన్నియో సిద్ధులను బొంది వాని నందఱము ప్రకట పరుపఁగా నవి యన్నియును లుప్తమై పోయినవి అప్పూర్వు లైనవారే తమ విషయమందు కొంచెమును గొప్పగాఁ జెప్పుకొనుటకుఁ బ్రయత్నించుచుందురు. కాని భగవద్దర్శ నమైనది. భగవంతుఁడు మాచేతిలోని అన్నమును దినిపోయి నాఁడు. అట్లే మాకు దర్శన మొసఁగినాఁడని కొందఱొక్క వరుఁ జెప్పుకొనుచుందురు. వీనిలోఁ గొన్ని నిజముండవచ్చును, కొందరు కల్ల కపట మెఱుఁగక చెప్పియుండ వచ్చును కాని యెక్కువమంది జనులను మోస మొనర్చుటకును, అట్లు మాయచేసి యశః ప్రతిష్ఠను, ధనమును బొందుటకును జేయుచుందురు. కావున మునులారా! ఒక వేళ భగవంతుఁ డెవరిమీఁద ననుగ్రహముంచి దర్శనమిచ్చియుండ వచ్చును. అట్లిచ్చినను సాధ్యమైనంత వఱకు బయట పెట్టకుండుట ముఖ్యము. అందువలన భగవానుఁడు వెడలినప్పు డదితికి విషయమును విశేషముగఁ జెప్పెను.

శ్రీశుకదేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను:- "రాజా! ఈవిధముగ నదితికి వరమును నుపదేశమును నొసంగి భగవంతుఁ డచ్చటనే తక్షణమే అంతర్ధానమయ్యెను. ఇచట భగవంతునివలన వరమును బొంది అదితియును దాను కృతకృత్యనని యనుకొని పరమభక్తిభావపూర్వకముగఁ దనపతియగు కశ్యపుని భగవద్బుద్ధిచేఁ బూజించెను. ఇది వినగానే ఆతని హర్షమునకు మేరలేకుండెను. పరాత్పరుఁడగు ప్రభువు తన గర్భమున నవతరించు నని తెలిసికొని భగవంతుని జన్మకొఱకై ఉత్సాహముతోఁ బ్రతీక్షించుచుండెను.

వామనమూర్తి ప్రాదుర్భావము.

౧౮౬

శ్లో॥ ఇత్థం విరరంచ స్తుత కర్మవీర్యః
ప్రాదుర్బభూవామృతభూరదిత్యామ్।
చతుర్భుజః శంఖగదాబ్జ చక్రః
పిశంగ వాసా నలినాయతేక్షణః॥

శ్రీభాగ. స్కం. ౧౮అ. ౧శ్లో॥

ఇట్లు కమలసంభవుడు వినుతి సేయు నయ్యవసరంబున.

మ॥ రవిమధ్యాహ్నమునం జరింప గ్రహతారా చంద్ర భద్రస్థితిన్
శ్రవణ ద్వాదశినాఁడు శ్రోణ నభిజిత్సంజ్ఞాతలగ్నంబునన్

భువనాధీశుఁడు పుట్టె వామన గతిం బుణ్యవ్రతో పేత
కున్
దివిజాధీశ్వరు మాతకుం బరమ పాతివ్రత్య విఖ్యాతకున్ ॥

వ. మఱియు నద్దేవుండు శంఖచక్ర గదా కమలకలిత చతు
ర్భుజుండును బిశంగవర్ణ వస్త్రుండును, మకర కుండల
మండిత గండ భాగుండును, శ్రీవత్స వక్షుండును నలిన
చక్షుండును నై.........యవతరించిన సమయంబున.

— శ్రీమదాంధ్ర భాగవతము.

భగవంతుని పండ్రెండు దినముల వ్రతము చేతను, మాసోప వాసము చేతను, లక్ష సంవత్సరముల తపస్సు చేతను, ననేక విధములగు నియమముల చేతను నాతనిఁ బుత్రునిఁగా నొనర్చు కొనఁదలఁచిన నాతఁడట్లు కాఁజాలఁడు. భగవానుఁడు భక్తవశ్యుఁడు. అతఁడు తనకుఁ దానే యెవరి మీఁద నైనఁ బ్రసన్నుఁడగుచో స్త్రీ, పుత్ర, సేవకుఁడు కాఁగలఁడు. భగవానుఁడు ఫలాని వ్రతము చేతను, ఫలాని అనుష్ఠానము చేతను బ్రసన్నుఁడైనాఁడనిన నిదియొక నిమిత్త మాత్రమే. అతఁడేదైన లీలఁ జేయఁ దలచినచో దానికేదైన నిమిత్తముగ నొనర్చుకొని లీలనొనర్చును. అతఁడు నియమములకుఁ బరుఁడు. ఆతని కార్యములచే నియమము లేర్పడును. భాషావ్యవహారము చేత నే వ్యాకరణ రచనము కలుగుచున్నది కదా!

శ్రీశుకదేవుఁ డిట్లనెను:-"రాజా! అదితికి వరము నొసంగి భగవాను డంతర్ధాన మయ్యెను. అదితి తనపతి యగు కశ్యపుని సేవ చేయుచు భగవంతుని జన్మకొఱకు ప్రతీక్షించు చుండెను. ఒకదినమున భగవంతుని తేజమాతని శరీరమునఁ బ్రవేశించినట్లు కశ్యపుఁడు తెలిసికొనెను. సమాధి ద్వారా తేజము ననుభవించి విధివిధాన పూర్వకముగ శుభ ముహూర్తమునఁ దన తేజమును నదితి యుదరమందు స్థాపించెను. అదితి గర్భమందా తేజము శుక్లపక్ష చంద్రుని వలె వృద్ధి పొందఁ జొచ్చెను. యజ్ఞము లందరణిని మథించిన నగ్ని యుత్పన్నమగును. అగ్ని యెచటనో బయటనుండి రాదు. అరణులలో నాయగ్ని యిదివఱకే వ్యాపించి యున్నది. కాని మంథనముచే ఘనీభూతమై ప్రాదుర్భావ మగును. అదే విధముగ నదితి కశ్యప సంయోగముచే సర్వవ్యాపకుఁ డగు ప్రభువు ఘనీ భూతుఁడై యగ్నికివలెఁ బ్రజ్వల్యమానుఁడై ప్రకటము కావలసి యుండెను. అగ్ని ప్రకటము కాకపూర్వము యరణుల నుండి రవ్వలు రేగును అదేవిధముగా దేవి యగు నదితి అంగములందనేక విధమగు విచిత్ర జ్యోతివలె విదితమయ్యెను. ఆమె వర్ణము గర్భకారణమునఁ బాండు వర్ణముగ నున్నను, తెల్లగ నుండు మల్లె తన శోభచే సమస్తోప వనమును శోభితమును, సుగంధితము నైనట్లు ఆమె శోభయును నద్భుతముగ నుండెను. ఆమె యిప్పుడు

మంథరగతిచే నడుచుచుండెను. కశ్యపుఁడు తన ప్రియతమ యగు పత్ని నానంద పఱచుటకై ఆమెతో నిట్లనెను:—
"ప్రియా! నీకేమి కోరిక కలదు? గర్భవతి యగు స్త్రీని సమస్త విధముల సంతోషపరుచుటయే పతికి ముఖ్య కర్తవ్యము. నాకేవస్తువును గొదువ లేదు. నీవేదికోరిన దానినిఁ దెచ్చెదను.

ఇదివిని అదితి లజ్జా సంకోచములతో నిట్లనెను:—
"ప్రాణనాథా! నాకే వస్తువు నవసరము లేదు. మీకృప కావలయును. మీరింత ప్రేమించు చున్నారు. ఇదియే నాకు సర్వమును." ఈ విధముగఁ దన పతితో నేమియును నడుగదు కాని తన బాలికతైల నడుగును. ఒకర్తుకతో నిట్లనును: "నేడు మీరేమి చేసికొన్నారు. నాకును గొంచెమాఁగఁ బెట్టుఁడు కశ్యపున కిది తెలియఁగానే అతఁడిట్లు గ్రహించెను:-గర్భస్థ శిశువు భిక్షుకుఁడు కాఁగలఁడు. అతఁ డితరులనుండి భిక్ష మెత్తుకొనఁ గలఁడు.

అదితి దగ్గఱ నేదైన సఖ యే వస్తువునైన నప్పు తీసికొనిన నామె యిచ్చును; కాని తీసికొను నప్పుడు పాత్రతో నిచ్చినదో దానితోఁ దీసికొనక పెద్దదానితోఁ దీసికొనును. సఖ యేమైన నన్నచో నేను దీనితోడనే తీసికొందుననును. కశ్యపున కీ విషయము తెలియఁగానే అతఁ డిట్లనుకొనెను :- "ఈ పిల్లవాఁడు లోభికూడ కాఁగలఁడు.

అదితి గర్భవతిగా నున్నపుడామె బాలకులవలె నడుచును పిల్లలను మిక్కిలి ప్రేమించును. అప్పుడు కశ్యపు డిట్లనుకొనెను :- ఈమె కడుపునఁ జిన్నపిల్లవాఁడు పుట్టఁ గలఁడు. కాని తప్పక పోకిరి కాఁగలఁడు. అదితి చీటుమాటుగా నప్పుడప్పుడు మట్టినిఁదినును. ఒక దినమునఁ గశ్యపుఁడు దానినిఁ గాంచి యిట్లనెను :- 'ఛీ! ఛీ!! నీవింతటి ప్రజాపతి పత్నివయ్యును మట్టినిఁ దినుచున్నావు నావద్ద కంద, మూల, ఫలములును, మిఠాయీలును గలవు. ఇంక నితర పదార్థములకు కొదువ లేదు. కావలయు ననిన వీనినిఁ దిన వచ్చును. మట్టినేలఁ దిందువు ''

అత్యంత లజ్జించుచు నదితి యిట్లనెను :- 'ప్రాణ నాథా! ఏమి చెప్పుదును. నేను గర్భవతి నైనది మొదలు నాకెందులకో మట్టిమీఁద మనస్సు పోయినది. మట్టిబెడ్డలు రుచిగానున్నవి. పచ్చిమట్టి మఱియును రుచి, అప్పుడు కశ్యపు డిట్లనుకొనెను :- ' ఈ పిల్లవాఁడు భూలోభము కలవాఁడు. ఈతఁడు వశ్వము మోస మొనర్చి పృథివి నపహరణ మొనర్పగలఁడు.'

ఈ విషయములన్నియును లోలోనఁ గశ్యపుఁడీ విషయముల ననుకొనుచుండెను, కాని అదితికిఁ జెప్పుటలేదు. ఈవిషయము లామెకుఁ జెప్పినచోఁ గ్లేశము కలుగునేమోనని ఆతఁడనుకొనెను. ఈవిధముగ నదితి గర్భము దినదిన ప్రవర్థ

మానమగుచుండెను. ఉదయాచల గర్భమునుండి మేఘము లను జించుకొని సూర్యనారాయణుఁడుదయించి జగత్తును ప్రకాశించునట్లు భగవానుఁడు ప్రకటమగు సమయము సన్నికటమయ్యెను.

భాద్రపద శుక్ల ద్వాదశి పరమపావన దినము. ఆ ద్వాదశిని శ్రవణద్వాదశియని యు, విజయద్వాదశియని యును బిలిచెదరు. ఆదిన మభిజిన్ముహూర్తము. మధ్యాహ్న సమయమున సమస్త గ్రహనక్షత్ర యోగ కరణాదులు మంగళమయములుగ నుండెను. శుభగ్రహము లుచ్చ స్థానములలో నుండెను. ఆ సమయమున భగవానుఁడు ప్రాదుర్భావమయ్యెను. ఆసమయమున నాతని శోభ పరమ దర్శనీయముగ నుండెను. ఆతఁడు ప్రథమమున సాక్షా చ్చతుర్భుజుఁడగు విష్ణురూపమున నవనియందవతరించెను.

గర్భమున భగవంతుఁడుండఁగా నియమానుసార ముగ బ్రహ్మ గర్భగతుఁడగు విష్ణువును స్తుతింపవచ్చెను. స్తుతియొనర్చి బ్రహ్మ వెడలిపోఁగానే అదితిరూపమగు ప్రాచీ దిశయందు సూర్యరూపుఁడగు శ్యామసుందరుఁ డుదయిం చెను. ఆ సమయమున నాతని నాలుగుచేతులలో శంఖ, చక్ర, గదా, పద్మములు శోభిల్లుచుండెను. అత్యంత సుందర సువర్ణమయమగు పీతాంబరమును ధరించియుండెను. కర్ణములలోని కనక కుండలముల కాంతిచేఁ గపోలము

కుందకళికవలె నల్లసితమై యుండెను. ముఖ కమలమునందలి మకరందమయ మనోహర కాంతి నలువైపులను వెల్లివిరియు చుండెను వక్షస్థలమందు శ్రీవత్సము, వనమాల, కరముల కంకణములు, కంఠమందు కేయూరము, కేశములందు కమనీయ కిరీటము, కర్ణములందు కుండలములు, కటియందు కింకిణీయుతమగు బిళ్ళల మొలత్రాడును, పాదములందు నూపురములును శోభాయమానములుగ నుండెను, కంఠమందలి దివ్యవనమాలయందలి మకరందమును బానమొనర్చుటకై మత్తమధుపములు వానిపై గుంజారవమొనర్చుచుం బ్రభు ప్రాకట్యమునకు మంగళగానమొనర్చుచున్నట్లుండెను. అగస్త్యుడు సమస్త సముద్రసలిలమును బానమొనర్చినట్లు భగవంతుని వక్షఃస్థలముననున్న కౌస్తుభమణి కాంతులచే నంధకారమును బోగొట్టుచున్నట్లుండెను. మంగళమయుని మంగళజన్మ సమయమున లీవిషాదపూర్ణ జగత్తునందు సర్వత్ర మంగళమే దృష్టిగోచరమగుచుండెను. వాయువు శీతల, మంద, సుగంధిత, సుఖద స్పర్శయుక్తమై వీచు చుండెను. ఆకాశము నిర్మలముగ నుండెను. జలాశయములోని బురదనీరు స్వచ్ఛమయ్యెను. ప్రాణులందఱి హృదయములందొక యవ్యక్తమగు నుల్లాసము కనబడుచుండెను. సమస్త ఋతువులును మూర్తిమంతములై భగవంతునకు స్వాగతమిచ్చుట కుద్యమించెను. స్వర్గముయొక్క అధిష్ఠాత్రు

దేవుఁడు స్వయముగఁ బ్రసన్నుఁడయ్యెను. పృథివి గోరూపమును ధరించి నృత్యము చేయసాగెను దేవతలయొక్క హృదయకమలము తనకుఁ దానే వికసించెను సిద్ధగణ మంతరిక్షమందానందింపసాగిరి. పర్వతములు పచ్చబడెను. వానిపైనను వృక్షములు ఋతువులు లేకనే ఫలించి, పుష్పింపసాగెను. గోరూపియగు పృథివి నృత్యమొనర్పఁగా నస్యకామధేనువు మొదలగు గోవులు స్వయముగ జాసి బ్రతుతిలోఁ గలిపెను గంధర్వులు గానముచేయసాగిరి. దేవతలు దుందుభులను వాయించిరి. అప్సరసలును పృథివీతాళమునఁ దాళమును గలిపి నృత్యమును జేయసాగిరి, శంఖ, దుందుభి, మృదంగ, పణవాది వాద్యములు తమకుఁ దామే వాయింపకయే మ్రోగసాగెను. మునులును, దేవతలును, మనువులును, సిద్ధగణమును, పితృగణమును మరుద్గణమును, అగ్నిదేవుడును, ఇతర దేవతలును భగవంతుని స్తుతింపసాగిరి. ఆకాశచారులగు దేవగణము కల్పవృక్షపుష్పములను దమతమ విమానములలోనుండి అదితి భవనముమీఁద వృష్టిగఁ గురిపించిరి. సిద్ధ, విద్యాధర, కింపురుష, కిన్నర, చారణ, ప్రేత, భూత, పిశాచ, పక్షి, యక్ష రాక్షసాదులందఱును నానందోల్లాసమున గాన మొనర్చుచు నాట్యము చేయసాగిరి.

అదితి తన యెదుట చతుర్భుజుఁడగు భగవానునిఁ జూడఁగానే నిర్ఘాంతపోయెను. ఆశ్చర్యచకితయై, ఆనందాతిరేకమున మాఁటి కింకర్తవ్యవిమూఢయై కూర్చుండెను. ఆమె తన కర్తవ్యమును స్థిరపఱచుకొనఁజాలకపోయెను. ప్రజాపతియగు కశ్యపుఁడును నాపరాత్పర ప్రభువును దర్శించెను. భగవానునకు జయము గాక యని పలుకుచు జయ జయ శబ్దము లొనర్చెను. ఇచ్చట నింకొక లీల జరుగుచున్నదని భగవానుఁడు గ్రహించెను. తనకు జన్మించిన సంగతిని మఱచినాఁడు. ఈతఁడు నన్నుఁ బుత్రునిఁగాఁ దలచుట లేదు? అని యాలోచించుకొని వెంటనే తన సమస్త అస్త్ర శస్త్రములను, ఆయుధములను, భూషణములను, వస్త్రములను మాయ మొనర్చి పసిపిల్లవాఁడయ్యెను.

శ్రీశుకదేవుఁడిట్లనెను:- "రాజా! ఆ పసిబిడ్డను గాంచి తల్లిదండ్రులు చెదిన ఆనందమునకు మేఱలేకుండెను. ఆతనికి జాతకర్మాది సంస్కారము లొనర్చెను.

వటు వామనుని ఉపనయనము

(౫౫౭)

శ్లో॥ తం వటుం వామనం దృష్ట్వా మోదమానా మహర్షయః।
కర్మాణి కారయామాసుః పురస్కృత్య ప్రజాపతిమ్॥

శ్రీభాగ. ౮స్కం. ౧౮ అ. ౧౩ శ్లో॥

వ. అంతనబ్బాలునకు సంతసంబున మహర్షులు గశ్యప ప్రజాపతింబురస్కరించుకొని సముచితోపనయన కర్మకలాపంబులు సేయించిరి.

శ్రీమదాంధ్రభాగవతము

ఎవరిజీవితము మానవసేవకొఱకై యున్నదో, సార్వజనిక సుఖదుఃఖములను దృష్టికోణమున నుంచుకొని జీవనయాపన మెవరొనర్చుచున్నారో, లోకహితార్థకార్యము లెవరొనర్చుచున్నారో, వారికి సహాయ మొనర్చుటయును, వారికి సుఖ సౌకర్యములను గలుగఁజేయుట అందఱకును గర్తవ్యమై యున్నది ప్రాచీనాచార మొకటి కలదు. భిక్షుక బ్రాహ్మణుఁడు కానిండు, చక్రవర్తి సామ్రాట్టు కానిండు, ఇద్దరును దమపుత్రులను గురు గృహమున వదలి వచ్చెడువారు. అచ్చట వారిద్దరొకే విధముగనుందురు. ఇద్దరును నింటింటికి భిక్షము నడుగుకొనుటకుఁబోవుచుందురు. ఇద్దరును భిక్ష దెచ్చి గురువున కర్పించెదరు. గురువొసంగిన దానితో వారు జీవించెదరు. ఇంటివద్ద వారెంతటి స్వాదిష్ట భోజనమును దినినప్పటికిని, ఇచ్చట భిక్షలో ప్రాప్తించిన అన్నము మీఁదనే జీవించెదరు అందఱు గృహములను దమ గృహములుగ నెంచుకొందురు తల్లులందఱకును వారిపై సమానాధికారము కలదు. వారి పుత్రులును నిదే విధముగ గురుకులమున నుండు భిక్షనడుగుకొను చుండవచ్చును. ఈ విధముగ

వ్యష్టిజీవనము సమిష్టిజీవనమగుటయే ఆర్యధర్మముయొక్క లక్ష్యము. దానిని బూర్తిచేయుటకే వర్ణాశ్రమ ధర్మమును, షోడశ సంస్కారములును. ఈ సంస్కారములన్నిటిలో సర్వశ్రేష్ఠమగు సంస్కారము ఉపనయన సంస్కారము. ద్విజాతి బాలకుల కిది రెండవ జన్మగా భావింపఁబడుచున్నది. అందువలన బ్రాహ్మణ క్షత్రియ, వైశ్యులను మూఁడువర్ణములను ద్విజులనుసంజ్ఞ కలదు. ఉపనయనము కానివాఁడును, గురు సమీపమునకు పోయి వేదమాతయగు గాయత్రీ దీక్షను బొందనివాఁడును ద్విజుఁడని పిలువఁబడఁజాలఁడు బాలకుని గురువు కడకు జేర్చుటకే ఉపనయనమందురు.

శ్రీశుక దేవుఁడిట్లనెను: -"రాజా! ఇప్పుడు వామనుడు కొంచెముగఁ బెద్ద వాఁడయ్యెను. శరీరమునఁ బెద్దవాడు కాలేదు. ఉన్న వాఁడుగనే యుండుటకు సంకల్ప మొనర్చినప్పుడు పెద్దవాడెట్లు కాఁగలఁడు. కాని వయస్సు పెరిగినది తెలివి యెంత పెరుగ వలయునో అంత పెరుగినది. ఇప్పుడు కశ్యపుఁడాతనికి యజ్ఞోపవీత సంస్కారమును జేయ దలచెను. ఐదు సంవత్సరములవాఁడు కాఁగానే కశ్యపుఁడు సమస్త స్నేహితులను, స బంధువులను కుటుంబపరివారమును బిలుచు కొనెను. వామనుని ప్రభావమును నందఱుచు వినియుండిరి. ఇంద్ర, వరుణ, కుబేరాది సమస్త దేవతలును వామనునియజ్ఞోపవీత సంస్కారమునకు వచ్చిరి. మన కందఱ కంటెను జిన్న

వాఁడగు నీతని యుపనయన సంస్కారమును జూడవలయు నని అందరకును మిక్కిలి హర్షముగ నుండెను. దేవగురువగు బృహస్పతి తనపంచాంగమును జేతఁబుచ్చుకొని ఆచార్య కార్యమును నిర్వహించుటకై వచ్చెను. సంస్కారము కొఱకు చక్కని మండపము నిర్మింపఁబడెను. ముందు దినమున దేవ గురుఁడగు బృహస్పతి కశ్యపునిచే మాతృకాపూజనము నాందీముఖశ్రాద్ధాది మంగళ కృత్యములొనరింపఁ బడెను. మఱి నాఁడు దేవతల యొక్కయు ఋషుల యొక్కయు సమాజము సమావేశమయ్యెను. వేదాధ్యయన మొనర్చు చాలమంది బ్రహ్మచారులును వచ్చిరి వారుతమ యాచార్యు లతోఁ జంద్రుని ప్రక్కన నక్షత్రములవలెఁ బ్రకాశించు చుండిరి. అచ్చట దేవతలు, ఋషులు, మునులు, ఉపదేవతలు యొక్క అద్భుత సమావేశము జరిగెను.

ముందుగా వటువగు వామనుని బ్రాహ్మణ బ్రహ్మ చారులతో భోజనమొనరింపఁ జేసిరి. తరువాతఁ గావలసిన కర్మ చేయఁబడెను. అనంతరము స్నానమును జేయించి ఆతనిని మండపమునకుఁ గొనివచ్చిరి. ఇప్పుడాతఁడు బ్రహ్మచారి కావలసియున్నది. ఇంతవఱకును బాలత్వమున ధరించిన వస్త్రములను బరిత్యాగము చేయించ వలసివచ్చెను. ఇప్పు డాతఁడు బ్రహ్మచారివలె వేషమును వేసికొనవలసియున్నది, నియమముగ నుండవలయును. అందువలన నదితి ఆతని కొక

కౌపీనమును, గప్పుకొనుటకొక బొంతను నొసంగెను. వామను డందరకును గావలసినవాఁడు. అందఱాతని కేదో యొకటి యీయవలసియున్నది. అందఱి యాశీర్వాదముల తేజస్సు చేతనే ఆతఁడు సురకార్యమును నిర్వహింప సమర్థుఁడగును. విఱియఁబడిన తన తేజము నేకము కావించి దేవతలకు విజయ ప్రదానమును గావింపఁ వలసియున్నది. తల్లి యొసంగిన కౌపీనము వటువగు వామనునిచే ధరింపఁ జేయఁబడెను. కశ్యపుఁడొక సుందరమగు మేఖలను దయారుచేసి యిచ్చెను. అది వామనుని నడుమునకుఁ గట్టఁబడినది. సాక్షాత్తుగఁ బృథివీ దేవి కృష్ణమృగచర్మము నొసంగెను చంద్రుఁడు సుందరమగు పాలాశ దండమును వామనున కొసంగెను. బ్రహ్మనీటినుంచు కొనుట కొక సుందర కమండలువు నొసంగెను. సప్తర్షులు కుశరతోఁ జేయఁబడిన బ్రహ్మదండమును, ధరించుటకుఁబవిఁ త్రము నొసంగిరి. సరస్వతీదేవి ఒకసుందర రుద్రాక్షమాలను దెచ్చి యాచిన్నవాని మెడలో వైచెను. ఈవిధముగ బ్రహ్మ చారికి యోగ్యములగు సమస్తవస్తువులనుబొంది, వానినిధరించి వామనుఁడు బ్రహ్మచారివేషముఁజాల సుందరమగనుండెను. బృహస్పతి స్వయముగ యజ్ఞోపవీతమును వడకి తెచ్చెను. అక్షతపూర్ణములగు నెనిమిది పాత్రములం దెనిమిది యజ్ఞోప వీతములను, దక్షిణలను బెట్టి బ్రాహ్మణులకు దానమొసంగ

బడెను. మరల సప్తర్షుల సహాయముచే బృహస్పతి యిలువగు వామనుని కంఠమున యజ్ఞోపవీతము ధరింపఁజేసెను. అప్పు డాతఁడు కౌపీనమును ధరించి, చేతియందు దండమును కమండలును ధరించి, చంకయందు మృగచర్మమును బెట్టుకొని, భుజము మీఁద బొంతను వైచుకొని బ్రహ్మచారులవలె సకలము నందఱను దన బాలచాపల్యముచే నానందపఱచుచు యజ్ఞ కుండము సమీపమునకు వచ్చెను. ఉపనయన సంస్కారము కొఱకు స్థాపింపఁబడిన బ్రహ్మాగ్నికి సమూహన పరిస్త రణ, పూజనములను గావించి దానిలో సమిధలతో హవనము గావించెను ఆవు పిడకలనాహుతిగా వైచెను. అప్పుడాతని యన్నయగు సాక్షాత్తుగ సవితృదేవుఁ డాతనికి గాయత్రీమంత్రము నుపదేశించెను. బృహస్పతి బ్రహ్మచారి నియమములను జెప్పెను. ఇప్పుడు వామన భగవానుఁడు సాక్షాత్తుగ వటు బ్రహ్మచారి యయ్యెను. సంస్కారమంతయును పూర్తికాఁ గానే భిక్షాసమయము వచ్చెను. యక్షపతి యగుఁ గుబేరు డాతనికొక భిక్షాపాత్రము నొసంగెను. దానిఁ గైకొని వామనవటువు భిక్షమునకుఁ బోయెను. చిన్నవాఁడగు వామను నకు వస్తువులు చాలయేర్పడెను. ఒక్కొక్కప్పుడు మృగ చర్మము జారిపోవుచుండెను. ఒక్కొక్కప్పుడు భుజముమీఁద నున్నబొంత పడిపోవుచుండెను. ఒక్కొక్కప్పుడు కమండలువు నందలి నీరుచిలికిపోయెడిది. ఒక్కొక్కప్పుడు పవిత్రమును,

గొడుగును జారిపోయెడివి. ఒకప్పుడు భిక్షాపాత్ర వదిగిపోవు చుండును. దానిని చేతిలోని బ్రహ్మదండముతో సంబాళించు కొనును. అచ్చటికి జేరిన స్త్రీ పురుషులందఱును బాలకుని యీ విషయములను గాంచి నవ్వుచుందురు. వటువగు వామనుండు వీని నన్నిటిని దీసికొని ధరించి సంబాళించు కొనుచుం బోవుచుండును. ఇప్పుడాతండు భిక్ష మెత్తు కొనుటను నేర్చుకొనుచుండెను. శిక్షణమును గడువులోనే పొందెను. ఇప్పుడభ్యసించుచుండెను. మునుముందుగా నాతండు సతీ శిరోమణియును, సాక్షాజ్జగదంబికయునగు ఉమాదేవి సమీపమునకు భిక్షకొఱకై పోయెను. అన్నపూర్ణాదేవి ఆతనికిం పూర్ణపాత్రసమర్పణము కావించెను. కాని యీతండు పుట్టు లోభి. ఆతనికిం దృప్తి యెట్లు కలిగెడిది? అందఱకడను నాతండు భిక్షనడిగెను. అందఱును దమతమ సామర్థ్యానుసారముగ భిక్షనొసంగిరి. కాని లోభికెన్నడును దృప్తికలుగదు. ఆతనికి లోభము చే నధికాధిక లోభము పెరుగుచుండెను. అందఱ కడ భిక్షనుగైకొని వామనుండు దేవగురువగు బృహస్పతి కొసంగెను.

బృహస్పతి చిఱునవ్వు నవ్వి యిట్లనెను:— ''వామనా! ఈ భిక్షచే దేవతలకుగాని, నాకుగాని యేమిలాభము ? మా కందఱకును గొన్నాళ్ళు సరిపోవు నట్లింకం గొంత భిక్షను దెచ్చియుండుము.''

ఇది వినఁగానే వామనుఁడు దండకమండలువులను గైకొని శీఘ్రముగ నిట్లనెను:—"నేను గాశికి పోయెదను. కాశ్మీరమునకు బోయెదను."

నవ్వి దేవగురు విట్లనెను:—"కాశీ, కాశ్మీరములలో నేమున్నది. అచ్చట నున్న విద్యను మేము నీకుఁ జెప్పెదము. నీకు వానితోఁ బ్రయోజన మే మున్నది? కొంచెముగ భిక్షమును దెమ్ము."

వామన వటు విట్లనెను:—"ఇప్పుడీ దరిద్ర దేవతలకు ఋషులను నేమి యడుగుదును, యాచించిన నేదైన లభింపగల నుదారుఁడగు మహాదాత యొక్క పేరును జెప్పుఁడు.

అంత దేవగురువగు బృహస్పతి యిట్లనెను:—"ఈ సమయమునఁ ద్రిలోకములందును బలిచక్రవర్తికి మించిన దాతయును, మనస్వియును లేఁడు ఆతని కడకు బోయిన యాచకుఁడు విముఖుఁడై, నిరాశుఁడై రాఁడు"

వామన వటువు తెలియనివానివలె నిట్లనెను:— "స్వామీ! బలి యిప్పుడెచ్చట నున్నాఁడు? ఆతఁడెచ్చట నివసించును?

బృహస్పతి యిట్లనెను:— "ఆతఁడు త్రిలోకాధీశ్వరుఁడు. స్వర్గమున నాతనికి ప్రధానస్థానము కలదు, కాని యీ సమయమున నాతఁడు యజ్ఞమొనర్చు చున్నాఁడు."

బృహస్పతి యిట్లనెను :— "ఆతఁడు సర్వదానదీక్షి
తుఁడు. ఉత్తమమగు భృగువంశీయుఁ డొకఁడు మంగుళ సముత్తయజ్ఞము
నను ప్రోత్సాహముగ అశ్వమేధ యజ్ఞ మొనర్చుచున్నాఁడు.
ఆతని పురోహితులగు భృగువంశ బ్రాహ్మణులాతనినింద్ర
పదవియందు శాశ్వతముగ స్థాపించుటకై నూఱు అశ్వమేధ యజ్ఞము
లను చేయించుచున్నారు. ఇప్పటికి తొంబది తొమ్మిది యజ్ఞము
లైనవి. ఈ నూఱవ అశ్వమేధయజ్ఞము ఇది పూర్తియయ్యెనా
ఆతఁడు శాశ్వతముగ నింద్రపదవి నధిష్ఠింపఁగలఁడు. అందువలన
నాతఁడు యథేష్టముగ దానమొసంగుచున్నాఁడు. ఆతని నే
బ్రాహ్మణుఁడు నేది యేవస్తువును యాచించినను నావస్తు
వొసంగుచున్నాఁడు."

వామనుఁ డిట్లనెను :— "మంచిది. ఆతనికి భిక్షుఁ
డనుగ బోయెదను. నాకేదైనా నిచ్చిన యెడల నాతని
తొంబది తొమ్మిది అశ్వమేధ యాగములు పూర్తియగును.
నాకొఱకు నెఱ పర్వజాలమున్న నాతని నూఱవ అశ్వమేధ
యాగమ్ములు పూర్తికాఁగలవు."

దేవగురువగు బృహస్పతి లోలోన మనస్సులో నిట్లను
కొనెను:—"లోభవాని కోరిక నెవరును పూర్తిఁ గావింపఁ
జాలరు. కుబేరుఁడు కోరఁదగ సడిగి కాళ్ళు బాలఁజాపును.
కాళ్ళుజాపుటవలెనె లోభికెంత కొంచెము లాభముకలిగెనా
వాని తృష్ణావృద్ధి పొందును." పైకి బృహస్పతి యిట్లనెను:—

"మంచిది, బ్రహ్మచారి మహారాజా! బలిచక్రవర్తి యజ్ఞము నకుఁ బోండు, నీబోటి భిక్షుకుఁడు వానివాఁకిలి కడకుఁ బోయెగా ఆతని అపూర్ణ యజ్ఞముకూడ పూర్ణము కాఁగలదు. పొమ్మా భృగుకచ్ఛ (భడౌఁచ్) మువైపునకుఁ బ్రయాణము కమ్ము."

వామన భగవానుఁడిట్లనెను:– "గురువర్యా! నే నచ్చటికి త్రోవనెఱుఁగను. చిన్నవామన బాలుఁడను. మీరునావెంట రండు."

బృహస్పతియిట్లనెను:–"అయ్యా! నీకంతయును దెలియును బ్రహ్మాండము నీయుదరమున నిండియుండినది. నీకు గడ్డము పెరుగకున్నను నీపొట్టలోఁ బెరిగిన గడ్డము కలదు. నీవు చిన్నవాడవైనను సనాథ్యుఁడవు. నడువుము, యజ్ఞ మండపము వఱకు నిన్నుఁ బంపివచ్చెదను. లోపలికిరాను. కోరుట నీవే కోరుకొనవలయును."

వామన వటు విట్లనెను:– "గురుదేవా! మీరులోని కేలరారు? మీకు యజ్ఞమనిన నిష్టము లేదాయేమి?"

బృహస్పతి యిట్లనెను:– "లేదు స్వామీ! యజ్ఞ మనిన నిష్టములేకున్న తినునదేమున్నది? యజ్ఞములు చేయించుట మాపనియే; కాని ఒకవృత్తి కలవాఁడదేవృత్తి కలవానిని లోలోన ద్వేషించుకొనుచుండును. శుక్రా చార్యుఁడసురుల పురోహితుఁడు, నేను సురులకు. కావున

మేమిద్దరమును కొంచెముఁగ నెడముఖము పెడముఖముగ నుందుము.''

వామన భగవానుఁడిట్లనెను :- ''మంచిది, మార్గ మును జూపింపుఁడు.'' శ్రీశుకదేఁడిట్లనెను :- రాజా! ఇది విని దేవగురునితో వామనమూర్తి యజ్ఞము వైపునకుఁ బోయెను.''

బలియజ్ఞమున వామనుఁడు

(౫౫౮)

శ్లో॥ శ్రుత్వాశ్వమేధైర్యజమాన మూర్జితమ్
బలిం భృగూణాముపకల్పితైస్తతః ।
జగామ తత్రాఖిలసార సంభృతో
భారేణ గాం సన్నమయ న్పదే పదే ॥

శ్రీభాగ. ౮స్కం. ౧౮అ. ౨౦శ్లో॥

క॥ ప్రక్షీణదివిజవల్లభ, రక్షాపరతంత్రుఁడగుచు రాజీవాక్షుం
డాక్షణమున బలియింటికి, భిక్షాగమనంబు సేసెఁబెదతికముతోన్ ॥

క॥ సర్వప్రపంచ గురుభర
నిర్వాహకుఁడగుట జేసి నెఱఁజను దేరన్

ఖర్వుని ద్రేఁగు సహింపక
నుర్వీస్థలి గ్రుంగ ద్రొక్కె నురగేంద్రుఁడున్॥

శ్రీమదాంధ్రభాగవతము

కస్తూరిని డబ్బిలో దాఁచినను దాగదు సూర్యచంద్రులకు గ్రహణమువచ్చినను దాగదు. గ్రద్దతో యందలి మెరుపును దాపఁజాలరు మలినత్వమునందు సౌందర్యము దాఁగదు. అదే విధముగఁ దేజస్వుల తేజము దీనవికృతవేషమును ధరించినను నది దాగదు. చిన్న వేషమును ధరించినను, పెద్దవేషమును ధరించినను నధికులుగనేయుందురు. వారి శోభ యింకను ప్రభావశాలిని కాఁగలదు.

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా! జీవి తన స్వార్థ విషయమును వెంటనే నేర్చుకొనును. తనకుఁ బ్రయోజనము లేనిదానినిఁ బ్రయుత్నమొనర్చినను నేర్చుకొనదు. వటువగు వామనునకు అగ్నిహోత్రము, గురుపూజ, సత్య, సదాచార సంబంధమైనవి ఉపనయన సమయమునఁజాల యుపదేశములు కావింపఁబడినవి. ఆవిషయములందాతఁడు విశేష ధ్యానము నుంచలేదు; కాని భిక్షమెత్తుకొనుటను నేర్పఁగానే దాని నాక్షణముననే నేర్చుకొనెను. ఆతని తృష్ణ గొప్పది. సాధారణుల వద్ద భిక్షమెత్తుకొనుట ఉచితము కాదని తలఁచెను, చక్రవర్తి సామ్రాట్టు సమీపమునఁ జేతులను జాపుటయుగు, ఆతని ద్రవ్యమును గ్రహించుటకును

బయలుదేరెను చూపునకుఁ బొట్టివాఁడేకాని విశ్వబ్రహ్మాండములను బొట్టలోఁ బెట్టుకొనినాఁడు. ఆతఁడెచ్చటికైనను బోవును. ఆతఁడు తన బుడిబుడి పాదములను నేలపైఁ బెట్టఁగానే యెనుఁగెక్కిన పడవ యూగిపోవునట్లు పృథ్వి అడుగడుగునకును నూగిపోవుచుండెను. పొట్టి వామనుఁడు వటువై బలిని మోసగింపఁబోయెను.

ఇదివిని శౌనకుఁడిట్లడిగెను:—"సూతా! భగవానుఁడు మరుగుజ్జేల యైనాఁడు. సాధారణ బ్రాహ్మణుఁడై బలిని యాచింపవచ్చునుగదా! బలి యితర బ్రాహ్మణులకును నిచ్చుచున్నాఁడుగదా! అట్టియెడ నిట్టి వికృతవేషమును ధరించుటెందులకు?"

ఇదివిని సూతుఁడిట్లనెను :—"స్వామీ! దీని నా సర్వజ్ఞుఁడును, సమర్థుఁడును, సర్వేశ్వరుఁడును, సర్వాంతర్యామియగు శ్యామసుందరుఁడే యెఱుఁగ వలయును. ఆతని లీల అపరంపారము. ప్రాణులకు దానిని దాటుట మిక్కిలి దుష్కరము. అయినను వామనుఁడగుటకుఁ జాలకారణములు కనఁబడుచున్నవి."

మొదటి కారణమిదిగాఁ గనఁబడుచున్నది. సోదరులారా! కన్నులు తెఱచుకొని బాగుగఁ జూడుఁడు. భిక్షమెత్తుకొనుట అన్నిటికంటెఁ జిన్నకార్యము. సర్వేశ్వరుఁడనగు నేను భిక్షమెత్తుకొనను నవసరము వచ్చినచోఁ జిన్నవాఁడను

గావలసి వచ్చినది. అను శిక్షణ మొసంగుటకని తోఁచు
చున్నది.

మరుగుజ్జువాని చేతులును, గాళ్లును, నితరావయవములును నితరపురుషులకు వలెనే యుండును. భేదమేమనఁగా వయస్సు పెరిగినను నవి పెరుగవు. కొంచెముగఁ బెరిగిన తరువాతఁ గొంచెము బాతినవలె నగును. దీనిచే భగవానుఁడు భిక్షగాఁడైన పెరిగినను జిన్నవాఁడుగనే యుండునని చెప్పుచున్నాఁడు. సదా యితరుల సమ్ముఖమున దీనుఁడై చేయి జాపవలసివచ్చును. పొట్టను జూపింపవలయును!

మూఁడవ కారణమిదియై యుండును—మానము సాధారణ బ్రాహ్మణులమువలె నైనచో రాజు ఇచ్ఛానుసారముగ నేమియు నీఁడు. ఇంక నెక్కుడుగ మాటలాడినచో నాతని సేవకులేదైనఁ బరిశ్రమము చేసికొనరాదా? యందురు. మరుగుజ్జువాఁడనై వెడలినచో రాజునకు దయ కలిగి యిష్టము వచ్చినట్లు దానమీయఁగలఁడు, పాపము మరుగుజ్జువాఁడని జాలిపడగలఁడు. నాల్గవ కారణమిదియైయుండవచ్చును. ఈతఁడు పృథివిని యాచింపవలసియుండెను. అదియును బాదములతోఁ గొలుచుకొనియే. అప్పుడీ మరుగుజ్జు బ్రహ్మచారికిచ్చివేయుఁడనును.

అయిదవ కారణమిదియై యుండవచ్చును. భిక్షకుని హృదయము సదా శంకితమైయుండును. అదినిరంతరమును

వెనుక ముందులాడు చుండును. పోయిన దాతి యిచ్చునో యివ్వఁడో దలఁచకొను చుండును. పురుషులకంటె స్త్రీలతి దయామయులుగ నుందురు. పిల్లలకును బ్రహ్మచారు లకును సర్వత్ర ప్రవేశముండునని వామనుఁడు బ్రహ్మచారి యయ్యెను. పిల్లలంతఃపురము లోనికిని నేయడ్డును లేక యు పోవుచుందురు. పురుషుల కడకును బోవుచుందురు. అందు వలన భగవానుఁ డిట్లను కొనెను:—'ఎవరైనఁ బ్రబోధించిన బలిచక్రవర్తి నిర్లక్ష్య మొనర్చినచో, విద్యావళి సమీప మునకుఁ బోయి ఆమెహృదయమున దయాభావమును సంచ రింపఁ జేయు వచ్చును.

అటుల కారణ మిదియును గావచ్చును:— విచిత్రవేష మును జూడఁగానే అందఱ దృష్టులావైపున కాకర్షింపఁబడును. కావున నేను చిన్నవాఁడనై వెడలెదను అందఱును నారూప మునుగాంచి చకితులయ్యెదరు. నావైపున కాకర్షింపఁబడెదరు. నేను వేదశాస్త్ర సమ్మతముగను యుక్తిపూర్వకముగను బెద్ద పెద్దమాటలు మాటలాడుచున్నపుఁ డందఱును విస్మయా పన్నులై చూడుటకే వామనుఁడు చిన్నవాఁడేకాని గొప్ప గొప్పవారివలెనే మాటలను మాటలాడుచున్నాఁడే యని యనుచుందురు "పిట్టకొంచెము కూత ఘనము" వ్యాపార మందేదో విధముగ జనులను దమవైపున కాకర్షించుట శ్రేష్ఠ ముగుకదా. మూలికలమ్మువారు తమ దుకాణము ముందిద్దర చే

జడగమాడించెదరు. వారిద్దరును జాల చెడ్డగ నఱచుకొను చుందురు. పోట్లాడుకొనుచుందురు చాలమంది జనులు కుతూహల పరవశమున నచ్చటికి సమావేశమగుదురు. వచ్చినవారి ట్లడిగెదరు:–"ఏమి విషయము?" అప్పుడా వస్తు విక్రేత వారిని శాంతపఱచి తనవస్తువుల నమ్ముకొనును. ప్రకటన కిదియొక మార్గము. వామనమూర్తియును మరుగుజ్జు వేషమును ధరించి తనవిజ్ఞాపనమును నాకర్షింపఁజేసెను.

సూతుఁడు శౌనకాది మహామునులతో నిట్లనెను:– "మునులారా! భగవానుఁడు మరుగుజ్జువేషమును ధరించుట కనేక కారణములు కలవు అన్నిటి సారమేమనఁగా రాజును మోసగించుటకై ఆతఁడీ వేషమును ధరించెను.

శ్రీశుకదేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను:– "రాజా! నర్మదానదికి ఉత్తరతటమున భృగుకచ్ఛ(భరోంచ) యను క్షేత్రమందు– బలిచక్రవర్తి యజ్ఞము చేయుచున్న చోటునకు పోవుచుఁ బోవుచు వామనుఁడు చేరెను దూరమునను నీ అగ్నిశిఖవలె జాజ్జ్వల్యమాన మగు నొక తేజః పుంజము యజ్ఞము వైపునకు వచ్చుచుండుట నందఱును గాంచిరి. సూర్యచంద్రులవలె ప్రభావంతుఁడుగనున్న నా మాయా మాణవకు డగు హరినిఁగాంచి అందఱును నాశ్చర్య చకితులైరి. చక్రవర్తి యజ్ఞమందుండిన ఋత్విజ, యజమాన, సదస్యగణమిట్లనుకొనిరి:– యజ్ఞము వైపునకు వచ్చు

చుండిన నితఁడెవరో! అగ్ని దేవుఁడే సాకార స్వరూపమును ధరించి అగ్నిలోకమునుండి వచ్చుచున్నాఁడా? లేక సూర్య దేవుఁడు యజ్ఞదర్శనేచ్ఛచే వచ్చు చున్నాఁడా? బహుశః సదా ఐదారేండ్ల వయస్సు కలిగి బాలురవలె నుండు కుమారులలోఁ బరమ తేజస్వియగు సనత్కుమారుఁడు యజ్ఞప్రశంసను వినివచ్చుచున్నాఁడా? యేమి? ఈవిధముగ యజ్ఞమును చేయించు భృగువంశ బ్రాహ్మణులు తమ శిష్యుల తోడను, పుత్రులతోడను సహచరులతోడను వివిధముగఁ దర్కవితర్కము లొనర్చుచుండు నంతఁ వామనమూర్తి యజ్ఞమండపము సమీపమునకు వచ్చెను. అతని మనోహరమగు వేషమును గాంచి అందఱు చిత్తములను స్వతః అతని వైపునకాకర్షింపబడుచుండెను. ఆసమయమున వటువగు వామనుని శోభ దర్శనీయముగనుండెను. చిన్నగఁ బలుచనైన నడుమునకు ముంజ యొక్క మోటు మేఖలకట్టఁబడి యుండెను. ఒక కౌపీనమును ధరించెను. భుజముమీఁద మోటైనశుభ్ర యజ్ఞోపవీతము దూరమున నుండియే కనఁబడుచుండెను. శ్యామవర్ణమగు సుందర తేజస్వియగు శరీరమందాతఁడు మృగచర్మమును గప్పుకొని యుండెను. తల మీఁద చిన్న చిన్న తామ్ర వర్ణముగల తళుకులు వ్రేలాడుచుండెను. చంకలో గొడుగుండెను. భుజము మీఁద బొంత యుండెను పథశ్రమచే శ్రమించుటచే నాతనికి వస్తువు

లన్నియును భారభూతములై యుండెను. ఎప్పుడైన నపితము స్థానమునుండి జారి పోయినచోఁ గొన్ని క్రిందఁబడుచుండెను. కొన్నిఁదలు మండెను. ఒక్కొక్కప్పుడు పరస్పరము కలిసి కొనుచుండును. ఒక్కొక్కప్పుడు వ్రక్కతిని జెందుచు వాని నన్నిటిని సవరించుకొనుచు చిన్న చిన్న పాదములతో నడచుచు బలియొక్క యజ్ఞమండపమునకుఁ జేరెను. ఆతని యపరిమిత తేజస్సును గాంచి, ఆతని కాంతిచేఁ బ్రభావితులై భృగువంశ బ్రాహ్మణులును, నితర బ్రాహ్మణులును వెంటనే యంత్రితులవలె సంకల్పము లేకనే తమకుఁదాము నిలుచుండిరి. అగ్నికుండములోని అగ్నులును బ్రజ్వలితములై కుండములనుండి పైకి వచ్చి భగవానునకు స్వాగతమొసంగెను. యజ్ఞమునకు యజమాని యగు బలిచక్రవర్తి విచిత్ర బ్రాహ్మణ వేషమునుగాంచి ముగ్ధుఁడై, యాతఁడు లోలోన నను పూర్వకముగఁదన సర్వస్వము నాతని చరణములకు సమర్పించెను.

నాల్గు వైపులను కలకలము బయలుదేరెను. ఒక పరమసుందరుఁడును, వాయుదేవ సదృశుఁడును, దేజస్వియును, దపస్వియునగు బ్రహ్మచారి యజ్ఞమండపమునకు వచ్చుటను గాంచి స్త్రీపురుషులు గుంపులు గుంపులుగ నిలుచుండి మరుగుజ్జు వటువును జూచసాగిరి ఆతని సమస్త అంగములును, నుపాంగములును నాతని రూపమున కనురూపముగ నుండెను

అతిమనోహరముగను, బరమదర్శనీయుఁడుగను నున్న నా బ్రహ్మచారినిఁ గాంచి అందఱును నాత్మ విస్మృతినిఁ జెందిరి.

యజమానుఁడగు బలిచక్రవర్తి లేచి యెదుఱుగ వచ్చి వానికి స్వాగత మొసంగెను. బంగరు పళ్లెరమందు చరణములను గడిగెను విధ్యుక్తముగ మంత్రములను బఠించి ఆతని కర్ఘ్యము నొసంగెను. అత్యంత మనోహరములు మృదువునగు నాసనమును నాతనికిఁ గూర్చుండుట కొసంగెను. వామనవటువు తన కమండలువును నొకవైపునను౦చి, బొంతను భుజముపైనుండి తీసి, మృగచర్మమును సవరించుకొని, దండమును బొంతసహాయమున నుంచి ఆతఁడు సుఖాసనమునఁ గూర్చుండెను. వామనుఁడు కూర్చుండినమీఁదట బలి శాస్త్రోక్త విధిచే నాహిచి(?) తాతిథియగు విప్రునిఁ బూజించెను. తులసీ చందన గంధమిశ్రిత జలముచేఁ జరణములను గడిగెను. అర్ఘ్య, ఆచమనీయముల నొసంగి, యజ్ఞోపవీత వస్త్రములను గంధపుష్పములను, మాలా, ధూప, నైవేద్య, ఫల దక్షిణాదులను సమర్పించి హారతినొసంగెను మధుర కోమల వచనములతో స్తుతించెను. మరల నాతని పునీతపాదోదకములను శ్రద్ధాభక్తులతో శిరస్సున నుంచెను. నర్మదాతీరము నుండ గానే గంగవచ్చినదని ఆనీటిని గృహమందంతను జల్లుకొనెను. భృగుకచ్ఛపమందే గంగా నర్మదలసంగమమైనది. విష్ణుపాదోదకమును గంగయను పేరుకలదు. దేవాధి దేవుఁ

డును, చంద్రశేఖరుఁడును, వృషభ ధ్వజుఁడునగు శంకరుఁ డందుల కనియే భక్తిభావముతో దానిని శిరమున ధరించి నాఁడు.

శ్రీశుక దేవుఁడిట్లనెను :— "రాజా ! యోగ్యుఁడగు నతిథిని తన యజ్ఞ మండపమునకు వచ్చుటను గాంచిన బలి హర్షమునకు మేర లేకుండెను. అతఁడు తన యపూర్వమగు నతిథి సంతుష్టుఁ నొనర్చుటకై యేదియో అడుగుటకు వ్యక్తుఁ డయ్యెను.

బలి-వామనుఁడు.

శ్లో॥ యద్యద్వటో వాంచసి తత్ప్రతీచ్ఛ మే
త్వామర్థినం విప్రసుతాను తర్కయే ।
గాం కాంచనం గుణవద్ధామ మృష్టమ్ ।
తథాన్న పేయ ముత వా విప్రకన్యామ్ ॥

శ్రీభాగ. ౮స్కం ౧౮అ. ౩౨ శ్లో॥

మ॥ వరచేలంబులొ మాడలో ఫలములో వన్యంబులో
గోవులో
హరులో రత్నములో రథంబులో విమృష్టాన్నంబులో
కన్యలో

కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీ ఖండము కాక యేమడిగెదో ధాత్రీ సురేంద్రో త్తమా ॥

శ్రీమదాంధ్ర భాగవతము.

ప్రపంచములో మనస్సులకు వారు సత్సాంతల కీయరానిది లేదు. పృథివ్యప్తేజో వాయురాకాశములను నీ పంచ భూతములు భగవానునిచే సృష్టింపబడినవి. ఎవ్వడైనను దానొక నీటి బిందువును నిర్మింపదలంచిన నిర్మింపజాలడు భూతముల నుత్పన్న మొనర్చుశక్తి భూత భావనుడగు భగవంతుని యందే కలదు. ఈ ప్రపంచమందున్న సువర్ణము, వెండి, మణిమాణిక్యములు, భవనములు, మేడలు, తోటలు, ఉద్యానవనములు, పుష్పములు, వస్త్రములు, చందనము, స్త్రీ పురుషులు, గుఱ్ఱములు, ఏనుగులు, ఒంటెలు, గోవులు, గొఱ్ఱెలు, మేకలు మొదలగు పదార్థములన్నియును బంచ భూతముల సంయోగము చేతనే యేర్పడినవి. మన దేహమును బంచ భూతములతో నిర్మింపబడినది ఒకానొక దినమున నిదియును బూడిదయై, క్రుళ్ళి, మలమై పంచ భూతములలో కలిసిపోవును. ఈ దేహము నశ్వరమైనపుడు దీని ద్వారా ఉపార్జింపబడిన లేక నిర్మితపదార్థముల వినాశము లెట్లు కాకుండును. ఇవన్నియును నొకానొక దినమున భూతములలో కలిసి

పోవును. ఈ నశ్వర పదార్థములందు స్వేచ్ఛాపూర్వకముగ మమత్వమును తొలగించుటచేతను, సత్పాత్రమున దానము సంగులచేతను నవినాశి లభించినచో నిట్టి లాభప్రదమగు వ్యాపారమును బుద్ధిమంతుడు చేయ దలపడు? [illegible] నుండి రక్తము సదా స్రావము. అక్కడి పాత్రయందున్నను, నేయి, నూనె పీనితో నింపినచో [illegible] పాత్రయందుండినవో నది పడిపోదా, [illegible] బలము కలుగదు ఇదేవిధముగ [illegible] పురుషుని శరీరము వాడు [illegible] శ్రీహరియే. [illegible] కంటె శ్రేష్ఠమగు పాత్ర [illegible] యే [illegible] వానుని కర్పించిన వస్తువు [illegible] నశించనిదగును. నాశవంతమైనను నవినాశి యగును. [illegible] సర్వస్వమును సత్పాత్ర స్వరూపుడగు శ్రీహరికే సమర్పింపవలయును.

శ్రీ శుకదేవుడిట్లనెను:- "రాజా! బలి వామనమూర్తికి పూజచేయుచుండగానే చేతులను జోడించుకొని యిట్లనెను:- "స్వామీ! మీరీ [illegible] మిక్కిలి దయ చూపితిరి. ఈ యజ్ఞభూమియందు మీ పాదాబ్జమునే [illegible] పావనము సర్చితిరి నేను మీకెప్పుడు సేవ చేయుచుండెదనో, యేమి పలికి మిమ్ములను [illegible] తెలియుటలేదు."

వామనుడిట్లనెను:- "రాజా! మేము యోగ్యులము. భిక్షుక బ్రాహ్మణులము నీయశము దిగ్దిగంతముల

వ్యాపించి యున్నది. నీప్రశంసను విని యితర దర్శకులు వచ్చినట్లే నీ యజ్ఞమును జూచుటకు నేనును వచ్చితిని."

వినీతభావముతో బలి యిట్లనెను:—' స్వామీ! నేను మిమ్ముల నితర సాధారణ దర్శకుల వలె భావించుటలేదు. నేను మిమ్ములను మనుష్యునిగా భావించుటలేదు. సమస్త రాజర్షుల, బ్రహ్మర్షుల తపస్సుల యొక్క తపోమూర్తియని భావించుచు నాయజ్ఞమును కృతార్థ మొనర్ప వచ్చినట్లను కొనుచున్నాను."

వామన వటువిట్లనెను:—"రాజా! నీవుధర్మాత్ముఁడవు. అతిథి సేవాధర్మము భగవద్బుద్ధితో సత్కార మొనర్ప వలయునో నీవు బాగుగాఁ దెలియుదు. అందువలననే నీవిట్టిశిష్టాచారవాక్యములను బలుకుచున్నావు మంచిది. శిష్టాచారమైనది. ఇప్పుడు నీపనిని గానిమ్ము. దేవర్షి పితృతర్పణములొనరింపుము. యజ్ఞహవన మొనర్చి పుణ్యము నార్జించుకొనుము."

ఇదివిని బలి యిట్లనెను:—' స్వామీ! మీవంటి వారి దేవదుర్లభ దర్శనమైన తరువాతఁ గూడ నింక నాకు కర్తవ్యశేషమున్నదా! మీ పవిత్ర పాదపద్మముల నెప్పుడు ప్రక్షాళన మొనర్చితినో అప్పుడే నాపాపములన్నియును నశించినవని నేను దలఁచుచున్నాను. నేను విశ్వక్రముగఁ జేసిన సమస్త యజ్ఞముల ఫలమును బొందితిని. మీ చరణామృతమును

భానమొసర్చి, శ్రద్ధతో శిరస్సున ధరించి నేను నేఁడు పవిత్ర తీర్థములందు స్నానము చేసిన వాఁడనైతిని నేను సమస్త దేవతలను, ఋషులను, పితరులను సంతోషపెట్టఁగలిగితిని. ఈ కోమల చరణకమలముల స్పర్శచే భూమిని కూడ పవిత్రమైనది. మీరు నన్ను గ్రహించి మనుగ్రహించితిరి. నేను మీయొక్క విషయమునందుఁగలఁచుచున్నాను; కాని అడుగుటకు సంకోచించుచున్నాను.''

వటువగు వామనుఁడిట్లనెను:—''లేదు రాజా! సంకోచింపఁబని యేమున్నది? నీవడుగఁదలఁచినది నిస్సంకోచముగ నడుగుము.''

బలి యిట్లనెను:—''స్వామీ! మీరు నన్నేదో యాచింపవచ్చినట్లు భావించుచున్నాను.''

నవ్వి వటువగు వామనుఁడిట్లనెను:—''ఓహో రాజా! నీకెట్లు తెలిసినది?''

బలి వినీత భావముతో నిట్లనెను:—''స్వామీ! నాకు నిశ్చయముగా లేదు. కాని మీరేదో ప్రయోజనము కొఱకై వచ్చినట్లనుమానించుచున్నాను. మీ బ్రాహ్మణ వేషమే చెప్పుచున్నది. బ్రాహ్మణుడు భిక్షుకుఁడై జన్మించును. అతనికి సాంసారిక ప్రపంచముతోఁ బ్రయోజనము లేదు. అతఁడెవరి కడనైనను వెడలినచో యాచించుటకే పోవును. మీరీ బ్రహ్మచారి వేషమును ధరించితిరి. బ్రహ్మచారికి తననిత్య

కర్మానుష్ఠానము, అధ్యయనమునకే అవకాశము లేదు. అట్టిచో గృహస్థునకు అక్కఱకైనను వెదలవలెనో నేనో ఆవశ్యక వస్తువుకొఱకై వెదకును. బ్రాహ్మణులకు రెండవ ఆజీవిక అధ్యాపనము. యజ్ఞమును జేయించుట, దానమును గ్రహించుట, యజ్ఞోత్సవమునకు బ్రాహ్మణులే యోగ్యతతో వెడలుదురు. ఈ కారణముల వలనకే బహుశః మీరు ఆవశ్యకములగు వస్తువులు యాచించుటకు వచ్చితిరని నేనూహించితిని. నాయనను యాచనము నిత్యము కాదు కదా!

రాజుయొక్క యీ ప్రశ్నను విని భిక్షుకుడగు వామనుడు కొంచెము లజ్జించి యిట్లయ్యెను. లజ్జా దీనతాయుక్తమగు నవ్వుతో సంకేతనము నాతడి యనుమానము సత్యమని యంగీకరించెను.

బలి యాతని తపస్తేజ, సౌందర్య సరళతా స్వభావములను జూచి బహుమానందమును జెందుచుండును. ఇప్పుడాతని లజ్జాయుక్తమగు నవ్వుచే నాతని సాహసము పెరిగి యిట్లనెను:—"స్వామీ! లజ్జింపవలసిన పని లేదు. మీరు బ్రహ్మచారులు, సత్పాత్రులు. మీవంటి సత్పాత్ర సన్నుగౌరవాన్వితులు నాయొద్దకై నన్ను యాచింప వచ్చితిరి. మా బ్రాహ్మణుల కృపచే మావద్ద నేవస్తువునకు కొఱత యనునది లేదు. మీరేది యడుగ దలచితిరో దాని నిడుదును. మీరు రాజ్యము నడిగినను దాని నొసంగుటకు సిద్ధముగ నున్నాను.

నవ్వి వామనుఁ డిట్లనెను — 'రాజా! చిన్నవాఁడను రాజ్య మేమి చేయఁగలను?''

బలి యిట్లనెను - ''అయితే, మీకిష్టము వచ్చినదే అడుగుఁడు. మీరు చిన్నవటు బ్రహ్మచారులు. పిల్లలకుఁ బాల నిన నిష్టము. మీరు పాలు త్రాగుటకు గోవు కావలసియుండిన నొకటిగాని, రెండు, పది, యిరువది, యేబది, నూరు, వేయి పదివేలు, లక్ష, రెండులక్షలు మీకెన్ని గోవులు కావలసి యుండిన నన్నిటిని సుందరమైనవియును, పాడివియును, సక్కఁగుఁ బాలిచ్చునవియును గొనుఁడు.''

వామనుఁ డిట్లనెను: — మహారాజా! గోవులను నేనిచ్చుటఁ గట్టుకొని తిరుగగలను? నేనెంత చిన్నవాఁడనో చూచుచున్నావుకదా! నాశరీరమునే తీసికొని పోవుట కష్టముగ నున్నది.

బలిచక్రవర్తి మిక్కిలి యుత్సాహముతో నిట్లను - ''మంచిది గోవులు కాకుండినఁ బోనిండు. మీకెంత సువర్ణము కావలయునో తీసికొని పొండు. మీవద్ద సువర్ణముండినచో సమస్త సామగ్రులును వానికవియే రాఁగలవు భోజన మడుగుడు, వస్త్రముల నడుగుఁడు, పాలు, మీగడ, వెన్న పాలకోవా మొదలైన వన్నియును సొమ్ముచేఁ రాఁగలవు. డబ్బున్నవాని వద్దకు గొప్ప గొప్ప గుణవంతులును, శ్రేష్ఠాతి శ్రేష్ఠ పండితులును, నుత్తమ కళాకారులును వచ్చుచుందురు.

సమస్త గుణములును గాంచనమున నివాస మొనర్చుచుం డును. కావున మీరు యథేచ్ఛగా బంగారము నడుగుఁడు".

వామనుఁడిట్లనను:—"మహారాజా! బంగారము నిచ్చుటఁ గట్టుకొని తిరుగుకొనును? సువర్ణము రాఁగానే వ్యవహారం మందసక్తత వచ్చును. ధనమదము వృద్ధియగును దాని యందాసక్తి కలుగును. ధనికులకు దయ యనునది యుండదు. రజోగుణము వృద్ధియగును. అందఱితో వైరము కలుగును. అందఱాతనిఁ గొట్టి వానినుండి ధనము లాగుకొన వలయు నను కొనుచుందురు."

అంత బలి యిట్లనెను:—మంచిది సువర్ణమును గైకొన కుఁడు. నేను మీకొఱకొక యత్యంత సుందరమగు భవనము నిర్మించెదను. దానిలో మెత్తని పరుపులు పరువఁబడియుండును. బంగా రపు తూగుటుయ్యాల యుండును. అత్యంత సుందరమగు స్వచ్ఛ మును, తెల్లనను నగుడిన వస్త్రములు కొట్లనిండ బియ్యము నిండియుండును. సమస్త పదార్థము లందుండును. తినుటకు లేహ్య, చోష్య, భక్ష్య, భోజ్య, పేయ పదార్థములుండును. త్రాగుట కత్యుత్తమములగు పదార్థములు కలవు. ఇట్టి సర్వ సంపద్యుక్తమును, సమస్త సామగ్రులతో సంపన్నమైన పదా ర్థములతోఁ గూడుకొనిన దానిని దానము కావించెదను. నా కింకను వివాహము కాలేదు. గృహిణి లేక గృహమెందుకని మీరన వచ్చును. ఇటుకలును రాళ్ళతోఁ గట్టఁబడిన వి

యిండ్లుకావు. ఇట్టివానిలో నుండువారిని గృహస్థులనరు. అట్టులైనఁ బెద్ద పెద్ద మీసములను, గడ్డములను, జడలను బెంచుకొనిన సాధువులును నిండ్లలో నివసించుచుండెదరు. వీరు గృహస్థుని పిలువ బడరు. గృహిణి యుండు గృహమే వాస్తవమున గృహము. అట్లైన మీకు వివాహేచ్ఛయే యున్నచో నేదోవిధమున మీరే ఒక బ్రాహ్మణకన్యకను వెదకుకొనుఁడు. నేను మీకు వివాహ మొనర్చెదను. బ్రహ్మచారులగు మిమ్ము గృహస్థుగా నొనర్చెదను. రెండు కాళ్ళను నాల్గుకాళ్లుగాఁ జేయఁగలను. నిర్వాహము కొఱకు గ్రామము కావలయుననిన గ్రామమునే నిప్పించెదను. గుఱ్ఱము కావలసి యుండిన గుఱ్ఱము మీయింట వాఁకిటఁ గట్టించెదను. ఏనుఁగు కావలయుననిన నేనుఁగు నొసంగెదను. రథమును గోరుకొనినచో సుందర సువర్ణ మండితమగు రథము నిప్పించెదను. మీరును మీగృహిణియు దానిలోఁ గూర్చుండి సుఖపూర్వకముగఁ దిరుగుచుండ వచ్చును. ఈవస్తువులన్నియును గాక మీకింకేమైనను గావలసి యుండిన దానినడుగ వచ్చును. సంకోచము లేక అడుగ వచ్చును. కృపణుల నడిగిన లజ్జవేయును. స్వయముగ శ్రద్ధతో నొసంగుటకు సముత్సుకులైనపుడు దాని నడుగుటలో లజ్జించుట వ్యర్థము.

శ్రీ శుకదేవుఁడిట్లనెను :- "రాజా! రాజు సమస్త విధములను దనకనుకూలుఁడనియును, సమస్తమును నొసం

గుట కుత్సగించుచున్నాఁడనియుఁ దెలిసికొని, ఆతని నింకను దృఢమొనర్చుటకు, ఆతనిని మాటలతోఁ గట్టుటకును, నాతని మోసగింపఁగ పటువేషమును ధరించిన యాబ్రాహ్మణ దేవత ఆతనితో నేమో పలుకుచుండెను. ఆతని కేమి కావలయునో సూటిగాఁ జెప్పక, దానికి గొప్పభూమికను బంధించి చెప్పుట కారంభించెను.''

వామనుఁడు బలి కులమునుగూర్చి ప్రశంసించుట

౧౬౦

శ్లో॥ వచస్తవైతజ్జనదేవ సూనృతమ్
కులోచితం ధర్మయుతం యశస్కరమ్ ।
యస్య ప్రమాణం భృగవః సాంపరాయే
పితామహః కులవృద్ధః ప్రశాంతః॥

—శ్రీభాగ. ౮స్కం. ౧౯ అ. ౨ శ్లో॥

సీ. జననాథ నీమాట సత్యంబు సత్కీర్తి
దంబుఁ గులార్హంబు ధర్మయుతముఁ
గురుణానువర్తులు ఘనతత్త్వమూర్తులు
గాని మీకులమందుఁ గలుగ రొరులు

రణభీరువులు వితరణభీరువులు లేరు
ప్రత్యర్థు లర్థులు ప్రబ్బికొనిన
దానశౌండిమమునఁ దనుపుదు రథులై
మీతాతలందఱు మేటిమగలు.

—శ్రీమదాంధ్రభాగవతము.

నీతియుక్తులతోఁ జేయఁబడిన కార్యమే బాగుగ సిద్ధించును. అన్నికార్యములందును నెట్లు యుక్తియుండునో భిక్షమెత్తుటయందును యుక్తియుండును "దీనితో నేమియును లాభము లేదు. భిక్షమెత్తుకొని తిందు" మని లోకులనుచుందురు. దీనినిబట్టి భిక్షమెత్తుట అన్నిటికంటె సరళకార్యమని తేలుచున్నది. కాని వాస్తవమున విషయమిది కాదు భిక్షమెత్తుట చాల కఠినకార్యము. ఇతరుల హృదయమున దయాసంచారము గావింపఁజేసి, పరిశ్రమచే సంపాదించిన డబ్బును దీసికొనుట సరళకార్యము కాదు దీనికొఱకును బుద్ధిబలమును యుక్తియును గావలయును. భిక్షకుఁడు దాతదృష్టి తనమీఁదఁబడు ట్లు వేషమును వేయవలయును. వాస్తవమున నీతనికి ధనమవసరమని వానిఁ జూడఁగనే వానికిఁ దోఁచవలయును. అందువలననే చాలమంది బిచ్చగాండ్రెఱుపు రంగును రాచుకొని, దానిమీఁద గట్టునుగట్టి తమ శరీరమందు కృత్రిమగాయమును జూపించెదరు చాలమంది ఒకకాలిని భూమిలో పాతుకొని, దాని స్థానమునఁ గొయ్య

గాలినుంచి [illegible]ంటివారుగా ప్రదర్శించెదరు; చాలమంది ఒక చేతిని జోళ్ళక్రిందు దాఁచుకొని, ఆస్థానమునకుఁ గొయ్యతోఁ జేయఁబడిన కృత్రిమ హస్తమును దగిలించుకొని తాము చేతులు లేనివారమని చెప్పుకొనుచుందురు. కొందఱు కన్నులుండియును గ్రుడ్డివారుగ నభినయించెదరు. చాలమంది స్త్రీలు కృత్రిమముగ పసిబిడ్డల నేర్పాటుచేసికొనియును, నింకొకరి పిల్లలను దెచ్చియును నప్పుడే కనినవారివలెఁ గనఁబడుచుందురు. సారాంశమేమనఁగా దాతయొక్క హృదయములో నియ్యవలయునని భావన యెట్లు కలుగునో అట్టి వేషమును భిక్షకుఁడు వేయవలయును. పండితుఁడైనఁ బని జరుగుచోఁ బండితవేషమును వేయవలయును. వేషమువలన ప్రభావము [illegible]నవునిపిన వెంటనే పడును. స్వభావము సహవాసముచేఁ దెలియఁబడును. అందువలననే భగవానుఁడు దయనీయమైన బ్రహ్మచారిభిక్షుక బ్రాహ్మణవేషమును ధరించెను

భిక్షగాఁడే సామాన్యముగా దాతకడనే యే నడతలు సాగునో, ఎట్టివానిని మన్నించునో తెలిసికొనవలయును. అధికముగ వాక్ప్రయుగుచో వానికడకుఁబోయి వానిని ప్రశంసింపవలయును. అ[illegible]ని శ్రేష్ఠుడగు గు[illegible]యుని పలుకవలెను మూఁడవ విషయము దాతయొక్క వంశము వారిది [illegible] నిర్ధనులును, భిక్షగాండ్రు నైష్[illegible] రాక్షసులవలెఁ

క్రూరులుగ నుండినను వారి సత్యాధిక్యముగఁ బ్రశంసింప వలయును. దానివలన నాతనికి కులీనతాభిమానము జాగృతినిఁ జెందును నాల్గవ విషయము-స్వాయముగ దాతను మధుర శబ్దములతో నాతఁడొనర్చిన కార్యములను గోరంతలను గొండంతలుగఁ బ్రశంసింప వలయును. ఇట్టికార్యముల సింకెవరు చేయఁగలరన వలయును ఐదవవిషయము-తనకీ వస్తువు కావలయునను తనయభిప్రాయమును వెంటనే చెప్పరాదు. గొప్పభూమిక నేర్పాటు చేసికొని చివరకుఁ బ్రసంగము రాఁగానే సంకోచముతోఁ దనకుఁ గావలసిన దానిని బయటపెట్ట వలయును. చివరకు నాకీవస్తువు ముఖ్యముగఁ గావలిసి యున్నది. అదియెచ్చటనైన లభించినచో మీకడకు వచ్చి శ్రమపెట్టు వాఁడను గానన వలెను.

ఆఱవ విషయ మేమనఁగా-మొదటి నుండియును లోభముగ నుండరాదు. ఈవస్తువు నాకవసరము లేకుండిన నేఁడిగెడు వాఁడనే కానని ముందుగాఁ దన నిస్పృహతను వెల్లడింప వలయును తన త్యాగవృత్తిని బ్రదర్శించుచు దాతను దన్నెపుడు నాకర్షింప వలయును ఈవిషయముల నన్నిటిని దృష్టిలో బెట్టుకొని యాచకుఁడు దాతయును నుదారుఁడు నగువానిని యాచించునచో నాతని యాచన యెన్నటికిని నిష్ఫలము గాదు. ఉత్తమ భిక్షుకుఁడు యథాశక్తిగ లోభివాని నెన్నటికిని నడుగరాదు. కృపణుఁడు డొక

వేళ యిచ్చినను బదికోటు లందప యశస్సును గావించను. శ్రేష్ఠుఁడగువాఁడు లేదన్నను నాతఁడు చాల సిగ్గుపడును. ఈవిషయమును భిక్షుకులకు శిక్షన మొసంగుటకే భగవానుఁడు భిక్షుక వేషము ధరించినాఁడు

శ్రీశుక దేవుఁ డిట్లనెను:–"రాజా! బలిచక్రవర్తి అత్యంతోదారతతో నటువగు వామనునితోఁ గోరిన వస్తువు నడుగ వచ్చునని బహువంత పెట్టఁగా నాతని నుబ్బించుటకై భిక్షుకుఁడగు భగవానుఁడు భిక్షుకునియొక్క సమస్త లీలలను ప్రదర్శించు చుండెను. ఈసమయమున బలిచక్రవర్తి శుక్రాచార్యుని కప్పిలలో నున్నాఁడని గ్రహించెను. ఈతఁడాతఁ డేమి చెప్పిన నాటిని జేయును. అందువలన ముందుగా నాతఁడు శుక్రాచార్యునిఁ బ్రశంసించుచు నిట్లనెను:–రాజా! నీవు ధన్యుఁడవు నేను నిన్ను గూర్చిన ప్రశంసను వినిన దానికంటె నెక్కుడుగ నున్నది. ఏలనుండదు? ఎవనియొక్క సమ్మతిదాత, పురోహితుఁడు, గురువు, సమస్తైహిక లౌకిక పారలౌకిక కార్యములను జేయించు వాఁడునగు భృగునందనుఁడు శుక్రాచార్యులై యున్నారో నీమాటలు దాని కనురూపముగనే యున్నవి. సేవకుని వ్యవహారమును గాంచి స్వామి వ్యవహారమును దెలిసికొనవచ్చును శిష్యుని యోగ్యతను బట్టిగురువుయొక్క యోగ్యతనూహింప వలసియున్నది. ఒక భిక్షుకుని సమ్ముఖమున నిట్టి యుదార, మధుల, నిశ్చల

వచనములను శుక్రాచార్యుని శిష్యులే పలుకఁగలరు. అను లీని శిష్యుఁడై యుండినచో గుర్వాజ్ఞను మన్నింపఁడు ని కులము విషయమున జెప్పవలసిన దేమున్నది?"

అత్యంత నమ్రుఁడై లజ్జించుచు బలిచక్రవర్తి యిట్లనెను:-"ప్రభూ! నేను మీ బ్రాహ్మణులకు దాసుఁడను"

అత్యంతోల్లాస స్వరమున వామన వటు విట్లనెను:- "మహారాజా! ఇట్టి నమ్రత అకులీనులకు రానేరాదు. నీవు బ్రాహ్మణ సేవకుఁడవు ఇందాశ్చర్య మేమియును లేదు. బ్రాహ్మణులకు సంతుష్టుఁడై తన ప్రాణముల నొసంగిన విరోచనునకు నీవు పుత్రుఁడవు"

విరోచన మహారాజు గొప్ప తేజస్వి, యశస్వి, శూర వీరుఁడు. దాత. ధనుర్వేద విశారదుఁడు అతఁడు దన బాహు బలముచే స్వర్గమును జయించెను. దేవతలను స్వర్గమునుండి తరిమివైచెను. అతఁడు త్రిలోకములను శాసించెను. ఆతనికడ కెప్పుడు వచ్చి బ్రాహ్మణు లేవస్తువును యాచించినను వెంటనే యిచ్చెడువాఁడు ఆతనికడ బ్రాహ్మణుల కీయరాని వస్తువను నది లేదు. సురగణమాతని జయింపఁ జాలక కపట ముతో జయింపఁ దలఁచిరి. ఇంద్రాది దేవతలు బ్రాహ్మణ వేషములను ధరించి ఆతని కడకు వచ్చిరి బ్రాహ్మణ భక్తుఁ డగు విరోచనుఁడు వారికి యథేష్టముగ స్వాగత సత్కారము లొనర్చి, వారు యథార్థముగ బ్రాహ్మణులు కారనియు,

తమకు శత్రువులగు దేవతలు బ్రాహ్మణు వేషములను ధరించి తనకడకు వచ్చిరనియుఁ దెలిసికొన్నను నాతఁ డిట్లనుకొనెను:- "వీరెవరైనఁ గానిండు, బ్రాహ్మణ వేషములను ధరించి నాకడకు వచ్చినారు; కావున వీని నేను బ్రాహ్మణులను వలె స్వాగత సత్కారము లొనర్పవలయును". ఇట్లాలోచించి వారిని విధ్యుక్తముగఁ బూజించి చివరకిట్లనెను:- "బ్రాహ్మణులారా! మీరే ప్రయోజనము కొఱకై నాకడకు వచ్చితిరో దానిని జెప్పుడు, నేను మీకే ప్రియకార్య మొనర్పవలయును."

వారిలో బ్రాహ్మణవేషమును ధరించిన సహస్రాక్షుఁడగు నింద్రు డిట్లనెను.-'రాజా! మాకోరికను నెఱవేర్చెదనని మీరు మాటనిచ్చితివేని యట్లైననే మేము మిమ్ము యాచించెదము.'

అంత విరోచన మహారాజిట్లనెను:- 'బ్రాహ్మణులారా! మీరు నాయొద్దనుండి విశ్వాస మేల కలిగియున్నారు మీరడుగఁ దలఁచిన దేమో నిస్సంకోచముగ నడుగవచ్చును. నా వద్ద బ్రాహ్మణుల కీయరాని వస్తువేమియును లేదు.'

ఇది విని యింద్రుఁడిట్లనెను:- 'రాజా! మేము మీ మిగిలిన ఆయువును గోరుచున్నాము. మాకు మీ జీవితము నొసంగుడు.'

అత్యంత హర్షముతో బ్రాహ్మణభక్తుఁడగు విరోచన మహారాజిట్లనెను :— 'బ్రాహ్మణులారా! నేఁడు నేను కృతార్థుఁడనైతిని. నా జీవితము ధన్యమైనది. అది బ్రాహ్మణులకు పనికివచ్చినది నేను నా జీవన ప్రాణములను సహర్షముగ మీకు సమర్పించుచున్నాను.'

వామనవటువిట్లనెను:— 'రాజా! ఇట్లు పలికి యాతఁడింద్రునకిచ్చి యును తన జీవితమునొసంగెను. ఆతని వీర్యమునుండి నీవు పుట్టితివి. తండ్రియే పుత్రుఁడై యుద్భవించును. తండ్రియొక్క ఆత్మయే పుత్రరూపమునఁ బరిణమించును. నీవును నంతటి బ్రాహ్మణభక్తుఁడవే, ఈవిషయమున నాశ్చర్యమును జెందవలసిన పనిలేదు ఏలనఁగా నీవు పరమ భక్తుఁడవు. యశస్వివి, అసురాధిపుఁడవు విరోచనుని పుత్రుఁడవు'

సిగ్గుతో బలి యిట్లనెను :— 'స్వామీ! నే నాటని చరణధూళితో నెన నరిపోలఁజాను. నాకట్టిగుణము నూర్లకొలఁది జన్మములకైనను రాఁజాలదు'

వామనవటువు వికసితుఁడై యిట్లనెను .— 'రాజా! నీవట్టి పలుకులను బలుకకుము. మీ కులములో నందఱును నిట్టివారే వారందఱిలో గుణములుకలవు. అందఱును నేకమై నీలో ఘనీభూతులైరి నీ తండ్రియగుఁ బ్రహ్లాదుని గూర్చి చెప్పుట దీపముతో సూర్యుని జూపించుటయగును. భగవం

తుని గుణములవలె నాతని గుణములును సర్వత్ర కీర్తింపబడు చుండును. భగవంతుని యశమువలె లోకములో నాతని యశస్సును వ్యాపించియున్నది. ఆతఁడు భక్తలోకైకాగ్రణి. పూజనీయుఁడు, ఆదర్శమూర్తి. ఏ కులమందు భక్తశిరోమణియగు ప్రహ్లాదుఁడు ప్రకాశించుచున్నాఁడో. తన నిర్మల నిష్కలంక సుయశముచే ప్రపంచమందు సూర్యునివలె దేదీప్యమానమగుచున్నాఁడో రాజా! ఆకులమందే నీవు జన్మించితివి. ఆ ప్రహ్లాదుఁడు నీ తండ్రికి తండ్రి పౌత్రునకా గుణములు లేలగావు మీకు బ్రాహ్మణభక్త్యాదిసద్గుణములు కులపరంపరచే పైతృకసంపత్తియై యున్నది. మీపూర్వజులు బ్రాహ్మణులకు దానముసంగుటలో శూరవీరులు. అంతే కాదు. వీరుఁడననుకొను యోధుఁడెవఁడును వచ్చి రణమును యాచించి యీయకపోయిన వారెవరును లేరు శుభపర్వమందుగాని, యుద్ధస్థలమందుగాని వచ్చి ధనమును గాని, యుద్ధమును గాని యాచించినచో నీ తండ్రి గాని, తాతలు గాని, ముత్తాతలుగాని వెనుకాడలేదు వారి సమ్ముఖమునకు వచ్చినప్పుడెవరును నిరాశులైపోలేదు. అట్టియెడ నేనేల నిరాశుఁడనై పోవలెను!

బలి యిట్లనెను:—'ద్విజవరా! మిమ్ములను జూడఁగా జిన్నవారుగా నున్నారు మా యీవిషయములన్నియును మీకెట్లు తెలిసినవి? మా తండ్రి, తాతల, ముత్తాతల విషయములన్ని

యును మీకుఁదెలిసినవి. చూడఁగా మీరు సర్వజ్ఞులుగఁ గనఁబడు చున్నారు'

నవ్వి వామనవటు విట్లనెను :- 'రాజా! ఇందులో సర్వజ్ఞత యేమున్నది? సూర్య, చంద్ర, పృథివీ, సముద్ర హిమాలయముల నెట్లందరెఱుగుదురో అట్లే వంశవిఖ్యాతి యును జగద్విఖ్యాతమే ఈ ప్రపంచమంతయును మీ యశస్సుచే నిండియున్నది. రాజా! శూరవీరులును, పరాక్రమ వంతు లును, యశస్వులును, విశ్వవిజయులును నైన నీతండ్రియును తాతయును, ముత్తాతలును మిగిలినవారి సంగతియేల వారు విష్ణువును కూడ మెప్పించినవారు నీవు అనేకసార్లు శుక్రా చార్యాదుల వలనను, ప్రాచీన ఋషిమునుల వలనను వారి యితిహాసమును విని యేయుందువు. ఆ విషయములోఁ గొంత వఱకు నేను జెప్పెదను. నీవు సావధానముగ వినవలెను. సంకోచింపవలదు. వారిచరిత్రములను వినిన నీకును లాభము కలుగఁగలదు."

శ్రీశుక దేవుఁ డిట్లనెను :- "రాజా! ఇట్లుపలికి కపట వామనుఁడు బలినిఁ బొగడుటకును, ఆతని ప్రపితామహులను ప్రశంసించుట కుద్యమించెను.

వామనుఁడు బలియొక్క ప్రపితామహులఁ ప్రశంసించుట.

౫౬౧

శ్లో॥ యతోజాతో హిరణ్యాక్షశ్చరన్నేక ఇమాం మహీమ్।
ప్రతివారిం దిగ్విజయే నావిందత గదాయుధః॥

—శ్రీభాగ. ౮స్కం. ౧౯అ. ౫శ్లో॥

వ॥ తొల్లి మీ మూడవ తాత హిరణ్యాక్షుండు విశ్వజయంబు సేసి గధాయుధుండై భూతలంబునఁ బ్రతివీరులంగానక సంచరించె॥

—శ్రీమదాంధ్ర భాగవతము.

వంశపరంపరా ప్రభావము కొలఁదిగనో గొప్పగనో తప్పకయుండును. తన పూర్వజుల కీర్తి యశములను, గార్యములను స్మరించుటచేతను, శ్రవణమొనర్చుటచేతను దనకును నుత్తేజము కలుగును. కావుననే యుద్ధములో నేను ఫలాని వంశము వాఁడనని తమలోఁదాము కవ్వించుకొనుచుందురు. సూత, మాగధ, వందీగణము వారి పూర్వజుల యశమును గానమొనర్చుచుందురు. దాని మూలమున వారి ప్రభావమును స్మరించి ప్రాణపణముగ యుద్ధముచేయుదురు. కులము వారు చేసిన కార్యములను స్మరించుటచేఁ బిరికివారి ధమనులందును వీరరక్తము వేగముతో సంచార మొనర్చును. ఈ విషయమున నొక ప్రాచీన కథకలదు.

ఇద్దరు ఒకవిషయమునఁ బోరాడు కొనుచుండిరి. వారిలో నొకఁడు వైశ్యుఁడు, రెండవవాఁడు క్షత్రియుఁడు. వైశ్యుఁడు హృష్టపుష్టముగను లావుగ స్థూలకాయుఁడుగ నుండెను రెండవవాఁడు క్షత్రియుఁడు దుర్బలుఁడు, సన్నని వాఁడు, నిర్బలుఁడు, క్షీణకాయుఁడు. మాటలలోఁ జేతులు కలియుస్థితి వచ్చెను వైశ్యుఁడు బలవంతుఁడు స్థూలకాయుడు అతఁడు క్షత్రియునిఁ గ్రిందపడవైచి, వాని ఱొమ్ము మీఁదఁ గూర్చుండి మిక్కిలి గర్వముతో నిప్పుడేమనెదవో చెప్పుము."

దుర్బలుఁడగు వాఁడింతటి లావుమనుష్యుని భారమును సహింపఁ జాలకపోయెను. అతని ప్రాణము లవసిపోయెను. క్షమాపణమును గోరుకొనుట కాతఁడు క్రిందనే పడియుండి మిక్కిలి స్నేహముతో నిట్లనెను:– "సోదరా! నీవేజాతివాఁడవు. నీజన్మ యేకులములోనైనది?"

జయించినవాఁడు సింహమువలె నగుచు. విజయోల్లాసమున గర్వముతో నిట్లనెను:– "మేము వైశ్యులము. ఏమి చేసెదవో చెప్పుము,"

ఇది వినఁగానే క్షత్రియుని ధమనుల యందు జాతిగతమగు వీరత్వము సంచారమయ్యెను. గద్దించి అతఁడిట్లనెను:– "ఓరీ కోమటీ! ధనమందును, వ్యాపారబుద్ధియందు నీవు నన్ను జయించిన జయింతువుగాని శారీరక బలములో నీవు

నన్నెట్లు జయింపఁగలవురా? ఇట్లు పలికి ఆతఁడు వెంటనే వానిని క్రిందఁబడవైచి క్షత్రియుఁడు పైనఁగూర్చుండెను. అందఱును దీనినిఁగాంచి నవ్విరి ఇట్లనిరి :— "కులాగతముగ వచ్చు ప్రభావముండి తీరును."

శ్రీశుక దేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను.—"రాజా! బలికి నుత్సాహము కలిగించుటకై వామనుఁడాతని తండ్రి, తాతల ప్రశంస లొనర్పఁగా బలి యుత్సాహమును జెందుచున్నాఁడని తెలిసికొని, యిప్పుడాతఁడు ప్రపితామహులను బ్రశంసించుచుండెను. వామనుఁ డిట్లనెను:—"రాజా మీ వంశము సాక్షాత్తుగ బ్రహ్మనుండి ఆరంభమైనది. బ్రహ్మ మానసపుత్రుఁడు కశ్యపుఁడు. ఆతనికి దితి, అదితి మొదలైనవారు పదుమూఁగురు పత్నులు కలరు. తపస్వియగు ఋషి, ఈసమస్త స్థావరజంగమ దృశ్యజగత్తు ఆతని సృష్టి, అతఁడు బ్రహ్మవలె రెండవ ప్రజాపతి. ఆతనికి దితియను భార్య యందు హిరణ్యకశిపు హిరణ్యాక్షులను సిద్ధరాదిదైత్యులుదయించిరి. వారే నీకు ప్రథమ పూర్వజులు. హిరణ్యకశిపుని పుత్రుఁడు ప్రహ్లాదుఁడు. ప్రహ్లాదునకు విరోచనుఁడు, విరోచనునకు నీవు. నీకును నీవంటి తేజస్విలును, యశస్విలును, దాతలును, శివభక్తులైన బాణాదులు నూర్వురు పుత్రులు కలరు. నీకులమందు శూరత్వము, దానము, వీరత్వము పూర్వము నుండియును బరంపరాగతముగ వచ్చుచున్నది. నీతండ్రి,

తాతలయొక్క దానశీలతయు, వీరత్వమును, భక్తినిగూర్చి యత్కించిద్దర్శనముగఁ జెప్పితిని. ఇప్పుడు నీవు నీప్రపితామహులవిషయమును వినుము.''

నీప్రపితామహు లిద్దరిలో హిరణ్యకశిపుడు పెద్దవాఁడు. హిరణ్యాక్షుఁడు చిన్నవాఁడు. హిరణ్యాక్షుఁడతి శూరుఁడు. ప్రపంచమం దాతనికోఁ దలఁపడు వాఁ డొక్కఁడ నిండు, ఆతని సమ్ముఖమున నిలువఁబడఁగలవాఁడును లేకుండెను. ఇంద్రాది లోకపాలురు ఆతని నామమును వినఁగానే గడగడ వణఁకుచుండెడు వారు. ఆతఁడు చేతిలో గదను బట్టుకొని సమస్తలోకముల దిగ్విజయమును జేయుటకు వెడలెను. అందఱను యుద్ధమునకు బిలిచెనుగాని యందఱును పాదముల మీఁదఁబడి క్షమింపవేడుకొనిరి. సాక్షాద్విష్ణువునకుఁ గూడ ఆతనితో పోర సాహసము లేకపోయెను. పంది రూపమును ధరించి ఆతని భయమునకుఁ పాతాళమున దాఁగెను. ఆవీరుఁడాతనిని వెదకుకొనుచుఁ బాతాళమునకుఁ గూడ పోయెను. ఏలననఁగా యుద్ధము కొఱకై తనచేయి దురదయెత్తుచుండెను. ఇప్పుడిద్దరును దలపడిరి. ఈ యసురవర వీరుఁడు సూకరవేషధారియగు విష్ణువును నొప్పించెను. ఏదో విధముగ నాతఁడు చంపఁబడినను నాతని బలమును స్మరించుచు విష్ణువు తనను బరాజితుని గనే భావించెను. విష్ణువు సర్వత్ర భూరి భూరి ప్రశంస లొనర్చునట్లుగ నాతఁడు యుద్ధమందు విష్ణువును సంతుష్టపరచెను.

ఆతని యన్న హిరణ్యకశిపు తన తమ్ముని మరణమును విని చేత గదను ధరించి విష్ణువుతోఁ బోరఁబోయెను. అప్పుడు విష్ణుభగవానునకు గుండెలదరెను. బలాక్రమవంతుఁడగు నావీరుఁడు సరిగా వైకుంఠమునకుఁబోయి నేను విష్ణువును జంపిగాని తిరుగ నెను."

ఈ వీరునితోఁ దాను జయింపఁజాలనని విష్ణువను కొనెను. "వీనినిఁ జంపకున్న నన్ను వదలఁడు. బయట నెచ్చటనైనను దాగినచో నాతఁడు నన్ను వెదకఁగలఁడు. ఏలననఁగా నీతని దృష్టి బాహ్యదృష్టి" అని యిట్లాలోచించు కొని విష్ణువాతని హృదయములో దాఁగుకొనెను. కన్నుల లోని పాపలు కన్నులనెట్లు చూడఁజాలవో అట్లే హిరణ్య కశిపుఁడు హృదయములో దాగిన విష్ణువును జూడఁజాలక పోయెను. ఆతఁడు వైకుంఠములో నలువైపులను వెదకినను విష్ణువు కనఁబడలేదు. అంతనాతఁడు పృథివిని లాగివైచెను. స్వర్గమును వెదకెను, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యాదిలోకములందును, దశదిశలందును, సప్తసముద్రము లందును, సప్తపాతాళములందును, సమస్త స్థానము లందును వెదకెను. విష్ణువు బయటయుండినఁ గనఁబడెడువాఁడే. ఆతఁడు గడగడ వణఁకుచు, సూక్ష్మశరీరమును ధరించి హిరణ్యకశిపుని శరీరమందుఁ బ్రవేశించెను. సర్వత్ర వెదకి నను విష్ణువు కనఁబడకపోఁగా నాతఁడు గర్జించి అహంకార

ముతో నిట్లనెను:—"విష్ణువును నేను జయించినాను. అతఁడు నాశ్రయమున మరణించినాఁడు. ఉండియుండినచోఁ గనఁబడెడువాఁడే." ఈవిధముగ విష్ణువు నెదుర్కొన్నవారు మీపూర్వజులు. ఆతని పుణ్యప్రభావముచేతనే ప్రహ్లాదునివంటి విశ్వవిఖ్యాతభగవద్భక్తుఁడాతనికిఁ బుత్రుఁడైనాఁడు. అట్లే అతనికి విరోచనుఁడును గలిగినాఁడు. ఒకసారి విరోచనునకును నొక ఋషిపుత్రునకును గొప్ప జగడము వచ్చెను. విరోచనుఁడు నేను గొప్పయనిన ఋషి నేనే గొప్పయనెను. ఇద్దరును ప్రహ్లాదుని మధ్యవర్తిగా నెన్నుకొనిరి. ఇద్దరును బరస్పరము వారు తమ ప్రాణముల నొడ్డిరి. ప్రహ్లాదుఁడు మిక్కిలి ధర్మసంకటములోఁబడెను, కాని ఆతఁడు సత్యధర్మములను విడువలేదు. విరోచనునికంటె ఋషికుమారుఁడే శ్రేష్ఠుఁడని ప్రహ్లాదుఁడు నిర్భయముగ నిర్ణయముగావించెను. రాజా! మీకులమువారేది చెప్ప దలఁచిరో దానినిఁ జెప్పుదురు. దేని నీయఁదలఁచెదరో దాని నిచ్చెదరు. ఇంతవఱకెవరునూ నిరాశులైపోలేదు. ఎవరికిని వచనమొసఁగి తప్పనులేదు.

నీవు వారికి దీసివేసినవాఁడవుకావు నీలో వారందఱియొక్క సమగ్రగుణములును సమావేశమైనవి. నీవు నీ బాహుబలముచే దేవతలను జయించి స్వర్గాధిపత్యమును సంపాదించితివి. త్రిలోకములను నీకు వశమైనవి, అయినను నీవు విషయ

భోగలిప్తుఁడవు కాలేదు. నిరంతరము దానపుణ్య యజ్ఞ యాగములందు లగ్నుఁడవైనావు. సదా కల్పవృక్షము వలె యాచకుల మనోరథములను బూర్ణమొనర్చుచున్నావు. చంద్రునివలె నందఱకును శీతలతా ప్రదానమొనర్చు చున్నావు. సూర్యునివలె నందఱకును బ్రకాశమొసంగు చున్నావు. నీవు పృథివికంటెను సహనశీలుఁడవు. వాయువు వలె భోగములందు నిర్లిప్తుఁడవు. జలములకువలె జీవులకు జీవనము. ఆకాశమువలె నిర్మలుఁడవు. ఇదంతయును గురు కృపాఫలము. నీ గురుదేవుఁడగు శుక్రాచార్యుఁడు సర్వ సమర్థుఁడు. నీకు హితకరమగు ధర్మమును సదా శిక్షణ మొసంగుచుండును. నీకు ధర్మమందలి చల ఆస్థకలుగుట వారి శిక్షణ ఫలితమే."

శ్రీశుకదేవుఁ డిట్లనెను :– "రాజా! ఆచిన్న వామన వటుని ముఖమున నిట్టి ధారా ప్రవాహముగు వక్తృతను విని గుణగ్రాహియగు బలిచకితుఁ డయ్యెను. ఈ మధుర భాషియగు పిల్లవానికి సర్వస్వమును దానమొనర్ప వలయు నను బుద్ధి కలిగెను. అందువలన మిక్కిలి యుల్లాసముతో నిట్లనెను :– "బ్రాహ్మణ కుమారా! పరమ పూజనీయుడ వగు వటూ! బ్రహ్మచారి! నీవు నీకోరికను వెల్లడించుము. నాకోరిక నెరవేరదేమో యను శంక నీ మాత్ర మును బెట్టుకొనకుఁడు. మీరేది యడిగిన దానిని నేను

సంకోచింపక యీయఁగలను. మీరు సంకోచమును వదలి మీ యిచ్ఛననుసరించి వస్తువు నడుగుఁడు.”

శ్రీ శుకదేవుఁ డిట్లనెను:— “రాజా ! ఇది వినియును వటుఁ వూరకుండెను. ఆతఁ డేమియు నడుగలేదు. బలిచక్రవర్తి మాటిమాటికిని నడుగుఁడని బలవంత మొనర్చుచుండెను.

వామనుఁడు బలిని మూఁడడుగు లడుగుట

౫౬

శ్లో॥ తస్మాత్త్వత్తో మహీమీష ద్వృణేఽహం వరదర్షభాత్ ।
పదాని త్రీణి దైత్యేంద్ర సమ్మితాని పదా మమ॥

శ్రీ భాగ. ౮ స్కం. ౧౯ అ. ౧౬ శ్లో॥

ఆ. నీవు రాజవనుచు నిఖిలంబు నడుగుట
దగవు గాదు నాకుఁ దగిన కొలఁది
యేను వేఁడి కొనిన యీపదత్రయమును
జాల దనక యిమ్ము చాలుఁజాలు॥

శ్రీ మదాంధ్రభాగవతము.

గొప్పవారి కడ నల్పవస్తును యాచించుట అవమాన మొనర్చుటయే; కాని అడుగు యాచకుఁడు కపటియై, వ్రేలినిఁ బట్టుకొని తర్వాత జేతినిఁ బట్టుకొనుటకుఁ బ్రయ

త్నించినచో గొప్పవారు శంకటములోఁ బడిపోవుదురు. వానిగతి సర్పము, చుంచువలె నగును. మ్రింగుటకును వీలు లేదు. క్రక్కుటకును వీలులేదు. ఈ విధముగఁ బలికి మాట యిచ్చిన తరువాత వారు అవునన లేరు, కాదన లేరు. కాని మనస్వియు జ్ఞానియునగు వాఁడు ప్రాణముండఁగాఁ బ్రతిజ్ఞను వీడఁ జాలఁడు అప్పుడే వారికీర్తి ప్రపంచమున నమరమగును వారు పరాజితులైనను విజయులే.

శ్రీశుక దేవుఁడిట్లనెను:—రాజా! బలిచక్రవర్తిమాటి మాటికిని వామన వటువును వాంఛిత వస్తువు నడుగుమని బలవంత మొనర్పఁగా నాతఁడు బలిచక్రవర్తితో నిట్లనెను:— "దైత్యేంద్రా! నీవు వరదాతలలో విఖ్యాతుఁడవు. త్రిలోకములందును నీయొక్క విమల ధవళ కీర్తి వ్యాపించి యున్నది. సర్వత్ర నీదానము విషయమునఁ బ్రసిద్ధి కలదు. అందువలననే నేనును నిన్ను గొంచెముగ నడుగుటకు వచ్చి యున్నాను"

ఇది విని యుల్లాసముతో బలి యిట్లనెను:— 'సరియే అడుగుము బ్రాహ్మణోత్తమా! నీకిష్టము వచ్చిన దడుగు మని నేనెంత సేపటి నుండియో ప్రార్థించుట లేదా?"

వటు విట్లనెను:—"నాకు కొంచెముగ భూమినీయవలయును." బలి అత్యంత హర్షముతో నిట్లనెను:— "స్వామీ! ఈభూమియంతయును మీదయే మీకెంత కావలయును?"

వామనుఁ డిట్లనెను:-"రాజా! నేను లోభియగు బ్రాహ్మణుఁ డనుగాను. నాకు కావలసిన దానికంటె నెక్కుడుగ సంగ్రహింపను. నాకునాకాలి యడుగు కొలతతో మూఁడడుగులు కొలిచి దానమిమ్ము."

ఇది విని బలిచక్రవర్తి పకపక నవ్వి యిట్లనెను:- "పిల్లలబుద్ధి పిదప బుద్ధియను పెద్దల వాక్యమసత్యముకాదు. మాటలలో మీరు పెద్దవారిని మించిపోయినారు, కాని పిల్లతనపు చేష్ట లెచ్చటికి పోఁగలవు? మీ స్వార్థవిషయమున మీర బోధ శిసువువలె నైతిరి. అయ్యా! యాచనలో నావంటి చక్రవర్తిని మంచి మంచి యుక్తులతోడను, మధుర వాక్కుల తోడను ప్రసన్నునిఁ గావించుకొని మూఁడడుగుల భూమి నడుగు టేమిటి? సమస్త పృథివి నడుగ వచ్చునే. ఇంతటి పృథివి కాకున్న సప్తద్వీపములలో నొక్క ద్వీపము నడుగ వచ్చునే అడిగి అడిగి మూఁడడుగు లడుగుటయా?

ఇది విని వామన వటు విట్లనెను:-"రాజా! యాచన అన్నిటికంటె నికృష్ట కార్యము బుషులు దానముగ్రహించుట కూడ దనిరి వారు పరిగ్రహ వ్రతమును గూర్చి భూరి భూరి ప్రశంస లొనర్చిరి ఒకవేళ యాచింపక తప్పకున్నచో దానమును గ్రహింప వలసి వచ్చినచోఁ గష్టముగ జీవనము నడుచునంత మాత్రమే గ్రహింప వలయును. ఈ నియమమును నావశ్యక వస్తువును దానముగ గ్రహించిన నేవిధముగు దోషమును నంటదు."

బలి యిట్లనెను:—"మంచిది ఇది బాగుగ నేయున్నది కాని దానిలో మూఁడడుగుల నేలతో నేమగును? మీరు పరుండ నైన బరుండ లేరు కదా! కష్టము గాక మీకులభిం చిన దేముండును మీకు కష్టము కలుగఁ గానే మరల నాకడకు వచ్చి యిట్లనెదరు.— "ఈ కొంచెమున నాకు జరుగుట లేదు ఇంక మూఁడు బారలిచ్చుచుండుయును." దాని తోడను మీకు పనిజరుగదు అగ్నిహోత్రము నెచ్చటఁ బెట్టు కొందురు? ఆవు నెచ్చటఁ గట్టివేయుదురు? బావి నెచ్చట ద్రవ్వించు కొందురు? చెట్ల నెచ్చట నాటుకొందురు? కథా ప్రవచనములకు బీఠ మెచ్చట నేర్పాటు చేయుదురు? విద్యా ర్థులు వచ్చినచో వారి కెచ్చట జదువును జెప్పెదరు? మరల మీరు నాకడకు రావలసినదే. ఇట్టి మాటి మాటికినడుగుట కంటె మీరొక్క సారియే యథేచ్ఛగా నడుగుఁడు. నేను దాన మొసంగు నప్పుడీ విషయము నెక్కుడు శ్రద్ధతోఁజూచు చుందును అన్నిటికంటె మిక్కిలి తక్కువ దాన మేమనఁగా నాయాచకుఁడు మరల నింకెవరి కడకును వాని జీవితములోఁ బోయి యాచింపరాదు; చేయి జాపరాదు మీరింక నెక్కు డుగ భూమి నడుగుఁడు. మీపాదములు చూచినఁ జిన్నవిగ నున్నవి. వీనితోఁ గొలిచిన నెంతటి భూమి రాఁగలదు?"

ఇది విని వామనుఁ డిట్లనెను:—" రాజా! మనుష్యు లందఱును దమ చేతులతోఁ దొంబది యాఱంగుళములుం

దురు. పెద్ద వారికి పెద్ద వ్రేళ్ళుండును. చిన్నవాండ్రకు జిన్న వ్రేళ్లుండును. నాకూరక కూర్చుండి జప మొనర్చుకొనుటకే భూమి చాలును. ఇతరుల స్థలములోఁ గూర్చుండి జపతపము లొనర్చిన సందులో సగము భాగము వారికిఁ బోవును. కావున నాకు కేవలము కూర్చుండుటకు మాత్రమే భూమి కావలయును."

బలి యిట్లనెను :– 'స్వామీ! ఇదంతయును సత్యమే. కాని పూర్ణ సంతుష్టినిఁ జెందు నంతటి భూమిని కోరు కొనుఁడు.'

అంత వామనుఁడిట్లనెను :– 'రాజా ! పృథివి వలన సంతుష్టినిఁ జెందినవా రెవరో ఒక్కరిపేరును నాకు జెప్పుము. మూఁడడుగులతో సంతుష్టినిఁ జెందనివాఁడు, సప్త ద్వీప యుతమును, నవఖండమండితమునగు నీ పృథివి నంతను బడసి నను సంతుష్టినిఁ జెందఁజాలఁడు. మనువగు ప్రియవ్రతుఁడు, గయుఁడు, భగీరథుఁడు, రావణుడు, హిరణ్యకశిపుఁడు, మొదలగు గొప్ప గొప్ప తేజస్వులును ప్రతాప శాలురును రాజులెందరో యుండిరి. వీరందఱును సప్తద్వీపాధి పతులే. సప్తసముద్ర యుతమగు నీవసుంధరయందు వారి యాజ్ఞ మన్నింపఁబడు చుండెడిది. కాని వారును జివరకు తృష్ణకు వశీభూతులై పృథివికొఱకు పోరాడుచుండిరి. వారి తృష్ణ శాంతింపలేదు. ఈ విషయముల నెంతగా ననుభవించిన

నంతగాఁ దృష్ణ పెరుగును. యయాతి మహారాజు తన వృద్ధావస్థను దన పుత్రునకొసంగి, ఆతని యువావస్థతో భోగముల ననుభవించెను చివరకాతఁడిట్లు చెప్పినాఁడు :- 'విషయముల ప్రచురతంగా సుఖము లేదు, శాంతి లేదు, సంతోషము లేదు, తృప్తి లేదు. వాని నుపభోగించుటచేఁ దృష్ణ అధికాధికముగఁ బెరుగు చుండును. కావున రాజా! నేను మూఁడడుగుల భూమికి మించి నేనధికముగ గ్రహింపను, నాకిదియే బ్రహ్మాండము.'

బలియిట్లనెను :- 'స్వామీ! నాకేమియును నిబ్బంది లేదు. మీరు మూఁడడుగులు గైకొనుఁడు. మూఁడులోకములను గైకొనుఁడు. నేనన్నిటికిని సిద్ధముగనే యున్నాను. కాని ఇది నా పదప్రతిష్ఠకు విరుద్ధమగు విషయము మీరు చిన్నవారు, చిన్న వస్తువునడుగుటకు సంకోచింపరు. కాని యిది నాకు మహా ప్రతిమవమాన కరమగు విషయము. మీరు నాకను రూపముగా దానము నడుగుఁడు.

కపటియగు వామను డిట్లనెను :- 'రాజా! నేను బ్రాహ్మణుఁడను బ్రాహ్మణునకు ముఖ్యధనము సంతోషము. బ్రాహ్మణుఁ డావశ్యకతకు మించిన వస్తువులను సంగ్రహించినను, లోభము పెరిగినను వానికి పతన మని వార్యము. బ్రాహ్మణుఁడు లభించిన దానితో సంతుష్టినిఁ జెందవలయును. నీటి వలన నగ్ని చల్లారినట్లు, అసంతోష

ముచే బ్రాహ్మణుని తేజము నశించును. నాకు సర్వమును మూడడుగులే యగుచుండగా నేనధికముగ నేల యాచింప వలయును? అధికముగ సంగ్రహించి పాపభాగి నేల కావల యును?

దైత్యరాజగు బలిపాలకుని యీ హఠమును గాంచి యిట్లనెను :- 'ప్రపంచములో మూడు హఠములు ప్రసిద్ధ ములు. రాజహఠము, స్త్రీహఠము, బాలహఠము నేను రాజునుగాబట్టి నాహఠము నాకు తెలియదు. నారాణి పతి వ్రత కాబట్టి ఆమె నాతో నెన్నడును హఠమును గావిం పదు. సదా నాతోడనే కలిసిమెలసి యుండును కావున దాని విషయమునను నాకనుభవము లేదు. కాని బాల హఠమును నేను ప్రత్యక్షముగ నేడు చూచితిని. నాల్గంగు ళములుకలిగి చిన్న చిన్న కమల దళములవలె నున్నపీ బ్రాహ్మణకుమారుని చరణములు వానితోఁ గొలుచుకొని యీతఁడు పృథివిని గైకొనదలచు చున్నాఁడు. అవియైనను లక్ష, రెండు లక్షలు, వేయి రెండువేల యడుగులు కాదు. కేవలము మూడడుగులకు మాత్రము కోరుకొనుచున్నాఁడు నా కిచ్చుటకును సిగ్గగుచున్నది చెప్పుకొనుటకును సిగ్గగు చున్నది. అంత వామనునితో నిట్లనెను :- 'బ్రహ్మచారీ! నాయనా! ఇంకఁ గొంచెమడుగుడు.'

హఠపూర్వకముగఁ గపటియగు బ్రాహ్మణుఁడిట్ల నెను :- 'రాజా! నాపని దీనితోడనే తీరిపోగలదు. ఏల

ననఁగాఁ దనకెంత కావలయునో అంతయే అర్థసంగ్రహ మొనర్చుట ఉచితము, ధర్మసంగతము, న్యాయము.'

నవ్వి బలియిట్లనెను :— 'మంచిది స్వామీ! నైకొనుఁడు. మూఁడడుగుల పృథివిని కాని కొలుచుకొనునప్పుడు కొంచెము సాగవలయును.'

వటువగు వామనుఁడు నవ్వుచు నుపేక్షాస్వరమున నిట్లనెను:—'అట్లైనఁ జూతము లెండు, నీవు ముందుసంకల్ప మొనర్పుము. తర్వాత నేమి కాఁగలదో తరువాత నీవే చూడఁగలవు '

శ్రీశుక దేవుఁ డిట్లనెను :— 'రాజా! వామనుని యీ మాటలను విని బలిచక్రవర్తి ఆతనికిఁ బృథివి నొసంగుట కుద్యుక్తుఁడయ్యెను శుక్రాచార్యునికిఁ వామనుని యథార్థ రూపము తెలియును. ఈతఁడు మోసగించుచున్నాఁడని ఆతనికి కిదివఱకే తెలియును. ఈతఁడు తన శిష్యుని సర్వస్వమును హరింపదలచుచున్నాఁడని. బలిని సంకల్ప మొనర్చుటను విరమింప జేయుటకై ఆతనికి నీతిని బోధింపదలఁచెను.'

శుక్రాచార్యుఁడు శిష్యున కుపదేశించుట

(౫౬౩)

శ్లో॥ ఏష తే స్థానమైశ్వర్యం శ్రియం తేజో యశః శ్రుతమ్।
దాస్యత్యాచ్ఛిద్య శక్రాయ మాయామాణవకో హరిః॥

— ౮ భాగ. స్కం ౧౯ అ. ౩౨ శ్లో॥

సీ॥ దనుజేంద్ర యీతఁడు ధరణీసురుఁడు గాఁడు
దేవకార్యంబు సాధింపఁ గోరి
హరి విష్ణుఁడవ్యయుఁ డదితి గర్భంబునఁ
గశ్యపసూనుఁడై కలిగెఁ గట॥

—శ్రీమదాంధ్ర భాగవతము

యజమాని హితముకోరుచు మెలఁగువాఁడే పురోహితుఁడు. యజమాని పురోహితసంబంధము పితాపుత్ర సంబంధమువంటిదిగ నుండును. పురోహితుని పుత్రపుత్రికలతో నన్న చెల్లెండ్ర సంబంధముండును. యజమాను నింటిని బురోహితుఁడు తన యిల్లుగా భావించును. ఆతని హితము కోరుచు సదా తత్పరతఁ జింతించుచుండును. యజమానుఁడును బురోహితు నడుగక ఇహలోక పరలోక సంబంధములగు కార్యముల నొనర్పఁడు. తండ్రి యాజ్ఞలనైనను దిరస్కరింపవచ్చునుగాని పురోహితుని ఆజ్ఞలను దిరస్కరించుట అసంభవము. వశిష్ఠమహర్షి తన యజమానుఁడగు మహారాజుతో నీపుత్రుఁడు ధర్మవిరుద్ధముగ శ్రాద్ధపదార్థమునుండి

కొంత తీసినాఁడు. కావున వీనిని నీరాజ్యమునుండి వెడల నడుపుము.'' అనెను, ఇంతటి చిన్న అపరాధమునకై తన రాజ్యమున కధికారి యగు యువరాజును శాశ్వతముగ దేశ భ్రష్టు నొనర్ప నేమంత న్యాయము?'' కాని దీని నడుగువా రెవరు ? పురోహితుని యాజ్ఞకు విరుద్ధముగ మాట్లాడువాఁ డెవఁడు ?'' రాజాతని వెడలఁగొట్టెను. ఇంతకుఁ జెప్పఁ దలఁచిన సారాంశ మేనఁగా యజమానుఁడు పురోహితుని సమస్తాజ్ఞలను నను నచ అనగ యే పాలనజేసెడువాఁడు. పురోహితుఁడును దన తపస్తేజములచే నిరంతరము యజమానుని హితమునే కాంక్షించుచుండును. ఆతని యున్నతినిఁ దన యున్నతిగను, ఆతని అవనతినిఁ దన యవనతిగను దలఁచెడు వాఁడు. అందువలన నీ సంబంధము మిక్కిలి పవిత్రమైనదిగ నెన్నఁబడుచున్నది. కాలక్రమమున నీసంబంధము లోపించెను.

శ్రీ శుకదేవుఁ డిట్లనెను :- ''రాజా! చాలసేపటి వఱకు వాదవివాదములు జరుగఁగా వామనుఁడు తన మూఁడడుగుల పృథివిమీఁదనే నిలువఁబడెను. అప్పుడు బలి చక్రవర్తి యిట్లనెను :- ''మంచిది స్వామీ! మీయిష్టము. తీసికొనుఁడు మూఁడడుగుల నేలనే కైకొనుఁడు నా రాజ్యములో నెచ్చటినైనను మీకిష్టమువచ్చినచోటున మూఁడడుగులను గొలుచుకొనుఁడు. నేను జేతిలోనికి జలమునుగైకొని సంకల్పమొనర్చెదను.'' ఇట్లు పలికి ఆతఁడు సువర్ణమయమగు

ఝారీచెంబునుండి జలమును దీసికొని శుక్రాచార్యులతో సంకల్పమును జేయించుచుండఁగా శుక్రాచార్యుఁడు శుష్కహాసమొనర్చి యిట్లనెను :- "రాజా! నీవేమి చేయఁబోవుచున్నావు?"

ఉల్లాసముతో బలి యిట్లనెను :- "స్వామీ! మీరు చూచుటలేదా యీ బ్రాహ్మణబాలకుఁ డెంతటి సుందర తేజస్వియో, తపస్వియో ఈతని భూదాన మొనర్చుచున్నాను."

దృఢతా స్వరమున శుక్రాచారుఁ డిట్లనెను :- "పని లేదు, సంకల్పము చేయవలసిన బని లేదు. ఈతనికి భూదాన మొనర్చుట ఉచితము కాదు."

ఇది విని బలిచక్రవర్తి నిర్ఘాంతపోయెను. దానమొన ర్చుటలో గురుదేవుఁ డింతవఱకెన్నడును గాదనలేదు. నేఁడిట్టి నూతనాజ్ఞ యెట్లు వచ్చినది? విస్మితుఁడై దీనతాస్వరమున నిట్లనెను :- "పాపమీ బ్రాహ్మణకుమారుఁడు స్వయముగ మిక్కిలి సంకోచముతోఁ జాల తక్కువ భూమిని నడిగినాఁడు. దానినైన నిచ్చుటకు మీరిష్టపడుటలేదు. కారణమేమి?"

శుక్రాచార్యుఁ డిట్లనెను :- "కారణమేమున్నది? బ్రాహ్మణుఁడైనచో నీయవచ్చును. ఈతఁడు మోసగాఁడు. కపటవేషమును దాల్చినాఁడు. ఈతఁడు విష్ణువను సాక్షాత్ విష్ణువు. మఱుగుజ్జువాఁడై నటకునివలె లీలయొనర్చుచున్నాఁడు. ఈతఁడు తన్ను యాచకునిగా చేసికొనుచున్నాఁడు; కాని నావద్ద దాగఁ

గలఁడా ? నేనీతని చేష్టలన్నిటి నెఱుఁగుదును. నా కీ త ని ఆఱవ యేఁడు వఱకును దెలియును. ఈతఁడు మహామాయావి. నీ ముత్తాతను సగము సింహము సగము నరుఁడై సంహ రించెను. నీ చిన్నముత్తాతను సూకరమై చంపినాఁడు. ఇప్పుడు మఱుఁగుజ్జై నిన్ను మోసగించవచ్చినాఁడు. నేను నా సమ్ముఖమున నన్యాయమును జరుగనీయను. నేను పృథివీ దానము నొసఁగనీయను."

బలి సరళతతో నిట్లనెను :—"ఏల వృథాగా శంకించె దవు ? ఇట్లు సందేహించుచో నందఱను సందేహింపవచ్చును. ఎవరైనఁగానిండు. భిక్షుగాఁడై వచ్చినాఁడు. మూఁడడుగుల భూమినే అడుగుచున్నాఁడు. ఈయనిండు."

ఆ సమాటను సమర్థించుకొనుచు శుక్రాచార్యుఁ డిట్ల నెను 'మూఁడడుగులే యని భావింపకుము. ఈమూఁడడు గుల తోడనే సమస్తమును గ్రహింపఁగలఁడు. మూఁడడు గుల తోడనే యీతఁడు త్రిలోకములను గొలుచుకొనఁ గలఁడు. నీయిల్లు, వాకిలి, యశము. ఐశ్వర్యము, ధనము, లక్ష్మి వేయేల సర్వస్వమును హరించి యీ దేవతల కొసంగ గలఁడు. నాకితని సంగతి తెలియనిదికాదు. ఈతఁడు కశ్య పుని వీర్యమున నదితి గర్భమున నుద్భవించినాఁడు. ఈతని జన్మకు ముఖ్యోద్దేశ్యము దేవతా కార్యమును సాధించుటయే. అసురులనుండి సమస్త సంపత్తునపహరించి సురల కొసంగఁ

గలఁడు ఈతనికే దైన నిచ్చితివా సర్వస్వమునిచ్చినవాఁడవు గా గలవు అసురులకు క్షేమము లేదు. కల్యాణము లేదు, ఐశ్వర్యము లేదు, వృద్ధి లేదు, రాజ్యము లేదు. ఇప్పుడు దేవతలు తిరుగుచున్నట్లు తిరుగఁగలరు. కావున నీవు నాశక్తి యున్నంతవఱకు దానమీయనీయను.''

ఈమాటలు వినఁగానే బలికి మిక్కిలి దుఃఖము కలిగి యిట్లనను:- ''అయ్యా! ఈచిన్నపిల్లవాని మూఁడడుగుల నేల కొఱకు పల్కులు పల్కెదరేల? పిల్లవాఁడు మొదటి సంకోచవశమున నడుగనే యడుగలేదు. నేనెంతో చెప్పఁగా నడిగినాఁడు. అయినను దానిని మీరాక్షేపించుచున్నారు. ''బ్రాహ్మణుఁడింకొక బ్రాహ్మణునిఁగాంచి కుక్కవలె గుఱగుఱలాడుచుండు'' నను సామెత నిజమగునది. ఒక్కసారి ప్రతిజ్ఞ చేసినతరువాతఁ గాదనుట యెట్లు? నేనసత్యవాదిని గావలయునని మీయుద్దేశ్యమా? నాప్రతిజ్ఞను నెఱవేర్చుకొందుమందురా?''

శుక్రాచార్యుఁడు గంభీరముగ నిట్లనెను:- ''ఓయీ పిచ్చివాఁడా! అసత్యవాదియై వచ్చిన వానికడ నిజమేమి సాగును. ప్రతిజ్ఞను విఫలము చేయవచ్చిన వానికి సఫలమెట్లగును? నీవీతనికి మూడడుగల భూమినొసంగుటకు ప్రతిజ్ఞ నొనర్చియుంటివి. నీకు చిన్న చిన్నగఁ గముల దళముచలెఁ గనఁబడుచున్న నీతని పాదములు కృత్రిమ పాదములు. కొలుచునప్పుడు చూడవలయును నీవు ఈ విశ్వవ్యాపకుఁ

డగు వటువు ఒకపాదముతో సమస్త పృథివిని బాతాళ సహితముగ గొలుచును, రెండవదానితో నాకాశమందున్న సమస్తలోకములను గొలుచును. రెండడుగుల తోడనే యీ యూర్ధ్వాధోలోకములను విశ్వబ్రహ్మాండమును గొలిచి వేయును తర్వాత మూఁడవదానికి నీవెచ్చటఁ దేఁగలవు? నేనే అసత్యవాదిని కాఁగలను. మూఁడడుగులు దాన మొసంగి యీయఁజాలకున్నచో నీవు నరకమునకుఁబోఁగలవు ప్రతిజ్ఞ నొనర్చి యీయఁజాలని వాఁడవై పాపులు పడు నరకమునఁబడి యాతనల ననుభవింపవలసి వచ్చును. అసత్య వాదివి కాఁజాలకున్నచో స్వామీ! ఇంత నేనీయఁజాలను'' అనుము. ఏదైన నొక్కటే. ఈతఁడడిగినంత నీవీయఁ జాలవు'

దీనతతో బలి యిట్లనెను: — ''అట్లనకుఁడు గురు దేవా! ఇప్పుడొక్కసారి నోట వెలువడిన మాట శక్తికొలఁది పాలింపఁబడవలయును''

శుక్రాచార్యుఁడు కసరుచు నిట్లనెను :— ''ఓయీ! నీవు పిచ్చివాఁడవువలెనున్నావే? నోటినుండి నవ్వులాటలకు వెలువడిన వెన్నో వచ్చుచున్నవి మానవుఁడు తన హితమును జూచుకొనవలయును.''

బలియిట్లనెను :— ''స్వామీ! మీరు మాటిమాటికిని దానమీయకుండ మానమే హరించు మాటలను బలుకు

చున్నారు. నౌకలోనికి నీరు వృద్ధియైనను, ఇంటిలో ధనము వృద్ధియైనను లోభముచే దానినుంచరాదు. పెదజల్లవల యును. దానమువలన ధనము వృద్ధియగును. ఈలోకమునఁ గీర్తియును, బరలోకమున సుఖమును లభించును."

శుక్రాచార్యుఁ డిట్లనెను :- "నాయనా! ఈవిషయ మును నీకునేను మరలఁ జెప్పుచున్నాను. దానమొనర్చుట చెడ్డది కాదు కాని ముందుగ నాత్మ, తరువాతఁ బరమాత్మ. తన ఆ జీవికను రక్షణమొనర్చుకొని మిగిలినదానిని దాన పుణ్యములకు వినియోగిం పవలయును. ఇంటిలోని వారు ఆఁకలిచేఁజచ్చుచుండునపుడు మనము దానమొనర్చినచో నది దానమును గాదు. పుణ్యమునుగాదు. పాపము, అధ ర్మము. తన కాశ్రితులైనవారిని ముందుగా రక్షించుట కర్త వ్యము. తన యా జీవిక నష్టమగునట్లుచేయు దానము దానము కాఁజాలదు. నీకు ప్రతి మాసమునకు రు.00-00 నూటు రూపాయలాదాయము కలదు. నీవు దానపుణ్యాదులకు దాని నుండి రు20-00 యిరువది రూపాయలను ఖర్చుపెట్టి మిగిలి నది గృహకార్యములకు వినియోగించిననది యుచితమే. ఒక్కసారిగా నంతయు నిచ్చివైచినచో నీవు పరివార సహి తముగ నాఁకలిచేఁజావవలసినదే. అడుగుకొని తిరుగవలసి నదే. దానపుణ్యములు వదలిపోవును. స్వయముగ నితరు లను యాచింపవలసి యుండును. ఇది ధర్మముకాదు, అధ

ర్మము. ఆజీవికాయుక్తపురుషుఁడే దాన, యజ్ఞ, తప, సత్కర్మాదుల ననుష్ఠింపఁగలఁడు."

బలి యిట్లనెను :—"తనసర్వస్వమును దాన ధర్మములకు వినియోగపడుటకంటె నింక మంచివిషయమేమున్నది?"

శుక్రాచార్యుఁడత్యంత మమత్వముతో నిట్లనెను :— "నాయనా! త్యాగులకును విరాగులకును నీవిషయము లుచితములేమో కాని గృహస్థులకివి యుచితములు కావు."

బలియిట్లనెను :—"గృహస్థుల కేది యుచితము"

శుక్రాచార్యుఁడిట్లనెను :— "ఆతఁడు వ్యావహారిక ధర్మము నాశ్రయింపవలయును, ధర్మమని తెలిసికొని యేవిషయమునను హానము చేయరాదు."

బలియిట్లనెను :—"స్వామీ! వ్యావహారికధర్మమేది?

శుక్రాచార్యుఁడిట్లనెను :—"అయితే వినుము. నేను నీకు వ్యావహారిక ధర్మమును జెప్పెదను."

శ్రీశుక దేవుఁడిట్లనెను:—"రాజా! ఇట్లు పలికి శుక్రాచార్యుఁడు బలికి వ్యావహారిక ధర్మము నుపదేశింప సాగెను."

శుక్రాచార్యుని వ్యావహారిక ధర్మము

(౫౬౪)

శ్లో॥ ధర్మాయ యశసేఽర్థాయ కామాయ స్వజనాయ చ।
పంచధా విభజన్ విత్తమిహాముత్ర చ మోదతే॥
— శ్రీ భాగ. ౮ స్కం. ౧౯ అ. ౩౭ శ్లో॥

సీ॥ ధనయింటఁ గల్గు సర్వ ధనమును నైదు భా
గములుగా విభజించి కామమునకు

ఆ॥ నర్థమునకు ధర్మ యశముల కాశ్రిత,
బృందములకు సమతఁ బెట్టునట్టి
పురుషుఁడిందుఁ బూర్ణుఁడై మోదమందు,
దన్యమానిచేత దగవు గాదు."
— శ్రీమదాంధ్ర భాగవతము.

కుటుంబీకులఁ గొంకకుండను, ప్రాణముల నీయఁదను లోభము లేని ధర్మమే విశుద్ధధర్మము. ఛలకపటము లేని ధర్మమే యథార్థమగు ధర్మము. దానినే పాలింపవలయును. రెండవ వ్యావహారిక ధర్మము చేతులు కాళ్ళను రక్షించుకొనుచు మూజిని డాఁచివేయుట. విశుద్ధధర్మమందు కర్తవ్యమే ప్రధానమగును. హరిశ్చంద్రుఁడు సత్యపాలనమే ధర్మమని భావించెను కనుకనే ఆతఁడు రాజ్యమును విడెను, దేశమును వదలెను, భార్యనమ్ముకొనెను, పిల్లవాని నమ్ముకొనెను, తానమ్ముడు పోయెను; కాని ధర్మమును వదల లేదు. వ్యావహారిక ధర్మపాలన మొనర్చువారు తమ యోగ

క్షేమములు కలుగురాయము రాదంతే. అకే ధర్మహానిమొన ర్చెదరు. తమ జీవనమందు గాని, తమ వృత్తియందుగాని వ్యాఘాతమును మన్నించిరా వారు తమ ధర్మములను డి తొలంగుదురు. స్థితికాలదే ధర్మము నాశ్రయించిరి. వారి మతిమేరకుగా మానవుడు బ్రదికియుండినచో జీవితములో వందలకొలది సంగతులయందు ధర్మములు నొనర్ప వచ్చును, సాధింపవచ్చును. ఒక విషయమునకై ప్రాణములు నర్పించుట బుద్ధిమతుని లక్షణము కాదు.

శ్రీ శుకదేవు డిట్లనెను:—"రాజా! బలిచక్రవర్తి వ్యావహారిక ధర్మజిజ్ఞాస చేయఁగా శుక్రాచార్యుఁడిట్లనెను:— "రాజా! గృహస్థుడు తన పొట్టను నింపుకొనుటయే కాదు. ఆతఁడు తన ఆదాయమును నైదు భాగములుగా నొనర్పవల యును ఆ యైదు భాగములను నైదు కార్యములకై వ్యయ మొనర్పవలయును"

బలి యిట్లడిగెను:—"గురుదేవా! ఆ యైదు కార్యము లేవి? దానిని నాకు బాగుగాఁ దెలుప వలయును."

శుక్రాచార్యుఁడిట్లనెను:—'ఒకానొకని ఆదాయము నెలకు రు500లగుచో నాతఁడు రు100లు ధర్మ కార్యములకై వ్యయ మొనర్పవలయును. ఏలనఁగా ధర్మము నొనర్పక మానవుఁడు శుష్క ప్రవృత్తి కలవాఁడై దయాహీనుఁడగును పరలోక మునందు ధర్మమే వెంటవచ్చును ఇచ్చట మనమేమి చేయు

దుమో దానినిఁ బరలోకమునఁ బొందుదుము. ఇది యొక విధమగు బరలోకగతకోశము.

అంత శౌనకుఁ డిట్లడిగెను:—"సూతా! పరలోకగత కోశ మెట్లు?"

ఇది విని సూతుఁడు నవ్వి యిట్లనెను:— 'స్వామీ! ఒక శెట్టి మిక్కిలి కృపణుఁడు. అతని యింటికొక ధర్మబుద్ధి గల కోడలు వచ్చెను. ఆ యింటిలో దానపుణ్యములు లేక పోవుటను గాంచి, ఆమె యేకాంతమునకుఁ బోయి కొంచెము సేపేడ్చెడిది. కోడలు రోజు నేడ్చుచున్నదేమి కారణమని మామ యడిగించెను. నాకడ నే వస్తువునకును లోటు లేదు. ఆమె కేమి కావలయునో చెప్పుమనుఁడు"

కోడలిది విని తన మామతో నిట్లు చెప్పించెను:— "నిత్యమును పాసిన కూడునే దిని తిని నాకు విసుగు పుట్టు చున్నది. ఇచ్చటి వారందఱును పాసిన కూడును దిన కోశ మును బెంచుచుండెడి రే యనియే నాకష్టము."

ఇది విని శెట్టి యిట్లనెను:—"కోడలెట్టి మాటలు మాటలాడుచున్నది ఇచ్చటనెవరును పాసినకూడను దినరు. నా వద్ద కోట్ల రూపాయలు ప్రోగైనవి."

కోడలిట్లనెను.—"పూర్వ జన్మమున దానపుణ్యము గొనర్చినవారే తినుచున్నాము. పూర్వజన్మములో నిచ్చిన దానినిప్పుడుపభోగించుట పాసినకూడు తినుటయే యగును.

మీరిచ్చుటచే బ్రోవు చేయునది ఇచ్చుటనే నిలిచి పోవును. పరలోకమునకై నీ వద్దనేమియు నుండదు. దానమును లేదు పుణ్యమును లేదు."

కోడలు పలికిన యీ మాటలను విని మామ లజ్జితుం డయ్యెను. తన రాబడాయమును నైదు భాగములొనర్చి దాన పుణ్యములందు కోడలి సమ్మతిచే వ్యయము లొనర్పసాగెను.

సూతుం డిట్లనెను:—"మహర్షులారా! భగవానుఁడు సామర్థ్య మిచ్చియుండినను [illegible] దాన పుణ్యములొనర్ప కున్నఁ బరలోకమున [illegible] బాధయుండుచు కొనసాగిన్న వానికం మించిన మూర్ఖుం డింకెవఁ డుండును. ఈ విషయమున నొక మనోరంజకమగు నితిహాసమును వినుఁడు."

ఒక శెట్టి యుండెను ఆతని కడ నొక నౌకరు నివసించుచుండెను. నౌకరు గ్రామీణుఁడు మక్కిలి అమాయకుఁడు. సదా ధార్మిక విచారము కలిగియుండు సాధారణముగ జనులు అమాయకులను ధార్మికులను బరిహాసమొనర్చుచుందురు వారిని మూర్ఖులుగాఁ జేసిన వారికానందము కలుగును. నౌకరు పూర్వపువాఁడు, అమాయకుఁడు స్వామికి నచ్చినవాఁడు, ఇంటివాఁడువలెనే యుండెను. ఆతఁడు డబ్బును బ్రోవు చేసెడు వాఁడుకాఁడు. లభించిన దానిని దాన పుణ్యములకు వ్యయ మొనర్చును. శెట్టి కొంచెముగ లోభి. అటునుండి ధనము రావలెను, ఇటు నుండి ధనము రావలెను, ఆ కొట్టు నుండియు లభింపవలెను. ఈ కొట్టునుండియు లభింపవలెను.

అది లభింపవలెను, ఇది లభింపవలెను అను నీ చింతలోనే యుండును. అవకాశము చిక్కినప్పుడు నౌకరుతో నెగతాళి యాడుచుండును.

ఒకదినమున శెట్టికి వంకరటింకర కఱ్ఱ ఒకటి దొరికెను. దాని నాతఁడు తన నౌకరునకిచ్చుచు నిట్లనెను:—"ఇది విచిత్రమగు కఱ్ఱ. దీని నీకంటె మూర్ఖుఁడగు వానికీయ వలయును."

సేవకుఁడిట్లనెను:—"మంచిదిస్వామీ!" అనిపలికి ఆతఁడు కఱ్ఱను దీసికొనెను. ఆతఁడు సామానుకొనుటకు బజారునకు వెళ్లినప్పుడెల్ల దండమును వెంటఁ గొనిపోవుచుండును. శెట్టి ఆతనితో నిత్య మిట్లను చుండెను:—"నీకంటె నధిక మూర్ఖుఁ డెవఁడైనఁ జిక్కినాఁడా?"

అప్పుడు సేవకుఁడిట్లనెను:—"లేదు స్వామీ! ఇంత వఱకెవఁడును దొరకలేదు." ఇదివిని శెట్టిగారు హిఁహిఁయని నవ్వుచుండును వానికిది ప్రతిదినమును వినోద సామగ్రి యయ్యెను.

ఒకదినమున శెట్టిగారికి విషూచిక (కలరా) వ్యాధి వచ్చెను చికిత్సకులు నిరాశను బ్రకటించిరి. ఇఁకదాను బ్రదుకననియు ఆతనికి నిశ్చయమయ్యెను ఆతని ప్రియ సేవకుఁడును నాతని సేవయందు సంలగ్నుఁడై యుండెను. మిక్కిలి కాతర వాక్కులతో శెట్టిగారిట్లనెను:—"ఘాసీరామా! ఇఁక నేను బోవుచున్నాను."

ఘాసీరాముఁ డిట్లనెను —"శెట్టిగారు! మీ వెంట నేనును వచ్చెదను." శుష్కహాసమొనర్చుచు శెట్టిగారు కష్ట

మాతో నిట్లనెను:—"ఓరీ! అచ్చటికెవరును వెంటరా జాలరు."

అప్పుడు ఘాసీయిట్లనెను:—"మంచిది, ఈగుఱ్ఱపుబండి వెంటరాలేదు." శెట్టిగారికి మాటలాడుట కష్టముగా నుండెను:— 'అవును' తలనూపెను" కాని ఘాసీ మూర్ఖుడు కావున నాతడు మెదలకుండక యిట్లనెను.—"శెట్టిగారూ! గుఱ్ఱపుబండి పోకున్న నట్లుపనియగును. రూపాయల నన్నిటిని దీసికొని పోదము. నేయి, బియ్యము, పోపుదినుసులు, దిండు, పరుపు వగైరా లన్నిటిని గట్టెదను."

శెట్టిగారు కష్టముతో నిట్లనెను:—"నీవు మూర్ఖుడవురా అచ్చటికేదియును బోరాదు. ఈశరీరము నిచ్చటనే యుండిపోవును కేవలము పుణ్యపాపములే వెంటవచ్చును"

అప్పుడు ఘాసీరాముడు కఱ్ఱను దీసికొని శెట్టిగారి చేతికిచ్చుచు నిట్లనెను:—"మంచిది ఈకఱ్ఱను మీరేపట్టుకొనుడు. నాకు మీరే మూర్ఖులుగ గనబడుచున్నారు. ఏలనంగా నీవియు తెలియు నెఱిగి యీపృథ్విని విశాలముగ రూపాయల కొఱకు సదా చచ్చుచుంటిరి పరలోకము నకు దానపుణ్యముల నేమియును జేయలేదు." ఈవిషయము ఉపయుక్త సమయమున జెప్పబడినది. ఇది శెట్టిగారి మనస్సునకెక్కెను. భగవత్కృపచే నాతడారోగ్యవంతుడయ్యెను తరువాత నతడెన్నో దానపుణ్యములొనర్చెను.

సూతుఁడిట్లనెను:—"ఓ మునులారా! కావునఁ దమతమ యాదాయములో నైదవ భాగమును ధర్మకార్యములకు వినియోగింప వలయును." అందువలననే శుక్రాచార్యుఁడు తనయాదాయములో నైదవ భాగమును ధర్మకార్యముల దువ్యయ మొనర్పవలయునని చెప్పెను.

శుక్రాచార్యుఁడు బలికి నిట్లనుపదేశించుచు నిట్లనెను:—"రాజా! రు 500లు నెలకాదాయ ముండిన నందులో రు 100లు ధర్మకార్యములకు వినియోగింప వలయును. రు 100లు యశమును వృద్ధిఁ బొందించు కార్యముల కొరకు వినియోగింప వలయును ఏలననఁగాఁ బ్రపంచములో యశము లేకున్నచో వాఁడు జీవన్మృతుఁడే ఆతఁడు మనుష్యుఁడై నందులకు విశేష మేమున్నది? కుక్కలును పందులును పొట్టఁబోసి కొనును కావున యశోపార్జనము కొఱకు తన ఆదాయములో నైదవ భాగమును వినియోగింప వలయును విద్యార్థులకు సహాయము నొసఁగుట అన్నసత్రములు కట్టి పనలకును ఉచిత వైద్యశాలలను నెలకొల్పుడు. ధార్మిక పుస్తక ప్రచారమునకు వినియోగింపుఁడు. ఏశుభ కార్యముచే యశము వృద్ధిని జెందునో దానికి వినియోగింప వలెను.

ఒక యైదవ భాగమును మరల నాపనమును వృద్ధి చేయుటకు వినియోగింప వలయును. దానివలన నిత్యము

ధనము వృద్ధికావలయును. రు100లను దానికివినియోగింపవల యును. రు 100 లను సంసార నాదాయములో నైదవ భాగమును శారీరక సుఖోపభోగములకు వినియోగింప వలయును. పరుపు, దిండు, వాహనము మొదలగు నవియు, వివిధము లగు నాహార పదార్థములును సంగీతాది మనోరంజక మగు కార్యములందును వినియోగింప వలయును. ధనముండియు ననుభవింపఁ జాలని వానిగతి గానుగ యెద్దువలె నిరంతరము గానుగను త్రిప్పినట్లే. వానికి ధనమున్నను లేకున్నను నొక్కటే వానికిని జీతగాండ్రకును భేద మేమున్నది?" కావునఁ బంచమాంశముచే సుఖోపభోగము లొనర్ప వలయును.

మిగిలిన నైదవ భాగమును దన బంధుబాంధవులకును, స్వజనులకును సహాయ మొనర్చుటలో వినియోగింప వలయును తాను సుఖోపభోగము లనుభవించుచుఁ దన బంధువులకు లేకుండుటెట్లు? వారికి సహాయపడ వలయును. మన వాఁడు సంపన్నుఁడు అతఁడు మనకు సహాయ మొనర్పఁ గలఁడని బంధువులందఱాశించుచుందురు జన్మించి; సంపన్నుఁడై, యోగ్యుఁడై తనకులమువారికి సహాయపడకున్న నాతని జన్మ విద్య, యోగ్యత లన్నియును వ్యర్థములే. కావున రాజా! కులోన్నతి కొఱకవశ్య మైదవవంతును వ్యయ మొనర్పవలయును.

శుక్రాచార్యుఁ డిట్లనెను :- "రాజా ! గృహస్థు తన యాదాయము నిట్లు వినియోగ పరుపవలయును. ధన సంపత్తుల మీఁద నాతని కొక్కనికే అధికారము లేదు. పరివారమున కంతకును దానిమీఁద నధికారము కలదు. మరుగుజ్జు వామనుఁడు మూఁడడుగుల భూమిని దానమడుగు చున్నాఁడు. రెండడుగులలోనే నీ సర్వస్వమును హరింపఁ గలఁడు. సర్వస్వము నొసంగుటకు నీ కేమి యధికారఁ మున్నది ? కావుననే నేను దీనిని కాదనుచున్నాను. ఈ మాయలో నీవు పడి దాన సంకల్పము నొనర్పకుము."

బలిచక్రవర్తి యిట్లనెను :- "స్వామీ ! చేతి లోనికి జలమును గుశలను గైకొని సంకల్ప మొనర్చుట యేమంత గొప్పది కాదు. ఫలాని వస్తువు నొసంగెదనని మానసికముగ సంకల్ప మొనర్చినను, వాక్కుతో వాగ్దాన మొనర్చినను సంకల్పమైనట్లే. జలకుశలను గైకొని మంత్ర ముచ్చరించుట దానికి బుష్టి నొసంగు శారీరక క్రియ మాత్రమే నేను మనోవాక్కులతో సంకల్పము నిదివఱకే చేసియుంటిని. ఇప్పుడు సంకల్ప మొనర్చి యీయకున్నను నరకగామినగుదును. సంకల్ప మొనర్చినను నీయరాదని మీ శాస్త్రములలో నెచ్చటనైనను గలదా ?"

శుక్రాచార్యుఁ డిట్లనెను :- "అవును. ఎందులకు లేదు ? ఇది వేదమతము."

నవ్వి బలిచక్రవర్తి యిట్లనెను :- "స్వామీ ! ఇది వేదములలో లిఖింపఁబడినదా గీతములలో లిఖింపఁబడినదా ? ఏ వేదమందిట్లు లిఖింపఁబడినది ?"

శుక్రాచార్యుఁడిట్లనెను :- "ఋగ్వేదములలోని చాలఋక్కులలో నేనుజెప్పిన విషయమునకుఁ బుష్టి కలదు. దానిని నేను నీకు వినిపించెదను వినుము."

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా ! ఇట్లు పలికి శుక్రాచార్యుఁడు తాను జెప్పిన దానికి బుష్టి కొఱకై వైదిక ఋక్కుల కిష్టమువచ్చి నట్లర్థములు చెప్పసాగెను".

శుక్రాచార్యుని విపరీత ధర్మము

౫౬౫

శ్లో॥ పరాగ్రిక్తమపూర్ణం వా అక్షరం యత్తదోమితి ।
యత్కించిదోమితి బ్రూయాత్తేన రిచ్యేత వైపుమాన్ ।
భిక్షవే సర్వమోంకుర్వన్నాలం కామేన చాత్మనే॥
—శ్రీ భాగ. ౮ స్కం. ౧౯ అ. ౪౧ శ్లో॥

సీ॥ అంగీకరించిన నఖిలంబుఁబోవుచో
నన్నృతంబుగాదు లేదనిన నధిప
యాత్మవృక్షము మూల మనృతంబు నిశ్చయ
మనృతమూలము గల్గ నాత్మ సెడదు

పుష్పఫలము లాత్మ భూజంబునకు సత్య
మూ ప్రమాను ప్రదుకమి నదియుఁజెడును
ఫలపుష్పములు లేక పస చెడి వృక్షంబు
మూలంబుతో వృద్ధిబొందుఁగాదె

తే॥ గీ॥ చేయుఁ గొఱంతయు లఘిమయుఁజెందకుండ
నిచ్చుపురుషుండు చెడకుండు నిద్ధచరిత
కాక యంచిత సత్యసంగతి వటంచు
నిజ ధనం బర్థి కిచ్చిన నీకు లేదు.

—శ్రీ మదాంధ్ర భాగవతము.

వేదశాస్త్రములందనేక విధములగు వచనములుండును. వానిలోనన్నియును తమతమ బుద్ధిననుసరించి తమతమ మతములను బుష్టినొనర్చునవియే. వేదవ్యాసుఁడు రచించిన బ్రహ్మసూత్రమొకటియే. దానినుండి వివిధాచార్యులు వివిధార్థములను దీసియున్నారు. కొందఱు దానినుండి ద్వైతార్థమును దీసిరి. కొందఱ ద్వైతమును, కొందఱు విశిష్టాద్వైతమును, కొందఱు శుద్ధాద్వైతార్థమును స్థాపించిరి. ఈవిధముగ నందఱును దమతమ మతములను స్థాపించు కొనిరి.

ఈజగత్తు త్రిగుణాత్మకమైనది. అట్లే వేదములును త్రైగుణ్యములు. ఏ గుణముకలవారట్టి యర్థమును దీయు చుందురు పచారీదుకాణమునఁ బ్రతిఫలములు (ఉసరిక, తాడి,

కరక్కాయ) శుంఠి, మిర్చి మొదలైన రసాయనిక వస్తువులును గలవు. నాభి, పాషాణము మొదలగు విషములును గలవు. సమస్త విధముల మసాలా దినుసులు కలవు ఇతర వస్తువులును గలవు, ఎవరికే వస్తువు కావలసిన నాతండా వస్తువు కొనుక్కొని వచ్చి తీసికొనిపోవును. అదే విధముగ వేదములలోఁ గొన్ని వ్యావహారిక విషయములును గలవు అది యే యభిప్రాయములోఁ జెప్పఁబడినను, నీతిజ్ఞులు దానిని తమ స్వార్థ సిద్ధి నిమిత్తమై వానిఁ బరమప్రమాణముగ గ్రహించి యుపదేశించెదరు

శ్రీశుకుఁ డిట్లనెను :— "రాజా! అసురాధిపుఁడగు బలిచక్రవర్తి వామనునకు మూఁడడుగులిచ్చెదనని ప్రతిజ్ఞ నొనర్చి నాఁడనియు, ఇప్పుడా నీ కీయనని ప్రతిజ్ఞోల్లంఘన మొనర్చి మిథ్యాభాషణాపరాధము నెట్లు చేయఁగలననియుఁ బలుకఁగా శుక్రాచార్యుఁడిట్లనెను:— "రాజా! సత్యమేమో నిర్ణయించుట చాల కష్టము. ఒక్కొక్కప్పుడు సత్యమువలెఁ గనఁబడునది అసత్యమగుచుండును. అసత్యముగఁ దోఁచినది సత్యమగుచుండును."

బలిచక్రవర్తి యిట్లనెను :— "స్వామీ! అట్టిది సందేహవాక్యములందు సంభవమగును ఇచ్చట స్పష్టమే కదా! ఒక్కసారి మఱి మీఁదన వస్తువు విషయములో యాచకునితో 'సరియే యిచ్చెద' నని మరల నీయకున్నచో

నిది నిర్వివాదమైన సనత్యము, మీరు నాచే నసత్యాచరణ మేలఁ జేయించెదరు ?"

శుక్రాచార్యుఁడు గద్దించి యిట్లనెను :- "ఓయీ! పిల్లతనపు చేష్టలొనర్పకుము. చెప్పినది వినుము. ఎవనికి 'అవు' నని అంగీకరించితిమో అది సత్యమే. "బ్రహ్మమున్నాఁడు" ఇదియే సత్యము. 'లే' వని నిషేధించిన నది అసత్యము. మంచిది, చూడుము శ్రద్ధగాఁ దెలిసికొనుము. బ్రహ్మ సత్యము, జగన్మిథ్యా యనుజ్ఞానమెవరి ద్వారా కలుగును?"

బలి యిట్లనెను :-"స్వామీ! ఈజ్ఞానము శరీరసంసర్గము చేతఁగలుగును. ప్రసన్నుఁడై శుక్రాచార్యుఁడిట్లనెను:-"అవునంతే. జ్ఞానప్రాప్తికి సాధన భూతమైనదీ శరీరమే. ఈ దేహము అసత్యముచే నుత్పత్తియైనది. మూల ప్రకృతి యందు వికృతి కలిగినవే చతుర్వింశతి (24) తత్వము లుత్పత్తియగును. ఈపదార్థములన్నియును నాశవంతములు. మిథ్యలు, అసత్యములు! ఈయసత్పదార్థములచే నేర్పడిన దేహము ద్వారా సత్యస్వరూపమగు బ్రహ్మప్రాప్తించును. కావున నీదేహరూపమగు వృక్షమునకు మూలము అసత్యమైనది. సాధన రూపమగు జ్ఞాన పుష్పమును. మోక్షరూపమగు ఫలము వచ్చినది. అసత్యము అనఁగా దేహమే లేకున్నచో జ్ఞానమును, ముక్తియును నెట్లు ప్రాప్తింపఁ గలదు? వేరు తెగిపోయిన వృక్షమెండినట్లు, అసత్యమగు దేహము

నశింపఁగా దాని దేహమును వెంటనే యెండి పోవును. ఇం దుకు సందేహము లేదు."

బలి ఆశ్చర్యముతో నిట్లనెను :-"స్వామీ! నేఁడు మీరు నూతన విషయములను జెప్పుచున్నారు. అయితే మానవుడు సదా అసత్యమునే చెప్పవలయునన్నమాట."

శుక్రాచార్యుఁడు శీఘ్రముగ నిట్లనెను :- "సదా అసత్యాచరణమొనర్పుమని నాయభిప్రాయముకాదు. యథా శక్తిగ సత్యమునే చెప్పవలయును. అసత్యమును వీడవలెను; కాని ఆజీవిక పోవునప్పుడును, శరీరరక్షణ ప్రశ్నము వచ్చి నప్పుడును, కేవలము యుక్తితోఁబని జరుపుకొనవలయును. సర్వదా అసత్యమునుండఁగూడదు. తనసర్వస్వము నాశ మును గారాదు."

బలియిట్లనెను :- "స్వామీ! ఇది ప్రత్యక్ష అస త్యము వటువగు వామనుఁడిట్లనెను:-"నాకు మూఁడడుగుల పృథివినొసంగుము." నేను 'సరియేయిచ్చెద' నంటిని. ఇం దులో నేమియుక్తి రాఁగలదు? 'సరియే యిచ్చెద' ననిపలికి యీయకుండుట మిథ్యావాదమగు నసత్యము."

శుక్రాచార్యుఁడిట్లనెను :- "ఓయీ! నేనేది చెప్పు చున్నానో నీవా విషయము మూలము వఱకు పోనేపోలేదు. పైపైనే విచారించుచున్నావు. నీదగ్గఱకు నిత్యమును యాచ కులు వచ్చి వస్తువులను యాచించుచుందురు. నీవు సరియే

యిచ్చెదననుచుండుపు. సరియేయిచ్చెదననిఁ దనసర్వస్వము నొసఁగుట యను నర్థము కాదు తన శరీరమును, దారాపుత్రాదులను, రాజ్యమును గోశమును రక్షించుకొనుచు నిచ్చెదననియే అర్థము. "అవును నేనిచ్చెదను" అను నీ వచనమునకు మిక్కిలి వ్యాపకార్థము కలదు మొదటి యర్థమేమనఁగా నావద్దనున్నవస్తువును దీసి, దానిమీఁదఁగల నామమత్వమును దీసివైచి నీకొసంగెదను, కాని యేమి యొసంగెదను, ఎంతయొసంగెదను, ఎంతకాలమువఱకొసంగెదను, ఖరీదునకొసంగెదను, అల్పకాలము వఱకొసంగెదను, ఇన్ని అర్థములుకలవు. ఇందులో సంకేతమేమియును లేదు. భిక్షుగాని కెల్లప్పుడడుగుటయే పనిఁ దాత యిచ్చునపుడు దాత ఒకటి గుర్తునందుంచుకొనవలెను. ఎవఁడైన నన్నము నడిగిన 'అవునిచ్చెదను' అనిన దానియభిప్రాయము మన యింటిలోనున్న అన్నమంతయును నిచ్చెదనను నర్థముకాదు. ఎంతయిచ్చుట ఉచితమో అంతయిచ్చెదనను అర్థమే. అడిగిన దంతయును నిచ్చుచుండిన మనవద్ద మిగులున దేమియు నుండదు. తీసికొనువారికి కొదువయుండదు. నీవెంత యిచ్చిన నంతయును దీసికొందురు. పరిశ్రమలేకయే వచ్చుధనము నకుఁ జెలుపేమున్నది. భిక్షుకునకు బ్రహ్మాండ రాజ్యమొసంగినను దృప్తియుండదు. కావున దాత తెలిసికొని యీయవలయును, 'అవునిచ్చెదను' అని నిరంతరమనువాఁడు

ధనహీనుఁడై సర్ధనుఁడగును. చేతిని వెనుకకు లాగువాఁడును, అడుగుకొనువాఁడును, లాకేత్వము దాసుకొమ్ముపెట్టువాఁడును, వీరివద్దలక్ష్మి నిలుచును. కావున ధనికులు కృపణులుగ నుందురు. కృపణాత లేనిది ధనము ప్రోవుపడదు.”

బలి నవ్వియిట్లనెను:—“స్వామీ! అడిగినవారల దఱికును లేదనవలయునని దానికభిప్రాయ మేర్పడుచున్నది. ఇచ్చుచుండిన ధనము ఖాళీయగును గావున నెవ్వనికిని నేనిచ్చెద ననరాదనియే తేలుచున్నది ”

అంత శుక్రాచార్యుఁడిట్లనెను: “కాదు నాయనా! నీవు నాయభిప్రాయమును గ్రహింపలేవు. నేనొక సిద్ధాంత విషయమును జెప్పితిని. భిక్షువునకు దన సర్వస్వము నొసంగువాఁడు తనకావశ్యకములగు భోగములను సంరక్షించుకొన లేనివాఁడు కాఁగలఁడు. దీనికి విపరీతముగ నీయననువాఁడు తనవస్తువులనన్నిటిని సురక్షిత మొనర్చుకొనుచున్నాఁడు. సదా ధనధాన్యములచే సంపన్నుఁడగును. కాని యిట్టికృపణుని నందఱును నిందించెదరు. నిద్రలేవఁగానే వాని పేరు నెవరును దలంపరు. అతఁడు పట్టిలోభియని అందఱు నందురు. లోభియని ప్రసిద్ధినిఁజెందినవాఁడు జీవించియును మరణించిన వాఁడే. అతఁడు స్వయముగఁదినఁడు. ఇంకొకరికిఁ బెట్టఁడు.”

అంతట శౌనకుఁ డిట్లడిగెను :- "సూతా! లోభి యని యెవరి నందురు ?"

ఇది విని సూతుఁడు నవ్వి యిట్లనెను :- "స్వామీ! ఇదియొక గాథోక్తి. దీని యభిప్రాయము నే నిప్పుడు చెప్పెదను మాత్రమైన విశేషము లేయుటకు వానిని (మక్షీచూస్) లోభి యందురు ఒక కృపణుఁ డుండెను ఆతఁడు లడ్డు చేయుటకు పంచదార పాకము సిద్ధపఱచెను. దైవయోగమున దానిలో నొక యీఁగ పడెను. ఆతఁ డా యీఁగను దీసివైచెను. ఆతఁడు కృపణుఁడు కావున నాతఁ డిట్లనుకొనెను:- "ఈ యీఁగ కాళ్ళతో పోయిన పాకము వ్యర్థముగఁ బోవును. అది నాకు పనికి రాక చీమలు తినివేయును. అందువలన నాఁ డా యీఁగను నోటిలోఁ బెట్టుకొని చీకెను. దాని కాళ్ళ లందు తగులుకొనిన పాకమును వృథాగాఁ బోనీయలేదు. దాని యుపయోగమును దనకొఱకే చేసికొనెను" అందువలననే లోభి వానిని మక్షీచూస్ (యీఁగను చీకు) వాఁడందురు. ఈరకము వారిని సేవకుల సంగతి యేల భార్యాపుత్రులు కూడా యేవగించుకొనుచుందురు. ఈ లోభివాఁ డెప్పుడు చచ్చును. మాకెప్పుడు కడుపునిండ భోజన మెప్పుడు లభింపఁగలదు' అని అనుకొనుచుందురు ఇట్టివారు కేవల మితరుల కొఱకే ధనమును ప్రోవు చేయుదురు. బుద్ధిపూర్వకముగ బ్రదికి యున్నంతవఱకు తినరు, త్రాగరు, పుణ్యకార్యములకు విని

యోగింపరు. చిన్నచిన్న పిల్లలు కృపణునిఁ జూచి వానిని వెక్కిరించుచు నిట్లందురు. "కాచమ్మ కూడబెడితే మాచమ్మ మాయము చేసింది."

శుక్రాచార్యుఁడు బలితో నిట్లనెను :— "రాజా! మానవుఁడు కృపణుఁడు కాఁగూడదు. వచ్చిన వానికి లేదన రాదు. ఒకానొకఁడు వచ్చి వేయి రూపాయలడిగిన "మంచిది యథాశక్తి యిచ్చెదను" అని తన సంపదను జూచుకొని పందయో నూఁబదియో యీయవలయును చేతులను జోడించుకొని స్వామీ! యింతే యున్నది. యిప్పటి కిది కృపఁజేయుఁడు" అని యీవిధముగ సర్వథా లేదని అప యశస్సును బొందను రాదు. సర్వస్వదానము నొసఁగి తాను భిక్షుకాఁడును గారాదు. మధ్యమార్గము నాచరింపవలెను."

బలి యిట్లనెను :— "స్వామీ! వినిసి నేనొప్పుకొందును. మీరెంత యడిగెదరో అంత యిచ్చెదనని మన మని యుంటిమి. మన మొక్కటి యీయనిండు, వేయి యీయనిండు, ఇచ్చుటకు స్వతంత్రులము; కాని యింతకు ముందుగనే నేనింతయే తీసికొందును, దానిని మేమిచ్చెదమని యొప్పుకొని, అప్పుడు దానికీయకున్న నసత్యమైపోఁగలదు. వామనుఁ డిట్లనెను :— 'నేను నా పాదములతో మూఁడడుగుల భూమినిఁ గొనెదను." నేను "మీ యిష్టానుసారముగ నిచ్చెద"నంటిని, ఈ మాటలలో విపరీతార్థము లొనర్ప వీలులేదు."

శుక్రాచార్యుఁ డిట్లనెను :– "నీవు దీనినిఁ గొంచ ముగ సంశోధింపుము. "నేను పృథివి నొసంగెదను. మూఁడడుగు లొసంగెదను. నీపాదముల తోడనే యిచ్చెద'నని నీవంటివి. నీవు పృథివి నిమ్ము మూఁడడుగులు కాదు మూఁడువందల యడుగుల నిమ్ము. కాని ఓ వామన దేవతా! నీపాదములతో గొలువ నియమము గట్టిగా జెప్పవేయుము, ఇదియే నేను జెప్పునది. ఇందులో నే హానియునుండఁబోదు భిక్షుకుఁ డడిగిన దానికి మించి యిచ్చుచున్నాము."

బలి చేతులను జోడించుకొని యిట్లనెను :– "స్వామీ అన్యథా భావింపకుఁడు ఇది పచ్చి యబద్ధమైనది. వామనుఁడు మాటిమాటికిని 'నాకు మూఁడడుగులకంటె నధిక మొసగ నక్కఱలేదు, అధికముగ నిచ్చినను దీసికొనను, తక్కువయినను గైకొనను. నాపాదములతోడనే కొలుచు కొందు'నను చున్నాఁడు. నేనట్లే యిచ్చెదనంటిని. నీపాదములతో నియమనకు బ్రతిబంధమును బెట్టినచో నది అబద్ధపు వ్యవహారము కాఁగలదు. ఇట్లబద్ధమాడుట ధర్మమేనా?"

శుక్రాచార్యుఁడు మధురవచనములతో నిట్లనెను:– "అవును. అబద్ధమేనయ్యా! కాని అబద్ధమాడినను దోష ముగఁ బరిగణింపబడని స్థానములు కొన్ని కలవు."

బలియిట్లనెను :– "స్వామీ! అబద్ధమబద్ధమే. దాని నుంచి తప్పించుకొనవలయును."

శుక్రాచార్యుఁడిట్లనెను :— "ఏయే యవసరములలో నబద్ధము క్షమింపఁదగినదో నేను జెప్పెదను వినుము. అచ్చట నబద్ధము చెప్పిన నంతగా దోషము లేదు."

శ్రీశుకదేవుఁడిట్లనెను :—' రాజా! ఇట్లు పలికి శుక్రాచార్యుఁడపవాద ధర్మములను గూర్చి చెప్పసాగెను."

ఎచ్చట అసత్యము నిందనీయము కాదు

(౫౬౬)

శ్లో॥ స్త్రీషు నర్మ వివాహే చ వృత్త్యర్థే ప్రాణసంకటే ।
గోబ్రాహ్మణార్థే హింసాయాం నానృతం స్యాజ్జుగుప్సితమ్ ॥
శ్రీభాగ. ౮స్కం. ౧౯అ. ౪౩శ్లో॥

గీ॥ వారిజాక్షులందు వైవాహికములందు
ప్రాణవిత్తమానభంగములను
జకితగోకులాగ్రజన్మరక్షణమందు
బొంకవచ్చు నఘముఁ బొందదధిప॥

శ్రీమదాంధ్ర భాగవతము.

నియమము నుండును. దాని కపవాదము నుండును, మఱియు విపరీతయునుండును. ఎట్లనఁగా సదా సంధ్యావందనమొనర్పవలయునను నియమము కలదు. సూతకములలోఁ జేయరాదను నపవాదమును కలదు. విపరీతయన నెట్టిదనఁగా—

ఏదైన గొప్పయుత్సవములో నుండినను, యాత్రయాదివ కాశము లేకున్నను, ఏదైనఁబరోపకార కార్యమందు సంలగ్నుడైనను, నప్పుడు సంధ్యావందన మొనర్చు నవకాశము దొఱకకున్న నో సంధ్యావందనలోప మైనను నిది దోషముగఁ బరిగణింపఁబడదు అదియు న్యూనాపరాధము. ఇదేవిధముగ నన్యసందర్భములందును గమనింపవలయును.

బలి నాఁటి మాటికిని శుక్రాచార్యునితో "నన్న బద్ధమాడ మనుచున్నారా?" యని నిరుత్తరుఁడై నపుడు శుక్రాచార్యుని "డెనిమిది యవసరములలో నబద్ధ మాడవలసి వచ్చినను దోషము లేదనెను."

బలి చక్రవర్తి యిట్లడిగెను. — "స్వామీ! ఆ యెనిమిది యవసరము లేవి?" శుక్రాచార్యుఁ డిట్లనెను: — 'స్త్రీలను బ్రసన్నులఁ జేయుటకై అబద్ధ మాడవలసి వచ్చిన దోషవిశేష దోష మేమియు నుండదు. వృద్ధస్త్రీలు తమహాని లాభముల నన్నిటిని నెఱుఁగుదురు వారికి పుత్రపౌత్రుల భారమువచ్చి పడుటచేఁ దమ హాని లాభముల సిద్ధి నెఱుఁగుదురు వృద్ధలగుటచే నలంకారము లొనర్చుకొన వలయునను కోరికయును దగ్గిపోవును. కాని క్రొత్తగాఁ బురుషునివద్దకు వచ్చు వారికి అనుభవ ముండదు. వీరును నూతన వస్త్రములఁ గొఱకును ఆభూషణముల కొఱకును భర్తతోను గోడించుచుందురు ఇవ్వకున్న ముఖమును ముడుచుకొని కూర్చుందురు. ఎవరైన

మంచి మెఱుపుగల చీరెను గట్టుకొని రా వచ్చి పతితో నిట్లం దును:—"విన్నారా? నేను చిన్న కమల వివాహమునకు బోయితిని. పెద్దశెట్టిగారి పిల్ల పెద్దాపురము నుండి వచ్చినది. ఆమె మంచి నాజూకైన చీరెను గట్టుకొన్నది. నామనస్సంతయును దాని మీందనే యున్నది. 'అమ్మాయీ! ఈ చీరె ప్పుడు తీసికొంటివని నేనడిగితిని"

ఆమె యిట్లనెను:—"పిన్నీ! దీనిని కొని నాలుగేండ్లైనది. దీని నెంతగా నుదకిన నంత మెఱుపు వచ్చును. ఎంతో ధర లేదు. 'అప్పటి నుండియు నా మనస్సంతయును దాని మీందనే యున్నది. అట్టి చీరెను నాకును దెచ్చి పెట్టుడు"

నెల కెంత జీతమో ఆమె కేమి తెలియును? ఆ ఒక్క చీరకే పెట్టినచో దినుసదేమి కలదు? ఆమె ముఖము చిన్న బుచ్చుకొనును. ఆ సమయమున బలి బుచ్చిక మొనర్చుటకై యిట్లనవలెను:—"మంచిది, సరే, ఇకను నెలను బూర్తి కానిమ్ము నాకు పెద్దాపురము వెళ్ళవలసిన పనియునుగలదు. తెచ్చి పెట్టెదను" ఈ విధముగ బలికి టలాయింప వలెను. ఒక సంవత్సరమునకైనను దేనిక పోవచ్చును. నాక్యమైనంత వఱకు సత్యమునే చెప్పవలయును; కాని వస్త్ర భూషణములు, ఇంక చిన్న చిన్న విషయములలో జగడములు వచ్చు భయమున్నప్పుడు, ఆతండు సత్య హరిశ్చంద్రుని వలె సత్యవాది యైనం జెప్పలేము కాని యెంత గొప్ప వారైనను

స్త్రీల సమ్ముఖమున నిట్టి మాటలు చెప్పవలసి వచ్చును. ఇట్టి సమయములం దసత్య మంతగా నింద్రితము కాదు. సాధారణముగ వ్యవహారమున నిట్లు చేయవలసి వచ్చును. స్త్రీలు మాటమాటకును ముఖమును ముడుచుకొనుచుందురు. వారికి చెప్పఁదగిన విషయము లుండును, చెప్పఁదగని విషయము లుండును స్త్రీ లేవిషయమునైనను లోన దాచుకొనఁజాలరు. వారికేదైన రహస్యపు మాట జెప్పినచో వారందఱకును రహస్యముగ జెప్పుదురు. ఈ విధముగ వెల్లడించెదరు. దీని నెవరికినిఁ జెప్పగూడ దని వారికిని జెప్పెదరు. కాని వారును నట్లే చెప్పెదరు. ఈవిధముగ నది లోకమంతయును వెల్లడి కాఁగలదు. కావున స్త్రీ లేదైన రహస్యవిషయమును గూర్చి పట్టు పట్టినచో నా యీ మాటలను జెప్పి టలాయించి యేదియో సమాధానము జెప్పవలసి యుండును.''

కైకయ మహారాజన్ని జీవుల భాషల నెఱుఁగును. ఒక యోగి ఆతని కీవిద్యను జెప్పెను. దీని నెవరికైనను జెప్పినచో నీ ప్రాణము పోవుననియు నా యోగి చెప్పియుండెను. ఒక దినమున నాతఁడు తన యంతఃపురమునఁ గూర్చుండెను. రెండు చీమలు గోడలో దాము మాటలాడుకొనుచుండెను. అవియును బూర్వజన్మమున రాణులు. వాని మాటలను వినఁగానే రాజునకు నవ్వు వచ్చెను. రాణి

యును దగ్గఱనే కూర్చుండినది. రాజు తనను జూచి నవ్వు చున్నాఁడని ఆమె తలఁచెను."

క్రుద్ధురాలై రాణి యిట్లనెను:—"మహారాజా! మీరు నన్నుఁ జూచి యెందుకు నవ్వుచున్నారు?"

రాజు ధైర్యముతో నిట్లనెను:—"దేవీ! నేను నిన్నుఁ జూచి నవ్వుట లేదు. ఇది వేఱు విషయము."

రాణియిట్లడిగెను:—"అదేమిటి? దానిని నేను వినవలయును. నాకవశ్యము చెప్పవలయును."

రాజిట్లనెను:—"దానిని నేను జెప్పినచో నాకు మృత్యువు కలుగును. నీవీ విషయమును నన్నడుగకుము." కాని స్త్రీహఠమొనర్చినచో బ్రహ్మ చెప్పినను వినదు. ఆమె యిట్లనెను:—"కాదు మహారాజా! ఏమైనగానిండు మీరు నవ్విన కారణమును జెప్పితీరవలయును. మీరు చెప్పకున్నచో నేనువిషమును దిని చచ్చెదను."

రాజుమిక్కిలి ధర్మసంకటములోఁబడిపోయెను. అతఁడు పోయి యోగితో జెప్పెను. యోగి యిట్లనెను:—"ఆమెను జావనిమ్ము అట్టిహఠము చేయును గానిచావదు. ఆమెకుఁ జెప్పవలదు" రాజిట్లే నేనెను. "నీవు చచ్చినను బ్రదికినను నేను జెప్పననెను." రాజు యోగికి జెప్పుటచే సత్యమును రక్షించుకొనెను. ఒకవేళ నీవిషయము మీఁదనైన స్త్రీ యిట్లు మొండిపట్టును బట్టినచో నాయీమాటలను జెప్పి

శాంతింపఁ జేయవలయును. కుంతి కర్ణుని విషయమును దాఁచఁగా ధర్మరాజు స్త్రీలేవిషయమును నైన దాఁచకుండెదరుగాక యని శపించి యుండెను. ఏదైన విషయము బయటకుఁ జెప్పరానిది యున్నచో దానిని స్త్రీలకుఁ జెప్పకూడదు. దీనిలో విశేషదోషము లేదు.

రెండవది నవ్వులాటలకు అబద్ధములు నోటివెంట వెలువడినచో నంతదోషము లేదు. నవ్వులాటలకును నబద్ధములు రాకుండ చూచుకొనుట చాలముఖ్యము. కాని నవ్వులాటలలోఁ జాలగ నబద్ధములు వచ్చుచుండును. పసిపిల్లను మనద్దునకుఁ జంకలోనికెత్తుకొని "చూడు, నిన్నుగంగలోఁ బడవైచెద" నందురు. ఆతఁడు పడవేయఁడు ఊరక నవ్వులాటల కనుచున్నాఁడని ఆపిల్లకును దెలియును. మనమును బడవేసెదమను భావనతో ననము. నాటకములలో రాజుకానివాఁడు రాజువేషమును వేయును. ఆతఁడు మాటిమాటికిని నేను రాజును అదిచేసెదను, వీనిఁ గొట్టెదను. వానిని బడవేయుదును. మాటన్నియు నబద్ధములే; కానిఆటలోనిమాటలు. వాని కసత్యదోషమాపాదింపదు."

మూఁడవ స్థానము, వివాహప్రసంగము. ఒకానొక పిల్లకలదు. ఆమెనల్లనిదని చెప్పిన నామెకు వివాహముకాదు. ఆవిషయమును దాచి పిల్లఅందమైనది, కొంచెము చామనచాయ, ఏమియును ఫరవా లేదని చెప్పవలయును. ఇదే విధ

ముగ నేదైన వరుని వివాహము విషయములో నాతఁడు నిర్ధనుఁడని చెప్పినచో వానికి వివాహము కాదు. అప్పుడు పిల్లవాఁడు సంపన్నుఁడు, తినువాఁడును త్రాగువాఁడును గాదు పిల్లసుఖించును ఏదోషములును లేవు; అని చెప్పవలెను. పెండ్లికి ముందే నలుపు, తెలుపు, ధనికుఁడు, నిర్ధనుఁడను విచారముఁ వివాహమైన పెండ్లికొడుకును పెండ్లికూతురును గలిసికొనిరా అన్నివిషయములును ప్రాతపడి పోవును, ఇక నిభాయించు చింతనిలిచిపోవును. కావునఁ గన్యావరాది స్తుతిసమయమునఁ గొంతగా నసత్యభాషణము వచ్చినను దోషము లేదు

నాల్గవస్థాన మాజీవికా ప్రసంగము. వాణిజ్యవ్యాపారములొనర్చు చుందురు. అచ్చట వారు ఫలానివస్తువును రు 10లకు తక్కువ కీయమని తొమ్మిదికే ఇవ్వవలయుననిన నష్టము లేకుండినఁ తొమ్మిదికే యిచ్చినచో నది విశేషదోషము కాదు ఇదే విధముగాఁ దన ఆజీవిక పోఁబోవుచున్నప్పుడు ఫలాని యుక్తిని దాఁచుటచే నది రక్షింపఁ బడుచో దానిఁ దాఁచినది విశేషనిందనీయ దోషము లోనిది కాదు ఏలననఁగా జీవనము కంటెను ప్రియమైనది జీవిక.

అయిదవస్థానము-ప్రాణసంకటము కలిగి నప్పుడు-అనఁగా ప్రాణములు పోవు నవసరము తటస్థించు నప్పుడు కొంచెము అసత్యమును జెప్పుటచే రక్షణము జరుగుచో నా మాటను జెప్పి ప్రాణ రక్షణముచేసి కొనవలెను. బ్రదికి

యుండిన నీపాపమునకుఁ బ్రాయశ్చిత్తము చేసికొనవచ్చును ఇంక నధిక పుణ్యమును సంపాదించుకొనవచ్చును. ప్రాణరక్షణముకొఱకు విశ్వామిత్రుని వంటిఋషి అఖాద్య పదార్థమును దొంగిలించెను. ఒక ఋషి మిక్కిలిఆఁకలిని జెంది యుండెను ఆఁకలి కారణమున నాతనికిఁ బ్రాణములు పోవుచున్నట్లుండెను ఒక మాలవటి వాడలచంద గుగ్గిళ్లను దినుచుండుటను గాంచి ఋషితినుట కడిగెను. ఆతఁడిట్లనెను:—"స్వామీ! నావద్ద అలచందగుగ్గిళ్లున్నవి కాని యెంగిలివి" ఋషి యిట్లనెను:— "ఎంగిలివేయుమన్న". ఆతఁడు ఋషి, దానినిఁ దినెను. ఆ మాలవటివాఁడు నీటినిఁ ద్రాగుట కీయఁబోఁగా ఋషి 'నేను జలమును ద్రావననెను.

మాలవటివాఁ డాశ్చర్యముతో నిట్లనెను:— "స్వామీ ఎంగిలి గుగ్గిళ్ళు తినిన మీకు ధర్మము పోలేదు నాచేతిలోని శుద్ధజలమును ద్రాగుటలో మీకు ధర్మమెట్లు పోఁగలదు?"

ఋషి యిట్లనెను:— "సోదరా! ఆసమయమున నేను మిక్కిలి ఆఁకలినిఁ జెంది యున్నాను అప్పుడు నాకేమియును లభింపకుండిన నాప్రాణము పోయెడిదే అందువలన నేను ప్రాణరక్షణముకొఱకా యెంగిలి అలచ దలను జీవించుటకు దింటిని ఈపాపమునకుఁ బ్రాయశ్చిత్తము చేసి కొందును. కాని జలము సర్వత్ర దొఱకును. ఒకవేళ దొఱకినను నే నాలస్య ప్రమాద వశమునదీనినిఁ ద్రాగినచో నాకుదోషము

ప్రాప్తించును. దానికిఁ బ్రాయశ్చిత్తము లేదు. కావునఁ బ్రాణరక్షణము కొఱకు కొంచెమనుచితకార్యమొనర్ప వలసి వచ్చినను జీవన రక్షణను గోరువాఁడట్టి కార్యము నొనర్చి జీవన రక్షణమొనర్చు కొనినచో నేమంత దోష ముండదు.

ఆలవస్థానము. గోరక్షణము. గోవులు లోకమునకు మాతలుగఁ జెప్పఁబడినవి. ప్రాణము నొసఁగియైనను గోసంరక్షణ మొనర్పవలయును. గోసంరక్షణము కొఱకైనను నబద్ధమును జెప్పినచో నది నిందనీయము కాదు. గోహత్య నొనర్చు వానిని శక్తికొలఁది దండింపఁ గలిగినచో దండింప వలయును. గోరక్షణ మొనర్చుట ప్రతివ్యక్తికిని ధర్మమై యున్నది. అజన్ముఁడయ్యును భగవానుఁడు గోవులను, బ్రాహ్మణులను రక్షించుకొఱకె జన్మించుచుండును. సమస్త దేవతలును బితరులును గోశరీరమందు నివసించుచుందురు. గోమయమునందు లక్ష్మి నివసించుచుండును. గోసేవయొన ర్చుట సమస్త దేవతల రక్షణ మొనర్చుటయే. గోవుపాఱి పోవుచుండి, దానివెంట కసాయివాఁడు తరుముకొనివచ్చుచు నీవైపుగా గోవు పోయినదా యని యడిగినచో నచ్చట సత్యము పలుకుట అనుచితమే కాదు అధర్మము. నచ్చట నేవిధముగనైనను గోవును రక్షింప వలయును.

అంత శౌనకుఁ డిట్లనెను :—“ సూతా! పాపము పాపమే. సత్యమును బలుకుటచే నధర్మ మెట్లగును?”

అంత సూతుఁడిట్లనెను:—"స్వామీ! ఒక్కొక్కప్పుడు సత్యము వలెఁ దోచు కార్య మధర్మ మగు చుండును. అసత్యముగఁ దోఁచునది ధర్మమగు చుండును. ఈవిషయమున నేను మీకొక యితి హాసమును జెప్పెదను"

ఒక గొప్ప భగవద్భక్తుఁడగు సాధువుండెను. ఆతఁడు నాలుగు ధామములను (కన్యాకుమారి, జగన్నాథము, బదరీ, ద్వారక) యాత్ర చేయుటకుఁ గాలినడకను బయలు దేరెను. యాత్ర చేయుచుఁ జేయుచు నాతఁడు జగన్నాథ పురికిఁ బోవుచున్నప్పుడు రాత్రి ఆతఁడొక గృహస్థుని యింట నిలిచెను. సాధువు యువకుఁడు అత్యంత సుందరుఁడు. ఆ యింటి యందొక ముసలిది యుండెను. ఆమెకొక యువతియగు కూతురుండెను ఆయువతి సాధువునకు గొప్పగా స్వాగత సత్కారములను గావించెను. మిక్కిలి ప్రేమతో భోజనము పెట్టి రాత్రియందచ్చటనే యుండవలయు ననెను. సాధువు అమాయకుఁడు. కావున నామె శ్రద్ధను గాంచి నిలిచి పోయెను.

రాత్రియందఱును నిద్రించిన తరువాత నాస్త్రీసాధువు సమీపమునకువచ్చి ఆతనితో ననుచిత ప్రస్తావమును గావించెను. సాధు విట్లనెను:—'నీవు నీపతిని భజింపుము. పతి యుండఁగా నన్యపురుషుని సమీపమునకు వచ్చుట ఉచితము కాదు' దానికామె 'ముందు నీవు నీపతిని ఖండించుము. అతఁ

దుండఁగా నాకడకు రాంబోకు' మనునర్థమును దీసెను. ఆమె మనస్సు మలినమై యుండెను. అందువలన నామెపోయి, ఒక ఖడ్గముతోఁ దనపతి శిరమును ఖండించి మరల సాధువు కడకు వచ్చెను.

సాధువిట్లనెను:-"దేవీ! నీవెంతటి పాపపూర్ణము గుఁ బ్రస్తావ మొనర్చుచుంటివి నీవు నాతల్లివంటిదానవు. ఇట్టివ్యవహారము నీకు శోభింపదు." సాధువుయొక్క యీవ్యవహారము వలన నామెపై విపరీత ప్రభావము పడెను ఆమె శిరమునుఁ గాము భూతము స్వారీచేయుచుండెను తనకోరిక నెఱవేరక, తన స్వార్థమునకు వ్యాఘాతము కలుగుటను గాంచి ప్రతిహింసా వృత్తి జాగృతినిఁ జెంది యిట్లరచెను:-చూడండఁడో, ఈమనుష్యుఁడు నాపతిని హత్య గావించినాఁడు." ఈ గోలను విని అటునిటు నుండి చాలమంది మనుష్యులు గుమికూడిరి. రాజ కర్మచారులును వచ్చిరి. సాధువును బట్టుకొని రాజుముందు నిలువఁ బెట్టిరి. పురుషుఁడు చావనే చచ్చెను. రాజా సాధువు రెండు చేతులను ఖండించెను. సాధువిట్లనుకొనెను:-"ఇదియును నాపూర్వజన్మపు పాపమై యుండవలయును ఇది భోగము చేతనే నివృత్తి కాఁగలదు." అనుకొని ఆతఁడు జగన్నాథమునకుఁ బోయెను. కొంతదూరము పోఁగానే ఆతనికొక సిద్ధుఁడు లభింపఁగా నాతని నిట్లడిగెను:-"స్వామీ! ధర్మకార్యము లొనర్చుచున్నను నకారణముగ దీని నేల యనుభవింప వలసి వచ్చినది?"

సిద్ధుఁడిట్లనెను :- 'సాధువర్యా! ఎవ్వఁడును నితరుల కెన్నడును నకారణముగ బాధకలిగింపఁడు పూర్వజన్మ సంస్కారముండిన, వారే సుఖదుఃఖముల నొసంగి ప్రతీకారము నొనర్చెదరు.'

సాధువిట్లనెను :- 'స్వామీ! నే నీ తల్లికేమి యనిష్టము గావించితిని?'

సిద్ధుఁడిట్లనెను :- 'మహాత్మా! నీవు పూర్వజన్మమునఁ గాశీక్షేత్రమున గొప్ప విద్వాంసుఁడవు, కర్మిష్ఠివి, సత్యవాదియగు బ్రాహ్మణుఁడవు ఒక దినమున నీవు దశాశ్వమేధ ఘట్టమున స్నానము చేయుచుంటివి. ఆసమయమున నొక కటికవాని గోవు తప్పించుకొని వచ్చెను. ఆతఁడును వెంటనంటెను తన గోవు ఒక గల్లీలోనికి దూరుటను గాంచెను.

కటికవాఁడువచ్చి నీతో నిట్లనెను :-'పండితవర్యా! మీకు మా ఆవు కనబడినదా?'

నీవు రెండుచేతులనెత్తి యిట్లంటివి :-'అవునుఇప్పుడే వెళ్ళుటను నేనుగాంచితిని.'' నీవు చెప్పుటచే నాతఁడు పరువిడి యాగోవును పట్టుకొని వధశాలకుఁ గొనిపోయి దానిని వధించెను. కాలక్రమమున నాగోవేవచ్చి యీస్త్రీగ నయ్యెను. ఆ కటికవాఁడే దానికి పతియయ్యెను. పూర్వజన్మమున ద్వేషముకలదు. అందువలన నామె తన పతినిఁ జంపి

తన పూర్వజన్మపు క్రోధమునకుఁ బ్రతీకారమొనర్చెను. ఆ హింసలో నీకును భాగముకలదు. నీవు రెండు చేతులనెత్తి గోవును జూపించితివి. నీవు చెప్పకుండినచో నాతనికి దొఱకి యుండెడిది కాదు. అది రక్షింపఁబడెడిది. ఏ చేతులనెత్తి నీవు గోహత్యకు సహాయమును గావించితివో ఆ నీ రెండు చేతులను ఖండింపఁబడినవి. ఇప్పుడు నీవు శ్రీజగన్నాథుని శరణు వేఁడుము. ఆతఁడశరణ శరణుఁడు, దీనబంధువు, దయాసింధువు; ఆతఁడేది తలచుకొనిన దానినిఁ జేయఁ గలఁడు.'

సూతుఁడిట్లనెను :– "మునులారా! సిద్ధుని నోట యీ మాటలను విని సాధువు జగన్నాథమునకుఁ జేరి ఆతనిఁ స్తుతించెను. చూచుచుండఁగనే ఆతని రెండు చేతులును మరలఁ గమలములవలె బయటకు వచ్చెను. ఇంతకీ కథ యొక్క సారాంశమేమనఁగా నిట్టి సమయములందు సత్యమును చెప్పుటయును పాపమునకు సమానమే యగును."

శుక్రాచార్యుడు బలికి చెప్పుచు నిట్లనెను:–"రాజా! గోరక్షణము జరుగు నెడల నచ్చట అసత్యమును జెప్పుటయును దోషము కాదు."

ఏడవస్థానము బ్రాహ్మణహితము. ఒక బ్రాహ్మణుఁడు విపత్తులోనుండి అసత్యమును జెప్పుటచే వాని విపత్తు దూరమగుచో నా యసత్యము సత్యము కాఁజాలదు. భావనము, పరోపకారమే. దొంగతనమువంటి నిందితకర్మలొనర్చి,

దానివలన ధనమును దెచ్చి, దానిచే సాధుబ్రాహ్మణులకు భోజనమిడిన సద్గతిని బొందని భక్తులనేకులు కలరు కావున సాధుబ్రాహ్మణులకు మేలొనర్చుటలోఁ గొంచెముగనో గొప్పగనో అసత్యమును బలికినను వచ్చిన నది నిందనీయము కాదు.

ఎనిమిదవ స్థానము — ఇతరుల హింసను నివారించు సమయమున ఒకానొకఁడు రితీయఁబడబోవుచుండ మన మసత్యమును జెప్పుటచే వాని ప్రాణము రక్షింపఁబడునో నట్టి యవసరమున నసత్యమును జెప్పినను దోషముండదు. ఈసమయమున నబద్ధమును జెప్పవలయు ననున విధి కాదు. అట్లను గావచ్చునని యే. ఏమియును జెప్పక తప్పించుకొనినఁ దప్పించుకొనవచ్చును. కాని సత్యవాదియై యితరుల కనిష్టమును దేరాదు.''

శౌనకుఁడిట్లనెను :— ''సూతా! తప్పించుకొను టెట్లు? ఎవరైనను మన సమ్ముఖమున నిలుచుండి యడుగుచుండిన మన మవుననవలయునా కాదనవలయునా? ఈ రెంటిలో నేదియో చెప్పవలయునుగదా ?''

సూతుఁడిట్లనెను :— ''స్వామీ! అసత్యమును జెప్పియే కాదు, సత్యమును జెప్పియును నెవరికిని దుఃఖమును గలిగింపరాదు. ఇతరులకు దుఃఖమును గలిగించు

నప్రియసత్యము పాపసదృశము. ఈవిషయమున నొకదృష్టాంత మును వినుఁడు."

ఒక గొప్ప ధర్మాత్ముఁడును సత్యవాదియునైన ముని కలఁడు. అతఁ డెన్నఁడును నసత్యభాషణము నొనర్చువాఁడు కాఁడు ఒకసారి అతఁడు స్నానమొనర్చి వచ్చుచుండఁగా నాతఁడొక గాయపడిన మృగము పొదలమాటున దాగి యుండుటను గాంచెను. ఇంతలోనే మిక్కిలి బలవంతుఁడును, హృష్టపుష్టశరీరుఁడును నగు క్రూరవధికుఁడు చేతులలో ధను ర్బాణములను ధరించి ఋషిసమ్ముఖమునకువచ్చి యిట్లడి గెను :—"బ్రాహ్మణోత్తమా! మీరిటువచ్చిన మా గాయ పడిన మృగమును గాంచితిరా?"

ముని యిట్లు యోచించెను :—"నేనీ వధికునకు సత్యమును జెప్పితినా యీతఁడిప్పుడే దీనినిఁ జంపఁగలఁడు వాని హింస యందు నేనును సమ్మిళితుఁడనై పాపినగుదును నేను జూడలేదనిన నాసత్యవ్రతము ఖండితమగును," అని యాలో చించి ఆతఁడు మొదలు అవునన లేదు కాదనలేదు." ఆవధికు డెన్నిసార్లడిగినను మౌనముగనే యుండెను.

చివరకాతఁడు కోపముతో నిట్లనెను :—"మునివరా! మీరు గొప్ప ధర్మాత్ములని నేను వినియుంటిని. నవ్వులాల కైనను మీరసత్యమాడరఁట. మీరు మృగమును జూచిన

నౌసనుఁడు చూడకున్న లేదనుఁడు. నేను వెళ్లెదను మీరేదో ఒక ప్రత్యుత్తరమిందు."

ముని గంభీరుడై యిట్లనెను :- "అయ్యా! ఏమి ప్రత్యుత్తరమిచ్చెదను చూచిన కన్నులకు జెప్ప శక్తిలేదు. జిహ్వమాట్లాడఁగలదు. దానికిఁజూచు శక్తిలేదు. కావున నేను నీకేమని చెప్పఁగలను? చూచిన కన్నులు చెప్పినచో నది నిజమగును. చెప్పఁగలిగిన జిహ్వ చూడఁగలిగినచో నది సత్యమగును. ఒకటి చూచి యింకొకటి చెప్పినదానిని విశ్వసించుటెట్లు-కావున నేది చూచినదో దానినడుగుము."

ఈ అకటావికటపు ప్రత్యుత్తరమును విని వధికుఁ డత్యంత ప్రసన్నుఁడయ్యెను ఆతఁడువధికుఁడుకాఁడు. సాక్షాత్తుగ ధర్మమె వధికరూపమునుధరించి ఆతనిఁ బరీక్షింప వచ్చెను. ఆతనికి మనోవాంఛితవరము నొసంగి ధర్మమచ్చటనే అంతర్ధానమయ్యెను. అట్లా సత్యవాదియగు మునియే ఉత్తరమీయవలెను. సాధారణులిట్టి ప్రత్యుత్తర మీయఁజాలరు.

శుక్రాచార్యుఁడు బలిచక్రవర్తితో నిట్లనెను :- "రాజా! ఇది నీతిధర్మసంగత విషయము.

గీ॥ వారిజాక్షులందు వైవాహికములందు
ప్రాణవిత్తమాన భంగములను

చకిత గోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము బొందదధిప॥

ఆ అసత్యము నిందనీయము కాదు. ఈ సమయమున నీ యాజీవికాప్రశ్న కలదు. ఈ విష్ణువు మోసమునఁ గపట వేషమునుధరించి నీసర్వస్వమును హరింపఁజూచుచున్నాఁడు. ఈసమయమున నీవు కొంచెముగ నసత్యభాషణము పలికినను దోష మేమియు నుండదు ”

శ్రీ శుక దేవుఁ డిట్లనెను:—“రాజా! శుక్రాచార్యుఁ డన్నియుక్తుల నొసంగి వేద, శాస్త్ర, సమ్మతమగు నీతి నుపదేశింపఁగా ధర్మాత్ముఁడును, నుదారుఁడునగు బలిచక్రవర్తి దృఢముగ నీవిషయములకుఁ బ్రత్యుత్తర మొసంగ నుద్యుక్తుఁ డయ్యెను.”

బలిచక్రవర్తికి సత్యమందు దృఢత్వము.

(౫౬౭)

శ్లో॥ సత్యం భగవతా ప్రోక్తం ధర్మోఽయం గృహమేధినామ్।
అర్థం కామం యశోవృత్తిం యోనబాధేత కర్హిచిత్॥
సచాహం విత్తలోభేన ప్రత్యాచక్షే కథం ద్విజమ్।
ప్రతిశ్రుత్య దదామీతి ప్రహ్లాదః కితవో యథా।

[illegible] 3 శ్లో॥

సీ॥ నిజ మానతిగ్రోతి నీవు మహాత్మక
మహిని గృహస్థ ధర్మంబు విడియు
యర్థంబుఁ గామంబు యశమును వృత్తియు
నెయ్యది ప్రార్థింప నిత్తునని యు
సర్థలోభంబున నర్థిఁబొమ్మను టెట్లు
పలికి లేఁను కంటెఁ బాపమెద్ది?

శ్రీమదాంధ్ర భాగవతము.

కష్టములకు భయపడువాఁడు ధర్మమును విడుచును. ఏ సత్యమునకు సదావిజయము కలుగునో దానిమీఁద విశ్వాసములేనివాఁడే అసత్యము నాశ్రయించును. ప్రాణములపై మోహమును వీడినవాఁడును సదా తన శిరస్సును నఱచేతిలోఁ బెట్టుకొనినవాఁడును యథార్థమగు ధర్మపాలన మొనర్పఁగలఁడు ఈనశ్వర శరీర మేదో ఒకరోజున నశింపు తీరును దారా, పుత్ర, బంధు, బాంధవులతో స్నేహ మొక దినమున వియోగమును జెందుట అవశ్యంభావి యగును అర్థము ప్రపంచమున నెవనివెంటఁ బోయినది? జనులసంఖ్యాకములగు ముద్రలను ప్రోవుచేసి వానినన్నిటిని నిచ్చటనే వదలిపోయిరి. కుబేరుఁడును గల్పాంతమున మారిపోఁగల్గడు. కామోపభోగ సామగ్రిచే నేటివఱకు సర్వథా తృప్తిని జెందినవాఁడెవఁడు కలఁడు? యశమ్మాత్రము ప్రపంచములో నెవరికి స్థాయిగనున్నది? ఎందఱో బ్రహ్మలు, ఎందఱో

ఇంద్రులు, మారిపోయిరి. ఈకల్పములోని యింద్రులను వదలి అన్యకల్పములలోని అసంఖ్యాకులగు నింద్రుల సేవ చేయుచుందురు! ఆజీవికా రక్షణమును మానవుఁడు స్వతః చేసికొనఁదలఁచుచో నెట్లు చేసికొనఁగలఁడు? కూరలనమ్ముకొనునది ఒక్కరూపాయి కూరలను గొని అమ్మిన యెంతో కష్టముతో నాల్గణాలైన లాభము రాదు. దీనితోడనే అది తన పరివారమును బోషించుకొనును. మఱియొక చోట నొక శ్రేష్ఠికి నిత్యమును లక్షరూపాయ లాదాయము కలదు. అయినను బొట్టపొట్టయని యేడ్చుచుండును. అధర్మ మొనర్చు సమయమునఁ బొట్టపేరును జెప్పుకొనును. ఏమయ్యా! జూదమాడకున్నను, సత్యాసత్యములు పలుకనిచోఁ బొట్ట యెట్లు నిండును? ఇదిలోకులకున్న భ్రమ. అందఱి కొసంగువాఁడు శ్రీహరి, అందఱను బోషించువాఁడాతఁడే, రాళ్లలోనున్న కప్పకును నాతఁడాహారమును జేర్చును.

ఒకదినమున లక్ష్మీదేవి భగవాను నిట్లడిగెను:— "స్వామీ! మీరందఱకును భోజనము నందించుచున్నారా?"

భగవానుఁడిట్లనెను:— "నాపనియే అందఱకు నాహారమును బెట్టుట. మృత్యువును జెందకుండిన వాఁడెచ్చటఁ గూర్చుండినను వానికి భోజనమంపెదను. ఒక చీమను జూపించుచు లక్ష్మీదేవి యిట్లనెను:— "దీనికింకను నాయుస్సు మిగిలి యున్నదా లేదా?"

భగవానుడిట్లనెను:—"అవును. ఇదియింకను చాల కాలము బ్రదుకును." లక్ష్మీదేవి దానిని వెంటనే ఒక్క-డబ్బిలో బంధించెను భగవానుడు దీనికి భోజన మెట్లు చేర్పగలడో చూతము డబ్బిని తనదగ్గరనే పెట్టుకొనెను. దానిలోనికి వాయువు పోగలదు కాని యింకేవస్తువును పోజాలదు రెండు మూడు రోజులైన తరువాత నామె యిట్లనుకొనెను:—"చీమ యిప్పటికి చచ్చియుండును" అందువలన నామె భగవంతుని తో నిట్లనెను:—"ప్రభూ! ఈచీమకు మీరు భోజనము పంపినారా?" భగవానుడు నవ్వి యిట్లనెను:—"అవును పంపితిని."

లక్ష్మీదేవి ఆశ్చర్యముతో నిట్లనెను:—"ఎట్లుపంపితిరి స్వామీ?"

భగవానుడిట్లనెను:—"గర్భమందున్న పిల్లవానికి భోజనమును గర్భమందే పంపినట్లే పంపితిని."

లక్ష్మీదేవి యిట్లనెను:—"గర్భమందలి శిశువునకు తల్లి భోజనములోని రసము నాభిలోని నాడులద్వారా లభించును ఈయేర్పాటును మీరీచీమకెట్లు చేసియుంటిరి."

భగవానుడిట్లనెను:—"చీమకును తల్లి యిదివరకే యేర్పాటుచేసినది. లక్ష్మీదేవి ఆశ్చర్యముతో డబ్బాను తెఱచి చూడగా జీమునకు రెండు బియ్యపు గింజలుండెను. వానినది ప్రేమతో దినుచుండెను. డబ్బిని మూయునప్పుడు

లక్ష్మీదేవిః పుస్తక మునందలి కుంకుమ మిశ్రిత అక్షతలు రెండు జాగ్రత్త డబ్బిలోనికి బడెనని తెలిసికొనెను. వానిని దిని జీవము బ్రతుకుచున్నది. నాస్తికుడు దీనిని సంయోగిక విషయమనియు, అకస్మాత్ ఘటనమనియుఁ బలుకును. ఆస్తికులు దీనిని దైవిక ప్రారబ్ధమందురు. నా స్వవిక విషయమేమనఁగా భగవంతుడు జీవమాత్రునకు ఆజీవిక స్వయముగ నేర్పాటును గావించును. ఇట్లగుచుండ నర్థ, కామ, యశ, ఆజీవికల కొఱకు మానవుడేల నసత్యమును జెప్పవలయును. అధర్మాచరణమేల జేయవలయును?''

శ్రీశుకదేవు డిట్లనెను :–''రాజా! బలి చక్రవర్తికి కులగురువగు శుక్రాచార్యుడు బలి చక్రవర్తి యైశ్వర్య రక్షణము కొఱకీ విధముగ గృహస్థ ధర్మమును జెప్పెను. ఈవిధముగ నాజీవిక రక్షణముకొఱకు అసత్యమును బలుకుట దోషము కాదనెను. అప్పుడా విషయమును నమ్రతతో విరోధించుచు బలి యిట్లనెను:–' స్వామీ! ప్రపంచములో మీవంటి నీతిపారదు లెవరుందురు? మీరు చెప్పినది సత్యమే, గృహస్థులు తమ అర్థము రక్షింపఁబడునట్లు వర్తింపవలయును. సాంసారిక భోగములకు వ్యాఘాతము రాఁగూడదు. యశము నక్షుణ్ణముగ నుంచవలెను. అపయశము కలుగు కార్యమును దేనిని జేయరాదు. తన ఆజీవికను గూడ యథావిధిగ రక్షింపవలెను. ఆజీవికలోనే జీవనము కలదు. అయినను నేను వామనునకు ఆతని కోరినట్లు పృథివి నొసంగెదను ''

ఉత్తేజితుఁడై శుక్రాచార్యుఁ డిట్లనెను:—ఏల నిచ్చెదవోయి? నేను వలదనుచుండగా. నామాట కేమియును విలువ లేదా?''

నమ్రతతో, కాని దృఢతా స్వరమున బలిమహారాజిట్లనెను:—విలువ యేల లేదు స్వామీ! నాసర్వస్వమును గురుదేవుని చరణములకు సమర్పింపఁ బడినది. కాని నావలన నీపాపము జరుగదు. మీయాయాజ్ఞను పాలించుటకు నేను సర్వథా అసమర్థుఁడగుదును''.

శుక్రాచార్యుఁ డిట్లనెను:— ''ఇందులో నసమర్థత విషయ మేమున్నది? నేను పృథివి నీయవల దనుట లేదు. ఈవామన వటు పాదములతోఁ గొలువనీయు రాదనియుఁ గొంచెము సంశోధింప వలయునని యుఁగోరుచున్నాను.''

బలి యిట్లనెను :— ''స్వామీ! వటు వామనుఁడు తన పాదముతో మూఁడడుగులు కొలుచుకొందునని అతఁడు గొప్పభూమికను బంధించి అడిగి నాచే నొప్పించెను.నీ యిష్టానుసారమే యిచ్చెదనని నేను దీనిఁ గీకరించితిని. ఇప్పుడిచ్చెదనని పలికి, దానినిఁ గొంత మార్పుచేసి యీయకుండుట ధూర్తతయు కపటమును, నసత్యాచరణమునగును. నేను మట్టి రూప్యములలోభముచే, వృత్తిలోభముచే నాశను జూపించి బ్రాహ్మణుని నిరాశ చేయుదునా ? అవునని కాదందునా, స్వామీ ! నేను ప్రహ్లాదుని వంశమున నుద్భవించితిని.

బ్రాహ్మణ వేషధారియగు నింద్రుని కొఱకై యుండియును ప్రాణదాన మొనర్చిన బ్రాహ్మణ భక్తుఁడుగు విశ్వ విజయుఁడునగు విరోచన నందనుఁడను. నేనెఱుఁగని స్థితిలో మూఁడడుగులు దాన మొసంగితిని. ఈ బ్రాహ్మణుఁడెవఁడైనఁ గానిండు, యీతని కోరికను నెఱవేర్చెదను. నాకు శక్తి యున్నంతవఱకు ఈతనికి దాన మొసంగెదను. అసత్యమునకు మించిన పాపమే లేదు. అన్నిటిని ధరించిన పృథివి యిట్లు చెప్పినది–ఇంతగొప్ప పర్వతములు, నదీ నదములు, వనోపవనములు, సముద్రములు, సమస్త జీవులను ధరించుటలో నాకు కష్టము లేదు గాని ఒక్క అసత్యవాదిని ధరించుట నాకు చాల కష్టము. వాని బరువుచే నేనణఁగి పోయెదను"

శుక్రాచార్యుఁ డిట్లనెను :– "నీవు మూర్ఖుఁడవు. నీ స్వార్థము నెఱుఁగవు. నీవు బ్రాహ్మణునకు పృథివి నిచ్చుటకు మాట నిచ్చితివి. ఈతఁడు బ్రాహ్మణుఁగు కాఁడుఁ అజాతిఁ ఈతనికిజాతి లేదు. ఈతఁడుచిన్న వాఁడుగాఁగనఁబడుచున్నాఁడు నిమిషములో నీతఁడు భూతమువలెఁ బెరుగును. త్రిలోకము లాక్రమించును. ఒక్క పాదముతో సమస్తాధోలోకములను గొలుచును. ఒక దానితో సమస్తోర్ధ్వలోకములను గొలుచును. రెంటి చేతనే యీసమస్తదృశ్యజగత్తును గొలుచును. అంతనాతఁడు నీశిరస్సుపై నవాంచేయును. నిన్ను బంధించి మూఁడవపాదమునకుఁ జోటును జూపించుమమును. నీవప్పు

డెచ్చటఁజూపించెదవు! నీప్రతిజ్ఞ అసత్యము కాఁగలదు. అసత్యమాడువాఁడే నరకములకేఁబోవునో వానిలో నీవు సదా యాతననుభవింపవలెను. సర్వస్వమును లాగివేయుటచే దరిద్రుఁడవయ్యెదవు. నేఁడు త్రిలోకేశ పదమునఁ బ్రతిష్ఠితుఁడవైతివి. అందఱును నిన్ను శ్రద్ధాభక్తులతో స్వాగత సత్కారము లొనర్చుచుందురు. నీవు పదచ్యుతుఁడవైనపుడు నిన్ను మంచి నీళ్ళడుగువారైన నుండరు. పరివారమువారు నిన్నవమానించెదరు. ఇంటిలోని వారు నీ విషయమడుగరు. నీవు దేవశత్రుఁడవని చంపినను జంపవచ్చును."

అంతబలి యిట్లనెను :-"బ్రాహ్మణా! నేను నాప్రతిజ్ఞను నెఱవేర్చుకొన్నను నరకమునకుఁబోవునెడల నాకు నరకమునకు బోవుట అంగీకారమే. ఈస్వర్గమును నొకవిధమగు నరకమే. బ్రాహ్మణ వంచన మొనర్పఁగోరినఁజాలను, నాకు పదచ్యుతియైనను నంగీకారమే. దరిద్రతలో దుఃఖమేమున్నది? బ్రాహ్మణుఁడు సంతుష్టిని జెంది, ఆతనికి నేనొసని మరలఁ గదనకున్నచో నేనాదరిద్రతను సంతోషపూర్వకముగ నభినందించెదను. ధర్మరక్షణ మొనర్చుచు, సత్యపాలన మొనర్చుచు నాకు మృత్యువు కలిగినను దానికి మించిన నుత్తమగతియేది కలదు! జీవితములో దాన మొనర్చుటయును, పరలోకసంబంధమగు పుణ్యకార్యము లొనర్చుట, ఇదియే జీవునకు ముఖ్య ధ్యేయము. ఈ ధన, జన, స్త్రీ,

పుత్ర, వాహనాది సమస్త సాంసారిక సుఖకర సామగ్రులు చచ్చినతరువాత మనమువశ్యమొకదినమున వదలివైచెదము వీని వియోగము అవశ్యంభావియే యగుచో దీనికొఱకై చింతింపవలసిన పని యేమున్నది? మరణకాలమున వీనిని వివశులమై వదలవలసి వచ్చినప్పుడు మనము స్వతః ప్రేమపూర్వకముగ వీనిమీది మమత్వము నేలవదలరాదు? బ్రాహ్మణుడు భగవత్స్వరూపుఁడు. జ్ఞానధారణమొనర్చువాఁడు. ఈనశ్వరధనముతోనీ బ్రాహ్మణుఁడైనను తుష్టినొందినచో నీధనమునకు దీనికి మించిన సదుపయోగమేమి కలదు?''

శుక్రాచార్యుఁడిట్లనెను .– ''నాయనా! నేనెప్పుడు కాదనినాను. నేను జెప్పునది ఈతని పాదములతోఁ గొలువవలదనియే: స్వేచ్ఛతో సప్తద్వీపములనైన సంకల్ప మొనర్పుము.''

బలియిట్లనెను :–''స్వామీ! ఇచ్చు నభిప్రాయమేమి? తీసుకొనువానికి సంతుష్టికలుగ వలయునని కాదా? ఒకానొకఁడు నీరులేక దప్పికతోఁజచ్చుచున్నాఁడు. మిమ్ము జలమడుగును. వానికి మీరు బహు మూల్యమగు సుగంధ తైలము నొసంగిన వానికేమి ప్రయోజనము? బ్రాహ్మణుఁడు దేనిచేఁదృప్తిఁ జెందునో అదియే యథార్థమగు దానము. విప్రుడు సంతోషింపని దానముచే నేమియును లాభము లేదు. అదివ్యర్థము.''

శుక్రాచార్యుఁడిట్లనెను :- "నాయనా! నీవృత్తిని రక్షించుకొనుచు దానమొనర్పవలయును."

బలి ఆవేశముతో నిట్లనెను :-"స్వామీ ! మీరు వృత్తి వృత్తి యనుచున్నారు. వృత్తినొసంగువాఁడు శ్రీహరి. సత్యము ముందు వృత్తియేమిలెక్క? దధీచి మహాముని దేవతలకుఁగాఁదన శరీరము నొసగెను. శిబిచక్రవర్తి ఒక పక్షిరక్షణము కొఱకు తన మాంసమును స్వయముగ కోసి యిచ్చెను. ఈ ధర్మాత్ములు సత్యము కొఱకు ప్రాణములను త్యజించుటకైనను వెనుకాడక పరోపకారముకొఱకే సాధు జనులు తమదు స్వజప్రాణములను గూడ నర్పించియుండ, భూమినిచ్చువిషయములో వెనుకాడు టేమిటి?"

శుక్రాచార్యుఁడిట్లనెను :- "సివిక్రమునికి సర్వస్వము నొసంగినచో నీవద్దనేమి మిగులఁగలదు?"

బలపూర్వకముగ బలి యిట్లనెను :- "స్వామీ! ప్రళయ పర్యంతము నాశము కాని యశస్సు నాకు శేషించును నా ప్రపితామహులును, ఇతరరాజులును దమ బాహుబలముచే నేయే భూఖండములను, నేయే లోకములను జయించిరో వానిని గాలము గ్రసించినది; కాని వారికీర్తి యిప్పటి వఱకట్లే అక్షుణ్ణముగనున్నది. కావున స్వామీ! నేనీ తుచ్ఛ పృథివికొఱకై వ్యాపించిన కీర్తినిఁ గాలదన్నను. అపయశమును బొందను."

శుక్రాచార్యుఁడిట్లనెను :- "యశమును సంపాదించుట కిరకను సాధనములున్నవి. అవేమనఁగా తాను సంపాదించి కూడబెట్టిన ధనమును వ్యర్థముగ నెవరికైనఁదీసి అవసరమునకు మించి యిచ్చిన నీయవచ్చును."

బలి యిట్లనెను :- "స్వామీ! యశమును సంపాదించుటకనేక యితర సాధనలు కలవు. యుద్ధమునందు వీఁపును జూపింపకుండుటయును, శత్రు సమ్ముఖమున యుద్ధమొనర్చుటయును, గ్రంథములు వ్రాయుటయును, ఉపన్యాసము లిచ్చుటయును, కళలను ప్రదర్శించుటయును, నివి యన్నియును నవశ్యము యశోపార్జనసాధనములు, కాని సత్పాత్ర లభించినప్పుడు తన ప్రాణములకంటెఁ బ్రియముగ, స్వార్జితధనమును శ్రద్ధాపూర్వకముగ దానమొనర్చువాఁడు ప్రపంచమందు దుర్లభమానవుఁడు. సత్పాత్రకు దానమిచ్చుటకంటె మించిన పుణ్యమేమియును లేదు. కావున నే నీ వామనవటువున కాతని యిచ్ఛానుసారముగ నాతఁడడిగినంత భూమి నవశ్య మొసంగెదను."

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా! బలిచక్రవర్తి యేవిధముగను వినకపోఁగా శుక్రాచార్యుఁడు మరల నంతిమ ప్రయత్నమునొనర్చెను."

బలి ఉదారత్వము

(౧౬౮)

శ్లో॥ యజంతి యజ్ఞక్రతుభిర్యమాదృతా
భవంత ఆమ్నాయ విధాన కోవిదాః।
స ఏవ విష్ణుర్వరదోఽస్తు వా పరో
దాస్యామ్యముష్మై క్షితిమీప్సితాం మునే॥

—శ్రీ భాగ. ౮ స్కం. ౨౦ అ. ౧౧ శ్లో॥

శా॥ ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ దనువుపై నంసోత్తరీ
యంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ బాలిండ్లపై
నూత్న మ
ర్యాదం జెందుకరంబు గ్రిందగుట మీఁదై నాకరంబుంట
మేల్
గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు
నాపాయమే॥

మ॥ నిరయంబైన నిబంధమైన ధరణీ నిర్మూలనంబైన దు
ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ రానిమ్ము
కానిమ్ము పో
హరుఁడైనన్ హరియైన నీరజభవుం డభ్యా
గతుండైన నాఁ
దిరుగన్ నేరదు నాదుజిహ్వ వినుమా ధీవర్య
వేయేటికిన్॥

—శ్రీమదాంధ్రభాగవతము.

పరోపకారమునకొఱకు ప్రాప్తించిన కష్టమును, యుద్ధక్షేత్రమందు సమ్ముఖమునఁ బోరాడు శస్త్రముద్వారా తెగిలిన గాయమును సురత కారణమునఁ గలిగిన శిథిలతయు, ప్రేమ, హర్షములవలన వచ్చిన అశ్రువులును. అత్తవారింట తగిలిన చీవాట్లును, పుత్రప్రసవ జన్యపీడయుచు, దానము వలనఁ గలిగిన దరిద్రతయును, ఇవి అందఱును జూచుటకు దుఃఖముగఁ గనబడినను వాస్తవముగ సుఖము నిచ్చునవే యగును. అట్లే యెవరికైనఁ గారాగృహవాసము లభించినచో అతని నందఱును నిందించెదరు. తనకును గ్లాని కలుగును. దుఃఖితుఁడగును, కాని దేశసేవా నిమిత్తమును, బరోపకార మొనర్చుచును గారాగృహవాసమును, నింకొక కష్టమును సహింపవలసి వచ్చినచో హృదయమునకు గొప్ప సంతోషము కలుగును. ప్రపంచములో వానికి గౌరవము కలుగును. ఆ కష్టములచే నొకవిధమగు నాత్మతుష్టి లభించును. ఒక ముల్లు గ్రుచ్చుకొనిన నెంతో కష్టము కలుగును. కాని యుద్ధక్షేత్రమందు శరీరము క్షతవిక్షతమైనపుడు శరీరమంతయును నుత్సాహముతో నిండి, ఆ ప్రహారములను గౌరవముతో సహించును. వాని వలన నిజమగు శూరవీరునకు, గొంచమైనను కష్టము కలుగదు. ఇంతేకాదు, వాని రక్తమును గాంచిన నాతని యుత్సాహ మినుమడించును. ఇదే విధముగ దరిద్రత అన్నిటికంటె మిక్కిలి దుఃఖకరముగ

నెన్నఁబడినప్పటికిని దారిద్ర్యమున నడుగిడుగునకును నసౌకర్యముల నెదుర్కొన వలసివచ్చును. అంతయు నాతనిఁదిరస్కరించెదరు. ఆతనికిని దన జీవితము భారముగఁ దోఁచును; కాని దాన మొసంగి దరిద్రుఁడైన వానికొక విధమగు నాత్మసంతోష ముండును. 'మనము ధనమును దురుపయోగమొనర్పలేదే, చెడ్డ కార్యములకు వ్యయమొనర్పలేదే' అని తృప్తినిఁ జెందును ఆ దరిద్రతలో గౌరవము కలదు. ధీరుఁడును, వీరుఁడును, దాతయును, స్వాత్మాభిమానియు నగు వాఁడు దారిద్ర్యమును సహర్షముగ స్వాగత మొసఁగును. దానినిఁ బొందుట తాను గౌరవాన్వితుఁడ ననుకొనును.

శ్రీశుకదేవుఁ డిట్లనెను:—'రాజా! శుక్రాచార్యుఁడు మాటిమాటికిని నీవటువగు వామనుఁడు విశ్వపతియగు విష్ణువనియు, వాని సర్వస్వమును నపహరించి తనను దరిద్రునిఁగా నొనర్చుననియు బలికి చెప్పఁగా మనస్వియగు బలిచక్రవర్తి యిట్లనెను :— 'గురువరా! ఏ దాతయైనను నొసంగినచో నాతఁడు స్వేచ్ఛచేనియుఁడు ఆశఁదొసంగుటకు వివశుఁడగును, ఎవరైన దుఃఖితులుగను, దరిద్రులుగను నున్నచో గాంచిన మనస్సులోఁ గరుణ యుత్పన్నమగును. ఇవ్వకున్నఁ జిత్తమునకు విచిత్రదశ కలుగును. హృదయమం దొక ప్రబల అసంతోషము కలుగును, మనము వానికేదో కొంచెమొసంగి, వాని ముఖము ప్రశన్నమగుటను గాంచినచో మన

కొక విధమగు నాంతరిక సుఖానుభవము కలుగును. మనస్సులో సంతోషము కలుగును. కావున యథార్థమగు దాత యితరుల కొఱకు దానమీయఁడు. తన సంతోషము కొఱకు దానమొసంగును. మనమెవర మొసంగుటకు, అందఱ కిచ్చువాఁడు భగవంతుఁడు. మనము నిమిత్త మాత్రులము ఆ ప్రభువు సమ్ముఖమున మనమును భిక్షుకులమే.' యని భావించును.

అంత శౌనకుఁడిట్లడిగెను :- "సూతా! దాత కొసంటనే సుఖమున్నచోఁ జాలమందిలోఁ గొందరకొసంగును, కొందఱకుఁ గాదనును. చాలమంది యెక్కువగ నడిగినను, నసమయమున నడిగినను భిక్షుకులను గసరుకొందురే దీనికిఁ గారణమేమి?"

సూతుఁడిట్లనెను :- "స్వామీ! వారు యథార్థమగు దాతలుకారు వారభిమానులు. మాదగ్గఱ ధనమున్నది. ఇందులోఁ గొంతధనమును నాశ్రితులకు దరిద్రుల కొసంగెదమను నభిమానముండును. తమకు పేరు రావలయునని పదిచోట్లను జెప్పుకొందురు మేమాతనికి సహాయ మొనర్చుచున్నాము, దీనికిచ్చుచున్నాము. వానిదుఃఖమును దూరమొనర్చితిమి." ఇట్లు చెప్పుకొనువాఁడు దాతకాఁడు. తన ధనమునకు విజ్ఞాపనమే ఇది తామసదానము. దీనినసద్దానమందురు. వీనికీలోకమునను బరలోకమునను ఫలము మిగులదు. నేను వీని

కిచ్చుచున్నాను, వీనికి సహాయము నొనర్చుచున్నానను నభిమానము దాతకు లేకుండుటే యథార్థ దాతయొక్క లక్షణము. దాతకు తాను దానము చేయునది భగవంతుని వస్తువనియు, భగవంతుండే తనచే నొక రూపమున నిప్పించుచున్నాఁడనియు, నాతఁడే అనేక రూపములను ధరించి చేతులను జాచి కైకొనుచున్నాఁడనియు భావింపవలయును. ఈ విషయమున నొక దృష్టాంతమును వినుఁడు

ఒక చాల గొప్పదాత యగు శెట్టికలఁడు ఆతని యింటికి తొమ్మిది ద్వారములు కలవు. పదవ ద్వారము కూడ యింకొకటి కలదు. సమస్త ద్వారములందు జాలమంది భిక్షుకులు కూర్చుండి యుండెదరు. ఆతఁడు క్రమముగ నన్ని ద్వారములలోనను బోయి అందఱికన్న దాన మొనర్చును. ఆతనికి గొప్పపేరు వచ్చెను. ఆతని కీర్తి స్వర్గమువఱకు వ్యాపించెను ఒకనాఁడు భగవంతుడు వృద్ధబ్రాహ్మణ వేషమును ధరించి వాని దానమును బరీక్షింప వచ్చెను. భిక్షుకులలోఁ జాలమంది వాచాలురుందురు. అసాధ్యులు దురు. వారధికముగ వాగుచుందురు దాతనత్యధికముగ బ్రశంసించుచుందురు ఇతర భిక్షుకులను గసరి భయపెట్టి యందఱికంటె ముందుకు వత్తురు. అట్లే యీ వృద్ధబ్రాహ్మణుఁడుండెను. భిక్షుకులలో కూర్చుండి యిట్లు పలికెను :- "మీరు గొప్పదాతలు. కుబేరునకు మించినవారు. కర్ణసదృశులు.

హరిశ్చంద్రుని వంటివారు” శెట్టిగారు మొదటి ద్వారము వద్దకు పంచుటకు వచ్చెను. ఈ బ్రాహ్మణుఁడందఱికంటె ముందుగాఁ జేరుకొనెను. తలవంచుకొని శెట్టిగారతనికి దాన మొసంగెను. ఈ ద్వారమునందఱకు నొసంగి శెట్టిగారు రెండవ ద్వారముకడకు పోయి భిక్షులకు దానమీయఁబోఁగా నచ్చటను వారిలోఁ గూడ ముందుగా నీబ్రాహ్మణుఁ డందఱికంటె ముందుండెను ఇట్లే తొమ్మిది ద్వారముల కడకును జేరుకొనెను. శెట్టిగారు తలవంచుకుని యిచ్చుచునే యుండెను. అతఁడీతని వైపునకు జూడనులేదు. నీవు ఆశపోతువు తొమ్మిది ద్వారముల కడకు వచ్చి తీసికొనుచుంటివను అనను లేదు పదివ ద్వారమెప్పుడోగాని తెఱవబడదు అచ్చటికెన్నఁడును నేభిక్షుకుఁడును బోనేపోఁడు. నేఁడు పదవ ద్వారమును దెఱువబడెను. ఆ విచిత్ర భిక్షుకుఁ డచ్చటను నిలుచుండెను. శెట్టిగారు తలవంచుకొని అచ్చటను దాన మొసంగెను. అప్పుడాయద్భుత భిక్షుకుఁ డిట్లనెను :— “శెట్టిగారు! నేను మిమ్మొక విషయమడుగఁ దలచుచున్నాను.”

తలవంచుకొనియే శెట్టిగారు చేతులను జోడించుకొని యిట్లనెను :— “సరే స్వామీ! అడుగుఁడు అప్పుడావృద్ధ భిక్షుక బ్రాహ్మణు డిట్లనెను :—

గీ॥ కేలు జాచితి పదియువా - కిండ్లలోన
పలుక లేదొక్క కఠినపు - పలుకునైన

నడుగుచుంటిని చెప్పఁడో - యనుఁగు సఖుఁడ
క్రింద చూపున నుంట ని - వెందు కొఱకు॥

తలవంచుకొని దానము చేయుచున్నా వెందుల కయ్యా!

అప్పుడు కన్నుల నీరునింపుకొని శెట్టి యిట్లుల నెను - స్వామీ! ఒక్కొక్క జలకణమునకును, వాయువు కొఱకును బరముగా పేక్షియగు వాఁడితరులకు దాన మేమీయఁ గలఁడు! తన కష్టములను దాను నివారించుకొనఁజాలని వాఁడితరుల దుఃఖముల నెట్లు దూరము చేయ గలఁడు? అంద ఱకును నిచ్చువాఁడును నిప్పించు వాఁడును నా శ్రీహరియే ఆతఁడే సదాసర్వదా అందఱకును నొసగును. ఆతఁడే అంద ఱను బాలించుచుండ వీరందఱును భ్రమవశమున నన్ను దాతగా భావించి నాయెదుటనే యిట్లందురు. "శెట్టిగారు గొప్ప దాతలు. చాల దానముల నొసర్చెదరు, అందఱి దుఃఖము లను దూర మొనర్చెదరు." స్వామీ! ఈ మృషావాక్యము లను వినివిని లజ్జాకారణమున నేను తలను బైకియెత్తుట లేదు. నాకు భగవంతుఁడు గుమాస్తా పని నొప్పగించినాఁడు దాత ఆ దీనబంధువే. ఆతఁడు నాచే నిప్పించుచున్నాఁడు."

ఇది వినగానే భగవానుఁడు "తన మాయవేషమును త్యజించి, చతుర్భుజ రూపమున బ్రకటమై తన దేవదుర్లభ మగు దర్శన మొసంగి కృతార్థుఁ గావించెను."

సూతుఁ డిట్లనెను :- "మునులారా ! యథార్థముగు దాత యిట్లే యుండును. భిక్షుకులపైఁ దన దానము యొక్కయు, నుదారత యొక్కయును భారమును వైచుచు, మాటిమాటికినిఁ దాను సంపన్నుఁడనని చెప్పుకొనుచు నితరులను దుచ్ఛులుగా భావించు చుండువారు దాతలు కారు మహామనస్వియగు బలిచక్రవర్తి యథార్థముగ నిజమైన దాత. అందువలననే ఆతఁడు గురువు వద్దనుచున్నను దానమొసంగుటకు సిద్ధపడెను. ఆతఁడు గురువుతో నిట్లనెను :- "స్వామీ ! సాధారణ యాచకుల యాచనను బూర్తి యొనర్చుటచే. బ్రాప్తించిన దుర్గతియు కల్యాణకారిణియగును. అట్టియెడ మీవంటి బ్రహ్మవేత్తలు యాచకులై వచ్చిన వారికిసర్వస్వము నుదానభిక్షుఁడైనచో వానిని మించిన భాగ్యవంతుఁడు విశ్వమందెవఁడుండఁగలఁడు? కావున స్వామీ ! నాకు గురుజ్ఞోల్లంఘన పాపము సంభవించినను నేనీవటువగు వామనునకు ఆతఁడు కోరిన వస్తువు నవశ్య మొసంగెదను. సంకల్పపూర్వకముగ నొసంగెదను. హఠముగ నొసంగెదను. నేను వినను. ఈయకుండిన నాకు సుఖములేదు శాంతిలేదు. యాచకుల యాచనను నేను వస్తువున్నంత వఱకు కాదనఁ జాలను ఇది నా స్వాభావిక ప్రవృత్తి. ఇచ్చిన నేను నరకమునకు వెళ్ళవలసి వచ్చినచో సహర్షముగ నంగీకరించెదను"

అంత శౌనకుఁడిట్లడిగెను :- "సూతా! దానపుణ్యములను జనులు తమ సుఖముకొఱకు చేయుచుందురు. ఈ కార్యమువలన మాకు సుఖము కావలయును స్వర్గప్రాప్తి కలుగవలెననుటయే దానఫలము. బలిచక్రవర్తి దానమొసంగియు సహర్షముగ నరకయాతనను సహించుటకేల సిద్ధపడెను"

అంత సూతుఁడిట్లనెను :-"స్వామీ స్వర్గాపేక్షచే సకామదానపుణ్యములొనర్చుటను శాస్త్రకారులుత్తమ మార్గముగఁ జెప్పలేదు. దీనిని కైతవధర్మమనిరి ధర్మమును నిష్కామముగ నొనర్చుట శ్రేష్ఠము. సురాపానమొనర్చువాఁడు సారాయినిఁ ద్రాగకున్న నెట్లు వ్యాకులతను జెందునో, అతనికి సారాయి దొఱకనంతవఱకెట్లు శాంతితో నుండునో అదేవిధముగ స్వాభావిక దాతలును, ధర్మాత్ములును దానముచేయకున్న నశాంతినిఁబొందెదరు. వారు సాంసారిక కామనచే దానధర్మములొనర్పరు వారికి దానధర్మములు లేకుండఁజాలరు, సత్యము పలుకకుండ జాలరు. వారి ప్రకృతి అట్లు మారిపోవును ఈవిషయమున నేనొక అతిప్రాచీనమైన పౌరాణిక ఉపాఖ్యానమును జెప్పెదన. మీరు శ్రద్ధతో వినుఁడు.

ప్రాచీనకాలమందు ఉశీనరపుత్రుఁడును, బరమధార్మికుఁడును రాజర్షియునగు శిబియుండెను. శిబి సంతతి దాతలును,

ధర్మాత్ములును, సత్యప్రతిజ్ఞులును విరళముగనుందురు ఆతని క్షమ ప్రపంచమందు సర్వత్ర ప్రసిద్ధమైనది దాని ననుకరించుట నట్లుంచుండు, ఆతని కర్మలమీఁద లోకులకు విశ్వాసము కలుగుటయును గఠినమే. క్షమలో నాతఁడు పృథివిని మించెను. ఋషులారా! ఒకరోజున జరిగినవిషయమేమనఁగా- శిబిచక్రవర్తి కడకొక బ్రాహ్మణుఁడువచ్చి భోజనమును యాచించెను ఆ బ్రాహ్మణుఁడఘోరివేషమును ధరించెను.

రాజు పరమధార్మికుఁడు. కల్పవృక్షమువలె నందఱి కోరికలను నెఱవేర్చుచుండును. ఆఁకలిఁగొన్నవానికి భోజనమొసంగుట పరమధర్మము. కావున శీఘ్రముగ నిట్లనెను:- "స్వామీ! ఆజ్ఞయిండు. నేను మీకొఱకెట్టి భోజనమును దేవలయును?"

ఆ యఘోరి విప్రుఁ డిట్లనెను :- "రాజా! నేను నరమాంసమును దినెదను అదియును వధశాలలో వధించిన పురుషునిఁగాదు. కులీనపురుషుని మాంసము నాకిష్టము. నీవు నీ యేకైకపుత్రుఁడగు బృహద్గర్భునియొక్క మాంసమును స్వయముగ వండి నాకుఁ బెట్టినచోఁ దృప్తికలుగును."

రాజత్యంతోల్లాసముతో నిట్లనెను :- "స్వామీ! నా పుత్రుని శరీరము పరోపకారమునకు వినియోగపడుట నాకును నాపుత్రుఁడగు బృహద్గర్భునకును బరమ సౌభాగ్యము. మీరు కూర్చుండుఁడు. మీకోరికను నెఱ

వేర్చెదను.'' ఇట్లు పలికి రాజు కుమారునిఁబిలిచి, వానిని స్వయముగఁజంపి, వాని మాంసమును వండుచుండెను. ఆ యఘోరీబ్రాహ్మణుఁడు బయటఁగూర్చుండి ప్రతీక్ష చేయుచుండెను. రాజు భోజనమును దెచ్చినప్పటికి విలంబము కాఁగా నాతఁడత్యంత కుపితుఁడయ్యెను. అతఁడు నగరము లోనికిఁబోయి రాజమహలున కగ్నిని ముట్టించెను అతని నివాసస్థానమును గాల్చి అత్యానందమును బొందుచుండెను.

శిబిచక్రవర్తి తన ప్రియపుత్రుని మాంసమును వండి, తన శిరస్సునఁ బెట్టుకొని ఆబ్రాహ్మణుని కొఱకై తెచ్చెను. సేవకులందఱును నేడ్చుచు పల్లనిరి :-'మహారాజా! భోజనమును దెచ్చుటలో నాలస్యమైనందులకుఁ గుపితుఁడై మీ మహలున కగ్నిఁబెట్టిన నిట్టి బ్రాహ్మణుఁ డు మీకెచ్చటి నుండి వచ్చినాఁడు?' ఇది విన్నప్పటికిని రాజు ముఖమునందు రోష, దుఃఖచిహ్నములేవియును గనఁబడలేదు. అతఁడు సరిగా నా కుపిత బ్రాహ్మణుని వద్దకుపోయి యిట్లనెను.- ''స్వామీ! భోజనము సిద్ధముగనున్నది నాకాలస్యమైనది మీకు కష్టముకలిగినందుకై నేను మాటిమాటికిని క్షమాపణమును వేఁడుచున్నాను మీరు ప్రసన్నులరై యిష్టానుసారము భోజనము నొనర్పుఁడు.''

రాజు నమ్రతను గాంచఁగానే బ్రాహ్మణునిపైన నూఱు కడవల జలము పడినట్లయ్యెను. సిగ్గుచే నాతఁడు

శిరస్సును వంచుకొనెను. అయినను నాతఁడు రాజుయొక్క క్షమను బరీక్షించుటకై యిట్లనెను :- "నీవే యీ మాంసమును దినుము"

ఇది విని మహారాజు సుముఖుఁడైనను విచలితుఁడు కాలేదు. అతఁడు వస్త్రమును దీసి పుత్రుని మాంసమును దినుటకుద్యుక్తుఁడగు నప్పటికి బ్రాహ్మణుఁ డాతని చేతిని బట్టుకొనెను. రాజాశ్చర్యమునకు మేర లేకుండెను ఏరాజకుమారుని నాతఁడు చంపినాఁడో ఆతఁడు వస్త్రాలంకారములతో సుసజ్జితుఁడై రాజు వైపునకు నవ్వుచుఁ బరుగెత్తుకొని వచ్చుచుండెను రాజు కడకు వచ్చి ఆతఁడాతనిఁ గౌగిలించుకొనెను. బ్రాహ్మణుఁడు తన చద్మవేషమును ద్యజించెను. ఆబ్రాహ్మణుఁ డెవరో కాదు. లోక పితామహుఁడగు బ్రహ్మ రాజుయొక్క ఓర్పును బరీక్షించుటకై వచ్చియుండెను. ఆతఁడుక్షణములో నచ్చటనే అంతర్ధానమయ్యెను. రాజు తన పుత్రునితో సభలోనికి వచ్చెను సభాసదులందఱును మహారాజుయొక్క యీ క్షమను, సహనశీలతను గాంచి పరమ విస్మితులైరి

సభాసదులు రాజు నిట్లడిగిరి —"ప్రభూ! మీరత్యంత దుష్కర కర్మము నొనర్చితిరి. మీరీకార్యము నేకోరికతోఁ జేసితిరో. యెటువంటి గోరుమున్నాము? స్వర్గ ప్రాప్తికొఱకై చేసితిరా? [illegible]

ఇది విని రాజిట్లనెను:—"సోదరులారా! నేను దానమును, యశము, ఐశ్వర్యము మఱి యితర వస్తు ప్రాప్తికొఱకు చేయుటలేదు సత్పురుషులు సదా దానమొనర్చుచుండిరి, దానమును ప్రశంసించుచుండిరి. ఈదానమును నాచారము పుణ్యాత్ములగు వారు ప్రారంభించిరి. సజ్జనులు దాని ననుకరింపవలయును ఈభావనతో నేనుసదా దానము నొసంగుచున్నాను సదా సత్పురుషులు నడుచుచు వచ్చుచున్న మార్గమే శ్రేష్ఠమగు మార్గము కావున నేనామార్గమునే నిష్కామ భావముతో ననుసరించుచున్నాను. దానమీయవలయును గావున నేను దానమొసంగుచున్నాను. నేనీయకుండ జాలను," ఇది విని సభాసదులందఱును బరమ విస్మితులైరి.

సూతుఁడిట్లనెను —"మునులారా! ఇట్టివాఁడే యథార్థమగు దాత. బలిచక్రవర్తి అట్టి దాతలలో నొకఁడు. భగవానుఁ డాతని గుణ ఖ్యాతిని వ్యాపింపఁజేయుటకై వామన వేషమును ధరించినాఁడు

శుక్రాచార్యునకు స్పష్ట శబ్దములతో బలిచక్రవర్తి యీవామనునకు పృథివినిఁ దప్పక యిచ్చెదను, మీమాటను వినవని చెప్పఁగా శుక్రాచార్యుఁడు కుపితుఁడై యిట్లనెను:— "ఎబుద్ధి భ్రష్టమైనది. నీవు పతనమొందఁ దలఁచుకొనుచున్నావు. నన్ను విశ్వసింపకున్నావు. గురువచనములను విశ్వసించని వాని

కథః పతన మనివార్యమగును. ఈతఁడు బ్రాహ్మణుఁడు కాఁడు సాక్షాద్విష్ణువని నేను మాట మాటికిని జెప్పు చున్నాను.''

బలి నమ్రతా పూర్వకముగ నిట్లనెను:—''స్వామీ! ఈతఁడు విష్ణు వనియు, వేషమును మార్చుకొని వచ్చినాఁడ నియును, నన్ను మోసగించుటకు వచ్చినాఁడనియును నేనంగీక రించెదను. నన్నేమి మోసగింపఁ గలఁడు. తానే మోస గింపఁ బడఁ గలఁడు. వేదవాదులగు మీవంటి బ్రాహ్మణులు సమస్త యజ్ఞయాగాదుల నీతని నుద్దేశించియే చేయుచుం దురు. సమస్త యజ్ఞములద్వారా యీతనినే పూజించుచుం దురు. ఈతనికే బలి యిచ్చుచుందురు. నాకు రెండుచేతుల లోను లడ్డు కలవు. ఈతఁడు సుయోగ్య బ్రాహ్మణుఁడగుచో నాకు దాన పుణ్యము కలుగును ఈతఁడు విష్ణువే యగుచో నాసర్వస్వమును విష్ణువున కర్పణ మగును. తన పులగపు పళ్లెరమందు పొరపాటున నేయి జారి పడిపోయిన నదినష్ట మైన దనిన నెవరును నంగీకరింపరు ఈతఁడు నన్ను బంధిం చునని మీరను చున్నారు బంధించిన బధింప నిండు. ఈతఁడు బ్రాహ్మణవేషమును ధరించియున్నాఁడు బ్రాహ్మ ణుఁడవధ్యుఁడని శాస్త్రములు చెప్పుచున్నవి ఈతఁడు బంధించినను నేనీతనిఁ జంపను ఈతఁడు తన ధర్మమును వీడఁడు. ఈతఁడు వదలినను నేను వీడను ఈతఁడు తనద్విజ

వేషమును వదలి దేవ రూపమున నాతో యుద్ధమొనర్చి నచో నేనును జేతులు కలిపెదను లేకున్న స్వయముగఁజచ్చి పోయెదను లేదా యీతనిని యమపురమునకుఁ బంపెదను ఈతఁడు సర్వసమర్థుఁడై నేనితని చేతిలో గెలువక నితఁడు నన్ను యుద్ధమున జయించి త్రిలోకములను గైకొనఁగలఁడు నేనితని కోరికను బూర్తిగావింపలేక, ఈతఁడు నన్నుఁజంపి నను నేను పలుకున దేమియును లేదు ఈతఁడువిష్ణువు కాక అన్యుఁడెవఁడైనను నాతో యుద్ధమొనర్చుచో దాని ఫల మీతఁడనుభవింపఁగలఁడు. సారాంశ మేమనఁగా నేనేది చెప్పుచున్నానో దాని కొఱకు అడుగైనను వెనుకకు దగ్గను ఈతని పాదములతోడనే యీతనికి మూఁడడుగుల పృథివి నొసంగెదను.

శ్రీశుక దేవుఁడిట్లనెను:—"రాజా! ఇట్లుపలికి బలిచక్ర వర్తి మెదలకుండెను"

బలిని శుక్రాచార్యుఁడు శపించుట.

౫౬

శ్లో॥ దృఢం పండిత మాన్యజ్ఞః స్తబ్ధో స్యస్మ దుపేక్షయా।
మచ్ఛాసనాతిగో యస్త్వ మచిరాద్భ్రశ్యసే శ్రియః॥

—శ్రీభాగ. ౮స్కం ౨౦అ. ౨౧శ్లో॥

వ. అనియిట్లు సత్యపదవీ ప్రమాణ తత్పరుండును వితరణ కుతూహల సత్వరుండును విమల యశస్కుండును దృఢ మనస్కుండును నియత సత్యసంధుండును నర్థిజన కమల బంధుండును నైన బలింజూచి శుక్రుండు గోపించి మదీయ శాసనం బతిక్రమించితివి. గావున శీఘ్రకాలంబునం బద భ్రష్టుండవు గమ్మని శాపంబిచ్చె॥

— శ్రీమదాంధ్రభాగవతము.

ధర్మపథము గొప్ప కంటకాకీర్ణమైనది. ఎవఁడెంత శుద్ధుఁడుగా నుండునో వానికంతటి పరీక్ష జరుగును. బంగారము మాటిమాటికినిఁ గాల్పఁబడును. కాల్చుటచే దానికి హాని కలుగకుసరిగదా, ఇంకను నుజ్జ్వలమగును. శ్రేయః కార్యములకుఁ జాలవిఘ్నములు కలుగుచుండును, కాని ధైర్యవంతుఁడగువాఁడు వానిని ధైర్యముతో సహించును. ఆపత్తులు వచ్చిన భయపడువాఁడు ధీరుఁడు కాఁడు, వీరుఁడు కాఁడు, దృఢ ప్రతిజ్ఞుఁడు కాఁడు. విఘ్నపర్వతములు మీఁదఁబడినను, తనవారు పరాయివారైనను, మిత్రులు శత్రులైనను ధీరపురుషుఁడడుగు వెనుకకు వేయఁడు. తనసత్యప్రతిజ్ఞనుండి విచలితుఁడు కాఁడు. చూచుటకాతఁడు నిర్ధనుఁడగును. కాని వాస్తవమున నాతని ధనము నశ్వరము కాక అవినాశియగును. వారమరత్వమును ప్రాప్తించెదరు.

శ్రీ శుకదేవుఁ డిట్లనెను:—"రాజా! ప్రపంచమందు భవిష్యత్తు చాల ప్రబలమైనది. భవితవ్యతయే సాగిపోవును; మానవుఁ డొకటి తలంచిన దాని ఫలము విపరీతమగును. నృగమహారాజు దానమును స్వర్గము కొఱకొనర్చెను. కాని యూసరవిల్లి కావలసివచ్చినది అదే విధముగ బలియొక్క సేవా శుశ్రూషలచేఁ బ్రసన్నుఁడై అసురాచార్యుఁడగు భార్గవుఁ డాతని శాశ్వతముగ నిరంద్రునిఁగాఁ జేయఁ దలంచెను కాని భవితవ్యతా కారణమున నాతఁడు కోపించి ఆతనికి శాపమొసంగ నుద్యుక్తుఁడయ్యెను"

బలిని బదచ్యుతునిఁగావించుటకు వేఱొక యుపాయమే లేదని భగవానుఁడు దేవతలతోఁ దెలిపెనని చెప్పియుంటిని. ఆతఁడు తన సేవలచే శుక్రాచార్యునిఁ దన వశము చేసికొని యుండెను. ఆతఁడే కోపించి వానికి శాపమొసంగఁగా నప్పుడతఁడు శ్రీహీనుఁడు కాఁగలఁడు. ఆతని నెదురొడ్డుటకుఁ కెవరికిని శక్తి చాలదు. ఇప్పుడదే సమయము వచ్చెను. అన్ని విధముల నచ్చఁజెప్పి, బుజ్జగించి, అదలించి, బెదిరించి, కసరి ప్రేమించి, కోపగించి శుక్రాచార్యుఁడు హితమును జెప్పఁగా, బలి తన ప్రతిజ్ఞయందే దృఢముగ నుండుటను గాంచి భవితవ్యతా వశమున శుక్రాచార్యునకుఁ గోపము వచ్చెను; క్రోధోద్రిక్తుఁడై సత్యపరాయణుఁడును, మహాత్ముఁడును నగు బలి చక్రవర్తికి శాపము నొసంగుచు నిట్లనెను:

"ఓరీ! నీవు మిక్కిలి మూర్ఖుడవు. నీవు నేనే గొప్ప పండితుడనని తలంచుచున్నావు. కాని నీ కిసుమంతైనను బుద్ధిలేదు. నీ స్వార్థముచే నీ వెటులో జాలమున్నావు. పైగా నన్నే అసత్యవాదిగా నెంచితివి. నన్నవహేళన మొనర్చుచున్నావు. నా యాజ్ఞను మన్నించుటలేదు. పొమ్ము, నీవల్పకాలములోననే యైశ్వర్య భ్రష్టుడవయ్యెదవుగాక!"

బలి చక్రవర్తి కది అన్నిటికంటె గొప్ప విపత్తు. అతనికి ప్రాప్తించినది గురుకృప చేతనే ప్రాప్తించినది. అతనిని బ్రహ్మని జేసి కొనిరమె అతడు శాశ్వతముగ నింద్రుడుగా నుండెను. అతడే నేడాతని దౌర్భాగ్యముచే నాటికైశ్వర్య భ్రష్టుడగునట్లు శాప మొసంగుచున్నాడు. ఇది కాలము యొక్క క్రూర గతికి ప్రత్యక్షోదాహరణము, కాని అతడు మహా మనస్వి, సత్యమునందాతనికి చంచలము గాని నాస్థ కలదు. గురు శాపమును వినియు నాతడు ప్రతిజ్ఞనే విచలితుడు కాలేదు. అతడు వామనునకు భూమి నొసంగు పట్టుదలను వీడలేదు.

సతీ సాధ్వి, పతివ్రతయగు బలి చక్రవర్తి భార్య వింధ్యావళి తన నాథుడొక సుపాత్రునకు దానమొసంగ, దలంచుచున్నాడనియు, గురువు దీనికి వ్యతిరేకించుచున్నా, డనియుం దెలిసికొని ఆమె సిగ్గుతో, గొంచెముగ ముసుగును వైచుకొని రాజు సమీపమునకు వచ్చెను. నిండు సభలో

నామె మాట్లాడఁజాలకుండెను. అందువలన నామె సువర్ణ కలశమున శుద్ధ పవిత్రజలమును గైకొని సిద్ధపడెను. ఆమె అత్యంత కోమల వచనములతోఁ దన తన పతితోఁ నిట్లనెను :—"దేవా! ఈ వటువామనుని పంకజదళ సదృశములగు, పునీతపాదములను ప్రక్షాళనము గావించి పృథివీదాన పుణ్య ప్రతిజ్ఞను పూర్ణము కావింపుఁడు. బ్రహ్మచారికాతని యిచ్ఛానుసారముగ భూమి దానము నొనర్పుఁడు."

నేఁడీ సంకట సమయమునఁ దన ప్రాణప్రియ తోడుండుటను గాంచి బలి హర్షమునకు మేఱలేకుండెను. విపత్తులోఁ దోడుపడినవారే బంధువులు, స్వజనులు, ఆత్మీయులునుఁ సాధారణముగ నైశ్వర్యమున్నంత వఱకే తన పరివారము వారు చేరుచుందురు. ఐశ్వర్యహీనులుఁ కాఁగానే అందఱును బరిత్యజించెదరు. నన్ను నాగురుదేవుఁడు త్యజించినాఁడు. బంధు బాంధవులందఱును విముఖులైనారు; కాని నా జీవన సంగిని నాకు తోడుగ నున్నది. అందువలన మిక్కిలి హర్షము తోడను నుల్లాసముతోడను నాతఁడత్యంతానందముతో స్వయముగ నా వామనవటువు యొక్క శ్రీసంపన్న చరణయుగళమును గడిగి, ఆ త్రైలోక్యపావన పాదోదకమును దనమస్తకమున ధరించెను. అది తన కీర్తి రూపమగు గంగ శ్రీహరి చరణముల నుండి బయలుదేరు చున్నట్లుండెను, మరల దానము నొసంగుటకుఁ బూర్వము బ్రాహ్మణుని విధి విధాన

పూర్వకముగఁ బూజించెను. వస్త్రాభూషణములచే నాతని నలంకరింపఁ జేసెను. ఆ తరువాత నాతఁడు కొమ్ముచెంబుతో జలమును గైకొని వామన వటువునకు దానమొసంగ సంకల్పమును జదువ నారంభించెను. ఇఁక మించి పోవుచున్నదని తెలిసికొని శుక్రాచార్యుఁడింకొక ప్రయత్నమును జేయదలఁచెను. ఆతఁడా కొమ్ముచెంబులో సూక్ష్మరూపమును ధరించి కూర్చుండెను, ఆతఁ డిట్లనుకొనెను :- 'జలము పడక, సంకల్పము చదువఁబడక యీయఁబడిన దానము నియమానుసారముగఁ జెల్లదు. విధిలో లోపము జరిగినచో నీ దానము నియమ విరుద్ధముకావునఁ జెల్లనేరదని మన మనవచ్చునని భావించి యాతఁడొక బొట్టెనను గొమ్మునుండి జాఱనీయలేదు.

బలిచక్రవర్తి యిట్లనుకొనెను :- 'ఇప్పుడు మరల నొక నూతన విపత్తు వచ్చిపడినది. ఆతఁడు వామనునితో నిట్లనెను. 'ద్విజవరా! ఈ కొమ్ము చెంబునుండి జలముపడ దేల?'

వామనున కంతయును దెలియును. సర్వజ్ఞుని కడ దాఁపరిక మేమున్నది? కావున నిట్లనెను :- 'రాజా! తెమ్ము, నేనును జూచెదను. కొమ్ముచెంబున కేమి జరిగినదో నీ చేతిలోని ధర్భను నాకిమ్ము. రాజు కుశను వామనున కొసంగెను. ఆతఁడా కుశతో నా కొమ్ము చెంబులోనికి వేగముగ బొడువఁగా నా యసుర పురోహితుని కన్ను గోవిందాయ

నమోనమః అయినది. సంకల్పము లేకయే ఒక్కకన్ను దాన మొసంగఁబడెను. ప్రతిజ్ఞ నొనర్పకయే వామను డొక కంటిని దీసికొనెను. ఇప్పుడు శుక్రుఁడచ్చటినుండి పాఱి పోయెను. నీరు పడసాగెను. బలి సంకల్పమును జదువ సాగెను :— 'నేఁడు బ్రహ్మయొక్క యీ పరార్థమందు ఈ కల్పమున. నీమన్వంతరమున, నీద్వీపమున, నీ పుణ్యక్షేత్ర మున, నీయుగమందు, ఈ మన్వంతరమున, నీ మాస మందు, ఈపక్షమందు, ఈ తిథియందు, ఈవారమందు, ఈముహూర్తమున, కరణ నక్షత్రాదియందు కశ్యపకులమున నుత్పన్నమైన బలినగు నేను యీకశ్యపవంశమున నే యుత్ప న్నమైన వామనునకు మూఁడడుగులు భూమి నొసంగు చున్నాను. ఈ దానముచే సర్వాంతర్యామి యగు ప్రభువు ప్రసన్నుఁడగు గాక! ఈ దానమూ ప్రభువుదే నాది కాదు. ఈ దానము శ్రీకృష్ణార్పణమగుగాక! చేతులు జాచి లజ్జతో సంకుచితుఁడై వామనుఁడా ప్రతిగ్రహమును గ్రహించెను.

ఆసమయమున మూఁడులోకములలోని వారును బలి చక్రవర్తికి జయజయ ధ్వానము లొనర్చిరి. అందరీ దుష్కర కార్యమునకు నూరిభూరి ప్రశంసలొనర్చిరి.

అందరిట్లనిరి:— 'దాతలలో శిరోమణియును మనస్వియు నగు నీ మహారాజు సాహసమును గాంచుఁడు. ఈతఁడు తన కులమునకు శత్రువు, దేవతలపక్షమున విష్ణువని తెలిసియును

నేవిధముగను వెనుకాడక సంతోషముగ నీతఁడు పృథ్వీ దానమొసంగెను. ఇట్టికర్మ మితరులెవరును జేయఁజాలరు.'

ఈ విధముగ నందరును నాతనిఁ బ్రశంసించిరి. ఆకాశమున నుండిన నందన కానన పుష్పముల వృష్టిని గురిపించిరి. గంధర్వులు గానమొనర్చిరి. విద్యాధరులు రాగాలాపన మొనర్చిరి. సిద్ధచారణు లాతనిని స్తుతించిరి. సహస్రములుగ దుందుభులు మ్రోగెను. అప్సరసల నృత్య ఝంకారముచే నాకాశమండలమునిండిపోయెను. సర్వత్ర ఆనందము వ్యాపించెను.

శ్రీ శుక దేవుఁ డిట్లనెను :– 'రాజా! ఈ విధముగ దానమొసఁగి బలి మిక్కిలి దుష్కర కర్మనొనర్చెను.'

వామనుని విశ్వరూపము

౫౭౦

శ్లో॥ తద్వామనం రూపమవర్ధతాద్భుతమ్
హరేరనంతస్య గుణత్రయాత్మకమ్।
భూః ఖం దిశో ద్యౌర్వివరాః పయోధయ
స్తిర్యఙ్నృదేవా ఋషయో యదాసత॥

—శ్రీభాగ. ౮స్క. ౨౦అ. ౨౧శ్లో॥

వ॥ ఇట్లు ధారా పరిగ్రహంబుసేసి.

శా॥ ఇంతింతై వటుఁడింతయై మఱియుఁ దానింతైనభోవీథిపై
నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రునికంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సం
వర్ధియై॥

—శ్రీమదాంధ్ర భాగవతము.

మొదట బిందువుగానుండి, తరువాత సింధువగును. అతి సూక్ష్మమైన వటబీజములో విశాలమగు వటవృక్ష మంతర్భూతమైయున్నది. కాల, కర్మ, గుణములతో సంబంధమేర్పడినప్పుడా సూక్ష్మబీజము విశాలవృక్షమగును. జగదాదియందు పరమాణువే కలదు. అదియే కలిసి, సమయమునకు విశ్వరూపమునఁ బరిణామమును జెందెను. శుక్ర బిందువే యింత పెద్దశరీరరూపమున పరిణతినిఁ జెందును. అణువు మహత్తగుటయు, మహత్తు అణువగుటయే విశ్వ ప్రవాహము. ఆవిశ్వనాథుఁడణువు కంటె నణువు, మహత్తు కంటె మహత్తు. లీలకొఱకు ఒక్కొక్కప్పుడు బృహదణువుచే వామనవటువగును. వటువగు వామనుఁడు విశ్వరూపమునఁ బరిణతినిఁ జెందును. అణువులో మహత్తును, మహత్తులో నణువును నెవఁడు చూచునో అతఁడే జ్ఞాని, విజ్ఞాని. అతఁడే యీ మఱుగుజ్జు వామన రహస్యమును దెలిసికొనఁగలఁడు. బాహ్యవృత్తికలవారీ తత్త్వమును దెలిసికొనఁజాలరు. అట్టి

వారేదో మెట్ట వేదాంతము లవకతవకగఁ జెప్పుచుందురు. ఇదంతయు నాతని ప్రేరణచేతనే చెప్పఁగలఁడు. ఆతని ప్రేరణము లేక నెవ్వరునేమియును బలుకఁజాలరు. ఏమియును జేయఁజాలరు.''

శ్రీశుకదేవుఁడిట్లనెను :-''రాజా! గొప్పవారు బుద్ధిపూర్వకముగఁ జిన్నవారగుట వారింకను బెద్దవారగుటకే అట్లొనర్చుచుందురు. పెద్దవారు పెద్దలుండవలసినట్లే యుండినచో వారుపెద్దలే. వారికి పతనముకూడ కలుగవచ్చును. స్వాభావికముగఁ జిన్నవారైనవారికి పతనమేమి కలుగును! మంచము మీఁదఁ బరుండినవానికిఁ గ్రిందపడు భయము కాని క్రిందఁబరుండినవానికిఁ బతనభయమెక్కడిది! కాని చాలగొప్పవారయ్యుఁ జిన్నవారుగానైనచో నిట్లు చిన్నవారగుటకేదో రహస్యముండియుండ వలయునని తెలిసికొనవలయును. వీరు చిన్నవారై పెద్దవారి చెవిని గొఱుకుటకు కూర్చుండిరని తెలియవలెను. వారి నిరాడంబరతలో మహాత్మ్యకాంతి అంతర్భాగమైయున్నది. త్యాగమందు మహదైశ్వర్యము దాగియున్నది. వామన వటువు చిన్న చిన్నపాదములను జూపించుచు దన హీనతను, లఘుత్వమును జూపించుచున్నాఁడు. ఈతనికి దానిలో మహాత్మ్యకాంతి గూఢముగ నున్నది. బ్రహ్మయొక్క యేదోక్షుద్ర ప్రదేశమునఁ బ్రకృతి పడియుండును. దానిలో సత్వ

రజస్తమో గుణములు మూఁడును నత్యంత సూక్ష్మరూప ముగ నిద్రించుచుండును. దానికి దేశ, కాల, కార్య, కారణ సంబంధముచే నాత్రిగుణములే వ్యాపించి చతుర్దశభువన ముల రూపమును ధరించును, అణువునుండి మహత్తగును. గుణములతోఁ గాలకర్మ సంబంధము కలుగుటచే నవి విశ్వ బ్రహ్మాండమును గప్పివేయును. బ్రహ్మనాచ్ఛాదించును. అప్పుడు గుణప్రవాహము తప్ప బ్రహ్మకనఁబడనే కనఁ బడదు. ఆతఁడంతః కరణసంస్కారమను కొట్టునందు దాగును. వటవృక్షబీజమువలె నతి సూక్ష్మముగఁ గనఁబడు చుండిన వామనుఁడిప్పుడు బలియొక్క అనుకూలతా, సంక ల్పముల జల సహితముగఁ బృథివినిఁ బొంది పెరుగఁజొచ్చెను. వటవృక్షమునకుఁ గాలము కావలయును. ఈతఁడు కాల కాలుఁడు. ఈతనిఁ గాంచి కాలమును గంపించును. కావున నీతఁడు భూతము వలెను, తృష్ణవలెను, లోభమునకుబోలె, రాత్రియందలి అంధకారము మాడ్కని, పెరిగి విశ్వము నాచ్ఛాదింపఁ జొచ్చెను. నూతనాభినయ విచిత్ర చిత్రపటము లను దర్శకు లాశ్చర్యముతోఁ గాంచు నట్లచ్చట నుండిన జన సమూహము వర్షాకాలమందలి ప్రబల ప్రవాహము కంటెను మించి తన శరీరమును బెంచు చుండెను. ఆతని శరీరమందు జ్ఞానులకు సమస్త విశ్వబ్రహ్మాండము గోచరించు చుండెను. పరమ యశస్వియును, మహాజ్ఞానియునగు బలి

చక్రవర్తి ఆతని యీ రూపమందు సమస్త విశ్వమును దర్శించెను. అనంతుని యీ త్రిగుణమయమగు వామన రూపము విశ్వమందు వ్యాప్తము కాఁజొచ్చెను. ఆతఁడు దశదిశలను గప్పివేసి నట్లుగా వ్యాపించెను పృథివి, ఆకాశము, స్వర్గము పాతాళము, సముద్రములు, పశుపక్షిఁ సరీసృప, మనుష్య, దేవతా, ఋషి, మునులందఱు నారూపమం దిమిడిరి. ఆతని సమస్తాంగ ప్రత్యంగముల యందీ సమస్త త్రిగుణ మయమగు జగత్తు కనఁబడు చుండెను. బలిచక్రవర్తికి పంచభూతములు దశేంద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచవిషయములు, అంతఃకరణ చతుష్టయము ఇవన్నియును గనఁబడు చుండెను. ఆతఁడొక్కఁడే చూడ లేదు. అచ్చట యజ్ఞకర్మ యందుండిన ఋత్విక్కులును, నాచార్యులును, సదస్యగణమును నీవిశ్వ రూపమును గాంచఁ గలిగిరి. నఖ శిఖ పర్యంతము భగవంతుని సమస్తావయములందు విశ్వములోని ప్రధాన విభూతులు కనఁ బడెను.

అంత బరీక్షిన్మహారా జిట్లనెను:-ప్రభూ! భగవంతుని యే యంగమందే యే విభూతులు కనఁ బడినవి?'

అంత శుకుఁడిట్లనెను: —" రాజా! ఈవిషయమును గొంచెము ధైర్యముతో వినవలసి యుండును. ఇది యితర కథలవంటిది కాదు. దీనిని నీవే కాగ్రచిత్తముతో శ్రవణము చేయుము చెప్పెదను.

పరీక్షిన్మహారా జిట్లనెను:–" సరియే, స్వామీ! నే నత్యంత సావధానముతో శ్రవణము చేయుదును. మీరు భగవానుని విరాట్స్వరూపమును నఖశిఖ పర్యంతము విస్తారముగ వర్ణింప వలయును."

నవ్వి శుక దేవుఁడిట్లనెను:–"రాజా! బ్రహ్మ దేవుఁడు తన ఆయువు పర్యంతము నిరంతరము తన చతుర్ముఖము లతో వర్ణన మొనర్చినచోఁ బూర్తిగా వర్ణింపఁ జాలఁడు. కావున నే నత్యంత సంక్షేపమున వామనుని విశ్వరూపమును వర్ణించెదను. సరియే. ఇప్పుడు నేను భగవంతుని అతికోమలములగు పాదతలమునుండి వర్ణించుట కారంభించెదను."

పరమ భాగవతుఁడగు బలి చక్రవర్తి విశ్వరూపుఁడైన వామనుని కమల దళ సదృశములైన నెఱ్ఱని మృదువులైన కోమల చరణ తలములందు రసాతలమును గాంచెను. చరణములపై పై భాగమున తాఁబేలు పుచ్చువలెఁ గండరములు తేలిన చోట భూదేవిని దర్శించెను. పిక్కలందు భూమిపై నుండిన పెద్దపెద్ద పర్వతములను గాంచెను. జానువులందు సమస్త జాతుల పక్షులను, ఊరువులందు నలుబది తొమ్మిది మరుత్తులను దర్శించెను. ఆవిశ్వరూప విశ్వేశ్వరుని బహుమూల్యమగు వస్త్రమునందు ముసుఁగు వైచుకొనిన సంధ్యా దేవిని గాంచెను. గుహ్య ప్రదేశమున సమస్త ప్రజాపతులను దర్శించెను భగవానుని జఘనములు వైపునకుఁ

జూడఁగా హిరణ్యకశిపు, హిరణ్యాక్షు, ప్రహ్లాద, విరోచనాది సమస్తాసురులను దన్నుగూడ చూడఁ గలిగెను. విశ్వరూపుఁడగు భగవానుని నీటిబుడగ వంటి బొడ్డునందు అనంతాకాశమును గాంచెను. ఆ విశ్వేశ్వరుని కుక్షియందు సప్తసముద్రము లుప్పొంగు చుండెను. వక్షస్థలమందు నక్షత్రగణము మెఱయు చుండెను. హృదయస్థల శోభను సాక్షాత్తుగ ధర్మదేవుఁ డినుమడించుచుండెను. స్తనద్వయము నందు ఋతసత్యములు ప్రత్యక్షముగఁ గనఁబడు చుండెను.

మనస్సునందు చంద్రుఁడు ప్రకాశించు చుండెను. వక్షఃస్థలమందు విద్యుత్తువలె మెఱయుచుండి చంచల చపలయగు లక్ష్మీదేవి తన యౌవన మదమునఁ గలుగుచు ననురాగమందార్ద్రయై యుండెను. ఆమె భగవానుని హృదయమున హారమైనదా యనునట్లుండెను. కంఠమందు సామవేదశ్రుతులును, మూర్తిమంతములగు శబ్దములును శోభిల్లుచుండెను. భుజములందింద్ర, వరుణ, కుబేర, యమాది సమస్త దేవతలు సుఖపూర్వకముగా నివసించుచుండిరి. కర్ణములందు ఛిద్రాకాశమందు సమస్త దిశలు మూర్తిమంతములై యుండెను. మస్తకమందు పైనున్న సమస్త స్వర్గములును విరాజిల్లు చుండెను. నల్లని ముంగరములు తిరిగిన వెంట్రుకల యందు యౌవనాన్వితములగు మేఘములుండెను అవి ధణధణ ఘణ ఘణ లాడుచుండెను. వాయుదేవుఁడు నాసికను శోభనుఁ

గూర్చుండెను. నేత్రములయందు సూర్యుడు తన కాంతి వెదజల్లుచుండెను. ముఖమందగ్ని తన జ్వాలలను వెదజల్లుచుండెను. వాణియందు వేదములు సన్నిహితములై యుండెను. నాలుక యందు వరుణు డుండెను. ఒక భ్రుకుటి యందు విధులును, వేఱొక భ్రుకుటి యందు నిషేధము లును మెదలక కూర్చుండి యుండెను కను రెప్పలయొక్క నిమేషోన్మేషములందు దినరాత్రులు తమ యాసనమును వేసికొని యుండెను. లలాటమందు క్రోధము తన భీషణ భ్రుకుటి ద్వారా చూచుచుండెను. అధరమున లోభమంటు కొని యున్నది స్పర్శేంద్రియమందు దన పుష్పముల క్రీడ మును వాసన చూచుటకు పుష్పాయుత కాము కమనీయక్రీడ నొనర్చు చుండెను.

భగవానుని వీర్యమందు జలము నివసించు చుండెను. జలమే జీవనము, జలమే భువనములు, జలమే వనము. పృష్ఠ భాగమందు ధర్మముతనక రాలదృష్టి చేజూచుచుండెను. ఈతడును భగవానుని పృష్ఠభాగమునుండి యుత్పన్నమైన ధర్మముతో సమానమైన పుత్రుడే. భేదమేమనగా ధర్మము యొక్క ఉత్పత్తి హృదయము నుండి యైనది. దీనియొక్క నివాసము ఆతనిపృష్ఠ ప్రదేశమునకలదు. భగవానుని మీద గాళ్ళమీద సమస్త యజ్ఞ, యోగము లున్నవి. మృత్యు దేవత ఆతని ఛాయయందు ముసుగు వేసుకొని దాగియున్నది.

మాయాదేవి భగవానుని నవ్వులోఁ గూర్చుండి నవ్వుచున్నది. శ్రీహరియొక్క రోమకూపములందు సమస్తౌషధులు సన్నిహితములై యుండెను. నాడులందసంఖ్యాకములగు నదులు ప్రవహించుచుండెను భగవానుని చేతులు కాళ్ల గోరులందు పర్వత శిలలుండెను. బుద్ధియందు జగదుత్పత్తినిఁ గావించు బ్రహ్మకూర్చుండి యుండెను. ఆతని సమీపమున దేవతలును, ఋషిగణమును విరాజిల్లుచుండెను. ఎంతని చెప్పఁగలము. వటువామనుని సమస్తాంగములందును విశ్వములోని సమస్త వస్తువులుండెను. జగత్తునందలి సమస్త స్థావరజంగమములు పిరాట్టైన ప్రభుని శ్రీయంగమునందు బలికి కనఁబడెను.

శ్రీశుక దేవుఁడిట్లనెను:—"రాజా! పెరిగిన వటువామనుని యీవిశ్వరూపునిఁ గాంచి సమస్త దైత్యగణము పరమ విస్మితులైరి. వారు భయభీతులై భగవానుని విరాడ్రూపమును గాంచిరి. వారు భయపడుటయే గాక ఆశ్చర్య చకితులై ఆతనిని సంభ్రమముతో గాంచుచుండిరి. ఇప్పుడు భగవానుఁడు తన బ్రహ్మచారి వేషమును వీడి యధార్థమగు రూపమునకు వచ్చెను.

---

*

విశ్వరూపుఁడగు వామనుని రెండడుగులు

౫౭౧

శ్లో॥ క్షితిం పదైకేన బలేర్విచక్రమే
నభః శరీరేణ దిశశ్చ బాహుభిః ॥
పదం ద్వితీయం క్రమతస్త్రివిష్టపమ్
న వై తృతీయాయ తదీయ మణ్వపి॥

—శ్రీ భాగ. ౮ స్కం. ౨౦ అ. 33 శ్లో॥

మ॥ ఒక పాదంబున భూమిఁగప్పి దివి వేఱొంటికి నిరోధించి యొం
డొకటిన్ మీఁద దిగంబులెల్లఁబొడి యొండొంటిన్ విలంఘించి ప
ట్టక బ్రహ్మాండ కటాహముం బగిలి వేండ్రంబై పరుల్ గాన రా
కొకఁడై వాగ్దృగలభ్యుఁడై హరి విభుం డొప్పారె విశ్వాకృతిన్॥

—శ్రీ మదాంధ్ర భాగవతము.

మొదటినుండియును మారువేషమును ధరించిన నది తనపని నెఱవేరువఱకే యుండును. కార్యము నెఱవేరిన తరువాత యథార్థరూపమునఁ బ్రకటమగును. మనుష్యుని ఆకృతి భావానుసారముగ నుండును. భావనను బట్టియే ఆకృతి యేర్పడును. మాయవేష మెంతో కాలము నిలువదు. అది అల్ప కాలములోనే బయటపడును.

శ్రీశుకదేవుఁ డిట్లనెను :- "రాజా ! విశ్వరూపమును ధరించినపుడు వామనుని చేతులలోనుండిన దండ కమండలాది బ్రహ్మచారికి యోగ్యమైన వస్తువులు పెరుగలేదు. ఆతని స్వరూపమే పెరిగినది. స్వరూపము పెరుగఁగానే భగవంతుని అంగములును, ఉపాంగములును, అస్త్రములును, ఆయుధములును, పార్షదాది నిత్యములు వచ్చెను. ఆతఁడు మరుగుజ్జునుండి విరాట్టయ్యెను. వామనుఁడు విష్ణువయ్యెను. చిన్నరూపము విశాలముగఁ బరిణమించెను. బ్రహ్మచారి విశ్వచారియయ్యెను. భగవానుఁడు కపటవేషము నుద్యజించి తన యథార్థరూపమునకు రాఁగానే, ఆతని నిత్యములగు నస్త్రశస్త్రములును, ఆయుధములును, శార్ఙాదులును ఛాయవలె నిత్యముండునవి కావున సాక్షాద్రూపమున నచ్చటికివచ్చెను. మునుముందుగా భగవానునకుఁ బరమప్రియమగు దివ్యాస్త్రము సుదర్శనచక్రము వచ్చెను. దాని తేజము సహింపరానిదై యుండెను. అది తన ప్రకాశముచే దశదిశలను బ్రకాశింపఁజేయుచుండెను. అది యథాస్థానమునకు వచ్చి భగవానుని శ్రీహస్తమున శోభించుచుండెను. నేఁడు భగవానుఁడు చతుర్భుజుఁడు కాక అష్టభుజుఁ డయ్యెను. కావున నష్టభుజములందు నెనిమిది క్రమముగ వచ్చి తమ తమ స్థానములనాక్రమించెను. చక్రము తరువాత శ్రీహరియొక్క శార్ఙమను దివ్యమనస్సును, అది జలభరితమగు నవ మేఘము

వలె ఢంకారమొనర్చును. దాని తరువాత భయంకరఘోష మొనర్చుచు నసురుల పీచమడంపఁగల పాంచజన్యమను ప్రభువుగారి శంఖమువచ్చెను. ఆమీఁదట అత్యంత వేగము కలిగి మూర్తిమతియు, శ్రీమతియునైన కౌమోదకీయను భగవానుని విశాలమగు గదవచ్చెను. అత్యంత కఠినచర్మము కలిగి చంద్రునివలెనగుండ్రముగనుండి, ప్రహారములను రక్షించు డాలు వచ్చెను. దానివెంటనే విద్యాధరమను పేరుగలిగి అసురుల యుదరములను విదీర్ణము కావించు ఖడ్గమును వచ్చెను. భగవానుని పృష్టదేశమున వ్రేలాడుచుండు రెండు బాణతూణీరములును వచ్చెను. ఆ బాణము లెన్నడును వ్యర్థముకానివి. భగవానుని దివ్యక్రీడాకమలమును వచ్చెను. ఆ కమలముతో నాతఁడు కమనీయ క్రీడనొనర్చును. అది యుండుటచేతనే భక్తులభయము ప్రదానము నను బడయు చున్నారు. ఈవిధముగ శంఖ, చక్ర, గదా, పద్మములును, డాలును, ఖడ్గమును, ధనుస్సును, బాణములును అష్టభుజము లందు వచ్చి శోభాయమానముగ నుండెను.

భగవంతుని ప్రియపార్షదులును, అంశభూతులగు అష్ట దిక్పాలకులను భగవానుఁడు తన యదార్థరూపమునఁ బ్రకట మైనాఁడనియు, నాతఁడు యుద్ధయుక్తుఁడై యున్నాఁడనియుఁ దెలిసికొని అష్టదిక్పాలకులును, నంద, సునంద. విష్వక్సేనాది భగవంతుని ప్రముఖ పార్షదును వచ్చిరి. ఆ సమయమున

భగవానుని శోభ అత్యంతాద్భుతముగ నుండెను ఆతఁడు లోకపాలురచేతను, పార్షదులచేతను జుట్టుకొనఁబడి యుండెను. దివ్యాయుధము లాతని శ్రీహస్తములలో విరాజమానములై తమ కాంతులచే విశ్వమును బ్రకాశించు చుండెను. ఆతని మనోహర మస్తకమందు దేదీప్యమానమగు మకుటము తళతళ మెఱయుచుండెను. అష్టబాహువులందును సువర్ణాంగదములు తళతళలాడుచుండెను మకరాకృతి కుండలములు కపోలముల శ్రీనివృద్ధిచేయుచు గలగలమని వ్రేలాడుచుండెను. వక్షఃస్థలమందుండు శ్రీవత్స చిహ్నము మీఁద మణులలో శ్రేష్ఠమగుఁ గౌస్తుభమణి తన కిరణ సమూహములచేనాశ్రితజనుల హృదయాంధకారమును నాశమొనర్చుటకు వ్యగ్రతను బ్రకటించుచుఁ జంచలత్వమును బ్రదర్శించుచుండెను. కటి ప్రదేశమునకుఁ జుట్టుకొనిన మొలత్రాడు శ్రీ యంగము యొక్క కాంతిని ఘనీభూత మొనర్చుటకై, దానిని హద్దులలో నుంచుటకై ప్రయత్నశాలియై యుండెను. వివిధ వేషములను ధరింపఁగల నటవరుని శరీరము మీఁదఁ బీతపటము ధరించి దామినీకాంతులను దిరస్కృతి నొనర్చుటకై అభ్యాస మొనర్చుచున్నట్లుండెను. పంచ పల్లవముల తోడను, బుష్పముల తోడను గూర్చిన వనమాల వక్షఃస్థలమున నుండి తన కాంతులచే నింద్రధనుస్సు గర్వమును ఖర్వమొనర్చుచుఁ గర్వించుచున్నట్లుండెను. ఆ పుష్పముల కంటుకొనిన మధువును బాన మొనర్చుటకై మధుకరములు

మదించి దానికి నలువైపులను నెగురుచుండెను. భ్రమరనికర గుంజారవముచే గుంజితమగు నావనమాల కదలుచు గానము చేయుచున్నట్లుండెను, ఆ గానమును శ్రవణమొనర్చి రసిక భ్రమరములు శిరస్సులను నూపుచు దాని నభినందించు చున్నట్లుండెను.

ఇప్పుడా విచిత్ర వేషధారియగు వామన వటువు విష్ణువై విభువై, బలితో నిట్లనెను :— ‘రాజా ! ఇప్పుడు నా యథార్థ స్వరూపమును గాంచితివా? ఇప్పుడు మూఁడడుగుల పృథివిని గొల్చుకొను మందువేమో చెప్పుము?’

వ్యగ్రతను బ్రకటింపకయే వీరవరుఁడగు బలి యిట్ల నెను :— ‘ప్రభూ ! గొల్చుకొనుఁడు. ఈ త్రిలోకములకును నేనధీశ్వరుఁడను, మీరు మీయిష్టము వచ్చినట్లుగఁ బెంచు కొని మీ యడుగులతో దానమును గ్రహింపుఁడు.’

శుష్కహాస మొనర్చి విరాట్ప్రభువిట్లనెను :— ‘పూర్తి కాకుండినచో ?’ బలిసాహసముతో నిట్లనెను :— ‘అయినఁ గానిండు. చూచెదము, మీరు గొలుచుకొనుఁడు, మీరోడె దరో లేక నేనోడెదనో చూచుకొందము.’

ఇదివిని విరాట్టైన వామనుఁడొక యడుగునుదీసి సప్త పాతాళములతో భూమండలము నంతయును గొలుచుకొనెను. ఆకాశమును విశాల శరీరముతోఁ గప్పివైచెను. అష్టదిశలను దన యష్ట భుజములచేఁ గప్పెను. ఇప్పుడుమరల నాతఁడు

రెండవపాదమును బెంచి స్వర్గము చాలక పోవుటచే మహా ర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకముల వఱకును దన రెండవపాదము ను బెంచెను. ఇంకనున్నొక్క-గోరు సందు మిగిలియుండెను. నఖము నింక నెచ్చటికిఁ బెంచగలఁడు? బ్రహ్మలోకమందింకను బ్రహ్మాండ కటాహము కలదు. దానికిపైన నష్టప్రకృతియొక్క సూక్ష్మావరణము కలదు నఖము సాధారణ మైనది కాదు. అతఁడు బ్రహ్మాండ కటాహమును భేదించెను. పృధివి యొక్క సూక్ష్మావరణమును భేదించి జలావరణమును భేదించెను.

శ్రీశుకదేవుఁడిట్లనెను:—"రాజా! అంతవిరాట్ భగవానుఁడొక యడుగుతో సమస్త వసుంధరను గొలిచి, రెండవ యడుగునఁ బైన నున్న సమస్త లోకములను గొలిచెను భగవానుని పావన పాదపద్మములు లోకములన్నిటినిఁ గొలుచు కొనుచుఁబోయి బ్రహ్మ లోకమునకుఁ జేరఁగనే బ్రహ్మహర్షమునకు మేరలేకుండెను. ఆహా! ఇవియే నాజనకుని యొక్క పరమ పూజనీయము లగుఁ బవిత్ర చరణ కమలములు. వీనిని ధ్యానించుటచే జగద్బంధనము లన్నియును శాశ్వతముగ విలీనము లగును. వానినిఁ బ్రాప్తించుటకై యోగిగణము, నిరంతరము ధ్యాన ధారణ మొనర్చుచు సమాధిలో నుందురు. నేడట్టి చారుచరణములు స్వయముగ నాలోకమునకు వచ్చినవి. ఈవిధముగఁ దన భాగ్యమును

గూర్చి భూరిభూరి ప్రశంసలొనర్చుకొనుచుఁ జపరాననుఁడా పదములకుఁ బూజలొనర్చుటకు సిద్ధపడెను.

ప్రభు పాదపద్మముల నుండి విష్ణు పదియగు గంగ పుట్టుట

౫౭౨

శ్లో॥ ధాతుః కమండలు జల తదురు క్రమస్య
పాదావనే జన పవిత్రతయా నరేంద్ర ।
స్వర్ధున్య భూన్నభసి సా పతతీ నిమార్ష్టి
లోకత్రయం భగవతో విశ దేవ కీర్తిః ।

—శ్రీభాగ. రస్కం.౨౧అ. ౪శ్లో॥

మ॥ తన పుట్టిల్లిదె పొమ్మటంచు నజుఁడుం దన్నాభి పంకేరు
హంబు నిరీక్షించి నటించి యున్నతపదంబుం జూచి తత్పాదసే
చనముం జేసె.గమండ లూదకములం జల్లించి తత్తోయ
ముల్
వినువీథిం బ్రవహించె దేవనది నావిశ్వాత్మ కీర్తి
ప్రభన్ ॥

శ్రీమదాంధ్ర భాగవతము.

ఈవిశ్వబ్రహ్మాండము వ్యాపకవిభుని కొక్క పాదమున గలదు. మిగిలిన మూఁడు పాదములును విశుద్ధ త్రిపాద్విభూతిగఁ జెప్పఁబడినది. ఆతఁడవతారమును ధరించినప్పుడు, అనఁగా ధరాధామమున నవతరించినపుడు ద్విపాదుఁడగును. రెండు పాదములతోడనే బ్రహ్మాండకటాహము నావరించును. లోకకల్యాణము కొఱకు తన విరాడ్విభూతినుండి శ్రీగంగ నవతరింపఁజేయును. గంగ అన్యమేమియును గాదు ద్రవించిన బ్రహ్మమే. బ్రహ్మ నిరాకారుఁడై యుండెను. ఘనీభవించిన పరబ్రహ్మయే కరిగి జలరూపమునఁ బరిణమించెను. ఆతఁడన్యావతారములలో నెట్లవతరించినాఁడో అట్లే సత్యలోకమునుండి జలరూపమున సమస్తలోకములను బావనమొనర్చుటకై అవతరించును. ఆ బ్రహ్మ ద్రవమునకే గంగయందురు. విష్ణుపదప్రక్షాళమున దానిని బ్రహ్మపదియనియునందురు. సురలోకమునుండి వచ్చుటచే దానిని సురసరిత్తందురు. ఆ త్రిభువన తారిణీ తరళ తరంగ స్వర్ధుని యగు గంగ పాపులపాపములను బ్రక్షాళన మొనర్చుచు నేఁటివఱకును భూమిమీఁదఁగలదు. అది వామన, బలిచక్రవర్తుల విమల కీర్తియే జలరూపమును ధరించి అవిచ్ఛిన్నగతిచేఁ బ్రవహించుచున్నదా యనునట్లుడెను.

శ్రీశుక దేవుఁడిట్లనెను:-"రాజా! ప్రభువు తన రెండు పాదములచేఁ బృథివినిఁ, బైనున్న సమస్త లోకములను

గొలువఁగా ద్వితీయ పాదముయొక్క అంగుష్ఠము కొంచెము ముడుచుకొని యుండి చాచుకొనుటకుఁ వీలు లేకుండెను. భగవానుఁడు తన యంగుష్ఠమును జాచుకొనుటకుఁ బ్రయత్నింపగా బ్రహ్మాండ కటాహము పగిలిపోయెను. ఈ బ్రహ్మాండమున కావల ప్రకృతియొక్క అష్టావరణములు కలవు. ప్రథమమున సూక్ష్మమగు పృథివీ యావరణము; రెండవది జలావరణము. ప్రభువుయొక్క పాదాంగుష్ఠనఖము పృథివీ యావరణమును భేదించి జలావరణమందుఁ బ్రవేశింపఁగనే అచ్చటనుండి ఒకానొక విశుద్ధజలధార ప్రవహించెను. అది అతి పావనమైనదని తెలిసికొని చతుర్ముఖుఁడగు బ్రహ్మ దానినిఁ దన కమండలువునందుంచుకొనెను.

నేఁడు ప్రభుని పూజ్య చరణములు పితామహలోకమునకు వచ్చుట వలన వానినిఁ బూజించుటకై బ్రహ్మ సామగ్రినిఁ బ్రోవు చేయుచుండెను. గంగ తోడనే మనము పూజచేయుదము. పాద్యార్ఘ్య, ఆచమనీయాదుల కొఱకు జలమన్యత్ర తీసుకొనిరాము. అచ్చటనుండియే తీసుకొందుము. అదే విధముగా బ్రహ్మాండ కటాహము పగులగా వెలువడిన దివ్య జలముచేతనే బ్రహ్మయా ప్రభుని ద్వితీయ చరణమును శ్రద్ధతోఁ బూజించెను.

అంత శౌనకుఁ డిట్లనెను:- "సూతా! బ్రహ్మాండ కటాహమును భేదించుకొని జలము వచ్చిన దనిన మాకర్థమగుట లేదు. దీనిని స్పష్టముగ నెఱుకపరుపవలెను."

సూతుఁ డిట్లనెను :– 'స్వామీ! క్రింద నతల, వితల, సుతల, తలాతల, మహాతల, పాతాళ లోకములను నేడులోకములును, భూ, భువ, స్వర్గ, మహాజన, తప, సత్య లోకములను నేడూర్ధ్వలోకములును, గలిసి చతుర్దశభువనము లని పిలువఁబడుచున్నవి. దీనినే బ్రహ్మాండ మనియునందురు. ఇవన్నియును గలిసి యొక అండాకారముగ నైనవి. బ్రహ్మ యొక్క అండ మగుటచే నిది బ్రహ్మాండ మనియును బిలువఁ బడుచున్నది. ఈ బ్రహ్మాండమున కావల దీనికిఁ బదిరెట్లుగ సూక్ష్మపృథివియొక్క ఆవరణము కలదు. అనఁగాఁ బృథివి యొక్క అతి సూక్ష్మ రూపమీ బ్రహ్మాండమునకు బయట దీనిక౦టెఁబదిరెట్లుగ వ్యాపించినది. దీనికి పదిరెట్లుసూక్ష్మజలా వరణము కలదు. ఇదేవిధముగ నుత్తరోత్తర తేజ, వాయు, ఆకాశ, అహంతత్వ మహత్తత్వము యొక్క ఆవరణములును, జివరకు ప్రకృతి తత్త్వవరణలును గలవు అప్పుడీ బ్రహ్మాండము పూర్తియగును. ఇట్టి బ్రహ్మాండము లసంఖ్యాకములుగ నీవిశ్వ మందుగలవు బ్రహ్మాండ మొక అత్తిపండువంటిది. దానిలోఁ జీవ మొదలు బ్రహ్మవఱకును నత్తిపండులోనుండు పురుగుల వంటివారు. ఆ యత్తిపండును జించుకొని వచ్చి పురుగు తానుండు నత్తిపండు వంటినసంఖ్యాకములగు నత్తిపళ్లు చెట్టు నకు బట్టుకొని వ్రేలాడు చున్నవనియుఁ దెలిసికొనును. ఆ యత్తిచెట్టు అనంతాకాశమండలమందొక తృణము వంటిది.

భగవానుఁడు లీల కొఱకు వామనుఁ డగును. మరల విరాడ్రూపమును ధరించును. ఆతనికి వామన రూప మేమి విరాడ్రూప మేమి. అన్నియును సమానములే జీవుల హితార్థమై కొంచెముగఁ గానఁ బడి సత్యలోకము వైపునకుఁ జాఁచెను. ఆ మూలమున బ్రహ్మాండ కటాహమునకు బయటనున్న విశుద్ధజలము పాపులను బావన మొనర్చుటకై పృథివిపైకి వచ్చినది.

శౌనకుఁడిట్లడిగెను:—"బ్రహ్మలోకమందులువునుండి అది పృథివిపై కెట్లువచ్చినది?

సూతుఁడిట్లనెను:—"స్వామీ! ఈ విషయమునే శుక మహర్షి పరీక్షిన్మహారాజునకుఁ జెప్పుచున్నాఁడు:—"రాజా! భగవానుని యా పూజనీయపదారవిందములు బ్రహ్మ తన లోకమునకు వచ్చుటనుగాంచి, ఆ బ్రహ్మ పొందిన యానందమునకు మేర లేకుండెను. కమలదళమువలె నరుణ తలము కల పద నఖ చంద్ర చంద్రికచే నాతని నిత్య సనాతన ప్రభా విలసితమగు లోకముల లోని తేజస్సు నిస్తేజ మగుటను, నా తేజముచే నాతఁడును నాచ్ఛాదింపఁబడి యుండుటను గాంచి బ్రహ్మ సంభ్రమముతో లేచి నిలుచుండెను. ఉరు క్రముఁ డగు భగవానుని చరణము లోకములను గొలుచుచుఁ దమ లోకమునకును వచ్చిన దని తెలిసికొని, కర్మ కలాపముచేఁ బ్రాప్తింపఁజాలక ఆతని చరణ స్మరణ ప్రభా

వముచే నా బ్రహ్మ లోకమును బ్రాప్తించిన పుణ్యాత్ము లందఱును బ్రహ్మ సమీపమునకుఁ బరువిడి వచ్చిరి. బ్రహ్మ మానస పుత్రులగు మరీచాదులును నీమాటను వినఁగానే వెంటనే వచ్చిరి. బ్రహ్మ సభలో నుండు సనకాది ఊర్ధ్వ రేతస్కులును, నైష్ఠికులును, బ్రహ్మచారి గణమును, యోగి జనులును, మూర్తీభవించిన వేదములును, నుప వేదములును, యమ, నియమ, తర్కేతిహాస, వేదాంగ, పురాణ, సంహితా, జ్ఞానాగ్నులచేఁ దమ యజ్ఞానరూపమగు మల మును భస్మీపటల మొనర్చుకొనిన జ్ఞానులును నా పాదార విందము సమీపమునకు వచ్చి చేరిరి. వారందఱును దానికిఁ బ్రణామము కావించి స్తుతి చేయసాగిరి.

బ్రహ్మ తన కమండలువు యొక్క దివ్యజలమందు గంధ, పుష్ప, తులసీ దళములను వైచి దానినిఁ గడిగెను. ప్రభు పాదముల యొక్క పావన రేణువులను, తులసీ మంజరి యొక్క దివ్యగంధమును గైకొనుచు నది త్రైలోక్య పావన పదము క్రిందకు ప్రవహించెను. బ్రహ్మయును, సమస్త ఋషు లును, మునులును దానినిఁ దమతమ శిరములందు ధరించిరి. అయినను నాయవిచ్ఛిన్న ప్రవాహ మాగలేదు. బ్రహ్మ లోకము నుండి దిగి తప, జన, మహర్లోకములలో గుండా స్వర్గమునకు వచ్చెను. ఆ పాదోదకమే స్వర్గమందు మందా కినీ యను పేరుతోడను, పాతాళమున భోగవతీ యను పేరు

తోడను, భూమియందు గంగ యనుపేరుతోడను విఖ్యాతిని బొందెను. అది వామనమూర్తి యొక్క తరళకీర్తి ముల్లోకములను పావన మొనర్చుచుఁ బ్రవహించుచున్నట్లుండెను."

అంత శౌనకుఁడిట్లనెను:—"సూతా! గంగను భగీరథుఁడు తెచ్చినట్లు మేము వినుచున్నామే నీవు అది వామనుని ద్వితీయ పాదాంగుష్ఠముచే విదీర్ణమై అండ కటాహము నుండి బ్రహ్మ కమండలువులోనికి వచ్చి, మరలఁ బాదప్రక్షాళనముచే నతిపవిత్రమై సమస్త లోకములను పావన మొనర్చుచు నిచ్చటికి వచ్చినదని చెప్పుచున్నావు. ఇది యెట్లు సంగతము కాఁగలదు."

సూతుఁ డిట్లనెను:—"స్వామీ! గంగ నిత్యమైనదియే. అట్లు నిత్యముకాక భగీరథుఁడే తెచ్చియుండినచో హరిశ్చంద్రుని సమయమున నది కాశీకెట్లు వచ్చినది? హరిశ్చంద్రుఁడు భగీరథుని కంటెఁ జాలముందువాఁడు. మనుపుత్రుఁ డిక్ష్వాకు. ఇక్ష్వాకునకు వికుక్షి. వికుక్షి పుత్రుఁడు పురంజయుఁడు. పురంజయునకే కకుత్స్థుఁడను పేరు కలదు. కకుత్స్థుని పుత్రుఁ డనేనుఁడు, అనేనునకుఁ బృథువు పృథువునకు విశ్వరంధి, విశ్వరంధునకుఁ జంద్రుఁడు, చంద్రునకు యువనాశ్వుఁ డుదయించెను. యువనాశ్వునకు శావస్తుడు, శావస్తునకు కువలయాశ్వుఁడు. ఆతనికి దృఢాశ్వుఁడు, ఆతనికి హర్య

శ్వుఁడు, ఆతనికి నికుంభుఁ డుదయించెను. నికుంభునకు బర్హ ణాశ్వుఁడు. ఆతనికిఁ గృశాశ్వుఁడు, కృశాశ్వునకు సేనజిత్తు, ఆతనికి యువనాశ్వుఁడు, యువనాశ్వునకు మాంధాత, మాంధాతకు పురుకుత్సుఁడు పురుకుత్సునకు త్రసదస్యుఁడు. ఆతని కనరణ్యుఁడు, అనరణ్యునకు హర్యశ్వుఁడు, హర్యశ్వునకు త్రిబంధనుఁడు, ఆతనికిఁ ద్రిశంకు, త్రిశంకునకు హరిశ్చంద్రుఁడు, హరిశ్చంద్రునకు రోహితాశ్వుఁడు, ఆతనికి హరితుఁడు, హరితునకు విజయుఁడు, విజయునకు భరుకుఁడు, ఆతనికి వృకుఁడు, వృకునకు బాహుకుఁడు పుత్రుఁ డయ్యెను. బాహుకునకు సగరుఁడు సగరునకసమంజసుఁడు, అసమంజసుని పుత్రుడంశుమంతుఁడు. అంశుమంతునకు దిలీపుఁడు, దిలీపునకు భగీరథ మహారాజు. ఈతని పేరుననే గంగకు భాగీరథి యను పేరువచ్చినది హరిశ్చంద్రుఁడీతనికి పంద్రెండు తరములకు బూర్వమువాఁడు. అప్పుడును గంగ కలదు.

ఇంతకు విషయమేమనఁగా విష్ణుపది సనాతనమైనది. అది బదరీనారాయణుని పాదములను బ్రక్షాళనముకావించుచు అలకనందయను పేరుతోఁ బూర్వము నుండియును బ్రవహించుచుండెడిది అదియే అన్యత్రపోయి సముద్రములోఁ గలిసెడిది. సగరుని అఱువేలమంది పుత్రులును దక్షిణ సముద్ర తీరమున భస్మమైరి. అచ్చటికి గంగను దీసికొని రావలసియుండెను. అందువలన నాతఁడు గంగోత్రికి వెడలి తపస్సు

చేసెను. అప్పుడాతఁడు గంగయొక్క నవీనధారను దెచ్చెను. అదియే భాగీరథీ గంగ యయ్యెను. అదియే దేవప్రయాగకు వచ్చి అలకనందతోఁ గలిసెను. సముద్రమువఱకు రెండును గలిసిపోయెను. మరల భాగీరథి వేఱై సగరపుత్రులను దరింపఁ జేయ బోయెను. అదియే గంగ సాగర మయ్యెను. దేవ ప్రయాగకు వచ్చి కలియు భాగీరథీ; అలక నందలు వేఱు వేఱుగాఁ బ్రవహించుటను మీరిప్పటికిని నుత్తరప్రదేశమున జూడఁగలరు. కావున విష్ణుపదియును, భాగీరథియు, వేఱు వేఱుగ బ్రవహించుచున్నను నొక్కటియే. వీని కేమియును భేదము లేదు. విష్ణువెట్లు సనాతనుఁడో గంగయును సనాతన మైనదే. వీనిలో వెనుకముందులను బ్రశ్నయే లేదు.

సూతుఁడిట్లనెను:–"మునులారా! ఈవిధముగ బ్రహ్మ లోకమునఁ బాదపూజ జరుగుటచే బ్రహ్మ యొక్క మనో రథము పూర్తియయ్యెను. విష్ణుపదియును బ్రకటమయ్యెను. ఈగంగ త్రిలోకములను బావన మొనర్చును. ఆకాశ గంగ రూపమున నిది సదా పైన వాయువెట్లు వ్యాపించియుండునో అట్లు వ్యాపించినది. ఏదైన యంత్ర విశేషము ననే అగంగా కణములను నొక్కచోఁ బ్రోవుచేసిననది హిమమై ప్రత్యక్ష ముగఁ బ్రకట మగును. గంగ కనేక రూపములు కలవు. కొందఱు దానిని భగవంతుని పాదములను గడిగిన చరణో దకమందురు, నారద వీణా గానమును విని భగవంతుఁడు

ద్రవించెనని కొందఱు చెప్పుదురు. దానినే బ్రహ్మ తన కమండలువులోనికిఁ బట్టుకొనినాఁడనియు, నదియే త్రిభువన తారిణియగు గంగయయ్యె నందురు. అందు వలననే దీనిని బ్రహ్మద్రవమను చున్నారు. ఇంతకు సారాంశ మేమనఁగా భగవంతునకును, దీనికిని అభేద సంబధ మున్నదనియే ఋజువగుచున్నది. ప్రభుపాదపద్మములెట్లు సమస్త పాప పర్వతములను క్షణములో నాశ మొనర్చునో. అట్లే గంగాజలమును ప్రాణులయొక్క సమస్తా శుభములను నాశన మొనర్చి, వారినిఁ గ్రమముగఁ బరమ పదాధి కారులనుగా నొనర్చును.

శ్రీశుక దేవుఁడిట్లనెను:—'' రాజా! ఈవిధముగ రెండు పాదముల తోడనే సమస్త బ్రహ్మాండమును గొలిచి భగవానుఁడుతన రూపమును సంకుచితము కావించుకొనెను. మరల నాతఁడు తన ప్రాకృత రూపమునకు వచ్చెను.

వటువగు వామనునిపై నసురుల క్రోధము.

(౫౭౩)

శ్లో ॥అనేన యాచమానేన శత్రుణా వటు రూపిణా ।
సర్వస్వం నోహృతం భర్తుర్న్యస్తదణ్డస్య బర్హిషి ॥
తస్మాదస్య వధో ధర్మో భర్తుః శుశ్రూషణం చ నః ॥
ఇత్యాయుధాని జగృహు ర్బలేరనుచరా సురాః ॥

— శ్రీ భాగ. ౮ స్కం. ౨౧ అ. ౧౧, ౩౧ శ్లో॥

వ. అంతనొయ్యన పూర్వ ప్రకారంబున వామనాకారంబు వహించియున్న వామనుని గని పదత్రయ వ్యాజంబున నితండు సకల మహీమండలంబు నాక్రమించెఁ గపటవటు రూపతి రోహితుండగు విష్ణుండని యెఱుంగక మన దానవేంద్రుండు సత్యసంధుండు గావున మాటదిరుగక యిచ్చె నతనివలన నేరంబు లేదీ కుబ్జుండప్రతిహత తేజః ప్రభావంబున సజ్జనంబుగా నిజ్జగంబులం బరిగ్రహించి పర్జన్యాదులకు విసర్జనంబు సేయందలచి యున్న వాఁడీపాటునిం దూటి పాటనీక నిర్జించుట కర్జంబని తర్జనంబులును గర్జనంబులును జేయుచు వజ్రాయుధాది మరుజ్జేతలగు హేతి ప్రహేతివిప్రచిత్తి ముఖ్యులైనరక్కసులు పెక్కండ్రుక్కుమిగిలి యుద్ధమునకు సన్నద్ధులైరి.''

—శ్రీమదాంధ్ర భాగవతము

తనస్వామి సుఖమునందు సుఖమును, దుఃఖమునందు దుఃఖమును జెందువాఁడే నిజమగు సేవకుఁడు. అతని లాభమే తనలాభమను కొనవలెను. అతని హానియే తనహాని యనుకొనవలయును. అతని హితము కొఱకు ప్రాణముల మీఁద మోహమును ద్యజించి సతతము ప్రయత్న మొనర్ప వలయును. స్వామిసేవయందు ప్రాణముల నర్పింప వలసియుండినను వానిమీఁదగల మోహమును వీడి ప్రాణముల నర్పించును. స్వామి శత్రువును దన శత్రువుగా భావించి సదా వానితో యుద్ధము చేయుట కైనను సిద్ధపడియుండ వలెను

శ్రీశుక యోగీంద్రుఁడిట్లనెను:–"రాజా! ఒక్క అడుగుచే సమస్త పృథివిని, ఒకయడుగుచే సమస్త ఊర్ధ్వలోకములను గొలిచి వామన వటువు మరల యథా ప్రకారముగ మరుగుజ్జువాఁడై యిట్లనెను:–"రాజా! నీవు నాకు మూఁడడుగు లిచ్చెదనని మాటనిచ్చితివి. ఇది రెండడుగు లైనఁ బూర్తి గాలేదు. ఇప్పుడిఁక మూఁడవదానికేమి చేయవలయును ?

బలిచక్రవర్తి లజ్జితుఁడై నిలుచుండెను. ప్రపంచ మంతటను గోల చెలరేగెను. వామనమూర్తి బలిసర్వస్వమును మోసమున గ్రహించెను. బ్రహ్మ బ్రహ్మలోకము నుండి తన యనుచరులతో గబగబ పరువిడి వచ్చెను. లోకపాలురును వచ్చిరి. దాగిన దేవతలు ప్రకటమైరి. అందఱును జల, ఫల, మాలాపుష్ప, గంధాక్షత, ధూప దీపాంకుర, లాజాదులచే భగవంతునిఁబూజించి ఆతనిమహిమనుస్తోత్రములచేగానమొనర్చిరి. చరణామృత పానమొనర్చిరి. భక్తిభాగీరథియందు స్నానమాడిరి. ఆతని విశ్వవందిత విరాడ్రూపమును ధ్యానించిరి. ప్రభువుయొక్క భక్తవత్సలత నభిమానించిరి. వివిధవస్తువుల బ్రాహ్మణులకు దానమొసంగిరి. పెద్దలకును, బ్రహ్మాదులకును సన్మానము కావించిరి. సుందరమధుర పదములతో సర్వతాళ లయాదులచే గానమొనర్చిరి. మాటిమాటికిని జయఘోషములొనర్చిరి. గంధర్వులువాద్యములు వాయించుచుండ నప్సరసలు నాట్యమొనర్చుచుండిరి. అనేకవాద్యము

లను ప్రయోగించిరి. మరల స్వర్గాధిపత్యమును సంపాదించుటకై ప్రయత్నించుచుండిరి. శంఖదుందుభీ నినాదములచే దశదిశలును ప్రతిధ్వనించెను ఆదినములలో ఋక్షరాజగు జాంబవంతు డతి శీఘ్రగామియై యుండెను కావున నాతఁడు దశదిశలందునను, ప్రపంచ మందంతటను, భేరిని వాయించుచు నీపృథివి యంతయును వామన మూర్తిదని చాటించెను. ఆతఁడిట్లు చాటింపును వైచుకొనుచుఁ బోవుచుండెను:—"ఈజగత్తునకు జగత్పతి వామన భగవానుఁడై నాఁడు. ఇది బ్రహ్మాజ్ఞ బలి యిప్పుడు రాజు కాఁడు. త్రిలోకములను నదితి పుత్రుల వశమైనది." ఇంకను వామనుఁడు సంబాళించుకొని కూర్చుండనే లేదు. అప్పుడే వాయువేగ మనోవేగముల తోఁ బోయి యీ కార్యమునొనర్చి హరిసమీపమునకు వచ్చెను.

బలిచక్రవర్తి శాంతుఁడు. భగవంతుని లీలను గాంచిలోలోన నానందించుచుండెను. ఆతఁడు దీనిని లీలాధారియొక్క లీలలనియే భావించుచుండెను. కాని యతని యనుచరులు భగవానునిపై నత్యుగ్రుద్ధులైరి. వారు పరస్పరము 'ఓరీ, ఈతఁడు బ్రాహ్మణుఁడు కాఁడు, దేవాసుఁడు, మాయావి, వేషాలమారి కాఁడు, కపటి, అని యనుకొనుచుండిరి.

ఒకఁడిట్లనెను :—"ఈతఁడు దానమునకును గీకము నకును వచ్చినవాఁడు కాఁడు. యథార్థమున కీతఁడు విష్ణువు.

ఈతఁడు స్వభావముచేతనే అసురులను ద్వేషించుచుండును. ఈతఁడు మాయావి. ఇష్టమువచ్చిన వేషమును వేయఁగలఁడు. ఒకొక్కప్పుడు తాఁబేలగును, ఒకొక్కప్పుడు చేఁపయగును. ఒకప్పుడు సూకరముగను, మఱొకప్పుడు సింహముగను. ఇప్పుడీతఁడు బ్రాహ్మణుఁడై వచ్చినాఁడు. ఈ వేషముచే నీతఁడు దేవతాకార్యమును నిర్వహించుటకు వచ్చినాఁడు. ఇట్టీతఁడు కపటముచే మాస్వామి సర్వస్వమును హరించి యింద్రునకీయఁ గలఁడు.

ఇంకొకఁ డిట్లనెను :—"మన ప్రభువు అమాయకుఁడు. ఈతని ఛలకపటముల నాతఁడెఱుఁగఁజాలఁడు."

మఱియొకఁ డిట్లనెను :— "ఒకవేళ తెలిసికొన్నను నాతఁడేమి చేయఁగలఁడు. యుద్ధమును జేయఁజాలఁడు. ఏల ననఁగా యజ్ఞమందు దీక్షితుఁడగువాఁడు కోపించుటగాని, అస్త్రశస్త్రములను బ్రయోగించుటగాని నిషేధింపఁబడినది. మఱి గుజ్జురూపగు నీవామనుఁడై యీతఁడు యజ్ఞమందు యాచించుటకు వచ్చినాఁడు. మహారాజు గొప్పధర్మాత్ముఁడు కావున నీతని కాతఁడేమియును గాదనఁజాలఁడు. అతఁడు యాచకుని బరాఙ్ముఖుఁ గానర్పఁజాలఁడు. విశేషించి అతఁడు గొప్ప బ్రాహ్మణభక్తుఁడు. బ్రాహ్మణుల కొఱకాతఁడు సమస్తమును జేయఁగలఁడు. ఈకపటి ఆయా బులిబుచ్చికపు మాటలను నాలిగిఁటిని మాటలాడి యీతనిచేఁ బ్రతిజ్ఞ

నొనరింపఁజేసినాఁడు. ఆతఁడు సత్యవాది. ఆతఁడు ప్రాణము నైనఁ బణముగఁబెట్టి ప్రతిజ్ఞాపాలన మొనర్చును కాని యీ వటువు కపటమొనర్చినాఁడు. యజ్ఞదీక్షితుఁడైన మహా రాజును మోసముచేసినాఁడు. ఈ వామనునకు దీనికి ప్రతి కార మొనర్చిన బాగుండునని నాయభిప్రాయము."

నాల్గవవాఁ డిట్లనెను :– "ఓయీ, ఈతనిని యమ పురమునకుఁ బంపుటయే దీనికి ఫలము. ఈగ ముక్కు మీఁదఁగూర్చుండి దానికి రంధ్రమువేయును. అట్టియెడల ముక్కును మొదలంటఁ గోయవలయును ఈ వామనుఁడే లేకున్నచో మరల రెండడుగు లడుగువారెవరున్నారు, మూఁడడుగు లడుగువారెవరున్నారు?"

ఐదవవాఁ డిట్లనెను: – "సోదరా! నీవు నిజముపలికి తివి. మన మిన్నాళ్ళనుండి మన యజమానియొక్క ఉప్పు పులుసును దినుచున్నాము. దానిని జీర్ణింపఁజేసికొనుట కిదియే యదను. అన్నవస్త్రముల నొసంగి సేవకునిఁ బాలనపోషణ మొనర్చువాఁడక్క అక్కఱకే చేయును ఆతని ఋణమును దీర్చుకొనుట కిదియే అదను ఈ మరుగుజ్జువాని నీ విశ్వము నుండి తొలగింపవలయును"

ఈవిధముగ నందఱుఁ బరస్పర మాలోచించుకొని యుద్ధమొనర్చుట కుద్యుక్తులైరి వారుత్సాహమున నిండి తమ తమ యస్త్రశస్త్రములను గైకొని మేఘములు పర్వత

ములపై వర్షమును గురిపించునట్లు వామనునిపై శస్త్రవర్షమును గురిపించిరి. వారు బలినిఁ బ్రసన్నునొనర్చుటకును, దమ స్వామిభక్తినిఁ బ్రదర్శించుటకును శూలపట్టిశాదులను గైకొని యుద్ధముచేయుచున్నను బలికిట్టిది యిష్టముగ లేకుండెను. వామనవేషధారియు, ద్విజుఁడునైన విష్ణువుమీఁదఁ బ్రహారమొనర్చుట ఆతని కణుమాత్రమైనను నిష్టములేకుండెను వారందఱును దమ స్వామియొక్క అభిప్రాయమును దెలిసికొనకయే యిట్టి సాహసమొనర్చుచుండిరి. నంద సునంద, జయవిజయాది ప్రియపార్షదులు అసురులు యుద్ధము చేయుటకు వచ్చుటను గాంచఁగానే వారిని వారు వామనుని కడకుఁ బోనీయలేదు. మధ్యలోనే అడ్డగించిరి ఇప్పుడు బలియొక్క అనుచరులకును విష్ణుపార్షదులకును యుద్ధము చెలరేగెను. అసురసేనలోఁ బ్రబల పరాక్రమవంతులగు సేనాపతులు విప్రచిత్తి, రాహువు, కాలనేమి మొదలగు వారుండిరి. అటు పదివేల యేనుగులకంటెను మించిన బలము కల నంద, సునంద, జయ, విజయ, ప్రబల, బల, కుముద, కుముదాక్ష, విష్వక్సేన, గరుడ, జయంత, శ్రుతదేవ, పుష్పదంత, సాత్వతాది విష్ణుపార్షదులు డిరి. వీరసురులను బీచమడంచిరి. చాలమందినిఁ జంపిరి కొందఱను గాయపరచిరి. చాలమంది యుద్ధమును వీడి పాఱిపోయిరి.

బలిచక్రవర్తి యుద్ధము జరుగుచుండుటను గాంచి శీఘ్రముగ నచ్చటకుఁబోయి, తన సేనాపతులను సంబోధించుచు నిట్లనెను :– "ఓయీ విప్రచిత్తీ! రాహూ! కొంచెము నామాట వినుఁడు మీరొనర్చుచున్న గడబిడ, రద్దియేమిటి? యుద్ధమునకును వేళయుండును నిర్బలుఁడును, సబలుఁడును నెవఁడును లేడు. ఎప్పుడైనను గాలమే ఒకానొకని దుర్బలునొనర్చును. కాలమే ప్రబలమొనర్చును. కాలమనకూలమైనపుడు ప్రయత్న మొనర్పకున్నను ననాయాసముగఁ గార్యములుసిద్ధించును; కాని కాలము ప్రతికూలమైనపుడు ప్రయత్న మొనర్చినను నోడిపోవలసివచ్చును ఈసమయము మనకను కూలమైనది కాదు కావున యుద్ధమొనర్చిన నేమియును లాభము లేదు"

విప్రచిత్తి క్రోధముతో నిట్లనెను:– "ప్రభూ! మేము మా ప్రబల ప్రయత్నముచే నీ విష్ణుపార్షదులను బారఁద్రోలెదము"

బలిచక్రవర్తి గంభీరుఁడై యిట్లనెను :– "ఓయీ! పురుషప్రయత్నము సమస్తస్థానములందునను, సర్వకాలములందును బనిచేయదు దానికిని సమయముకలదు కాలమే ప్రాణులకు సుఖదుఃఖాదులనొసంగ సమర్థమైయుండును. దానినెవఁడను దన ప్రయత్నముచే జయించి విజయమునుబొందఁజాలఁడు. ఒకానొకప్పుడు దేవతలు మన పేరును వినఁగానే

భయపడి యుద్ధమొనర్పకయే స్వర్గసంపత్తునంతను వదలి పారిపోయిన రోజులుకలవు. నేఁడీ దేవతలందఱును నన్నుఁ జుట్టుకొని ఘృణితదృష్టితోఁ జూచునట్టి కాలమాసన్నమైనది. నాస్థితినిఁ జూచి నవ్వుచున్నారు. రాహువిట్లనెను :– "మహా రాజా! కపటితోఁ గపట మొనర్చుటలో దోషము లేదు. వీరిని మేము బలపరాక్రమముల చే జయింపఁజాలకున్నచో, మా గురువులతో నాలోచించి, గొప్ప గొప్ప బుద్ధిమంతుల యొక్క విచిత్రబుద్ధి సహాయముచే వీరితో మాయాయుద్ధ మొనర్చెదము. కోటలోపలఁ గూర్చుండి పైనుండి వీరిని జంపెదము. గొప్ప గొప్ప అభిచార మంత్ర, తంత్ర, మాయా, మోహనాదుల నొనర్చువారినిఁబిలిచి, వారిచే మారణ, మోహన, ఉచ్చాటనాది ప్రయోగము లొనరింపఁ జేయుదము లేదా వీరు వారంతటవారే యుద్ధమొనర్పకయే చచ్చునట్లు వీరి భోజనములందునను, జలమందును నేదైన మారణౌషధమును గలిపెదము. లేదా సామదానాదులచే వీరిని వశపఱచుకొందుము."

బలి నవ్వి యిట్లనెను :– 'నాయనలారా! ఈయుపా యము లన్నియును ననుకూలపడినప్పుడే సఫలమగును. ప్రతి కూల కాలమున బల, మంత్రి, బుద్ధి, దుర్గ, మంత్రౌషధ, సామ, దాన, భేద, దండోపాయము లేవియును బనిచేయవు. అన్నియును విఫలమగును. విధాత ప్రతికూలమైనపు డివి యన్నియును వ్యర్థములగును."

రాహు విట్లనెను :- "స్వామీ! ఈ దేవతలును, విష్ణుపార్షదులు నొక లెక్కయా? మేము వీరినెన్నిసార్లు యుద్ధములో నోడించితిమి. వీరెన్నిసారులో వీపును జూపి పారిపోయిరి."

బలి యిట్లనెను :- "తరిమినపుడు తరిమితిమి. ఆ కాలము మనకనుకూలముగనున్నది. మీరనేక మారులీ పార్షదులను జయించితిరను విషయమును నేనెఱుగుదును. కాని నేడు జయింపజాలరు. నేడు భగవంతుడు మనకు ప్రతికూలుడుగనున్నాడు అట్లు ప్రతికూలము కాకుండిన సదా మనకు మనోవాక్కాయ కర్మలచే శుభమును గాంక్షించు మన గురుదేవుడు ప్రతికూలుడేల కాగలడు? ఐశ్వర్యహీనులమగునట్లు మనకు శాపము నేల యొసంగును? మాచేత నూ అశ్వమేధ యజ్ఞములను జేయించి శాశ్వత యింద్రునిగా నొనర్ప వ్యగ్రుడై, ప్రయత్నశీలుడైన మన గురువే నేడు మనము పతనమగునట్లు శాప మొసంగినాడు. కావున నిప్పుడు యుద్ధమొనర్చుట వ్యర్థము. కాలమును ప్రతీక్షింపుడు. మన కనుకూలకాలము వచ్చినపుడు యుద్ధమును చేయుదము. అప్పుడు మీకు మరల విజయము కల్గును?

అసురు లిట్లనిరి :- "అయితే ప్రభూ? మే మేమి చేయవలెను?"

బలి యిట్లనెను :- "ఇప్పుడు భగవానుఁడెచ్చట నుంచిన నచ్చటనుండవలెను. ఇప్పుడు మీరు యుద్ధమును చేయ వలదు. ఇప్పుడు మనకు భూమిమీద నుండుటకును నధి కారము లేదు."

శ్రీ శుకదేవుఁడిట్లనెను: - "రాజా! సత్యవ్రతుఁడును, దృఢప్రతిజ్ఞకలవాఁడును, జ్ఞానియు, స్వామియునగు బలి వాక్యములను విని అసురులందఱును సమరవిముఖులైరి. దుర్మదులగు నా దైత్య దానవ యూథపతుల శరీరములు విష్ణుపార్షదుల ప్రబలప్రహారములచే క్షతవిక్షతములయ్యెను. వారిలోఁ జాలమంది అప్పటికప్పుడే రసాతలమునకుఁబోయిరి. కొందఱు తమ ప్రభువుతోనుండిరి.

మూఁడవ యడుగు కొఱకు బలి బంధనము

౫౭౪

శ్లో॥ అథ తార్క్ష్యసుతో జ్ఞాత్వా విరాట్ ప్రభుచికీర్షితమ్।
బబంధ వారుణైః పాశైర్బలిం సౌత్యేఽహని క్రతౌ॥
హాహాకారో మహానాసీద్రోదస్యోః సర్వతో దిశమ్।
నిగృహ్యమాణేఽసురపతౌ విష్ణునా ప్రభవిష్ణునా॥

—శ్రీభాగ. ౮ స్కం. ౨౧ అ. ౨౬,౨౭ శ్లో॥

వ. ....హరి హృదయంబెఱింగి తార్క్ష్యనందనుండు యాగసుత్యాహంబున వారుణ పాశంబుల నసురవల్లభుని బంధించె నంత.

క॥ బాహులుఁ బదములుఁగట్టిన
శ్రీహరి కృప గాక యేమి సేయుదు నని సం
దేహింపక బలి నిలిచెను
హాహారవ మెసఁగె దశదిగంతము లందున్ ॥

—శ్రీమదాంధ్ర భాగవతము.

బంధనము దుఃఖమునకుఁగారణమగును. ఆబంధనము సత్య, ధర్మ బంధనమగుచో దానివలన సుఖకరమగు నొకవిధమైన నాత్మ సంతోషము కలుగును. ప్రపంచములో సత్య ధర్మకారణమునఁ గలుగు దుఃఖము, వాస్తవమున నది దుఃఖమే యగుచో, ధర్మము కొఱకు యుధిష్ఠిరుఁడు, హరిశ్చంద్రుఁడు, శిబి, దధీచి మొదలగు రాజర్షులును బ్రహ్మర్షులు నింతటి దుఃఖము నేల సహించెదరు. రఘుకులమండనుఁడును, దూర్వాదళ శ్యాముఁడను నగు శ్రీరామచంద్రుఁడిట్టి దుఃఖకరుణా సరిత్తు నేలఁ బ్రవహింపఁ జేయును? కమల కోమలములగు దన నగ్న చరణారవిందములను నొకవనమునుండి మఱియొక వనమునకు కాలి నడకతోఁ దిరుగుచు వానినిఁగంటకా విద్ధమేలఁగావించు కొనును! ధర్మము కొఱకు సహించు కష్టము నందును సుఖము

కలదు. దానిలో యశఃకీర్తులును, పారలౌకిక సుఖ సంతో
షములును సన్నిహితములై యున్నవి.

శ్రీశుక దేవుఁడిట్లనెను:—"రాజా! వామన మూర్తి
విరాట్టై రెండడుగులలో బలియొక్క సమస్త లోకములను
గొలిచెను. కొలుచుకొని మరల నాతఁడట్లే మరుగుజ్జు వటు
వయ్యెను. ఇచ్చట నసురులు విష్ణుపార్షదులమీఁదఁ గ్రుద్ధులై
యుద్ధము చేయ నంత బలి చెప్పుటచే వారు పాతాళమునకుఁ
బోయిరి. అప్పుడు వటు భగవానుఁడు భిక్షుకుఁడు ధనికుఁ
డయ్యెను. ఆతఁడు కనుసన్నలతో వినతా నందనుఁడును
దనకు వాహనమునగు గరుడుని బిలిచి 'యిప్పుడీ బలిని
వరణపాశములచే బంధింపు' మనెను. గరుత్మంతుఁడు పక్షి
యాయెను. ఆతనికి దయ యెక్కడిది? ఆతఁడు భగవంతుని
సైగచేతనే వెంటనే మహా యశస్వియును, బరమ జ్ఞానియు
నగు బలిని వరుణ పాశములచేఁ గట్టివైచెను.

విధి విడంబన మెట్టిది? ఇంత వఱకును త్రిభువన
శాసకుఁడైనవాఁడును, ఎవని నామమును జెప్పిన నింద్రాది
దేవతలు గడగడ వణఁకు చుండురో, ఎవని వచనములు
వేదవాక్యముల వలె నెన్నఁబడు చుండినవో, ఎవని సేవ
యందు వేలకొలఁది సురసుందరులు సదా సముపస్థితులై
యుండెదరో, అట్టివాఁడు నేఁడు వరుణ పాశములచేఁ గట్టఁ
బడి నిలువఁబడినాఁడు. ఆరోజు యజ్ఞమునకుఁజాలముఖ్యమగు

దివసము. ఆదినమున యజమానుఁడు దేవతల తోడను, ఋత్విక్కులతోడను, సదస్యులతోడనుసోమపానమొనర్చును. అదిసోభాభిషవక దినము. పశుయజ్ఞములందునను, సోమ యజ్ఞములందును నది సర్వశ్రేష్ఠ దివసముగ నెన్నఁబడు చుండును. నేఁడాదినముననే ధర్మాత్ముఁడగు బలి బంది యయ్యెను. తార్క్ష్య నందనుఁడగు గరుడుఁడాతని గట్టిగా బిగించి కట్టెను. ఆతఁడు శ్రీహీనుఁడై నప్పటికిని, ఆతని సర్వస్వమును ఛలమున హరింపఁబడినను, ఉదారకీర్తియును, స్థితప్రజ్ఞుఁడును, జ్ఞానియునగు విరోచనసుతుఁడు అవిచలభావ ముతో నిలుచుండెను వామనమూర్తి ఆతనినిఁ జేతనైనంత వఱకు ధర్మమునుండి విచలితునిఁ గావింపఁదలఁచెను, కాని ఆతఁడు విచలితుఁడు కాలేదు.

అప్పుడు నవ్వి వామనుఁడిట్లనెను:—"ఓయీ! దాత లలో శ్రేష్ఠుఁడవగు నో మహారాజా! నీవు నాకు మూఁడడు గుల పృథివిని దానమొసంగెద నంటివా లేదా?"

చేతులు జోడించుకొని బలి యిట్లనెను :—"ప్రభూ! నేనెప్పుడు కాదంటిని. నేను నాప్రతిజ్ఞ యందు స్థిరముగ నున్నాను."

కపటియగు వామనుఁడిట్లనెను:— "స్థిరముగ నుండి నచో నీయుమయ్యా!నీప్రతిజ్ఞను బూర్తి కావించుకొనుము. సూర్యతాపమున్నంత వఱకును, గ్రహ, నక్షత్ర, చంద్ర

ప్రకాశమున్నంతవఱకును, మేఘము వర్షించునంత వఱకును నీవాభూమికధిపతివి. దీనికంతర్గముగ నున్నలోకములన్నిటి యందును నీకధికారమున్నది. నీవు చూచితివి కదా! నేనొక పాదమున సమస్త పృథివిని, శరీరముచేత నాకాశమును, చేతులతో దిశలను గొలిచితిని. నీరాజ్యమంతయును రెండడుగులలోనే పూర్తియైనది. ఇప్పుడికను మూఁడవయడుగు నీవు నాకు బాకీ యున్నావు. ఇప్పుడిఁక దాతృగృహోత్రుల సంబంధము లేదు ఇప్పుడు నీవు నాకు బంధితుఁడవు. నా ఋణమునొసంగుము. నామూఁడవ యడుగు కొఱకు పృథివినిఁ జూపింపుము అప్పుడు వదలి పెట్టఁగలను. నేనసత్యవాదినా? చెప్పుము."

బలి యిట్లనెను:—"స్వామీ! నేనబద్ధమాడుట లేదు, నే నీయననుట లేదు."

వామనుఁడిట్లనెను :— "అయ్యా! అబద్ధమేమున్నది? మనమొకానొకనితో నీకింత సవర్శ్యమొసంగెదనని చెప్పి, యిచ్చునపుడు దానికంటెఁ దక్కువగ నొసంగినచో నది అబద్ధముకాలేదా? అది విశ్వాసఘాత మొనర్చుటయే కాఁగలదు. ప్రతిజ్ఞ నొనర్చిన వస్తువు నీయకున్నచోఁ జిరకాలము వఱకు నరకాగ్ని యందు తపింపవలసి వచ్చును. నీవునాకు మూఁడవ యడుగునకు స్థానమును జూపింపుము. లేదా నరక వాయువును భక్షింపుము. నేనబద్ధమును జెప్పుట లేదను సంగతిని నీగురువు నడిగి తెలిసికొనుము."

బలి యిట్లనెను:—“ స్వామీ! గురువు నేమడుగుదును. ఆతఁడంతయును మొదటనే చెప్పియున్నాఁడు. మీవిషయములనన్నింటినిఁ దెలిసికొని నాఁడు. మీ యథార్థరూపమును దిగ్దర్శన మొనర్చియుండెను ; కానినేనే నాప్రతిజ్ఞనుండి విచలితుఁడనగుట మంచిది కాదనుకొంటిని.”

భగవానుఁడు వ్యంగ్యస్వరమున నిట్లనెను:—“ఉచిత మనుకొనకుండినచో నిప్పుడనుభవింపుము. ఇదివఱకు నీవు గర్వమున నిండి నేనే శ్రీసంపన్నుఁడనను కొంటివి. “నేను మూఁడడుగుల భూమినొసంగెదను, అవశ్య మొసంగెదనని మాటిమాటికిని గట్టిగాఁబలికితివి. ఇప్పుడు తలను వంచు కొంటివేల? నీప్రతిజ్ఞను బూర్తికావించుకొనుము. యాచకునకుఁ బ్రతిజ్ఞను గావించియును, నాతనికా వస్తువు నీయఁ జాలక, వానికి విశ్వాసఘాత మొనర్చినచో మిథ్యా భాషణదోష కారణమున నాతఁడు నరకమునకుఁ బోవలసివచ్చును. నీవు నాకు వాగ్దాన మొనర్చియును దానినిఁబూర్ణ మొనర్పఁ జాలకున్నావు. కావున కొన్నాళ్లు నీకు అధోలోకములందు వాసము కలుగుఁగాక! పృథివికి క్రిందనున్న నరకములు నీకు నివాసస్థానముగుఁ గాక! ఇప్పుడు నీవు చాలకాలము వఱకు స్వర్గసుఖములను భోగించితివి. ఇప్పుడు స్వర్గమునుండి పృథివి వఱకు గల సమస్తలోకములను నాకు దానమొసంగితివి. ఇప్పుడు నేను నీకెచ్చటస్థానమొసంగెదనో, అచ్చటికి పోయి

నీబంధు బాంధవుల తోడను, జ్ఞాతులతోడను, సుహృదుల తోడను బోయి యుండుము."

శ్రీశుక దేవు డిట్లనెను :- "రాజా! ఈవిధముగా వామనుఁడు బలికి క్రోధమును దెప్పించుచు, నాతనినిఁగఠినముగఁబరీక్షించుటకై ఆతనితో మిక్కిలి కఠినవాక్కులను బలికెను. ఆతని ననేక విధముల ధిక్కరించెను; కాని యీ విధముగ మాటి మాటికినిఁ దిరస్కరింపఁ బడినప్పటికిని నాతఁడు సత్యమునుండి అణుమాత్రమును జారిపోలేదు. స్థిరముగఁదన ప్రతిజ్ఞయందు దృఢముగ నుండియు నా యసురరాజును, మహామనస్వియునగు బలి గంభీరుఁడై భగవంతుని మాటలకుఁ బ్రత్యుత్తర మొసంగుటకు ద్యుక్తుడయ్యెను.

బలిచక్రవర్తి వినయము

(౨౭౨)

శ్లో॥ యద్యుత్తమ శ్లోక భవాన్ మమేరితమ్,
వచోవ్యలీకం సురవర్య మన్యతే।
కరోమ్యృతం తన్న భవేత్ ప్రలంభనమ్,
పదం తృతీయం కురు శీర్ష్ణి మే నిజమ్

శ్రీభాగ. ౮స్కం. ౨౨అ. ౨శ్లో॥

ఆ॥ సూనృతంబు గాని నుడియదు నా జిహ్వ
బొంకఁజాల నాకు బొంకు లేదు
నీతృతీయ పదము నిజము నాశిరమున
నెలవు సేసి పెట్టు నిర్మలాత్మ॥

శ్రీమదాంధ్ర భాగవతము.

ధైర్యపరీక్ష ఆపత్కాలమందే జరుగును. అందఱును దమకుఁ దాము ధైర్యవంతుల మనుకొనుచుందురు కాని ఘోరసంకటము ప్రాప్తించినను నెవఁడు విచలితుఁడు కాకుఁడునో ఆతఁడే ధీరవీరుఁడనఁబడుచుండును. అవమాన మొనర్చినను నెవఁడు క్రోధమును జెందఁడో ఆతడే సహనసీలుఁడనఁబడును. ఒక మహాత్ముఁ డొకనికడకు భిక్షము నడుగఁబోయెను. ఆతఁడీతసని బిలిచి యిట్లనెను :– 'నీవింతగా బలిసియుండియును దిరుగుచున్నావు. నీకు భిక్ష మడుగఁకొనుటకు సిగ్గగుట లేదా? పద పద యిచ్చటినుండి' ఇది విని మహాత్ముడు తిరిగి వెడలి పోయెను. ఆతడు మరలఁ బిలిచి యిట్లనెను:– "నీపాపము పండుటచే మరల దిరిగి వచ్చితివి. ఏ పరిశ్రమయును లేకయే వ్యర్థముగ భోజనము దొఱకినఁ దిని శ్మశానములోని కుక్కవలె బలిసినావు. పోపో" మహాత్ముఁడిది విని తిరిగి పోయెను. ఆతఁడు మరల పిలిచి మరల త్రిప్పి పంపెను. చివర కాతఁడు మహాత్ముని పాదముల మీఁదఁ బడి యిట్లనెను:– "మహాత్మా!

మిలా సహనశీలత ధన్యమైనది. ఇ తటి యవమానము లైనను నిర్వికారుడవై సహించితిరి."

అంత మహాత్ముడిట్లనెను :— "నా య నా! నా సహన శీలత యేమున్నది. కూటికొఱకు కుక్కయును నింతటి సహనశీలతను గలిగి యుండును. తన సర్వస్వమును విశ్వామిత్రునకు దానమొసంగి, దానసాద్గుణ్యార్థ మొసంగు దక్షిణ కొఱకు విశ్వామిత్రుని కొరడా దెబ్బలను సహించిన హరిశ్చంద్ర చక్రవర్తిదే సహనశీలత. తన ప్రాణప్రియయగు భార్యను దాసీగా బ్రాహ్మణున కమ్మినాడు, పసివాడగు రాజకుమారునిగూడ కొంచెముగ ద్రవ్యమునకై కొని అమ్మినాడు. తాను స్వయముగ జండాలునకమ్ముడువోయెను. ఇట్లయ్యును విశ్వామిత్రుని దెబ్బలు మొదలగు వాటిని సహించుచుండెను. ఒక్క శబ్దమైనను నోటినుండి వెలువడ లేదు. యాచకునకు దానమొసంగియును నాతని దండమును సహించు వారు లోకములో నరుదుగనుందురు. బలి, హరిశ్చంద్రుడు వీర లిద్దరే ప్రపంచములో నాదర్శముగ నుందురు."

శ్రీ శుకదేవుడిట్లనెను:—"రాజా! వామన వటువు విరాడ్రూపమును ధరించి బలిచక్రవర్తి సర్వస్వమును నపహరించెను. రెండడుగులలోనే ఆతని సమస్త రాజ్యమును గొలుచుకొనెను. ఇప్పుడొక్క పాదము కొఱకు పట్టుపట్టుచుండెను. లోభము యొక్క పరాకాష్ఠనందుకొనెను. ఈతని

సర్వస్వమును బోయినది, ఒక్క అడుగునకు శిక్షించవచ్చు నను దయయును లేకుండెను ఆతనికిఁ గావలసిన దీతనినిఁ దపింపఁజేయుట విశుద్ధమును, నిర్మలముగు సువర్ణముగ నొనరించుట గరుడునిచే నీతని బంధింపఁజేసెను. అనరాని మాటలనెన్నింటినో పలికి తిరస్కారమును గావించెను. "స్వామీ! నావద్ద నింకేమియును లేదు, నేనేమి చేయఁగల నని బలి స్వయముగ ననుచున్నట్లు చేయవలయునని చాల ప్రయత్నమును గావించెను.

బలిచక్రవర్తి ధీరుఁడు, వీరుఁడు, జ్ఞాని, యశస్వి, మనస్వి, స్థితప్రజ్ఞుఁడు అందువలన నాతఁడు వామనుని యెట్టి కఠిన వాక్యములను వినియును విచలితుఁడు గాలేదు. ఆతని మాటలకు సమాధాన మొసంగుచు నిట్లనెను:—"స్వామీ! మీ పవిత్రకీర్తి విశ్వబ్రహ్మాండమందు వ్యాపించినది. కృష్ణుఁడవై మీరేమేమి కౌతుకములు చేయలేదు? మీరెన్నెన్ని విచిత్ర వేషములను వేయలేదు లోకమంతయును నీయశము నెఱుఁగును. మీరింద్రునకు తమ్ములైతిరి గాని సమస్త దేవతలకంటెఁ బెద్దవారు. నేను మూఁడడుగుల భూమి దానము నీయలేదని నాచేత మాటిమాటికేల ననిపించఁ దలఁచెదరు? నేను మూఁడడుగుల నిచ్చెదనంటిని, ఇచ్చెదనంటిని, ఇచ్చెదనంటినని ఢంకామీఁద దెబ్బ కొట్టి చెప్పఁగలను. దాని నొసంగెదను. అవశ్య మొసంగెదను. అవిలంబముగ నొసంగెదను.

వామన వటువు శుష్క హాసమొనర్చి యిట్లనెను:- "ఇప్పుడెచ్చట నుండి తెచ్చియిచ్చెదవోయి? నీకుండిన రాజ్యము, సామి, అధికారము, భూమియందంతటను గల ధన ధాన్యములును సమస్తమును నావైనవి. ఇప్పుడు నీవు మూఁడవ యడుగు కొఱకు బ్రహ్మాండమునకు బయట నెచ్చట పృథివి నేర్పఱచెదవు?"

బలి యిట్లనెను:- "స్వామీ! దాతయొకఁడు కలఁడు. దానవస్తువొకటియుండును. మనము గోదానమొనర్చినచో గోదానముతోఁబాటుగాఁ దనను దానమొనర్చుట యుండదు. నేను నా పృథివినే దానమొసంగితిని. నేనింకను మిగిలి యున్నాను. మూఁడవ యడుగును నా శిరస్సునఁ బెట్టి నను గొలుచు కొనుఁడు." నన్ను మీ క్రీత దాసునిగ నొనర్చు కొనుఁడు.

వామనుఁడు నవ్వి యిట్లనెను:- "మిక్కిలి దీనతా వచనములను బలుకుచున్నావే బలీ! భయ పడితివా యేమి?"

దృఢతా స్వరమున బలి చక్రవర్తి యిట్లనెను:- "స్వామీ! మీరు మాటిమాటికిని భయమును గూర్చి చెప్పుచున్నారు. మీరు నాకు మాటి మాటికిని నరక భయమును బెట్టుచున్నారు; ఆ నరకమనిన నాకిసుమంతైన భయము లేదు నాకు నరక స్వర్గములు రెండును సమానములే. 'నీవింక రాజవు కావు నీవింక రాజవు కావని మీరనుచున్నారు. నేను

రాజునుగాను. రాజున కేమి? తెక్కు-లుండునా? సాధారణుఁడేమి తినునో రాజును నదియే తినును. అతఁడును నితరులవలె వస్త్రములచే శరీరమును గప్పుకొనును. ఆకని లేపుటకు ప్రయోగించు భేరినందఱును వినుచుందురు. ఒకదినమున నేను రాజ్యచ్యుతుఁడనై గాడిదనై తిరిగితిని.అప్పుడింద్రుఁడు నన్నుఁ గాంచి నవ్వెను. నేఁడింద్రుఁడును నట్లే తిరుగు చున్నాఁడు. ఈ రాజ్యపదవి రథ చక్రమువలెఁ బైకిని క్రిందకును దిరుగుచుండును. కావున నాకు పదచ్యుతియైనదను దుఃఖము లేదు. మీరు నన్ను గరుడుని ద్వారా వరుణపాశములచే బంధింపఁ జేసితిరి దీనివలన నాకు జెడిన దేమున్నది? ''నీ సర్వస్వమును హరించి, నీకు దుస్తర దుఃఖముల నొసంగి, దుస్సహ దండము నొసంగి నిన్ను నరకమునకు బంపెద'' నని మీరు నన్నుచున్నారు. పంపుఁడు మీయిష్టము. దీనికి నేను భయపడు వాఁడనుగాను. ప్రహ్లాదుని పౌత్రుఁడు వటువగు వామనునకు మూఁడడుగుల భూమినొసంగెదనని సంకల్పమొనర్చి దానిని బూర్తి చేయఁజాలక పోయినాఁడని లోకు లనఁగల రేమోయని భయపడు చున్నాను. బ్రాహ్మణ సంబంధమున వచ్చిన యపకీర్తిని గూర్చియే నాకు భయము.''

లోలోన నానందించుచుఁ బైకిరూక్షముగ వామనుఁ డిట్లనను:—''దైత్యరాజా! నేను నీయైశ్వర్యమును నశింప జేయక శాంతింపను. నీవు దానమును నెఱవేర్చకుండిన వోఁ గఠినాతి కఠిన దండము నొసంగెదను.''

నవ్వి బలి యిట్లనెను:—"స్వామీ! ఏమనుచున్నారు. మీరనిన దేమి? ఇవ్వకున్న దండనమా? అశరణ శరణా! నేను మీదండమును బొంది అది నా భాగ్యమను కొందును. మీ బోటి పూజ్యతములవలన దండమును బొందుటది సౌభాగ్యమని కొందును. విశ్వంభరా! గొప్ప వారిచే దండనము భాగ్యశాలురకే ప్రాప్తించును. పాపులును, సహనశీలము లేనివారును, అసదాచారులును గురుజనుల దండమునకు వంచితులగుదురు. మోహ కారణమునఁ దల్లియును, దండ్రియును, సోదరులును, సుహృదులును యథేష్టముగ దండము నొసంగరు. సదా హితమును గాంక్షించువారును, సమస్తవిధముల విద్యను నేర్పువారును, బరమార్థ పథమును జెప్పువారునగు గురువులే దండము నొసంగుదురు. మీరు మా యసురులకు గురువులరే కారు, పరమ గురువులు."

వామనుఁడిట్లనెను:—"గురువు మీ శుక్రాచార్యుఁడు. నే నెప్పుడు నీకు దీక్ష నొసంగితి నయ్యా?"

నవ్వి బలి యిట్లనెను:—"స్వామీ! చెవులలో మంత్రము చెప్పుట చేతనే గురువు కాఁడు. దీక్షా గురువు లెట్లో శిక్షా గురువులు నట్లే యుందురు. మీరు మాకు ప్రత్యక్ష రూపమున దీక్షనీయకున్న నీయకుందురుగాక, కాని పరోక్షరూపమున నిశ్చయముగ మీరు మా యసురులకుఁ బరమ గురువులు."

భగవానుఁ డిట్లనెను:—"గురువు పని జీవన దాన మొనర్చుటయా లేక చంపుటయా!"

బలి యిట్లనెను.—"పరమ గురూ! మీరు చంపియును జీవన దాన మొనర్చెదరు. మీ క్రోధమును వరదాన తుల్యమే. మీరు మా యైశ్వర్య నాశన మొనర్చుటయును మా హితము కొఱకే. అనేక విధమునగు మదములచే మదోన్మత్తులమై అసురగణమగు మేమంధులమగుచుందుము. మీ యైశ్వర్యనాశన మను అంజనము ను బెట్టి మాకు ప్రకాశ ప్రధానమును గావించుచున్నారు. మా బుద్ధిని యథా స్థానమునకుఁ దెచ్చుచుందురు. మీతో వైరమును బెట్టుకొనిన దైత్యులును ప్రపంచములోఁ బ్రసిద్ధినిఁ జెందిరి. మీ చేతఁ జచ్చి వేలకొలఁది వత్సరములు ఘోర తపంబొనర్చెడు యోగులును దపస్వులకు సులభముగఁ బొందరాని దుర్లభ పరమపదమును బొందిరి. కావున మీతో వైరమును బెట్టు కొన్నను నసురులకు మేము బ్రదికిన రాజ్యము, చచ్చిన మోక్షము. కొలఁదులచే సన్మానమును బొందుటయును శ్రేష్ఠము కాదు. గొప్పవారిచేఁ బరాజితులగుటయును నవమా నితులగుటయునను త్తమమే. కావున నేను మీచే బంధింపఁ బడుటచే విశేషలజ్జను జెందుటలేదు, సర్వస్వమపహరింప బడుటచే దుఃఖమును జెందుటలేదు. బయటవారై యుండిన లజ్జింప వలసియుండెడిది. మీరు నాకు సంబధించినవారే."

నవ్వి వటువామనుఁ డిట్లనెను:-"నాకును నీకును నేమి సంబంధమయ్యా?" బలి తనమాటను బలపఱచుకొనుచు నిట్లనెను:-"మీకును నాకును మిక్కిలి ఘనిష్ట సంబంధము కలదు స్వామీ! నా పితామహుఁడును, పుణ్యశ్లోకుఁడు నగు ప్రహ్లాదుఁడు మీకు నిజభక్తుఁడు, ప్రియపార్షదుఁడు. మీరాతని స్వామియైనపుడు, నాస్వామికి స్వాములైతిరి. పూజ్యులకును బూజనీయులైతిరి. అతఁడు మీ చరణార విందముల నాశ్రయించినాఁడు కావుననే ఆతని కీర్తి నేటికినిఁ బ్రపంచమున వ్యాపించి యున్నది."

భగవానుఁ డిట్లనెను:-"ఆతఁడు భగవద్భక్తియొనర్చి తండ్రినుండి విడిపోయినాఁడు. నరహరి ఆతని తండ్రినిఁ జంపినాఁడు. స్వజన వియోగ మొనర్చుటయేనా భక్తి ఫలము?"

బలి కన్నుల నీరునించుచు నిట్లనెను:-"ప్రభూ! మీ చరణ సంయోగము కలిగిన స్వజన వియోగ మేమి లెక్క! మా పితామహుఁడు మహాజ్ఞాని. ఈ స్వజన రూపులగు దొంగల వలన నేమియు లాభము లేదని ఆతఁడు తెలిసికొనినాఁడు. స్వజను లేమి చేయుదురు? మా యిహ లౌకిక ధనమును హరించి, మోహమును బెంచి, పర లోకమును నాశ మొనర్తురు మరల మరల సంసారమునఁబడవేయుదురు. ఎవరిని స్మరించి ప్రాణములను వదలుదమో వారికడ జన్మింప వలయును. ఈ స్వజన పరివారములు పరమార్థమునకు శత్రు

వులు. మనము ప్రాణముల కంటెఁ ప్రియముగ భావించు భార్యయే జనన మరణరూపమగు సంసారమునకుఁగారణము. ఎవని శిరస్సున నిత్యం నిరంతరమును మృత్యువు తాండవించు చుండునో అట్టివానికి సాంసారిక సంబంధములేమి మేలు చేయ గలరు.? అని యిట్లాలోచించుకొనియే మా పూజనీయు పితా మహుఁడు పరమాత్మయగు మీ పునీతపాదపద్మముల నాశ్ర యించినాఁడు. మీ కనుచరుఁడై యా యసురవరుఁడమరుఁడై నాడు, అతని కీర్తి అక్షుణ్ణమైనది. అదే విధముగ నేనును మీ యరుణ చరణములను శరణు జొచ్చి యీ భవసాగర మును దాటెదను. అనేకముగానున్న మీ ప్రియపార్షదుల లోన కించనుఁడనగు నన్నును లెక్కలో వైచుకొందురు గాక ! మీరు నాకు మేలే యొనర్చితిరి.''

వామనుఁ డిట్లనెను:-'' నేనేమి మేలొనర్చితిని? నేను నీధన వైభవములను బలవంతముగ వంచించి గ్రహించి భిక్షు నొనర్చితిని!''

బలి నిస్పృహాతో స్వరమున నిట్లనెను:-''ప్రభూ! ఈ సాంసారిక ధనవైభవములలో నేమున్నది? వీనినిఁబొంది, మానవుఁడు మదోన్మత్తుఁడగును. చివరకు వీనినన్నిటిని నిచ్చటనే త్యజించి మృత్యుముఖమునఁ బడును. కావున నో దేవా! మీరు శత్రువులరై నాకడకు వచ్చినను మీరు నాకు పరమ మిత్రులరే. భాగ్యవశముననే నాకు మీ దేవ

దుర్లభ దర్శన మైనది. ఇప్పుడు నా సంసారచక్రము శాశ్వతముగ వదలిపోఁ గలదు. ఇప్పుడు నేనీ యెనుబదినాల్గులక్షల జీవమాయలోఁబడఁబోను. ఇప్పుడు నేను సమస్త ఆధివ్యాధుల నుండి విముక్తుఁడనైతిని. నేనుద్ధరింపఁబడితిని మీరు కృపతో నన్నుఁ గృతార్థునిఁ గావించితిరి."

శ్రీ శుకదేవుఁ డిట్లనెను:—"రాజా! బలి చక్రవర్తి వామన మూర్తి శ్రీముఖమున నీవిధమగు వినయవచనములను బల్కునంతలో వైకుంఠమునుండి ఆతని పితామహుఁడును, పరమ భాగవతోత్తముఁడునగు ప్రహ్లాదుఁడు తన పౌత్రునిఁ జూచుటకును, వటువగు వామనుని దర్శించుటకును నచ్చటికి వచ్చిచేరెను."

ప్రహ్లాదుని శుభాగమనము.

(౫౭౬)

శ్లో॥ తస్యేత్థ భాషమాణస్య ప్రహ్లాదో భగవత్ప్రియః।
ఆజగామ కురుశ్రేష్ఠ రాకాపతి రివోత్థితః॥

శ్రీభాగ. ౮స్కం. ౨౨అ. ౧౨ శ్లో॥

శా॥ ఆదైత్యేంద్రుఁడు పీనవక్షు నవపద్మాక్షుం బిశంగాంబరా
చ్ఛాదున్ నిర్మల సాధువాదు ఘనసంసారాది విచ్ఛేదుసం

శ్రీదున్ భక్తిలతాతిరోహిత హరి శ్రీపాదు నిఃఖేదుఁ బ్ర
హ్లాదున్ బోధ కళా వినోదుఁ గని యెన్ హర్షంబుతో
ముందటన్॥

శ్రీమదాంధ్ర భాగవతము.

మన సుఖదుఃఖము లందునను, నున్నతి అవనతుల యందునను వెంటనుండువారే బంధువులనఁబడుదురు. తమ కులమందుత్సవములు, మంగళాభ్యుదయ కార్యములు జరుగుచుండిన కులపరివారములలోని వారికి మిక్కిలి హర్షము కలుగును. ఇదే విధముగఁ గులమందేదైన దుఃఖద ఘటనము జరిగినచో దుఃఖమును గలుగును. ఎవరి సుఖ దుఃఖములలో మనము బాగుగా బంధింపఁబడెదమో అదియే సంబంధమనకు లక్షణమగును. సంబంధము రెండు విధములుగనుండును. ఒకటి దేహసంబంధము, రెండవది పారమార్థిక సంబంధము. దేహసంబంధము తల్లిదండ్రులయొక్క సంబంధమువలన. మన దేహము తల్లిదండ్రులయొక్క రజోవీర్యములచే నేర్పడినది. కావున తండ్రికి సంబంధించిన మాతామహి మాతామహులును, మేనత్తలు, మేనమామలును, పినతల్లులును, పినతండ్రులును వీరందఱియొక్క పిల్లలును సంబంధులునుసంబంధులనఁబడుదురు. ఇదేవిధముగఁ దండ్రికి సంబంధించిన పితమహుడును, పితామహియును, సోదరులును, బినదండ్రులును, తోఁబుట్టువులును, బావలును, వీరిపిల్లలును, సంబంధులును బరి

వారకటు బములోని వారేయగుదురు. తన దేహమునకు సంబంధించిన భార్యా, పుత్ర, పౌత్రాదులును, ఇట్లు మూఁడు విధములుగ దేహసంబంధులుందురు. పారమార్థిక సంబంధము భగవంతునకును, గురువునకును సంబంధించియుండును. భగవద్భక్తులు మనకు సంబంధులే. ఎవరిచే మనము శిక్షణను బొంది, దీక్షను దీసికొంటిమో, వారిచే సింకెవరు దీక్షను గ్రహించిరో వారును మనకు పారమార్థిక సంబంధులే. భగవద్భక్తులను, జ్ఞానులును సాంసారిక సంబంధము లన్నిటి నుండియును విరక్తినిఁజెంది భగవద్భక్తులతో సంబంధమును బొట్టుకొందురు భగవద్భక్తుఁడగు వాఁడే దేశమువాఁడైనను, నేజాతివాఁడైనను, నేవర్ణమువాఁడైనను, నేరంగురూపములు కలవాఁడైనను నాతఁడు తనకు మిత్రుఁడే, సంబంధియే, సుహృత్తుఁడే, సఖుఁడే, ఆత్మీయుఁడే. దీనికి విపరీతముగ భక్తుఁడు కానివాఁడు తనకుఁ బుత్రుఁడైనను వానితో సంబంధము పనికిరాదు. ఇది వఱకు తనకు దేహ సంబంధముండి, భగవద్భక్తుఁడుఁ నగుచో నొకటి ఒకటి కలిసి పదునొకండగును. బంగారునకు దావియబ్బినట్లగును.

శ్రీ శుకదేవుఁడిట్లనెను:- "రాజా! మహాభాగవతుఁడును విష్ణు పార్షదుఁడునగు బ్రహ్లాదుఁడు తన పౌత్రుని యందు ప్రభువు కృపను జూపినాఁడనియును, ఆతనికిఁ దన దేవదుర్లభ దర్శనము నొసంగి కృతార్థునొనర్చినాడనియును, ఆతని నను

గ్రహించుటకై భగవానుఁడు వటువుగనుండి విరాట్టైనాఁడని యును దెలిసికొని, ఆతఁడు భగవద్దర్శనమొనర్చుటకును, దన పౌత్రుని సౌభాగ్యమును బ్రశంసించుటకును వెంటనే వైకుంఠ లోకమునుండి అచ్చటకు వచ్చెను. ఆతఁడు వచ్చుటకవకాశమే లేదు. గగన మండలమున శీతరశ్మియగు నిశానాథుఁడు పూర్ణిమయం దుదయించినట్లాతఁడుదయించెను. ప్రహ్లాదుఁడు విష్ణుపార్షదుఁడు. ఆతని శోభను వర్ణింప వలసిన పనియేమున్నది ఆతఁడు తన యున్నత, సుపుష్టియుక్తమును, గమనీయ మగు కాయమునందు సుందరమును, స్వచ్ఛమును, శోభా యుక్తమునునగు శారద సుషమవలె మనోహరమగు పీతాంబరమును ధరించి యుండెను. అతనికి విశిష్టశ్యామవర్ణము నీలకాంతమణివలె దేదీప్యమానమై యుండెను. ఆతని విశాల బాహువులందు విష్ణుపార్షదులయొక్క సమస్తాస్త్రములు విరా జిల్లుచుండెను. తన సరస దృష్టులచే దశదిశలను రసమయ ముగ నొనర్చునట్లు కమల సమానములైన వికచ నేత్రము లతో నాతఁడు చూచుచుండెను. కళకళ లాడుచున్న శ్రీసంపన్నముఖమండలము చంద్రునివలె వికసించియుం డెను. దానిలోనుండి మందహాస కిరణములు వెలువడు చుండెను.

ఇదివఱలో నెప్పుడైన ప్రహ్లాదుఁడు తన పౌత్రుని కడకు వచ్చినచో నాతఁడితనిఁ బ్రేమపూర్వకముగ మిక్కిలి

శ్రద్ధతో నాతనికి షోడశోపచారపూజలొనర్చుచుండెడువాడు; కాని నేడాతడు వరుణపాశములచే బంధింపబడి యుండెను. ఈస్థితిలో బూజచేయుటెట్లు? ఎప్పుడును నాతడు శ్రీసంపన్నమగుసువర్ణ రాజసింహాసనమందు బితామహుని గూర్చుండబెట్టి, ఆతనిబూజించి, ప్రణామమును గావించుచుండెడువాడు, కాని యిప్పుడాతనికడ తనదని చెప్పుకొనుటకేమియును లేకుండెను. వామన వటువుసర్వస్వమును హరించెను. అందువలననాతనికి దనవివశతకు మిక్కిలి సిగ్గువేసెను. స్నేహ, లజ్జా సంకోచములచే నాతని కన్నులశ్రుపూర్ణములయ్యెను. బొటబొట కన్నులనీరు గార్చుచు బంధింపబడియే తనపూజ్యపితామహునకు బ్రణామమును మాత్రమే కావించెను.

ఈ సమయమున బ్రహ్మాదుని సమ్ముఖమున నాతని పౌత్రుడును నుండెను. ఆతనిసర్వస్వామియునుండెను. అందువలన శీఘ్రముగ బ్రేమ పులకిత గాత్రుడై నేత్రములందు నీరునింపుకొని విహ్వలుడై ప్రభుపాదపద్మములకు నేలమీదబడి సాష్టాంగప్రణామమును గావించెను. అతడు జేతులను జోడించుకొని స్తుతిచేయమొదలిడెను.

ఇప్పుడాతనికి రెండు కార్యము లుండెను. ఒకటి తన పౌత్రు నోదార్చుచు నుపదేశించుటయును, రెండవది భగవంతుని స్తుతించుటయున్నై యుండెను. కావున నాతడు తన పౌత్రుడు విను నట్లుగ భగవానుని భక్తవత్సలతను గూర్చి

ప్రశంసించుచుండెను. శ్రీప్రహ్లాదుఁ డిట్లనెను:-"స్వామీ! తాను భగవంతునకుఁ దనసర్వస్వము దానమొసఁగితినను నభిమానమీ బలికి యున్నచో నాతనికీయభిమానము వ్యర్థము. ఈతని క్రింద పదవిని మీరేయొసంగితిరి. తమరే న్యాసరూపమున తమవిశిష్ట శక్తి నొసంగి వీని క్రిందత్వము నొసంగి, యిప్పుడీతఁడ యోగ్యుఁడని తెలిసికొని తమరే హరించితిరి. ఈతని నైశ్వర్యశాలియగు నింద్రపదవి నుండితొలఁగించిన, నీవిషయమున నీతఁడు లజ్జింప వలసిన పనిలేదు. మీరీతని యెడల ననుగ్రహమునే చూపితిరి. వీనిని మోహమునఁ బడవేయు రాజ్యలక్ష్మినుండి భ్రష్టునిఁ గావించితిరి. ఈరాజ్యలక్ష్మి కన్నులున్నను మానవుని గ్రుడ్డివానిగా నొనర్చుచుండును. మదవానమొనర్పకున్నను మదోన్మత్తునిఁగావించును. జ్ఞానినిఅజ్ఞానిగను, సావధానునైనను బ్రమాదభరితునిగను నొనర్చును, గొప్పగొప్ప విద్వాంసులును నీమాయాచక్రములోఁబడి మోహితులగుచుందురు. అట్టి లక్ష్మీరహితునిఁగా నొనర్చి నీయీయనుచరున యందత్యంతాను గ్రహమును జూపితిరి. అనుగ్రహావతారమును, భక్తవత్సలుఁడవును నగు వామన భగవానుఁడగు మీపాదపద్మములకు మాటిమాటికిని నా ప్రణామములు."

శ్రీశుకదేవుఁడిట్లనెను:-"రాజా! ప్రహ్లాదుఁడువచ్చుటచే నిప్పుడచ్చట చాలజనము చేరిరి. వామనమూర్తి తన

నందసునందాది పార్షదులచేఁ బరివేష్టింపఁ బడియుండెను. ఒక వైపున సమస్త దేవగణము నుండిరి. వారందఱ యెదుట లోక పితామహుఁడగు బ్రహ్మకూర్చుండి యుండెను. బలి చక్రవర్తియొక్క ముఖ్య ముఖ్య సేనానాయకులగు నసురులును దీనమనస్కులరై తలవంచుకొని మెదలకఁ గూర్చుండి యుండిరి బలిచక్రవర్తి సమీపముననే చేతులను జోడించుకొని భగవద్భక్తుఁడగు ప్రహ్లాదుఁడుండెను ఇది దేవాసుర సమ్మిళిత సమావేశముగ నుండెను. అధికారము చేఁజిక్కుటచే దేవతలు సంతోషముగ నుండిరి. అసురుల మనస్సులలో దుఃఖముండెను. మహామనస్వియును, పరమ జ్ఞానియునగు బలి మనస్సునందు దుఃఖమును లేదు, సుఖమును లేదు. ఆతఁడు సమభావముతో నుండి ప్రభుపాద పద్మములను గాంచుచుండెను. పులకిత హృదయముతోఁ బ్రేమాశ్రువులను గార్చుచుండెను భగవద్దర్శనము వలన నాతనికిఁ దృప్తి కలుగకుండెను. ప్రహ్లాదుని స్తుతివినఁగానే బ్రహ్మకును సాహస మభివృద్ధి కాఁగా నాతఁడును భగవంతుని స్తుతించుటకై నిలుచుండెను.

వింధ్యావళి తనమామగారి తండ్రియగు ప్రహ్లాదునిఁ గాంచగానే ముసుఁగును సవరించుకొనెను. మామగారి యెదుట మాటలాడుట సదాచారవిరుద్ధము. కానిభగవంతుఁ డందఱకును దల్లితండ్రి. ఆతనికడ సిగ్గేమున్నది? ఆతడు

వలన నామెయును కొంచెముగ మూసుగొనుసర్దుకొని ప్రహ్లా దుని వైపు ముఖము కాకుండునట్లు త్రిప్పి భగవంతుని వైపు నకుఁ జూచుచు నిట్లనెను—లోక పితామహుఁడగు బ్రహ్మ యేదో పలుక నున్నాఁడని ఆమె గ్రహింపలేదు. వింధ్యా వళీ మహారాణి యేదో చెప్పఁబోవుచున్నదను సంగతినిఁ దెలిసికొని బ్రహ్మమాట్లాడక మెదల కుండెను స్త్రీయెదుటఁ బడినచో స్వయముగఁ దప్పుకొనుట ప్రాచీన సదాచారము. వాహనము మీఁద ముందుగా స్త్రీల నెక్కించి తరువాతఁ దానెక్కవలయును. సమస్త స్థానములందును లజ్జావతులగు స్త్రీలను సమ్మానింపవలయును. ఏలననఁగా స్త్రీసులభ శీలతా కారణమున వారేవస్తువును నడుగఁజాలరు మఱే విషయమునను బట్టుదలగఁ మాటలాడఁజాలరు. లజ్జయే వారికి ధనము. శీలమే వారికి శృంగారము. దానినిరక్షించుట యును, ఆదర మొనర్చుటయును మానవునకు పరమధర్మము. ఎచ్చట స్త్రీలకు సన్మానము దునో, పూజజరుగునో అచ్చట లక్ష్మి వసించును. బ్రహ్మ యెప్పుడు నిలుచుండునో, ఎప్పుడు కూర్చుండునో వింధ్యావళికి తెలియదు తనపతివరుణపాశముచే బంధింపఁబడుటను, లజ్జచేఁదలను వంచుకొని చూచుచుండు టను నామె కాంచి, భయవ్యాకులయై అత్యంత వినయముతో నిట్లనెను:—"ప్రభూ! ఈ యఖిల జగత్తునకు నేకైకమగు నధీ శ్వరుఁడవు నీవే. ఇంకొక కారణముకాదు కాని కేవలము

క్రీడ కొఱకు నీ వీజగత్తును రచించితివి. కోరిక కలిగినప్పుడీ త్రిగుణాత్మక జగత్తును నిర్మించెదవు. నీకిష్టమున్నంతవఱకు దానిని గైకొని ఆడుకొనుచుందువు. నీకుకోరికగలిగి, ఆడఁగా నాడఁగా విసుగు పుట్టినప్పుడు వెంటనే దీనిని బగులఁగొట్టెదవు. సంహరించెదవు. నిర్మించు నాటమెట్టిదో దానిని బ్రద్దలు చేయు కార్యమును నట్టిదే. నిర్మించు నాసక్తియును బ్రద్దలొనర్చుటలోఁ జింతయును లేదు. తన యాటకొఱకై నిర్మించుకొనిన జగత్తునం దెవఁడు మమతను వహించి దానిని దనదని చెప్పుకొనుచు, దానే దానికి స్వామినని చెప్పుకొనుచుండువాఁడు చాల పొరపాటుపడిన ప్రాణి. నాప్రాణేశ్వరుఁడు మనస్సునఁ దాను త్రిలోకములకు స్వామినని భావించుచు, నీరాజ్యమంతయును దనదే యనుకొనుచు, దీనినిఁ దాను వామనప్రభువునకు దానమొసంగుచున్నానను కొనుచుండు నెడల నది వారి పొరపాటు అభిప్రాయమనియే నేను జెప్పఁగలను. ఎచ్చటనైన నందఱకు నిచ్చు నీకీయఁగలవాఁ డెవఁడు? తనదేదియైన నున్నచో నీయవచ్చును. కాని అందఱకును స్వామివి సర్వేశ్వరుఁడవును నీవేకదా! వస్తువులన్నియును నీవైనప్పుడు ఎవ డన్యుల కేమీయఁగలఁడు? అన్నియును మీవస్తువులే. అన్నిటికినిఁ బ్రభువులు మీరలే. మీరు మీవస్తువులను గాపాడుకొనుఁడు. నేను నీకిచ్చెదను, నీకోర్కెను నెఱవేర్చెదను.'' అనిపలికిన నాపతి మీరు

లక్ష్యపెట్టకుఁడు. పూర్ణకాముఁడవగు నీకు కోరిక లేమి యుండును."

ఇట్లుపలికి వింధ్యావళి కూర్చుండెను. అప్పుడు బ్రహ్మ మరల లేచి యిట్లనెను:-" దేవదేవా! భూతభావనా! భూతేశ్వరా! బలిని బంధించుట మీకనురూపముగ లేదు. ఈతఁడు మీకేమి యపరాధము నొనర్చినాఁడు? ఏయభియోగమున నీతఁడు బంధితుఁడైనాఁడు? ఈతఁడు నీకు సర్వస్వమును సమర్పించినాఁడు. ఈతఁడు శిక్షాపాత్రుఁడు గాక మీకృపా పాత్రతకు యోగ్యుఁడైయున్నాఁడు. దయాళూ! దుఃఖియును, దీనుఁడును నైన నీదైత్యునియందు దయను జూపుము. ఈతనికి నీచరణ శరణ మొసంగుము. ఒక్క అంగుళము భూమినైన నిచ్చుటకు జిత్తమున దుఃఖము కలుగుచుండును. ఈతఁడు తన యీపృథివినంతను తనసందానే ప్రేమపూర్వకముగ మనో మలిన మేమియును లేకయే మీకు సమర్పించినాఁడు. పుణ్యోపార్జితమైన స్వర్గాది సమస్త లోకములను స్వేచ్ఛగా నీకు ద్వితీయ పదమును గొలుచుట నొసంగినాఁడు. తృతీయ పదము కొఱకాతఁడు తన తలను వంచినాఁడు, శరీరమును సమర్పించినాఁడు. అట్టి యెడ నీతనిని మీరు బంధింపనేల? ఈతని బాధింపనేలఁ బ్రయత్నించెదరు? ఈతఁడు నీచరణామృతమును శ్రద్ధతో శిరస్సునందు ధరించినాఁడు. ఈతఁడు పుణ్యశ్లోకుఁడును, బుణ్యాత్ముఁడునై

యున్నాఁడు. పాపులును నీపాదోదకమును బానమొనర్చి పరమపుణ్య భాగులగుచుం దురు. అట్టియెడ నీతని కశుభ మెక్కడిది? నీచరణములందొక పుడిసెడు జలమును శ్రద్ధా భక్తులతో నొసంగి, ఒక్కతులసీ దళమునుగాని, ఒక్క గరికపోచను గాని సమర్పించినవాఁడు నీ సంసార సాగరము నుండి విముక్తుఁడగును. అట్టి యెడలసర్వస్వమును సమర్పించిన సాధుశ్రేష్ఠుఁడగు బలి బంధనమునందేల పడినాఁడు?

శ్రీశుకదేవుఁడిట్లనెను:- " రాజా! లోకపితామహుని యీ మంచి వాక్కులను విని వామనుఁడాతనికి నవ్వుచుఁ బ్రత్యుత్తర మొసంగెను."

ధనికుఁడు ధనగర్వమున భగవానునైన నవమానించును

(౧౭౭)

శ్లో॥ బ్రహ్మన్ యమను గృహ్ణామి తద్విశో విధునోమ్యహమ్।
యన్మదః పురుషః స్తబ్ధో లోకం మాం చావమన్యతే॥
శ్రీభాగ. ౮స్కం. ౨౨అ.౨౪శ్లో॥

సీ॥ ఎవనిఁ గరుణిఁప నిచ్చించితిని వాని
యఖిల విత్తంబు నే నపహరింతు
సంసార గురుమద స్తబ్ధుఁడై యెవ్వఁడుఁ
దగడి లోకము నన్ను ధిక్కరించు॥

—శ్రీమదాంధ్ర భాగవతము.

స్వార్థహానినే విపత్తందురు. స్వార్థ సిద్ధినే సంపత్తందురు. ప్రపంచములో నన్నిటికంటె గొప్పస్వార్థము శ్రీహరి పాదపద్మ ప్రాప్తియే. శ్రీహరియే సర్వశ్రేష్ఠమగు ధనము. హరిని మరపించు నదియే గొప్ప నిర్ధనత. ఎవని హృదయమున సదా శ్రీహరి స్మృతి జాగృతి చెందియుండునో అతఁడే సర్వశ్రేష్ఠుఁడగు ధనవంతుఁడు భోగ్యవస్తువులు లభింపక పోవుటయును, ఈ నాశవంతమగు శరీరము నానావిధ రోగములును, వివిధపీడలును గలుగుటయు, అనిత్య సంబంధము కల స్వజను లనఁబడువారు వియోగము చెందుటయు మొదలగు నవి యన్నియును విపత్తులు కావు హృదయమున శ్రీహరి పాదపద్మ విస్మృతి కలుగుటయే ఘోరమగు విపత్తు. నారాయణ స్మృతిరూపమగు సంపత్తి కలవాఁడు నిర్ధనుఁడైనను ధనికుఁడే, నీచుఁడైనను శ్రేష్ఠుఁడే. కనిష్ఠుఁడైనను జ్యేష్ఠుఁడే. నారాయణ స్మృతి శూన్యుఁడు ధనికుఁడును నిర్ధనుఁడే భాగ్యశాలియును నభాగ్యుఁడే, ఐశ్వర్యశాలియును దరిద్రుఁడే.

శ్రీశుకదేవు డిట్లనెను: "రాజా! బ్రహ్మ వామనునితో బలిని వదలి వేయవలసిన దని ప్రార్థింపఁగా భగవానుఁడిట్లనెను: —"బ్రహ్మా! బలిని నేను గష్టపెట్టుట లేదు. అతని ననుగ్రహించు చున్నాను."

బ్రహ్మ యిట్లనెను:—"స్వామీ! ఇదేమికృప. నీ వితని సర్వస్వము నపహరించితివి. త్రిలోక రాజ్యమును హరించి

తివి. మోసమున వామనుఁడవై దానమడిగితివి. విరాట్టువై దాన మిచ్చిన భూమినిఁ గొలుచు కొంటివి. పైఁగా నీవు పరమ యశస్వియనూ, నసురాధిపుఁడు నగు నితని వరుణ పాశములచే బంధించితివి. అందఱ ముందఱ నిండు సభలో నవమానించు చున్నావు. ఇంతకు మించిన కష్టమింకేమి యుండును."

అంత భగవంతుఁ డిట్లనెను:—"బ్రహ్మా! ధనము ప్రభల మాయకు సంబంధించినది. మానవుఁడు ధనమదమున నున్మత్తుఁడై అందఱనన నేలఁ జివరకు నన్నుఁ గూడ నవమానించును. లక్ష్మీ సంపన్నుఁడు నారాయణు నెఱుఁగఁడు. ధనికుఁ డితరుల నెవరినిఁ బ్రేమింపఁడు. జడములగు బంగారము, వెండి, కాగితములు వీనియందు మోహము కలవాఁడు చైతన్యమునెట్లు ప్రేమింపఁ గలఁడు? అతని ప్రేమ స్వార్థమైనది కాదు. అట్టివాఁడు ధనమునే సర్వస్వము భావించును. అందు వలన నిర్ధనులను సదా అవమానించు చుండును."

అంత శౌనకుఁ డిట్లడిగెను:—"సూతా! లక్ష్మీదేవి శ్రీమన్నారాయణుని సహచరి గదా! అట్టి యామె యే భాగ్యశాలి కడనుండునో ఆతఁడంత క్రూరముగ నుండ నేల? వారు భగవాను నవహేళన మొనర్చు టెందులకు?"

ఇది విని సూతుఁడు గంభీరుఁడై యిట్లనెను:— "స్వామీ! లక్ష్మీదేవికి రెండుస్వరూపములు కలవు. ఒకటి

విష్ణు వల్లభరూపము. ఆమె సాక్షాత్తుగ చైతన్యరూపమున శ్రీహరి వక్షస్థలమందు క్రీడించుచుండును. ఒకతె ఆతని ధనరూపము. ఆమె జడరూపమున లోకమున వ్యాపించి యున్నది. ఈ ధనరూపమున నున్న లక్ష్మికి గొప్ప మదము కలదు. అత్యధికమగు నాకర్షణము కలదు. ప్రపంచములో నాలుగు పనులత్యంత నిందితములుగ జెప్పబడినది, అధర్మపూర్వకమగు ద్యూతము, అధర్మపూర్వక సురాపానము, అధర్మపూర్వక మైథునము, అధర్మపూర్వకమగు హింస. ఈ నాలుగు పాపములకు మించిన పాపము లేదు జూదములో నేమియును విశేషదోషము లేదుకాని ఇందులో నొక గొప్ప దోషము కలదు. జూదగాడు సత్యపాలన మొనర్పజాలడు. ఆతడబద్ధమాడవలసి వచ్చును. అసత్యము సమస్త పాపముల కును మూలము. సురాపానములో నొకే దోషము కలదు, దాని వలన మదము కలుగును. మానవుడు మదిరామదమున నస్తవ్యస్తముగ వాగుచుండును. తన్ను దాను మఱచును. మైథునము వలనగలుగు గొప్పదోష మేమనగా దాని వలనగామతృష్ణ అధికమగును. తృప్తి కలుగదు. ఉపభోగముచే నధికాధికమగు కోరిక ప్రబలమగును. శరీరమును బుష్టియొనర్చు కొనుటచే మాంసముకొఱకు ప్రాణులను వధించును. వధించుట చేతను వధింపజేయుట చేతను రజోగుణము వృద్ధియగును. మాంసాహారులు సాత్త్వికులుగ నుండజాలరు.

ద్యూతము, మదిరా పానము, కామినీ సేవనము, హింస అను నీ నాలుగు వ్యసనములందు క్రమముగ నసత్యము, మదము, కామము, రజోగుణము ఇవి ఒక్కొక్క దోషములు కాని యీ నాలుగు దోషములు ధనములోఁ కలవు. ఈ నాలుగు దోషములు కాక వీనికి మించిన నధిక దోషము ధనమందొకటి కలదు. అదేమనఁగా ధనికుఁడు లోలోన నందరను సందేహించును. లోకులును వానితో వైరమును బెట్టుకొనెను.

ధనికులు ధనమును బ్రోవుచేయుటలో సత్య రక్షణమును గావించుకొనఁజాలరు. అతని యుద్దేశ్యము ధనోపార్జనమొనర్చుటయే. అబద్ధమాడిన ధనము లభించుచో నాతఁడసత్య మాడుటకు వెనుకాడఁడు. లక్ష్మీదేవి విశేషముగ వ్యాపార మందుండును. వ్యాపారమును సత్యానృతమనిరి. అనఁగా సత్యము, అసత్యము రెండును గలిసి యుండును. వ్యాపారులలో నరుదుగ సత్య వాదులుందురు. ఇదే విధముగ ధనికులు సాధారణముగ సురా పాన మొనర్చువారుగను, కాముకులుగను, హింసకులుగను నుందురు. అతఁడెవరిని హృదయ పూర్వకముగఁ బ్రేమింపఁడు. వారి ప్రేమలో స్వార్థము దాగియుండును. వారి దానమందు కీర్తివాసన దాగి యుండును. తన దానమును బదిమందియు నెఱుఁగవలయునను కొనుచుండును. వ్యాపార వృద్ధి కావలయునని యుండును. వారి

దాన మట్టి విజ్ఞాపనము కొఱకే. వారి కడకు సాధువులు వెడలినను వారికొక రూపాయ పండ్లనొసంగినచో లక్ష రూపాయల లాభము రావనయునని యుండును. ఇన్నాళ్ళ నుండి చేసిన సాధు జపమును పాదములంటిరి, ఒక్క దినము భోజనమిడి కాఁజేయ వలయునని యుండును. వారికి డబ్బు గైకొనని సాధువుల మీఁద భక్తి యుండును. కేవలము పాదము లంటుట చేతనే ధన ధాన్యములు, పుత్రపౌత్రాదులు కలుగు నాశీర్వాదము లభింపవలె ననుకొను చుందురు. అట్టి వారి కడకు బోయి వారు తమ ఉదారతను ప్రకటించు కొనుచుందురు.

ఒక మహాత్ముఁ డుండెడువాఁడు. ఆతఁ డెవరివద్దను నేమియును గైకొనువాఁడు కాఁడు. ఎవరైన నేదైన నిచ్చినా దానిని మరల వారికే యిచ్చి వేయుచుండును. ఒక దినమున నొక శ్రేష్ఠి వచ్చెను. ఆతఁడిట్లను కొనెను:- "మహాత్ముఁ డేమియును గైకొనఁడు. మరలఁ ద్రిప్పి యిచ్చి వేయును. నేను నా యుదారతను నేలఁ ప్రకటించుకొనఁ గూడదు? అని యాలోచించుకొని యాతఁడు పదివేలరూపా యలతో నిండిన సంచి నాతనికడ నుంచెను. అట్లిచ్చి మహాత్ముఁ డిది నాకే మలకయ్యా, దీనిఁ దీసికొని పొమ్మను నేమోనని ఆతఁడచ్చటనే వేచియుండెను. కాని యా మహా త్ముఁడు నేడట్లు చేయలేదు. శ్రేష్ఠిగారు మహాత్మునితో

మాటి మాటికి నిట్లనఁ జొచ్చెను:-"స్వామీ! దాసుని యీ తుచ్ఛమగు కానుకను స్వీకరింపుఁడు." కొంచెము సేపాగి మహాత్ముఁడు తన శిష్యునితో నిట్లనెను:-"గోపాల దాసా! ఈ సంచినెత్తి కుటీరములో నుంచుము. రేపు సాధు మహాత్ములకు సంతర్పణమునకుఁ బనికివచ్చును." ఈ మాట శ్రేష్ఠికి నూరు కడవలు నీరు పడినట్లుండెను. తడబడుచు నిట్లనెను:-'స్వామీ! స్వామీ! మీరు రూపాయలను స్పృశింపరనియుఁ, దెచ్చినవారికే మరల నిచ్చెదరనియు వినియుంటిని'."

నవ్వి మహాత్ముఁడిట్లనెను:-"అయ్యా! నేనేమి తాకుచున్నానయ్యా? స్పృశింపఁగూడదను నియమము నాది. ఇది గోపాలదాసుని నియమము కాదు. గోపాలదాసు స్పృశించుచున్నాఁడు. ఇఁకఁ ద్రిప్పి ఇచ్చి వేయుటయా? ఏదో చిల్లర, రూపాయి, రెండురూపాయలైనచో దానినిఁ ద్రిప్పి వేయుదుము కాని, యింతవఱకు పదివేలిచ్చినవారే లేరు. పెద్ద మొత్తముల కీనియమము లేదు." ఇట్లు పలికి మహాత్ముఁడు నవ్వెను.

సూతు డిట్లనెను:-"మునులారా! ఈ ధనికు లొక్కపైసనిచ్చినచో దానివలన నొకలక్షరూపాయల నాశించెదరు. మానవులకడనే కాదు యీయాశ. దేవతలకడను నీమోసమే. తమకొఱకు వక్కలాకులను దెచ్చుకొనిన మంచి మంచివి చూచి చక్కని నునుపు వక్కలను లేత యాకులను దెచ్చుకొందురు. పేరు గలవారు చాల ఖరీదు గల ఆకులను

వెదకి తెచ్చుకొందురు. దేవపూజనమున కవసరమగుచో నాకు లమ్ము వానితో దేవపూజ కాకులు వక్కలు కావలయు నందురు ఇట్లుడిగి అన్నిటికంటె నలిగిన పుచ్చువక్కలను దెచ్చును. ఒక్కపోకను సమర్పించి యిట్లు ప్రార్థించును :- "ఈ పూగీఫలముచే నాసమస్త, దారా, పుత్ర, ధన, ధాన్యాది కామన లీజన్మమందే కాదు నాకెన్ని జన్మములు రానున్నవో అన్నిటియందును బూర్తి కావలయును. మీ రూహించుఁడు. భగవానున కెంతటి చౌకసరకు నొసంగెదరో వీరి శ్రద్ధయంతయును స్వార్థముతో నిండియుండును. ఎవరి కడనైనను గొంచెము చమత్కారము కనఁబడెనా వానికి నమస్కార మొనర్చెదరు. అన్యులకు శుష్కప్రణామము నైన నొనర్పరు. తమస్వార్థమునకు వ్యాఘాతము రానంత వఱకే సాధు పూజ. ఇంకెక్కడైన నింకొక చమత్కారి కనఁబడెనా సాధువునకు గురువులయ్యెదరు. "పారెడు నీటను బరగును యోగి" యనుసామెత బాగున్నది, మనుజులారా! ఈ విషయమున నేను మీకొక మనోరంజక మగు దృష్టాంత మును జెప్పెదను."

ఒక ధర్మాత్ముఁడగు శ్రేష్ఠియుండెను. కొట్టు సాగు చుండెను. వ్యాపారము బాగుగా సాగుచుండెను. నగరము లన్నిటిలో నాతనికి శాఖలు కలవు. గొప్పదాత, ధర్మాత్ముఁ డుమ్మ, అతని దానధర్మములను గుఱించి సర్వత్ర ఖ్యాతి కలదు.

ఒక దినమున నవ్వులాటలకు లక్ష్మీదేవి శ్రీమన్నారాయణునితో నిట్లనెను – "స్వామీ! మీరుగొప్పా నేను గొప్పా? ఇప్పుడు భగవానునకుఁ దెలియును పురుషుని కంటె స్త్రీ గొప్పయని, కాని పిల్లవాని నేర్పింపఁ దలఁచినచో విపరీతపు మాటలు పలుకవలయును. భగవానుఁడిట్లనెను:– "నేనే గొప్ప నీవెట్లుగొప్పకాఁ గలవు?"

ఇప్పుడు లక్ష్మీదేవి వాదించెను:– "నాథా! మీరెట్లు గొప్ప? నేనే గొప్ప నేనే లేకున్న మిమ్ముల నడుగున దెవరు! నా ప్రాప్తి లేనంతవఱకే మీపూజ. నేను రాఁగానే మీ కొరకు తులసీదళమైనను సమర్పించుట కఠినమే."

భగవానుఁడిట్లనెను:– "ప్రపంచములో నందఱును నా భజన మొనర్చెదరు. నీవాహనము పేరును జెప్పి యిది గుడ్లగూబ యందురు.

లక్ష్మీదేవి కోపగించుచు నిట్లనెను:– "స్వామీ! పైకి మీ భజన మొనర్చెదరేమో కాని మనస్సులో జనులు నన్నే చింతించుచుందురు. నోటితో మీనామమును బలికినఁ బలికెదరేమో కాని కన్నులతో నారూపమునే చూచుచుందురు. జడదారులు, గడ్డాలు మీసాలవారు, త్యాగులు, విరాగులు, బ్రహ్మచారులు, గృహస్థులు ఆచార్యులు, శ్వేతాంబరులు, దిగంబరులు వీరందఱును నాగుప్పెడులో నున్నారు. కంగను మోత చెవులలోఁబడెనా జప, తప,

ధ్యానములన్నియును మఱచిపోయెదరు. నూపాఖునిఁ జూడఁగనే వికలత బయలుదేరును. భక్తుఁడు నాధ్యానము నొనర్చును. మీకుఁ గావలయు ననినఁ బ్రత్యక్షముగఁ జూపించెదను.”

భగవంతుని కేమియును బనిలేదు. నిత్యమును లక్ష్మీదేవితో నూతన లీలల రచించుచుఁ గమనీయ క్రీడ లొనర్చుచుండెను, ఇదియే ఆతనికి వ్యాపారము. ఆతఁడిట్లనను :–
“మంచిది, సరియే, పోవుదము పద. లోకులు నీపూజ నొనర్చెదరో నాపూజ నొనర్చెదరో చూతము.” అని పలికి యిద్దరును భార్యాభర్తల వేషమును ధరించి వెడలిరి.

భగవానుఁ డొక వృద్ధ బ్రాహ్మణ రూపమును మిక్కిలి సుందరముగ ధరించెను. పుస్తకముల కట్టను జంకను బెట్టుకొని ఆధర్మాత్ముఁడగు శ్రేష్ఠిగారి దుకాణమునకుఁ జేరుకొనెను. విద్వాంసుఁడగు వృద్ధ బ్రాహ్మణునిఁ గాంచగనే శ్రేష్ఠి ఆతనికి మిక్కిలి ఆదరమును గావించెను. విధ్యుక్తముగఁ బూజ గావించి, కొన్ని దినములుండ వలయునని ప్రార్థించెను. పండితుఁడు జ్యోతిషమును గూడా చెప్పఁగలఁడు. సాయంత్రపు సమయమునఁ గథాకాలక్షేప మొనర్చెడు వాఁడు. ఆతని స్వరమతి కమనీయమైనది. శ్రోతలందఱును మంత్రముగ్ధులవలె నాతని ముఖకమలమునుండి వెలువడు దివ్యకథామృతరస పానమును జేయుచుఁ జేయుచుఁ దృప్తిని

జెందెడువారు కారు. శ్రేష్ఠిగారికిని పండితుని మీఁద మిక్కిలి శ్రద్ధ కలిగెను అందఱును బండితునకు వశమైరి.

భగవానుఁడు శ్రేష్ఠిగారిని వశపరుచు కొనినాఁడని లక్ష్మీదేవి తెలిసికొని. వెంటనే ఆమెఒకయోగినీ వేషమును ధరించి, ఆమెయును నగరమందు దిరుగుచు శ్రేష్ఠిగారి కడకు వచ్చెను. యోగినీ వేషమత్యంతాకర్షణము గనుండెను. ఆమెను జూచిన వారట్లు చూచుచుఁ జూచుచు నిలువఁబడి పోవలసినదే. నల్ల నల్లని యుంగరములు తిరిగిన జడలు వ్రేలాడు చుండెను. కాషాయవస్త్రము నామె చుట్టుకొనెను దానిలో నుండి ఆమెయొక్క దివ్యాంగముల కాంతి బయటకు వెలువడుచుండెను. చంపా సువర్ణములను దిరస్కరించు శరీరము మీఁద భస్మము నలఁదు కొనుటచేనత్యంత శోభగానుండెను. కంఠమున రుద్రాక్షమాలయును చేతిలో జప మాలయును, చంకలో సంచియును, మస్తకమున సుందర తిలకమును శోభించుచుండెను. ఆమెకన్నులను మూసుకొని మాటిమాటికిని బిలుచుచుండినఁ దపస్సే మూర్తీభవించి వచ్చినట్లును, శోభ, సజీవమై భ్రమించుచున్నట్లుండెను ఎవరో పోయి గొప్ప యోగిని వచ్చినదని శ్రేష్ఠిగారికి జెప్పిరి. వినఁగానే శ్రేష్ఠిగారు పరువిడి వచ్చెను. ప్రణామము గావించెను. ఏమి కావలయునని ప్రార్థించెను.

యోగిని కొంచెము సేపు మౌనముగ నుండెను. తరువాత నిట్లనెను:— 'నేను కొంచెముగ దాహాముమ దీసి

గొనవలయును. శ్రేష్ఠిగారొక వెండిపాత్రలో గంగాజలమును దెచ్చెను.

యోగిని తన సంచినుండి ఒకజలపాత్రను దీసెను. అది శుద్ధ బంగారు పాత్ర. దానియందు చాల మణిముక్తికములు పొదుగఁబడి యుండెను. దానినిఁదీసి యిట్లనెను:— "శ్రేష్ఠిగారు! నేనే గృహస్థుపాత్రలను వాడుకొనను, ఈ పాత్రలో నాకు జలమునిమ్ము."

శ్రేష్ఠిగారు వెంటనే ఆమె పాత్రలో జలమును దెచ్చి యిచ్చెను. జలమును త్రావి యోగిని యాపాత్ర నచ్చటనే పారవైచెను. ఆపాత్ర యొక్క చేతయును, మణిముక్తావళుల కాంతులును శ్రేష్ఠిగారిని మంత్రముగ్ధునిఁగా నొనర్చెను. అతఁడిట్లనెను:— "అమ్మా! ఈ మీ పాత్రను మీసంచిలో బెట్టుకొనుఁడు."

ఉపేక్షా స్వరమున యోగిని యిట్లనెను:— "నేనొక్కసారి జలమును త్రాగినచో మరల ఆపాత్రను వాడను తాకను."

ఇది వినఁగానే శ్రేష్ఠిగారి యానందమునకు మేర లేకుండెను. మిక్కిలి బలవంత మొనర్చుచు నిట్లనెను:— "అమ్మా! భోజనసమయమైనది. మీ కిష్టమున్నంత వఱకు తప్పక భోజన మొనర్పుఁడు."

శ్రేష్ఠిగారి బలవంతమును గాంచి యోగిని అంగీకరింప వలసి వచ్చెను. శ్రేష్ఠిగారు స్వయముగఁబోయి, అనేక విధ

ములకు వస్తువులను దయారు చేయించి స్వయముగఁ దెచ్చెను యోగిని నొక్క దివ్యాసనమునఁ గూర్చుండఁ బెట్టెను.

ఆమె తన సంచినుండి యున్న పళ్లెరమును, ద్రావుటకు తాన పాత్రను దీసెను. శ్రేష్ఠిగారు మిక్కిలి యుల్లాసముతో నాపాత్రలో వడ్డించెను. యోగిని భోజనము చేయసాగెను. ఆమె చిత్తవారి టి అలుదు సిగ్గుతోఁ గొంచెము కొంచెముగఁ బిట్టమెతుకులు తినుచున్నట్లు మెల్ల మెల్లఁగాఁ దినుచుండెను. కథా సమయమయ్యెను శ్రేష్ఠిగారి నేక సార్లు పిలిపించెను. కాని యోగినిని వదలి వెడలు టెట్లు? అతఁడు సేవకులచే నిట్లు కబురంపెను :–"పండితునితో నేఁడిప్పటికి కథ లేదనియు, జరుగ వలసివచ్చినచోఁ గబురంపెదననియు, ఒకవేళఁ గబురు రాకున్నచో నేటికి కథ లేదనియు కావున నాకడకు కథ కొఱకు పిలువ వలదనియు జెప్పుఁడు" సేవకులు పోయి పండితునకుఁ జెప్పిరి. శ్రేష్ఠిగారు యోగిని వలలోఁ బడెనని పండితుఁడు గ్రహించెను.

ఇచ్చట యోగిని భోజన మొనర్చి శ్రేష్ఠి గారితో నిట్లనెను:–"ఈ పాత్రను దీసికొని పొమ్ము."

శ్రేష్ఠిగారు పైకిట్లనెను:–"అమ్మా! మేము మీ పాత్రల నెట్లు తీసికొనఁ గలము!"

యోగిని యిట్లనెను :–"ఒక్కసారి నేనే పాత్రలను దినుటకును ద్రాగుటకును వినియోగించితినో అవి మరల నాకు పనికి రావు. ఇప్పుడు మీ యిష్టము వచ్చినట్లు చేసికొనుడు."

ఇది విని శ్రేష్ఠి భక్తిపూర్వకముగ నిట్లనెను :- "మంచిది, మీ ప్రసాదమాగ నుండఁ గలదు. మహాత్ముల ప్రసాదమెంతో యదృష్టమునఁ గాని లభింపదు."

సూతుఁ డిట్లనెను:- "మునులారా! సాధువు కడ నుండి యేదైన వస్తువును మోసమొనర్పఁ దలఁచినచో దానిని బ్రసాదరూపమునఁ గైకొను చుందురు. శెట్టిగారి హర్షమునకు మేర లేకుండెను. అతఁ డిట్లనుకొనెను:- "ఈ యోగిని పది పంద్రెండు దినము లుండినచో నా ధనమునకు మేరయే యుండదు" ఇట్లనుకొని మిక్కిలి నమ్రతతో నిట్లనెను:- "అమ్మా! కొన్నాళ్ళీ సేవకుని యింట కృపజేసి యీ యింటిని గూడ మీ పవిత్ర పదరజముచే బావన మొనర్పుఁడు."

యోగిని కొంచెముగ కన్నుల నెత్తి మరల ధ్యాన మొనర్చి నిస్పృహతా స్వరమున నిట్లనెను:- "శ్రేష్ఠీ! మేము రాముని ధ్యాన మొనర్చుకొను వారము. నేఁ డిచ్చట నుండిన రేపింకొక చోట. మేము స్థిరముగ నుండము. అయినను నీవంటైన భక్తుఁడు కనఁబడినచోఁ బది పంద్రెండు దినము లుండుము కూడను."

శెట్టి అత్యంత వినయ భావముతో నిట్లనెను:- "అమ్మా! ఈ దాసునిఁ గూడ కృప చేయవలయును."

యోగిని యుపేక్షా స్వరమున నిట్లనెను:- "అయ్యా! నేనుండిన జిక్కు కలదు. నేనున్నచోట్ల నుండఁ జాలను.

స్థానము స్వచ్ఛముగ నుండవలయును. ఏకాంతము కావలయును. ఎవరును దగ్గఱలో నుండరాదు."

అత్యంత హర్షముతో శెట్టి గారిట్లనెను:-"అమ్మా! ఈ విశాలభవన మంతయును మీదే. దీనిలో మీకు విశ్రాంతి కిచ్చుట ననుకూలముగ నుండునో అచ్చట నేర్పాటు చేయుదును. ఇచ్చట ననుకూలముగ లేకున్నచో నగరమునకు బయట నాకొక వాటిక కలదు, అచ్చట యేర్పాట్లన్నియును జేయఁబడఁ గలవు. ముందిచ్చట అంతయును జూడుము."

యోగిని అంగీకరించెను ఆమె శెట్టిగారితో నన్ని స్థానములను జూడఁబోయెను. చాల మంచి మంచి స్థానముల నన్నిటిని యోగినికిఁ జూపెను ఆమె కేదియును నచ్చలేదు. చూపుచుఁ జూపుచు శెట్టిగారు పండితుఁడున్న స్థలమునకుఁ గొనిపోయెను. యోగిని పండితునిఁ గాంచెను. కనుసన్నలతోడనే మాటలాడుకొనిరి లోలోన నవ్వుకొనుచు యోగిని శెట్టితో నిట్లనెను:-'ఈ స్థానము కొంచెము బాగున్నది. ఇచ్చట నుండెదను"

అత్యంతానందముతో శెట్టి యిట్లనెను -"ఇది నా యదృష్టమును అమ్మా! నా సర్వస్వమును మీదియే."

యోగిని యిట్లనెను:-"ఇచ్చట నితరులెవరు నుండరు. పంగనామములు ధరించిన ఈతఁడెవరు?"

శీఘ్రముగ శెట్టి యిట్లనెను:-"అమ్మా! ఈతఁడు గొప్ప పండితుఁడు ఒక కుటీరమందీతఁడును బడియుండును."

అధికారస్వరమున యోగిని యిట్లనెను:-"ఎట్లు పడియుండును. ఏదైన సత్రమును జూచుకొను మతము. నాకు పండితులు గిండితులు పనికిరారు. ఇచ్చట నుండి ఖోఁ ఖోఁ యని దగ్గుచుండును. ఈతఁ డుండినచో నేనుండను."

శెట్టి భయపడి యిట్లనెను:-"కాదమ్మా! అదేమియును లేదు. పండితుఁడైన ఫరవా లేదులే ఆతఁడిఁకొక చోటునకుఁ బోఁగలఁడు."

తన మాట మీఁదనే నిలువఁబడుచు యోగిని యిట్లనెను:-"ఎప్పుడు పోవును? త్వరచేయుము. ఆలస్యమొనర్పక స్థానమును ఖాళీ చేయవలెను."

శెట్టి సరళతతోడను,దృఢముగను నిట్లనెను:-"పండితులవారూ! మీరు క్రిందనున్న నే గదిలోనికైనను బొండు."

పండితుఁ డిట్లనెను:-"అట్లు పోనయ్యా! నేనీ స్థానమును వదలను." మధ్యలో యోగిని యిట్లనెను.-"సరే, శెట్టిగారు నేనే వెళ్ళెదను." దీనతా స్వరమున శెట్టిగా రిట్లనెను:-"అట్లు కాదు తల్లీ! మీరు చింతింప కుఁడు. నేనంతయును నేర్పాటు నొనర్చెదను." అని యిట్లు పలికి ఆతఁడధికార స్వరమున నిట్లనెను:-"అయ్యా! మీకు హఠముగ నున్నారే. క్రిందకుఁ బోయిన నీకు వచ్చిన చెరుపేమున్నది?

పండితుఁడు యోగిని వైపు జూచి దృఢముగ నిట్లనెను:-"నేను మొదటి నుండియును నిచ్చట నున్నాను. ఒక స్త్రీ కొఱకు నన్నుఁ దిరస్కరించుట మమ్ము మిక్కిలిగ నవమానించుటయే కాఁగలదు. నేను పోను. ఈమె యుండిన నుండును. పోయినఁ బోవును."

శెట్టి కిపుడు కోపము వచ్చెను. అది ధన స్వభావమే. ఆతఁడు నౌకరులతో నిట్లనెను:-"ఈ బ్రాహ్మణుని సామానంతయును దీసి యావలఁ బారవేయుఁడు. ఈతని మెడపట్టి బయటకు నెట్టుఁడు."

నౌకరులట్లే చేసిరి. పండితుని సామాను, దండకమండలువులను దీసి యావలఁ బాఱవైచిరి. ఆతని మెడ పట్టుకొని క్రిందకు గెంటిరి. పండితుఁడు సిగ్గుతో వెడలి పోయెను.

కొలఁది క్షణములలోనే లక్ష్మి అటు నిటుఁ దిరిగి భగవానుని కడకు వచ్చి యిట్లనెను:- "స్వామీ! మీ భక్తుని భక్తినిఁ జూచితిరా?

నవ్వి భగవానుఁడిట్లనెను:-" ఈతఁడు నాభక్తుఁడు కానే కాఁడు. ఆతఁడు నీకు భక్తుఁడు. నీ భక్తుఁడైనను నీతనికి ధర్మమందు బుద్ధి కలదు. దాన పుణ్యము లొనర్చుచుండెను. ఈ దాన పుణ్యముల ప్రభావముచే నీతనికి నా దర్శనమైనది.

లక్ష్మీదేవి గర్వముతో నిట్లనెను:—"స్వామీ! నేను రానంత వఱకే వీరికి భక్తి గిక్తి. నేను బోయితినా మిమ్ము డుగు వాఁడెవఁడు నుండఁడు."

భగవానుఁడు గంభీరుఁడై యిట్లనెను:—"కాదు దేవీ! ఇది నీభ్రమ. నా యథార్థ భక్తుఁడొంటరిగా నీతో మాట నైన మాటలాడఁడు. ఇంకొక విషయ మున్నది, నా వెంట రమ్ము."

లక్ష్మీదేవి శీఘ్రముగ నిట్లనెను:— "మంచిగి, అట్టి భక్తుఁడెవఁడైన నుండినఁ జూపుఁడు. అట్టి భక్తుఁడెవఁ డును లేఁడని నా యభిప్రాయము."

భగవానుఁ డిట్లనెను:—"మంచిది పోదము పద, నీకు చూపించెదను" అని పలికి భగవానుఁ డామెనొక వనము నకుఁ గొని పోయెను. ఒక సుందర ఆశ్రమ ముండెను. బాగుగా నలికి మెత్తఁబడి స్వచ్ఛముగ నుండెను. దానిలో మంచి మంచి ఫల, పుష్పవృక్షము లు నాటఁబడి యుండెను. ఒక వానప్రస్థుఁడాతని ధర్మ పత్నితో నచ్చట నివసించు చుండెను. ఒక చిన్న తులసీ కాననము పెంచ బడు చుండెను. ఒక పూరియిల్లుండెను. భగవానుని సాలగ్రామ పూజ ఒక అరుగు మీఁదనుండెను. వానప్రస్థుఁడు నిత్య కర్మ లొనర్చు కొని వనమునకుఁ బోవును; కందమూల ఫలములను దెచ్చు కొనును. భగవంతునకు నివేదించి 'రామ రామ' యని జప మొనర్చు చుండును.

యోగిని యీతని కడకును వచ్చి యిట్లనెను:- "సాధువర్యా! మేమిందుండుటకు కొంచెముగ స్థానము నొసంగెదరా? "

సాధువిట్లనెను:- ' అమ్మా! నేనొంటరిగా నున్న స్త్రీకి నాకుటీరమందు తావీయను. నీభర్తయుండిన ఫరవా లేదు. నీవు నగరము లోనికిఁబొమ్ము. "

యోగిని యిట్లనెను:-" ఇప్పుడు నేనీ సమయమున నెచ్చటికిఁ బోవుదును. ఈ రాత్రియంతయు నుండుటకు నాకు స్థాన మొసంగుఁడు."

వానప్రస్థుఁడిట్లనెను:-" మంచిది, ఆచెట్టు క్రిందఁబడి యుండుము."

యోగిని ఆచెట్టు క్రిందకుఁ బోయెను. వానప్రస్థుని భార్య ఆమెకు దినుటకుఁ గొంచెము కందమూల ఫలముల నొసంగెను. ఆయోగిని ఆమెతో నిట్లనెను -" దేవీ! మీరీ వనమందింతగా గష్టపడెదరేల? మీకెంత ద్రవ్యము కావల యునో దానిని నా నుండి తీసికొనరాదా? "

ఆమె యిట్లనెను:-" అమ్మా! మీరిట్టి మాటలిఁకఁ బలుకకుఁడు. నాకున్న సర్వస్వధనమును బరమేశ్వర రూపుఁ డగు నీ నా పతియే. ఈతఁడుండిన నా కేవస్తువులు కొదువ." అని పలికి ఆమెకు కందమూల ఫలముల నొసంగి ఆమె వెడలి పోయెను.

ప్రాతఃకాలమున యోగిని వెడలిపోయెను; కాని ఆమె అచ్చట రత్నముల యొక్కయు, ముత్యముల యొక్కయు, కువ్వలు వదలి పోయెను ఆశ్రమమందూడ్చుచు వానప్రస్థుని భార్య అచ్చటికి చేరఁగా నామె యితర కసవుతోఁ బాటుగా వాని నన్నిటిని బయటకుఁ ద్రోసివైచెను.''

ఈ విధముగ యోగిని అనేకసార్లు వచ్చి రత్నముల హారములను, ముత్యాల హారములను నచ్చట వదలి పోవుచుండెను వానప్రస్థుని భార్య వాని నన్నిటినిఁ బయటకుఁ ద్రోసివైచెను. చాలసార్లిట్లు జరుగఁగా నామె కసరి యిట్లనెను.–'' దేవీ! నీవిచ్చటికి వచ్చి మాటి మాటికిని కసవు నేర్పాటు చేసి పోవుచున్నావు. ఇప్పుడిఁక నీవిచ్చటికి రాఁబోకుము. అట్లు జరిగినచో నీకవమానము జరుగఁ గలదు.''

ఇదివిని లక్ష్మీదేవి తలవంచుకొని తనదారినిఁదాను బోయెను

అప్పుడు భగవానుఁడిట్లనెను:–'' దేవీ! నాభక్తులయొక్క నిస్పృహతను గాంచితివా? వారునన్ను తప్ప రాజ్య, స్వర్గ, ధన, వైభవము లేంఁజివరకు ముక్తినైనఁగోరరు. కేవలము నీ భక్తులైన వారు ధనమద మత్తులై యితరుల నవమానించెదరు నన్నుఁగూడ అవమానించెదరు. ఆశెట్టికి నావలన మనోరంజనము కలుగ నంతవఱకునన్నాతఁ డుంచుకొనెను. ఆతని స్వార్థమునకు వ్యాఘాతము కలుఁగగానే ఆతఁడు నన్ను

మొదపెట్టి నట్టివైచెను. కావున నేనెవరిని స్వీకరించెదనో ముందుగా వారి సర్వస్వమును హరించెదను.''

సూతుఁడిట్లనెను.—''మునులారా! ఇదివిని లక్ష్మీదేవి యిట్లనుకొనెను :—''నేను భగవంతుని దాసిని. జగత్తులో నాకుగల ప్రభావము ధనలోలుపులగు అజ్ఞులకడను' జదివిన మూర్ఖులకడను. భగవద్భక్తులున్ను భగవంతునితోఁ గలిపి పూజించుచుందురు. భగవంతుని సంబంధముననే నన్నుఁ గోరుచుందురు.

శౌనకుఁడిట్లడిగెను:—''సూతా! భగవానుఁడు తన భక్తుల సర్వస్వమేల హరించును?''

సూతుఁడిట్లనెను:—''స్వామీ! ఈవిషయమును నేను మీకుఁ జెప్పెదను. మీరు ధ్యానపూర్వకముగ వినుఁడు''

భక్తుని సర్వస్వమును హరియేల హరించును?

(౫౭౮)

శ్లో॥ యస్యాహం ననుగృహ్ణామి హరిష్యేతద్ధనం శనైః।
తతోఽధనం త్యజన్త్యస్య స్వజనాదుఃఖ దుఃఖితమ్॥

శ్రీభాగ. ౧౦స్కం. ౮౮అ.౮శ్లో॥

వ॥ ఎవ్వని నేనను గ్రహింపఁదలతును, వానిధనమును నేను క్రమముగా హరింప గలను. అతఁడధనికుఁడని స్వజను లా దుఃఖతుని వీడిపోవుదురు.

మనస్సాక్షి చే. దీనిచే విషయములను బ్రోది చేయవచ్చును. లేక హానికి బ్రబనన్న నొనర్పవచ్చును. ప్రపంచములోని విషయములును, వానియుపయోగములును ప్రభుసేవాసాధనము కొఱకే. పుష్పములు మన ఘ్రాణేంద్రియములకు క్షణకాలము గంధప్రదానము కావించి సుఖమును గలిగించుట లేదు; అవి ప్రభుసేవయం దుపయోగపడుటచే మనకు సుఖదము లగుచున్నవి. ఇట్లే సమస్త సాంసారిక పదార్థములు. మృష్టాన్నము భగవన్నివేదనమునకుఁ బనికి వచ్చుచున్నది. కావున నది శ్రేష్ఠమగుచున్నది. గుఱ్ఱము మీఁద నెక్కి యాత్రను సుఖకరముగఁ జేయవచ్చును. గావున మార్గమున సుఖకర మగుచున్నది. గుఱ్ఱము వీపుమీఁద మన మెక్కినను నది మోసినను దుఃఖము నొసంగునది యే. మోహావశమున మనము దానిచే మోయించుచున్నాము. భగవంతుని మంగళమయమగు నుత్సవములలో వినియోగించుటే ధనమున్నందులకు ఫలము భగవంతునకు మహత్తరమగు పూజ జరుగవలెను. అసంఖ్యాకులగు నరనారీజనము ప్రసాదమును బొందవలయును. భగవన్నామకీర్తనము జరుగవలెను. సుందరసుందర సుమధురకథలు జరుగవలెను. భగవానుని మధుమయ లీలలు వైభవముగ ననుకరింపఁబడవలయును. అందఱు దానదమును జెందవలయును. గో బ్రాహ్మణులకుఁ బూజలు జరుగవలయును. నిత్యమును వైభవముగ నుండవలయును. వచ్చిన అతిథి

అభ్యాగతులకు త్సాహముతో స్వాగత సత్కారములొనర్ప వలయును. ధనమును భగవంతునిదే నని భావించుచు నాతని సేవలకే వ్యయ మొనర్చినయెడలనది సుందరముగనే, సుఖము నుండును. అట్లుగాక కేవలము ధనము ను బ్రోవుచేయుటనే తెలిసికొని, దానిని దాన ధర్మములలో వినియోగించుట యును, భగవత్సంబంధమైన సేవలకు వినియోగించియును దెలియకున్నచో నాతఁడు కేవలము భారభూతుఁడే ఆతనితనికి విఘ్నము, భక్తులచే నేదైనఁ గార్యములొనర్పఁ దలచినచో వారికి ధనైశ్వర్యముల నొసంగును. ఆతని ధనములోని మహ త్త్వము ను దొలగించుటకై సర్వస్వము నపహరించును. అప హరణ మొనర్చిన నాతఁ డేమాత్రము చింతింపక, క్లేశమును జెందక, దీనిలోను దన ప్రభువుకృప నే అనుభవించు చుండినచో భగవంతుఁ డాతనికి మరల నావశ్యకతానుసారముగ మోహ ము ను బోఁగొట్టి ధనము నొసంగును. కావున భగవద్భక్తుల ధనమపహరింపఁబడినను, బంధు బాంధవులను నాశ మొనర్చి నను దానినాతని కృపగా భావింపవలయును. ఏలననఁగా భగవంతుని సమస్తవిధానములందుననుమంగళమే నిహితమై యున్నది. శివుని కార్యము లశివములెట్లు కాఁగలవు?

సూతుఁడిట్లనెను:–"మునులారా! భక్తుల సర్వస్వ మును భగవంతుఁడేల హరించుననియును, వీరికి కష్టము లేలఁ గలిగించుననియు మీరడిగితిరి. దీనికి నేను ప్రత్యుత్తర

మొసంగెదను. మీరు శ్రద్ధగా వినుఁడు. ఋషులారా! సువర్ణమే మాటిమాటికిని నగ్నిలోఁగాల్చఁబడును ఉత్తీర్ణుఁడు కాఁదలఁచినవానికే పరీక్ష యుండును. అదే విధముగ భక్తుల కార్థిక కష్టములనొసంగి వారిచిత్తముల విషయములనుండి మళ్లించి, తనవైపున కాకర్షించును. భక్తునకు భగవానుని మీఁదకంటె ధనముమీఁదనే మోహమున్నచో శ్రీహరి యాధనమును హరించును. ఐశ్వర్యగర్వ మున్నచో నా యైశ్వర్యమును నాశము కావించును. ఎవనికైనఁ ధనదాన సమ్మానాహంకారమున్నచో నచ్యుతుఁడు స్వయముగనే వాని యహంకారమును నాశముగావించును. ఈవిషయమున నేను నీకొక చక్కని దృష్టాంతమును జెప్పెదను. మీరు దానిని దత్తచిత్తులరై శ్రవణమొనర్పుఁడు"

ఒకసారి లక్ష్మీదేవి భగవానునితో నిట్లనెను:- ప్రభూ! మీరు మీభక్తులను ధనికుల నేలఁగావింపరు?"

భగవానుఁ డిట్లనెను:- "నాభక్తులీ వెండి, బంగారు నాణెములచే ధనికులు కారు. వారికి ధనము నాచరణములందు భక్తియే. వారు ధన మాయాజాలమునఁ బడినచో నాభజనమును మఱచెదరు.

లక్ష్మీదేవి యిట్లనెను:- "స్వామీ! ఇంటిలో నవ్వారిగ ధనధాన్యములుండుచో నప్పుడు దానమొసంగు కోరిక కలుగును. అప్పుడు ఉదారత కలుగును ఏమియును లేనివాఁడు దానమేమిచేయును, ధర్మమేమిచేయును?"

భగవానుఁ డిట్లనెను:—"ధనమున్న వారు ధర్మము నరుదుగఁ గావించెదరు. సాధారణముగ ధనమున్న చోట లోభము పెరుగును. ధర్మకర్మలం దప్పుడు విముఖుఁడై ధనమును ప్రోవుచేయుటలో నిమగ్నులై యుందురు. విషయము లలోఁ బడిపోవుదురు. మంచిది, నీకొకానొకప్పుడీ లీలను జూపించెదను."

ఒకదినమున భగవానుఁడొక భిక్షుక వృద్ధబ్రాహ్మణ వేషమును ధరించెను. లక్ష్మీదేవియును ముసలి దమ్మాయెను. వీరిద్దరొక ధనికుని యింటికిఁబోయిరి. ఆతని కడ నూఱు గోవు లుండెను. పోయి యింటివారితో నిట్లనిరి:—"అమ్మా! మేము ముసలివారము. నిర్బలులము. ఆకలి చెంది యున్నాము. ఆరోగ్యమును సరిగాలేదు. కొంచెము పాలను మాకొసంగుడు.

ఇది వినఁగానే ఆయింటి యజమానురాలు మండి పడెను. క్రుద్ధయైయిట్లనెను:—మీరిద్దరును నిల్లిల్లుతిరుగుచు భిక్ష మెత్తుకొను చున్నారు. ఏమియును బనిచేయరు. పనిచేయు టెందులకు? ఏపరిశ్రమయును లేకయే పదార్థములు లభించు చుండెనాయెను — భిక్షమెత్తుకొను చున్నారు. జిహ్వను జయింపలేదు. మనస్సు పాలు మీఁగడలను దినఁచేరు చుం డును. మాకు పాలు నీటివలె నున్నవి. వచ్చితివి పాలనడు గుడుటకుపోపొమ్ము.మాందిచ్చుటినుండి."

బ్రాహ్మణుఁడు మొండివాఁడు–ఇట్లనెను:– "అమ్మా! కొంచెమిమ్మా తల్లీ! తినకున్న బ్రదుకలేము గదా!

ఇంటి యజమానురాలిట్లనెను –"గిద్దెడో, కొంచగిద్దెడో మజ్జిగయిన నిచ్చెదను."

భగవానుఁ డిట్లనెను:–"అమ్మా! తెమ్మా! మజ్జిగనే తీసికొని రమ్మా."

అప్పుడామె కొంచెముగ మజ్జిగ నొసంగెను భగవానుఁడు త్రావి యిట్లనెను:–"అమ్మా! నీకు చాల వృద్ధి యగును గాక, వేయి గోవులగుఁ గాక!" ఇట్లని భగవానుఁ డచ్చటి నుండి వెడలి పోయెను. పోయి పోయి ఒక నిర్ధనుఁడగు బ్రాహ్మణుని యింటికిఁ బోయెను.

ఆ నిర్ధన బ్రాహ్మణుని యిల్లు ఊరికి బయట నుండెను. అతఁడును, భార్యయును, ఒక చిన్న పిల్లవాఁడును గలఁడు. ఇంటికి బయట నొక ఆవు కట్టఁ బడి యుండెను. భగవానుఁడు పోయి యిట్లనెను:–"మేము ముసలి వారము, మాకు కొంచెము పాల నొసంగెదరా!"

ఇది వినఁగానే బ్రాహ్మణుఁ డాతఁడు కూర్చుండుట కాసనము నొసంగి, పాదములను గడిగి మిక్కిలి నమ్రతతో నిట్లనెను:–"ద్విజవరా! ఈ మా యావు సోలెడు. మూఁడర సోలలు పాలొసంగును. అది మనకు లభింపఁ గలవు సాయంకాలము వఱకుండుఁడు. ఇచ్చిన పాలనన్నిటిని మేము మీకే యొసంగెదను."

నామె బ్రాహ్మణుని మాటలను లోపల నుండి యీ మాటలును వినుచుండి బయట పరువిడి వచ్చి యిట్లనెను:—"నేను పిల్లవానికొఱకు కొంచెముగఁ బాలుంచినాను. పిల్లవాఁడు రోజును ద్రావుచునే యున్నాఁడు. ఈ యతిథు లెప్పుడు వచ్చెదరు. ఆ పాలను వీరి కొసంగుఁడు."

ఇది వినఁగానే బ్రాహ్మణుఁడు లేచి, పాలను దెచ్చెను. వచ్చి యిట్లనెను:—"బ్రాహ్మణోత్తమా! గోవు చాలకొద్దిగఁ బాల నొసంగును. నేను పగలంతయును గడ్డికొఱకు పోవలసి యుండును అప్పుడింకఁ గొంచెముగ నొసంగును. ఈ కొంచెము పాల నిప్పటికి ద్రాగుఁడు."ఇట్లు పలికి బ్రాహ్మణుఁడు భగవానునకు బాల నొసంగెను. భగవంతుఁ డొక గ్రుక్కలో వానినన్నిటినిఁ ద్రావి వైచెను. లక్ష్మీదేవి కొక బిందువైనను వదలి పెట్టలేదు. త్రాగి యిట్లనెను: 'నీ యీ గోవునుకూడ భగవానుఁడు నశింపఁ జేయుఁగాక!'

ఇట్లు పలికి భగవానుఁడు కఱ్ఱ పోటును వైచుకొనుచు నచ్చటి నుండి వెడలి పోయెను. లక్ష్మీదేవి యిట్లడిగెను:—"స్వామీ! నొక్కొక్క పుడిశెడు పాలుగాని, ఒక్క చుక్క మజ్జిగను గాంచని యీయన వానికి వేయి గోవులుగా వృద్ధి పొందవలయునని యాశీర్వదించితిరి. తన పసివాని పొట్టను మాడ్చి తనకున్న సర్వస్వము నొసంగినవానికి నీకీ గోవుకూడ నశించిపోవుగాక"యని శాపమొసంగితిరి. మీ రిట్టి విపరీతపు వ్యవహార మేలఁ జేయుచున్నారు? దీనికి కారణ మేమి?"

ఇది విని భగవంతుఁడు నవ్వి యిట్లనెను:-"నేనెవ్వరి నను(గహింపఁదలఁచితినో ముందుగా వాని సర్వస్వమునుహరించెదను. మానవుఁడు మాయామోహమునఁ బడి నన్ను మఱచును ఆతఁడు తన ముందుండఱను దుచ్ఛులని భావించుచుండును. అందఱ నవమానించును. దాన ధర్మములందు రుచి యుండదు. రాత్రింబవళ్ళు పదిని నిరువదిగను, నిరువదిని ముప్పదిగను జేయుటకే వ్యగ్రుఁడై యుండును. ఇట్టివారికి నేనింకను సంపత్తి నొసంగెదను. ఆ నూఱు గోవులు కలవాఁడిప్పుడు మజ్జిగనైన నిచ్చుచున్నాఁడు. వేయియైనప్పుడివియు నొసంగఁడు. కావున వేయి గోవుల నొనర్చుట ఆతనికి వరము కాదు శాపమే. ఈ బ్రాహ్మణ దంపతులిద్దరును నా భక్తులు. నా భజన మొనర్చుచుందురు. వీరి భజనమునకీ గోవు కంటకముగ నున్నది. వీరికి గోవుచింత లేకున్నచో వీరు నా భజన మధికముగఁ జేయుదురు, కావున వీరికి గోవును లేకుండ నొనర్చుట శాపము కాదు. వరమే."

భగవంతుఁడే భక్తునకైనను దారిద్ర్య దుఃఖము లొసంగుట ఆతని హితమునకును భక్తిశ్రద్ధలను వృద్ధి పొందించుటకేనని లక్ష్మికి విశ్వాసము కలిగెను. దీన దరిద్రుఁడగు వాఁడు ఆశాభరిత దృష్టిచే నన్నివైపులను గాంచును. అందఱ నాదరించును. ధనికునకు గర్వము కలుగును. ఆతఁడు పైకి చూచుచు నడచును, అందఱ నవమానించును, కావున

భక్తుని నాతని మేలు కొఱకే నిర్ధనునిఁగ నొనర్చును. నిర్ధనతయును నాతని దయకు చిహ్నమే.

అంత శౌనకుఁడిట్లనెను:–"సూతా! అయితే దరిద్రులందఱును బుణ్యాత్ములే కదా! నిర్ధనత్వము వలననే భజనము జరుగుచో నీధనహీనులందఱును భగవద్భక్తులు కావలెను, కాని అట్లు జరుగుట లేదు. దారిద్ర్య దుఃఖముచే దుఃఖితులై జనులు నానా పాపములొనర్చుచుందురు. దీనికి విపరీతముగఁ జాలమంది ధనికులును గొప్పసదాచారులును, భగవద్భక్తులునై అభిమానశూన్యులై, నిస్పృహులై యుందురు. ఇదెట్లు, కృపతో నా యీ సందేహమును బోఁగొట్టుఁడు."

ఇది విని సూతుఁడిట్లనెను:–"మునులారా! నేను దీని రహస్యమును మీకు జెప్పెదను మీరీ విషయమును దత్తచిత్తులరై శ్రవణమొనర్పుడు."

భగవత్కృపా లక్షణము

(౫౭౯)

శ్లో॥ జన్మ కర్మ వయో రూప విద్యైశ్వర్య ధనాదిభిః ॥
యద్యస్య న భవేత్స్తంభస్తత్రాయం మదనుగ్రహః ॥

శ్రీభాగ. ౮స్కం. ౨౨ అ. ౨౬ శ్లో॥

సీ॥ విత్తవయోరూప విద్యా బలైశ్వర్య
కర్మ జన్మంబుల గర్వముడిగి
తే॥ యేక విధమున విమలుఁడై యెవ్వఁడుండు
వాఁడునాకూర్చి రక్షింపవలయువాఁడు
స్తంభలోభాభి మాన సంసార విభవ.
మత్తుఁడై చెడనొల్లఁడు మత్పరుండు॥

శ్రీమదాంధ్ర భాగవతము.

అభిమానమున కనేక కారణములుండును ఏదైన వస్తువు భాగ్యవశమున లభించినచో నది ప్రభు ప్రసాదమని భావింపక అజ్ఞానవశమున దానిని దనదే యనుకొన్నను, దానికొఱకై తన వద్ద అమూల్యమైన వస్తువున్నదని గర్వించుచుందురు. ఎవఁడైనను శ్రేష్ఠకులమున పుట్టి, గనది ఫలాని వంశమనియు, తన పూర్వజు లంతటి వారింతటి వారనియు, నిట్టి మిథ్యాభిమానమునఁబడి యితరులను దిరస్కరించి గర్వమున మునిఁగి యుందురు. ఇంకొకఁడు తన వర్ణాశ్రమాచారముల కనురూపమగు కర్మల నొనర్చుచు ఆ యహంకారమున మునిఁగి తేలుచు 'నేనింత జపము చేయుచున్నాను' ఇట్టి సదాచారముతోనున్నాను. ఫలానివాఁడు భ్రష్టుఁడు, ఆతఁడు పండితుఁడైన నేమి నాతో సమానముగఁ గర్మను జేయుట లేదు కదా'' అని చెప్పుకొనుచుందురు. ఒకానొకఁడు యువకుఁడై యౌవన మదమున వృద్ధులను దిరస్కరించు

చుండును, అతని ముడతలు పడినముఖము ననుకరించుచు నెగతాళి చేయును, అయ్యో! నవ్వెదెందులకు? నీవును నొక నాఁడు వృద్ధుఁడవు కావలయును. ఒకానొకప్పుడీ వృద్ధునకును నీకువలె యువావస్థయుండి యుండునని, గ్రహింపవలెను. కొందఱు తమ సౌందర్యమునకు మురిసిపోవుదురు. కురూపులను జూచిన నేవగించు కొందురు. సుందరముగ లేనివానిని నిందించెదరు. కొందఱు తమ విద్యాభిమానమందు మునిఁగి తేలుచు, నితరులను తృణముతో సమానముగ భావించును. కొందఱైశ్వర్యమును బొందిమదాంధు లగుచుందురు. ఎదుట నున్న వారినిఁ జూచుచుండియును గనరు. ధనికులు నిర్ధనులను దుచ్ఛులుగ భావించెదరు అందువలన వారు తమకంటెఁ దక్కువ వారలను నవమానించు చుందురు. ఉత్తమకులము నందు జన్మము, మంచి మంచి సత్కర్మా చరణము, సుందరమైన రోగ రహితమైన యువావస్థ, భవ్య ఆకృతి, సఫల విద్య, అపారైశ్వర్యము, యథేష్టమగు ధనము ఇవన్నియు నున్నను నెవనికహంకారము లేదో వానిని భగవానుఁడధికముగ ననుగ్రహించును.

శౌనకుఁడడుగఁగా సూతుఁడిట్లనెను:—"మునులారా! అసత్పాత్రులకు దాన మొసంగుటచే మానవుఁడు రాఁబోవు జన్మలందు దరిద్రుఁడగును. దరిద్రము వలన గృహస్థులెన్ని దుఃఖము లనుభవింపవలసియుండునో అది మీకనుభవము

లేదు. పొట్ట నిండక పోయినప్పుడే పొట్టకొఱకు మానవుఁడు గొప్ప గొప్ప పాపములొనర్చును. పాపములకు ఫలము నరకము. పాపములొనర్చి మానవుఁడు నరకమునకుఁబోవును. నరకము ననుభవించి మరల నింకొక నీచజన్మమున మానవుఁడు పుట్టును. అచ్చట మరలఁబాపమొనర్చును. మరలనరకమునకుఁ బోవును. ఈ విధముగ మరల మరల దరిద్రుఁడై జన్మించును. మరల పాపమునర్చును మరల నరకమునకుఁబోవును. ఈ విధముగ దారిద్ర్యము పాపచిహ్నమైనను, పుణ్యకర్మలొనర్చుచుండ నెవఁడు దరిద్రుఁడగునో ఆతఁడు పరమ పుణ్యఫలమును బొందును. ఏ దారిద్ర్యమందు తృష్ణ, అసంతోషము దుఃఖము, గ్లాని, అశాంతి కలదో, ఆ దారిద్ర్యము పాపమూలకము. ఏ దారిద్ర్యములో సంతోషము కలదో ఏ విధమగు దుఃఖము లేదో, మనస్సులో గ్లాని లేదో, తన సుకర్మలందు ఒక విధమగు గర్వము కలదో, ఆత్మశాంతి కలదో, అట్టి దరిద్రత పరమ పుణ్యముయొక్క ఫలమగును.

భగవద్భక్తులకడను ధనముండును, కాని వారి ధనమును దనదిగా భావించుకొనరు. వారు తమ్ము జీతము చేయు బత్తెగాండ్రుగ భావించుకొందురు. వారి కేవిధముగనైన ధనము వచ్చి మదము కలిగినచో మదహారి యగు మధుసూదనుఁడు వారి మదమును బోగొట్టుటకు వారిని దరిద్రులుగా నొనర్చును. భగవానుఁడు తన భక్తుని దుఃఖాను

భవమును కలిగింపఁ జేసి విశుద్ధులుగ నొనర్చును. ఈ విషయమున నేను మీకొక ప్రాచీన పౌరాణిక కేతిహాసము నొక దానినిఁ జెప్పెదను. దానిని మీరందఱును శ్రద్ధతో శ్రవణ మొనర్పుఁడు.

ప్రాచీన కాలమున నొక గొప్ప ధర్మాత్ముఁడగు చక్రవర్తి రాజుండెను. ఆతఁడు గొప్పశీలినుఁడు. వంశ పరంపరచే నాతనికి రాజ సింహాసనము లభించెను. ఆతఁడు గొప్ప సదాచారి, ధర్మాత్ముఁడు దాననిష్ఠుఁడు రాజెట్లు ధర్మాత్ముఁడో అట్లే ఆతనిసతీ సాధ్వియును, ధర్మపరాయణయును, దయావతియునగు మహారాణి కలదు ఇద్దరును యౌవనావస్థలోనే యుండిరి. కాని యువావస్థలో నుండు చంచలతయును, నస్థిరతయును నాతనిలోఁ గొంచెమైనను లేదు. రాజును, రాణియును నిద్దరును సుందరులే. శచీ పురందరుల వలెను, రతీ మన్మథులవలెను వారి దాంపత్యముండెను. మహారాజు గొప్ప సాధుసేవి. విద్వాంసుఁడు. ధనైశ్వర్యముల కాతనికి కొదువ లేదు ఆతని కోశము యాచకుల కొఱకై సదా తెఱచి యుండును. ఆతనికంతులేని భాండారము కలదు. ఎవరే వస్తువు నడిగిన వారు వారి కావస్తువు నిచ్చి వేసెడువారు. రాజు యొక్క యీగుణముల వలన నాతని ఖ్యాతి స్వర్గము వఱకును వ్యాపించెను. ఇంద్రుఁడును నాతని యశమును విని ఆతని యెడల నీర్ష్య వహించెను.

ఒకసారి ఆతని ధైర్యమును బరీక్షించుటకొరకు అకటా వికటపుముని వచ్చి అతని కడఁజాతుర్మాస్యవ్రతము నారంభించెను. ఆతఁడు వ్రతపాలనేచ్ఛచే వచ్చినవాఁడు కాఁడు. ఆతఁడు రాజు ధైర్యమును బరీక్షింప దలఁచెను. ఇంతటి యైశ్వర్యమున్నను నీతనికిఁ గొంచెమైన గర్వమున్నదా లేదా అనునది తెలిసికొనఁదలఁచెను. నిత్యమేదో అకటా వికటపు మాటలు మాటలాడుచుండెడు వాఁడు.

ఒకదినమున ముని యిట్లనెను:—"రాజా! నేను రథము మీఁద నెక్కి నీనగరమును నిరీక్షింపఁగోరుచున్నాను."

రాజు వినీతభావముతో నిట్లనెను:—"స్వామీ! ఇదెంత పని? మంచి రథము సిద్ధముగనున్నది. మీరేవిధమగు రథము మీఁద గూర్చుండి నగరనిరీక్షణ మొనర్ప దలచిన దానిపై వెడలవచ్చును."

ముని యిట్లనెను :— "రాజా! నేను గుఱ్ఱములను గట్టిన రథము మీఁదఁ నెక్కను. ఒకప్రక్క నీవును, మఱి యొకప్రక్క నీ రాణియును బట్టి దానినిలాగినచో దానిమీఁద నైన నెక్కిపోయెదను."

రాజు దీనముగ నిట్లనెను :— "స్వామీ! ఇది మా యదృష్టము. ఇట్టి సేవాసౌభాగ్యము మాకెట్లు లభింపగలదు?' ఇట్లు పలికి మహారాజు రథమును దెప్పించెను. ఒక ప్రక్కను ధనప్రాణప్రియయును బరమసుకుమారియగు రాజమహిషిని

గట్టైను, రెండవవైపునఁ దాను బూనెను. ఆ యకటావికటపు ముని చేతఁ గొఱడాను ధరించి కూర్చుండెను. బజారు మధ్యగుండా ఆతఁడారథమును దీసికొని పోయెను. స్త్రీ పురుషులందఱును రాజు, రాణి రథమును లాగుటనుగాంచి చకితులైరి. రాజు ముఖమున నేవిధమగు వికారమును లేకుండెను. లజ్జాసంకోచములును లేకుండెను. ఆతఁడమితానందముతో రాణితోఁగూడి రథమును లాగుచుండిరి. రాణి పరమ సుకుమారి. ఆమె యింతవరకొక శేరుబరువునైన మోయలేదు రాజునకును రథమును లాగునవసరమురాలేదు. అందువలన వారాగియాగి నడుచుచుండిరి. అప్పుడాముని రథముమీఁదఁ గూర్చుండి రాణి, రాజు శరీరములందు రివ్వు రివ్వుమని కొఱడాలతోఁ గొట్టుచుండెను. రాణిశరీరము నుండి రక్తము స్రవించుచుండెను. అయినను మహారాజు విచలితుఁడు కాలేదు. ఆతఁడు ముని యెడల నిసుమంతైన నశ్రద్ధను బ్రకటింపలేదు. ఈవిధముగ నాతఁడు త్రిప్పితీసుకొని వచ్చెను.

అప్పుడుముని ప్రసన్నుఁడై తన యథార్థపురూపమును జూపించెను. ముని యిట్లనెను:—"రాజా! నీవు నీనిరభిమానతాకారణమున సమస్త ఊర్ధ్వలోకములను జయించితివి. నీవు మోక్షమున కధికారివైతివి. నీవు భగవానునకు బరమానుగ్రహ భాజనుఁడవైతివి. ఈ జీవాత్మ అనేక యోనులలోఁ గర్మానుసారముగ భ్రమించి భ్రమించి మనుష్య

జన్మము నెత్తును. మనుష్య దేహమును బొందియును నాతఁడుచ్చకులమునఁబుట్టి, సదాచారసంపన్నుఁడై, యౌవనుఁడై, రూపవంతుఁడై, విద్వాంసుఁడై, అంతులేని ధనసంపత్తిని, అతులైశ్వర్యమును గలిగియుండియును నెవని కభిమానముండదో వానిమీఁద నాకు బరమానుగ్రహ ముండును. ఆఁతడు నా కృపకు భాజనుఁడు. రాజా! నీవీ సంసారసాగరమును నీయొక్క క్షమచేతను, సహనశీలత చేతను దరించితివి. నీవు సంసారమునకు సంబంధించిన ఆవాగమనమునుండి శాశ్వతముగ ముక్తుఁడ వైతివి.'' ఇట్లుపలికి ఆముని అంతర్థాన మయ్యెను. రాజునకు భగవద్దర్శనమైనది. చివరకు తన సహనశీలతవలన నాతఁడు పరమపదమును బొందెను.

సూతుఁడిట్లనెను.—మునులారా! వామనుఁడు వెళ్లినది బలిని మోసగించుటకు, కాని యాతని సహనశీలతా, సత్యనిష్ఠల కారణమున స్వయముగఁదానే మోసపోయెను. బలి బంధింపఁబడుటను గాంచఁగానే బ్రహ్మకు దుఃఖముకలిగెను. అందువలన నిట్లడిగెను:—''మీరీతని సర్వస్వమును హరించియు నీతని కిట్టి కష్టమునేలఁ గలిగించుచున్నావు?''

అంత భగవానుఁ డిట్లనెను:—''బ్రహ్మా! నేను బలిని బంధించుటలేదు. కాని యీతఁడే నన్నుఁ దన ప్రబల సహనశీలతచేఁదన వశమును గావించుకొనినాఁడు. చూడుము. ఈతనిపైన నొకదానికి మించిన నొకవిపత్తు వచ్చుచున్నది.

మొదట నేనతని సర్వస్వమును హరించితిని. ధనసంపద్విహీనుని గా నొనర్చితిని. నాపార్షదులీతని సైనికులను బాఱద్రోలిరి. ఈతనిఁ దిరస్కరించిరి. గరుత్మంతుఁ డీతని బంధించి నాఁడు జాతి జనమునుద్యజించిరి. ఈతని కులగురువీతని ననేక కటువచనములు పలికి భయపెట్టి కసరెను. చివరకీతఁడు విచలుఁడగుటను గాంచి యాతఁడీతనికి శాపమునుగూడ నొసంగెను. అయినను నీదైత్యుఁడు దానవుల కగ్రగణి. పరమ యశస్వి. దాత, ఇంద్రసేనమహారాజీతఁడు తన ప్రతిజ్ఞనుండి నువ్వుగింజవాసియైనను దొలఁగ లేదు తనప్రతిజ్ఞనుండి విచలితుఁడు కాలేదు. కావున విరించీ! నాదుర్జయ మాయను నీ బలి చక్రవర్తిజయించినాఁడని నేను తలంచుచున్నాను. ఈతఁడు పరమపదమున కధికారియైనాఁడు.

బ్రహ్మ యిట్లనెను:—"అయితే ప్రభూ! మీ రితని నిప్పుడెచ్చట నిలిపెదరు? ఈతని భూమి నంతను మీరు హరించి తిరిగ దా?"

భగవానుఁ డిట్లనెను:—"ఏమి హరించితిని. ఈతనికి నా సర్వస్వమును నొసంగితిని"

బ్రహ్మ యిట్లడిగెను:—"అయితే స్వామీ! ఈతఁడు ముక్తుఁ డగునా?"

భగవానుఁ డిట్లనెను :— "ముక్తుఁ డగుటయేమి? ముక్తి యీతఁడే. ఒక రూపమున నీతఁడు నాపార్ష

డుండై నాఁడు. ఇఁక నింకొక రూపమున నాగామి మన్వంతరమున నీతఁ డింద్రుఁడు కావలెను. తదనంతర మీతఁడు నా ధామమును శాశ్వతముగఁ బ్రాప్తింపఁ గలఁడు."

బ్రహ్మ యిట్లడిగెను:-"అప్పటి వఱకీతఁ డెక్కడనుండ వలయును."

భగవానుఁ డిప్పుడు బలిమహారాజుతో నిట్లనెను :- "మహాభాగా! విరోచన నందనా! ఆధులును, వ్యాధులును, గ్లానియును, తంద్రయు, బరాభవమును, నితర విఘ్నములును లేనట్టియు, విశ్వకర్మ నిర్మితమైన సుతల లోకమందు నీజ్ఞాతి పరివారములతోఁ బోయి నివసింపుము. ఆ స్థానము స్వర్గము కంటెను శ్రేష్ఠమైనది. దేవతలును దాని నాకాంక్షించెదరు. అది క్రిందనున్న స్వర్గము. అచ్చట నీకుఁ గష్టముండదు. స్వర్గములోకంటె సుఖముగ నీ వచ్చటనుండెదవు. అచ్చట నిన్ను జయించు వారెవరు నుండరు. నీ శాసనము నంగీకరింపని యసుర విసరమును నాచక్రధాటిచే నేను ఖండించెదను."

బలిచక్రవర్తి యిట్లనెను:-"ప్రభూ! నాకు పై స్వర్గము నక్కఱ లేదు, క్రింద స్వర్గము నక్కఱ లేదు. మీరెచ్చట నుందురో అదియే నాకు సర్వస్వమును. మీరులేని చోటు నాకు స్వర్గమైనను నరక సదృశమే మీరును నాతోఁగూడి అచ్చట యుండవలయును."

ఇది విని భగవంతుఁడు నవ్వి యిట్లనెను:-"వామనుఁడు బలిని బంధించినాఁడని లోకులనుకొనుచున్నారు; కాని యథార్థముగ బలియే నన్ను శాశ్వతముగాఁ దన సేవకునిఁగ నొనర్చుకొనినాఁడు. మంచిది నేను నీద్వారపాలకుఁడనై చేత గదనుధరించి నీపురమును సదా రక్షించు చుండెదను. నీవు సర్వదా నన్నచ్చట నీసమీపమునఁ జూడగలవు. ఇప్పుడింకను నీయందు మిగిలియున్న యత్కించి దసుర భావ మచ్చట నుండుటచే నంతయును నశింపఁగలదు. అంతయును నశించినది. రాఁబోవు సావర్ణిమన్వంతరమున నిప్పుడున్న నింద్రుఁడు తొలఁగఁగా నీవింద్రుఁడ వయ్యెదవు."

శ్రీశుక దేవుఁ డిట్లనెను:-"రాజా! బలి యింద్రుఁడగుటఁ జేతను, సుతలలోక రాజ్యమును బొందుటచేతను సంతోషముకలుగ లేదు. కాని శ్రీహరి దాసుఁడగు తన సమీపమున నింకొక రూపమునఁ బ్రత్యక్షముగ నుండునను సంగతినిఁ దెలిసికొని ఆతఁడానందమును జెందెను.

బలి భగవదాజ్ఞచే సుతలము ప్రవేశించుట

(౫౮౦)

శ్లో॥ ఇంద్రసేన మహారాజ యాహి భో భద్రమస్తు తే।
సుతలం స్వర్గిభిః ప్రార్థ్యంజ్ఞాతిభిః పరివారితః ॥

శ్రీభాగ. ౮ స్కం. ౨౨ అ. 33 శ్లో॥

సీ॥ సేమంబు నీకింద్ర సేన మహారాజ
వెఱవకు మేలు నీవితరణంబు
వేలుపులందుండి వేడుక పడుదురు
దుఃఖంబు లిడుమలు దుర్మరణము.
లాతురతలు నొప్పులందుండు వారికి
నొందవు సుతల మందుండు నీవు॥

శ్రీమదాంధ్ర భాగవతము.

సర్వేశ్వరునకుఁ దన సర్వస్వమును సమర్పించినవారికి భగవంతుని కడ నీయరాని వస్తువేదియు నుండదు. భగవంతుఁడు జ్ఞానులనిన మిక్కిలి సంతసించును. వారు ముక్తినిఁ గాంక్షించిరా వెంటనే వారికి ముక్తినిఁ బ్రసాదించును. ముక్తనొసంగినాఁడు. ఇఁకఁ జిక్కు తీరి పోయినది; కాని ఆతఁడు భక్తులకు చాల భయపడును. ఏలననఁగా నాతఁడు భక్తుల వెనువెంటఁదిరుగ వలసివచ్చును. వారి నెల్లప్పుడును రక్షించు చుండవలయును. వారి చరణధూళిని సదా శిరస్సున ధరింప వలసి యుండును భక్తుఁడు ముక్తినిఁగోరకున్నను ముక్తి ఆతఁడడుగకయే, అనాయాసముగ నూరక లభించును. పెరుగును కీసి కొనిన నడుగకయే పిడత లభించు నట్లును, పూరీనిఁ దీసి కొనిన వెల నీయకయే కూరలభించు నట్లును, భక్తిని యొక్క సంసార బంధము ప్రభు పాదపద్మముల కడకుఁ జేరఁగనే తెగి పోవును. భగవానుని భక్తవత్సలతను

గాంచుఁడు. ఆతనికి శ్రద్ధా భక్తులతో నొక తులసీ దళమును, నొక పుడిసెడు జలమును సమర్పించుచో, నిట్టి నిష్కపటులను శ్రద్ధాళువులు నగు భక్తుల కాతఁడు తన్నుఁ దానర్పించు కొనును. అట్లుకాకున్న నింతటి గొప్ప గొప్ప రాజులు తమ తమ రాజ్యములను విసర్జించి యేల నిరంతరము భిక్షువులై యాతని చరణములను జింతించు చుందురు?

శ్రీ శుక దేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను:- "రాజా! భగవానుఁడు బలి చక్రవర్తి యుండు సుతలలోకమున నాతని సమీపమున నిత్యము నుండి, ఆతని రక్షింతు నను నాశీర్వాదము నొసంగఁగానే ఆతఁ డత్యంతానందమును జెందెను. ఆనంద కారణమున నాతని నేత్రములనుండి ప్రేమాశ్రువులు ప్రవహించెను. శరీరమంతయును రోమాంచిత మయ్యెను. ప్రేమావేగముగచే నాతని కంఠము రుద్ధమైనను, తనను దక్కు సంబాళించుకొని మిక్కిలి కష్టముతో గద్గద వాక్కులతో నంజలిని బంధించి వామనుని స్తుతి చేయ సాగెను.

బలి యిట్లనెను:- "ప్రభూ! మీకరుణను గూర్చి చెప్ప వలసిన పనిలేదు. కొందఱ మీఁద జలము నొసంగుటచేతను కొందర మీఁద బూజనొనర్చుట చేతను, గొందఱ మీఁదఁ గేవలము ప్రణామ మొనర్చుటచేతను బ్రసన్నుఁడవయ్యెదవు. గజేంద్రుఁడు గ్రాహమునుండి విముక్తినిఁ జెందుటకై తొండమున

గమలమును గ్రహించి యెత్తి మిమ్ముస్తుతించెను. మీరు వానినప్పుడే యుద్ధరించితివి. నీవాతని నాసముద్రమున నే యుద్ధరించితివి. దేవతలకు విపత్తులు వచ్చిపడినప్పుడు, వారు క్షీర సాగరమునకుఁబోయి, మధురవాక్కులతోఁ బురుష సూక్తములతోడను నన్యసూక్తములతోడను మిమ్మునుగూర్చి దీర్ఘముగ స్తుతించెదు వారు. అప్పుడు నీవు కనఁబడక యే ఆకాశ వాణి ద్వారమునో పలికెదు వాఁడవు. నేను పూజచేయ లేదు. సరిగదా మిమ్ములను స్తుతియైను జేయలేదు. కేవలము స్తుతినిఁ జేయుటకుఁ బ్రయత్నించునంతలో మీరంతట మీరే మీయనుపమ కృపావృష్టినిఁ గురిపించితిరి. బ్రహ్మాది దేవతల మీఁదను, ఇంద్రాది లోకపాలుర మీఁదను జూపని కృపను ననాయాసముగ నసురాధముఁడనగు నాపైనఁ జూపితిరి. నాకు మీదర్శనమొసంగి కృతార్థునొనర్చితిరి. సర్వేశ్వరుఁడగు మీకేవస్తువు కొదువ; కాని మీరు నాగౌరవమును వృద్ధిఁ బొందించుటకై భిక్షుకులరైతిరి. అధముఁడనగు నాముందు చేయినిఁ జాచితిరి. ప్రభూ! మీచరణస్తుతి యెల్లప్పుడు జరుగు మాఁదునట్లు చేయ వలయునని, మీ పునీత, పాదపద్మము లందు పునఃపునః ప్రణామ పూర్వకముగఁ బ్రార్థించుచున్నాను.

శ్రీశుక దేవుఁ డిట్లనెను :—"రాజా! బలి చక్రవర్తి యొక్క యిట్టి కోమల వినీత వచనములను విని వామనుఁడు

నవ్వి కృపాపూర్వకముగ నాతఁడు బలివైపునకుఁ జూచెను. తనపౌత్రుని యెడలఁ బ్రభువు ప్రసన్నుఁడైఁ నాడనియు, నాతఁ డాతని కృపకుఁ బాత్రుఁడై నాడనియుఁ దెలిసికొని ప్రహ్లాదుని సంతోషమునకు మేఱ లేకుండెను ఆతఁడు గద్గద కంఠముతో భగవానుని భక్తవత్సలతను స్మరించి స్తుతి ప సాగెను.

ప్రహ్లాదుఁడిట్లనెను:-"ప్రభూ! నీకృపా విషయమున నేవిధమగు నియమమును గాంచలేము సరిగదా, నీ వేకారణమున, నెప్పుడెట్లు, ఎవరిమీఁద, నెట్లు, కృపను జూపెదవో ఊహింపనైన నూహింపఁజాలము. చతుర్దశ భువనములను రక్షించు వాఁడును, చరాచర జగత్తునకు గురువైనవాఁడును సమస్తలోక పితామహుఁడునగు బ్రహ్మయైనని పాదపద్మములను ప్రేమపూర్వకముగఁ బూజించునో అట్టి విశ్వేశ్వరుఁడు అధర్ములమగు మాకు ద్వారపాలకుఁడై నాఁడనిన నెవడు విశ్వశింపఁగలడు? చేతదండమునుధరించి దుర్గరక్షణ మొనర్త వనిన నాకాశ్చర్యమగు చున్నది మాలో నే సామర్థ్యమును లేదు. శక్తి లేదు, సాధన లేదు, సదాచారము లేదు, వినయము లేదు, భక్తి లేదు. నీచరణ కమలములలో మధుమయ మక రందపాన మొనర్చి బ్రహ్మాది దేవతలు సృష్టి రచనాది మహా కార్యములందు సమర్థులై యున్నారు. అట్టి కృప మాకనా యాసముగ, సాధనభజన మేమియును జేయకయే లభించి

నది నాకీవిషయమున మిక్కిలి ఆశ్చర్యము కలుగుచున్నది. మీకృపా సంబంధమున నిప్పుడు మేమేమి చెప్పఁగలము. మా బుద్ధి పనిచేయుటలేదు. నీవీచిత్ర విచిత్ర ప్రపంచమును మీయపరిమిత యోగమాయచే ననాయాసముగ లీలగా సృజించితివి. ఇట్టిసర్వజ్ఞుఁడవును, సర్వాత్మవును, సమదర్శి వగు నీవు ఇంతటి అకారణముగ నధములగు నసురులమీఁద నిట్టికృపను జూపుటను గాంచిన మాకు సందేహము కలుగుచున్నది. మీరు మా అసురుల యెడలఁబక్షపాతమును వహించుచున్నారేమోనని మా కనుమానము కలుగు చున్నది

ఇదివిని భగవానుఁడు నవ్వి యిట్లనెను:—"ప్రహ్లాదా! నీకు నాసమదర్శిత్వముమీఁద సందేహము కలుగుచున్నదా యేమి? '

ప్రహ్లాదుఁడిట్లనెను:—"అవును స్వామీ! తప్పక సందేహము కలుగుచున్నది; కాని మరల నిట్లనుకొను చుందును. నీవు కల్పవృక్షము వంటివాఁడవు. దానితో నెవని కేవిధమగు సంబంధము కలిగినను కల్యాణమే. కల్ప వృక్షము కడకు మనము పోవలసి యుండును. కాని నీవు స్వయముగఁ దమ యనుచరుల సమీపమునకు వచ్చి అనుగ్రహించెదవు. కావున సమదర్శివయ్యు నీవు నీయాశ్రితాధములపై విశేషించి కృపఁజూపెదవు."

శ్రీశుకదేవుఁ డిట్లనెను:- "రాజా! ఇప్పుడు భక్తునకును భగవంతునకును సంధి జరిగెను. ఆట సమాప్తమయ్యెను. కలహము పూర్తి యయ్యెను ఇప్పుడు కలసి మెలసి స్నేహ సంభాషణ మొనరించుచుండిరి. వీనిని శుక్రాచార్యుఁడు చూచి యిట్లనుకొనెను. వీరిద్దరును బరస్పరము కలుసుకొని ఒక్కటైరి నేను వ్యర్థముగ మధ్యలోఁ జెడ్డ వాఁడనైతిని. నాకు లొంగియుండు శిష్యునకు నేను వ్యర్థముగ శాపము నొసంగితిని. సర్వాంతర్యామియగు ప్రభువు శుక్రాచార్యుని యొక్క మనోగత భావములను గ్రహించెను. అందువలన నాతని సంతుష్టు నొనర్చుటకిట్లనెను :-"ద్విజశ్రేష్ఠా! భార్గవవంశావతంసా! స్వామీ! నేను మీయాజ్ఞమునకు జాల విఘ్నమును గలుగఁజేసితిని. మీయజ్ఞ కార్యమింకను బూర్తి కాకయే యున్నది. ఇప్పుడు మీరుదయయుంచి, తము యీశిష్యుని యసంపూర్తి యజ్ఞమును విధివిధానము ననుసరించి పూర్తి కావింపుఁడు. దీనిలో జరిగిన లోపములకు మార్జనమును గావింపుఁడు. కాక మీవంటి వేద వాదులగు విప్రులుండఁగా లోపము లెట్లు సంభవింపగలవు? విధయుండు ఉచ్చారణమందును, కర్మయందును, స్వరసామగ్రియందును, నేవిధమగు లోపములు సంభవించినను నవి యన్నియును బ్రాహ్మణుఁడు చూచుట చేతనే పూర్తి కాఁగలవు. కావున మీరీ బలిచక్రవర్తి యొక్క అపూర్తియజ్ఞమును బూర్తిగావింపుడు."

శుక్రాచార్యుఁడు భగవానుని యీ వినీత వచనములను విని మిక్కిలి లజ్జితుఁడయ్యెను. ఆతనిహృదయము ప్పొంగెను. ఆతఁడు గద్గదకంఠముతోఁ జేతులను జోడించుకొని భగవానునితో నిట్లనెను :- "ప్రభూ! యజ్ఞములందు బ్రాహ్మణగణము విధివిధానపూర్వకముగ నీనిర్గుణ నిరాకార రూపమును బూజించెదరు; కాని యీ యజ్ఞమందు మీరు స్వయముగ సగుణ సాకారరూపమున నున్నారు నీకెవరు భక్తిపూర్వకముగఁ దులసీ పత్రమును, బుష్పమును, ఫలమును, జలమును నెవరర్పించెదరో వారి యశుభముల నన్నిటిని నాశనమొనరించెదరు. కాని యీ యజ్ఞము యొక్క యజమాని తన సర్వస్వమును సమర్పించి నిన్నుఁ బూజించినాఁడు. ఈ బలియజ్ఞమందు లోపములు, విషమత లెట్లు డగలవు. నీవు స్వయముగఁ బరిపూర్ణుడవు. పరిపూర్ణుని సమ్ముఖమున అపూర్ణతయుండుటకు వీలులేనేలేదు. మంత్ర, తంత్ర, దేశ, కాల, పాత్ర, సామగ్రులలోని సమస్త లోపములును నీ నామము నుచ్చరించుటచేతనే నశించిపోవును. అయినను మీరాజ్ఞాపించినచో నేను సమస్తకార్యములు నొనర్చెదను, ఏలననఁగా నీ యాజ్ఞలకే వేదవాక్యములని పేరు.

శ్రీశుక దేవుఁ డిట్లనెను:-"రాజా! అప్పుడు భగవదాజ్ఞను బొంది శుక్రాచార్యుఁడు బ్రహ్మర్షులతోఁ గలిసి బలియజ్ఞములోని త్రుటులను బూర్తిగావించెను. యజ్ఞము పూర్తి

కాఁగానే భగవానుఁడు ప్రహ్లాదునితోఁ నిట్లనెను:—"వీర శ్రేష్ఠా! విరోచన నందనా! నీవు నన్నుఁ బ్రసన్ను నొనర్చుకొని సర్వస్వమును బొందితివి. నీ విప్పటి నుండియే ముక్తుఁడవు. నీవు నాకు నిత్య పార్షదుఁడవైతివి. ఇప్పుడీ మన్వంతరము వఱకు నీవు సుతలలోకమందు స్వర్గసుఖములను భోగింపుము. తరువాత రాఁబోవు మన్వంతరమున నిన్ను నే నింద్రునిఁగా నొనర్చెదను."

బలి దీనతతో నిట్లనెను:—"స్వామీ! ఇప్పుడు నాకింద్ర పదవి అక్కఱలేదు నాకు మీ చరణములందు భక్తి కావలయును."

భగవానుఁడు దృఢముగ నిట్లనెను:—"నాయనా! నీకక్కఱ లేకున్న నాకుఁ గావలయును. నా భక్తుని మనస్సునందు స్వప్నమందే కోరిక జనించినను దానిని నేను బూర్తి కావించెదను. నీ కింద్ర పదవియును, భృత్య పదవియును సమానములే. నీకు నా ప్రాప్తియే కలగినప్పుడిఁకఁ బ్రపంచమందు దుర్లభమగు వస్తువులేమి యుండును? అయినను నిన్నొక మన్వంతరమువఱకు దేవేంద్రునిఁగ నొనర్చి, అప్పుడు నిత్యధామమునకుఁ బంపెదను."

బలి వినీత భావముతో నిట్లనెను:—"ప్రభూ! మేము మీ యంత్రములము. మీరెట్లాడించిన నట్లాడుదుము. కాని మీ చరణ విస్మృతి కలుగకుండు నట్టులఁ జేయవలయునని

ప్రార్థించుచున్నాను. హృదయమున నిరంతరము నీ దర్శనము కావలయును.''

భగవానుఁడిట్లనెను:-''హృదయములోనే కాదయ్యా! నేను నీకు నిత్యమును ప్రత్యక్ష దర్శన మొసంగెదను. చేత గదను ధరించి నీపురమును రక్షించుచుండెదను. నీ వెప్పుడు పురప్రవేశ మొనర్చినను, నే నచ్చట కావలి కాయుచుండుటను గాంచగలవు.''

శ్రీశుకదేవుఁ డిట్లనెను:-''రాజా! ఈవిధముగ భగవదాజ్ఞను, నాశీర్వాదమును బొంది బలిచక్రవర్తి ప్రహ్లాదుని ముందుంచుకొని, తన బంధు బాంధవ పరివారములతోఁ బృథివీ బిలముద్వారా సుతల లోకమునకుఁ బోయెను.''

బలి ద్వారపాలకుఁడు వామనుఁడు.

(౫౮౧)

శ్లో॥ నేమం విరించో లభతే ప్రసాదమ్
న శ్రీర్న శర్వః కిముతాపరే తే।
యన్నోఽసురాణామసి దుర్గపాలో
విశ్వాభివంద్యైరపి వందితాంఘ్రిః॥

(శ్రీభాగ. ౮స్కం. ౨౩అ. ౬శ్లో.)

సీ॥ చతురాననుఁడు నీ ప్రసాదంబు గానఁడు
శర్వాణీ లక్ష్ముల జాడఁ బొందఁ

దన్యుల కెక్కుడి వసురులకును మాకు
బ్రహ్మాది పూజిత పదుండ వయిన
దుర్లభుండవు నీవు దుర్గపాలుండ వైతి
పద్మజాదులు భవత్పాదపద్మ
మకరందసేవన మహిమ నైశ్వర్యంబు
లందిరి కాక మే మల్ప మతుల

తే॥ మధిక దుర్బోధులము కఠినాత్మకులము
నీ కృపాదృష్టి మార్గంబు నెలవు సేర
నేమితప మాచరించితి మెన్నఁగలమె
మమ్ముఁ గాచుట చిత్రంబు మంగళాత్మ॥

—శ్రీమదాంధ్ర భాగవతము

సదా అశుచిగానుండి, నవఛిద్రములు గల దేహమందుండు జీవి జలమృత్తికల యొక్క శుద్ధత్వముచే భగవంతునిఁ బ్రాప్తించుట అసంభవము. భగవంతు డంతటి పవిత్రుఁడు. భగవంతుని యందెనో దివ్య గుణములు కలవు. నేను నా గుణములచే సంతోషపెట్టి, నా సదాచారముచే వానిని వశపరచుకొందుననుకొనుట, అది అసంభవము. భగవంతుని గుణముల ద్వారా యెవఁడును దన కధీనము కావించుకొనఁజాలఁడు. ఆతఁడు కృపావశుఁడు. కరుణా సాగరుఁడు. సమస్త జీవుల యందును సమాన భావముతో సదా కృపాదృష్టినిఁ జూచుచుండును. ఆతఁడు సాధన సాధ్యుఁడు కాఁడు. కృపా

సాధ్యఁడు. కృపా ప్రతీక్ష నొనర్చుచుఁ గాలము సమీపించి నప్పుడు, ఎప్పుడెవరి యందను వృష్టి కురియునో, ఛలకపటములు లేక యెవఁడభిమానమును వీడి అతని శరణుజొచ్చునో వానినే అనుగ్రహించును. తనకు కృపా పాత్రనిగా నొనర్చుకొనును. అతఁడు ప్రపంచమందు తన సమ్ముఖమున నెవ్వరికిని గర్వముండ నీయఁడు. ఆతఁడు గొప్ప గొప్ప బలవంతులను జిత్తు గావించెను. దీనుడై యెవరాతని శరణు వేఁడెదరో వారి కాతఁడు రక్షకుఁడును, ప్రతిపాలకుఁడును సేవకుఁడును నగును.''

శ్రీ శుకదేవుఁడిట్లనెను:–''రాజా! బలిచక్రవర్తి తన జాతి బంధువుల నందఱను దీసికొని సుతలలోకమునకుఁ బోఁగా నొక రూపమున వామనుఁడు బలి వెంటఁబోయెను, ఇంకొక రూపమున స్వర్గమునకుఁబోయి బలినుండి లాగుకొనిన త్రైలోక్య రాజ్యమును మరల దేవతల నొసంగెను. బలి చక్రవర్తి భగవంతుఁడు బంధింపఁ దలఁచెను గాని తానే బంధింపఁబడెను. ఇప్పుడాతఁ డాతని ద్వారమున గదను జేతిలో ధరించి, అతనికి రక్షకుఁడై నిలుచుండి యుండెను. ఎవరైన బలితోఁ బోరాడవచ్చినయెడల ముందుగా నీతనితోఁ బోరవలయును. ఈతని రక్షణలో నుండి బలి చక్రవర్తి మిక్కిలి యానందముగ సుతలలోకమున నానంద విహార మొనర్చుచుండెను.

శౌనకుఁడిట్లడిగెను:- "సూతా! ఈ ద్వారపాలకున కెవనితోనైన నట్లు తలపడుట జరిగినదా? బలి ద్వారమున నీతఁడెవరితో యుద్ధము చేయవలసి వచ్చినది?."

ఇది విని సూతుఁడిట్లనెను:-"స్వామీ! వీనితో యుద్ధమొనర్చు సామర్థ్య మెవని కున్నది? ఒకసారి రావణుఁడు సాహసమొనర్చి తలవంచుకొని పోవలసి వచ్చినది."

శౌనకుఁడిట్లడిగెను:-"సూతా! రావణుఁడేల వీరితోఁ బోరుటకు సాహసించినాఁడు. అతఁడేలఁ తలవంచుకొనిపోవలసి వచ్చినది? ఈ వృత్తాంతమును నీవు విస్తార పూర్వకముగఁ జెప్పవలయును; మాకు వినవలయునని బాగుగా నున్నది."

సూతుఁడిట్లనెః:-"స్వామీ! ఇది చాల పెద్దకథ; కాని నేను సంక్షేపముగఁ జెప్పెదను. దీనిని మీరుద త్తచిత్తులరై వినుఁడు?

ఒకసారి పాతాళమందు దిగ్విజయమొనర్చుచు రావణుఁడు సుతల లోకమునకు వచ్చెను. అతఁడచ్చట దూరమున నుండియే బలియొక్క దివ్యభవనములను గాంచెను. ఆభవన నిర్మాణ చాకచక్యమును, మెఱుఁగును గాంచి చకితుఁడై రావణుఁడు తనమంత్రితో నిట్లనెను :-"ప్రహస్తా! ఇంతటి సుందర మనోహర దివ్యభవన మెవరిది? నీవు లోపలకుఁబోయి దీనిలో నెవరు నివసించుచున్నారో అడిగి తెలిసికొనుము."

ఇదివిని ప్రహస్తుఁడు లోపలికిఁ బోయెను. ఆయు ప్రాకార ద్వారములను దాటి యెడవదాని కడకుఁ జేరఁగనే అచ్చట సూర్యునివలె జాజ్వల్యమానముగఁ బ్రకాశించుచుండు నొక పురుషుని గాంచెను ఆతఁడగ్ని రాశివలెఁ దేజముచేఁ బ్రజ్వ లించుచుండెను. వానినిఁ గాంచగనే ప్రహస్తునకదరిపోయెను. ఆతఁడు తిరిగి రావణుని సమీపమునకు వచ్చి భయముచేఁ గంపించుచు నిట్లనెను:-"ప్రభూ! లోపల లోహపు గదను ధరించి యొకవ్యక్తి నిలుచుండి యున్నాఁడు. ఆతని జూడఁ గనే నాకదురు పుట్టినది."

ఇది విని వీరమానియగు రావణుఁడు నవ్వియిట్లనెను:- "ప్రహస్తా! నీవు నామంత్రి వయ్యు నిట్లు భయ పడెదవేల? మంచిది, నేనేపోయి వచ్చెదను." ఇట్లుపలికి రావణుఁడు లోపలికిఁబోయెను. అచ్చట నతఁడును నా తేజః పుంజమగు ద్వారపాలుని గాంచఁగానే, ఆతని శరీరమును భయముచే గడ గడ వణఁక సాగెను. శరీరమంతటను జెమటలుపోయ సాగెను. ఆతఁడు ధైర్యమును వహించి భీకరముగా బీర ముగ నధికాం స్వరముతో నిట్లడిగెను:- ఏమయ్యా! ఈ భవనమందెవరుందురు? ఇది యెవని నివాస స్థానము?"

తేజముచే జాజ్వల్యమానుఁడగు నావ్యక్తియిట్లనెను:- "రాక్షసేశ్వరా! దీనిలోపలఁ బరమ యశస్వి యును, దానవ వీర శిరో మణియు, దైత్య దానవేశ్వరుఁడును మహామన

స్థ్వియునగు బలిచక్రవర్తి నివసించుచున్నాఁడు. నీకేమి కావలయును? నీకు యుద్ధము చేయఁగలయునను గోరిక యుండినచో ముందుగా నాతో యుద్ధమొనర్పుము. తరువాత నా స్వామి కడకుఁ బోవలయును.''

రావణుఁడిట్లనెను :—''కాదు, నేను నీతో యుద్ధము చేయఁ దలచుట లేదు, బలి సమీపమునకుఁ బోయెదను.''

ఆవ్యక్తి యిట్లనెను:—''మంచిది, లోపలికిఁ బొమ్ము. ఇది వినఁగానే రావణుఁడు లోపలికిఁ బోయెను. అచ్చట నాతఁడసురేంద్రుఁడొక దివ్యాసనమునఁ గూర్చుండి యుండుటను గాంచెను. బలి రావణుని మిక్కిలిగ నాదరసత్కారము లొనర్చెను. కుశలము నడిగెను. సమస్త లోక పాలురను జయించి వచ్చిన రావణునిఁ జూడఁగనే బలి మిక్కిలి సంతసించెను. బలి ఆతని మిక్కిలి ప్రేమతో వడితోఁ గూర్చుండబెట్టుకొని, మిక్కిలి స్నేహముతో నిట్లడిగెను :—''రాక్షసేశ్వరా! నీకేమి కావలయును? నేను నీకేమి ప్రియకార్యము నొనర్పవలయును?''

రావణుఁ డిట్లనెను :—''మహానుభావా! నీవు మాతృకుల సంబంధముచే నాకు బూజ్యులు. విష్ణువగు వామనుఁడు నిన్ను మోసగించి సర్వస్వమునపహరించి నాఁడనియు, నిన్ను బంధించి పాతాళమునకుఁ బంపినాఁడనియు వినియుంటిని. నేనా విష్ణువును రణమునఁ జంపి నిన్ను విముక్తు నొనర్చుటకు వచ్చియుంటిని. నీవా విష్ణువెచ్చట నున్నాఁడో నాకుఁ జెప్పుము.

ఇది విని బలి పక పక నవ్వుచు నిట్లనెను:—"ఓయీ! ఆవిష్ణు భగవానుని రణమున నెవఁడు జయింపఁగలఁడు. ఆతఁడజేయుఁడు.

అహంకార స్వరమున రావణుఁ డిట్లనెను – "నేను యమ, కుబేర, దేవేంద్రాది సమస్త లోకపాలురను జయించితిని. నేఁటి వఱకు రణమున నాసమ్ముఖమున నిలిచిన వారు లేరు. విష్ణువెచ్చట నున్నాఁడో నాకుఁ జెప్పుము. నేనవశ్యమాతని జయించి, నిన్ను బంధ విముక్తునిఁగా నొనర్చెదను."

బలి యిట్లనెను:—"మంచిది, ఒక్క పనినిఁ జేయుము. ఎదురుగా గుండ్రగుండ్రముగా మెఱయుచుండిఅచ్చటచక్రము వలెనున్నదే దానినిఁ దీసికొని నాకడకుఁ దీసికొనిరమ్ము."

ఇది వినఁగానే రావణుఁడహంకరించెను. ఆతఁడు తన శక్తి నంతయును జూపి,ఆ జాజ్వల్యమానమగు చక్రము నెత్తెను గాని అది కదలలేదు. అప్పుడాతనికి మిక్కిలి దుఃఖము కలిగెను. తన శక్తి నంతను వినియోగించఁగా నది బెడసెను. దానితోఁ రావణుఁడు ధడామ్మని ధరణిపైఁ బడెను. నోటి నుండి రక్తమును గ్రక్కుచుండెను. సంజ్ఞాశూన్యుఁడయ్యెను. గ్రుడ్లు వెళ్ళుకొని వచ్చెను."

అప్పుడు బలి ఆతని సమీపమునకుఁ వచ్చెను. ఆతనిని లేవఁదీసి తన సమీపమునకుఁ గొనిపోయి యిట్లనెను:— "నాయనా! పూర్వకాలమున మా తాత తండ్రి, మహాతేజస్వి

యగు హిరణ్యకశిపుఁ డుండెడువాఁడు. ప్రపంచములో నాతనికి సమానుఁడగు బలవంతుఁడు లేకుండెను ఆతనిని విష్ణువు నృశింహ రూపమును ధరించి, తేలనముగఁ జంపివైచెను ఆతని పొట్టను గోళ్ళతోఁ జీల్చివైచెను. ఆ సమయమున నాతని ముకుట మెచ్చటనో పడిపోయెను. కుండలము లెచ్చటనో పడెను. ఒక కుండలమిచ్చట పాతాళమునకు వచ్చి పడెను. ఇది ఆతని కర్ణకుండలము. దీనినాతఁడు చెవులందు ధరించెడువాఁడు. నేనింద్రుని, వరుణుని, గుబేరుని జయించితి నంటివి. యమునిగూడ యుద్ధమున సంతోష పెట్టితినంటివి. విష్ణువేయాయుధము లేకయే వినోదమునఁ జంపిన నీ వ్యక్తి యొక్క కర్ణకుండలమునే యెత్తఁజాలక పోయితివే అట్టి వాఁడవు నీవాతనితో యుద్ధమేమి చేయఁగలవు?"

ఇది విని రావణుఁడు స్తంభితుఁడయ్యెను. ఆతఁడిట్లడిగెను:—"ఆ విష్ణువెచ్చట నున్నాఁడు?

బలిమహారాజిట్లనెను:—"ద్వారమున లోహపుగదను బట్టుకొని తేజఃపుంజమువలె నున్నాఁడే ఆతఁడే సాక్షాత్ మహా విష్ణువు. నీవు వేలకొలఁది యింద్రులను జయించిన జయించెదవుగాక! నీతని జయింపఁజాలవు. ఇంటికి దయ చేయుము. నన్ను విముక్తునొనర్చ ప్రయాసము బడకుఁడు."

సూతుఁ డిట్లనెను:—"మునులారా! ఇది వినఁగానే మహా అహంకారియగు రావణుఁడు వామనునితో యుద్ధ

మొనర్చుటకు ద్వారము కడకువచ్చెను. భగవానుఁ డిట్లను కొనెను:—పొరపాటున నైన నా చెంప పెట్టొక్కటి తగిలిన వీడు చావగలఁడు. వీఁడిప్పుడే చావరాదు.'' అని అనుకొని భగవానుఁడు వెంటనే అంతర్ధానమయ్యెను.

భగవానుఁ డచ్చట లేకుండుటను రాక్షసుఁడు తెలిసి కొనెను. ఆతఁడు మిక్కిలి వేగముతో సింహనాద మొనర్చుచు సవాలు చేయుచు నిట్లనెను:—''నేను సుతలలోకమునుగూడ జయించితిని.'' అని పలికి ఆతఁడచ్చటనుండి వెంటనే వెడలి పోయెను.''

సూతుఁ డిట్లనెను:—'' మునులారా! ఈవిధముగ రావణుఁడు భగవానుని మహాబలపరాక్రమము ననుభవపూర్వకముగఁ దెలిసికొనెను. వామన భగవానుఁడు తన యెడమ కాలి బొటన వ్రేలితో రావణుని విసరఁగా నాతఁడు సహస్ర యోజనముల దూరమున బోయి పడెననియు వ్రాయఁబడి యున్నది. ఏ భగవానుని శ్వాసవలన నీచరాచర విశ్వమంతయు నుత్పన్నమైనదో అట్టివాని కసంభవమైన దేమున్నది? ఆతఁడు నానారూపములను ధరించి కేవలము వినోదముకొఱకే నానా లీలలొనర్చును. ఈ విధముగ భగవానుఁ డొక రూపమున సదా సుతల లోకమందు బలిద్వారమునను ండును. ఒకరూపమున స్వర్గమందింద్రునితోఁ బ్రదిలోకములను బాలించు చుండును. నే నత్యంత సంక్షేపమున వామన భగవాని చరిత్రమును జెప్పితి. ఇప్పుడు మీ రేమివినఁదలఁచు చున్నారు.''

శౌనకుఁ డిట్లడిగెను:–"సూతా! బలి పాతాళము నకుఁ బోయిన మీఁదట భగవానుఁ డింకేమి యొనర్చెను. ఆ విషయమును నీవు మాకు జెప్పవలయును."

సూతుఁ డిట్లనెను:–"బలి నుండి పృథివిని గైకొని వామనుఁ డేవిధముగ నుపేంద్రుఁ డైనదియు నేను మీకుఁ జెప్పెదను. మీరందఱును సమాహిత చిత్తులరై శ్రవణము చేయుఁడు."

వామనప్రభువు నుపేంద్రునిఁగా నభిషేకించుట.

(౫౮౨)

శ్లో॥ ఏవం బలేర్మహీం రాజన్ భిక్షిత్వా వామనో హరిః॥
దదౌ భ్రాత్రే మహేంద్రాయ త్రిదివం యత్పరైర్హృతమ్॥
ప్రాప్య త్రిభువనం చేంద్ర ఉపేంద్ర భుజ పాలితః।
శ్రియా పరమయా జుష్టో ముముదే గతసాధ్వసః॥

—శ్రీ భాగ. ౮ స్కం. ౨౩అ. ౧౯శ్లో॥

వ. ఇవ్విధంబున వామనుండయి హరి బలి నడిగి మహిం బరిగ్రహించి తనకు నగ్రజుండగు నమరేంద్రునకుం ద్రిదివంబు సదయుండయి యొసంగె న త్తఱి దక్ష భృగు ప్రముఖ ప్రజాపతులును భవుండును గుమారుండును దేవర్షి పితృ గణంబులును రాజులును దానును గూడికొని చతురాననుండు

కశ్యపునకు నదితికి సంతోషంబుగా లోకంబులకు లోక
పాలురకు వామనుండు వల్లభుండని నియమించి యంత
ధర్మంబునకు యశంబునకు లక్ష్మికి శుభంబులకు దేవతలకు
వేదంబులకు స్వర్గాపవర్గంబులకు నుపేంద్రుండు ప్రధా
నుండని సంకల్పించె నాసమయంబున.

—శ్రీమదాంధ్ర భాగవతము

భక్తవత్సలుఁడగు భగవానుని అలౌకిక లీలలయందు సర్వత్ర భక్తవాత్సల్యత యిమిడి యుండును. అతని సమస్త చేష్టలయందును నాశ్రితుల యిచ్ఛాపూర్తి యిమిడియున్నది. ఆప్రభువు సంకల్పమాత్రముచేతనే సమస్తమును జేయసమర్థుఁడు; కాని అతఁడు సాకారరూపమును ధరించి ఆ లీలలను జేయుట, అతని చరిత్రమును సదా గానము చేయఁబడుచుండ వలయుననియే. భగవంతుని యొక్క సగుణ సాకార రూపమును ప్రత్యక్షముగ దర్శనము చేయని వారీ చరిత్రములను విని, చెప్పి యీదుస్తర సంసార సాగరమును సరళముగ దాటిపోఁగలరు. కాముకులకనుకూల కామినీ చరిత్రమును వినిన రోమాంచమగునట్లును, వారి చిత్తము తన్మయమైనట్లును, జాగ్రత్స్వప్నములందును నామెస్మరణమునే కలిగి యుండునట్లును భక్తుఁడు భగవచ్చరిత్రములను విని; భావజగత్తునందాతనిఁ ప్రత్యక్షముగ దర్శించుచుందురు. అతని స్మరణము జరుగుటచే నాతఁడు తన్మయుఁడగును. కావునఁ

ప్రపంచమందేదైన శ్రవణీయమగు కథ యేదైన నున్నయెడల నది యవతార కథయే. ఈకథలు వర్ణములకును ప్రియమైనవి. పాపనాశన సమర్థములైనవి. కావున సదా సర్వదా శ్రద్ధాభక్తులతో సచ్చిదానంద సాకార స్వరూపముల చరిత్రల నే శ్రవణమననములొనర్పవలయును. ఇదియే పురుషార్థము. ఇదియే సర్వశ్రేష్ఠమగు సాధనము.

శ్రీ శుకదేవుఁడు పరీక్షిన్మహా రాజుతో నిట్లనెను:- "రాజా! ఈవిధముగ వామనుడు భిక్షుకుఁడై అస్త్రశస్త్రములను బట్టకయే బలిచక్రవర్తిని జయించెను."

అంత శౌనకుఁ డిట్లడిగెను:- "సూతా! నీవు దీని ని విషయమని యెలపలికెదవు. మోసమనుము. ఇది యేమాత్రమును విజయము కానేకాదు."

సూతుఁడిది విని మిక్కిలినవ్వి యిట్లనెను:-"స్వామీ! బ్రాహ్మణవేషమునకు సదా విజయమే లభించును. సర్వస్వమును త్యజించి, భిక్షుకుఁడైన వానికేమి పరాజయము? "దిగంబరి పరమేశ్వరుని కంటె గొప్ప వాఁడను సామెత నిజము. భిక్షా జోలెను బట్టిన వానినెవరేమి చేయుఁగలరు? స్వామీ! బ్రాహ్మణుఁడు గెలిచినను గెలిచిన వాఁడే, ఓడినను గెలిచిన వాఁడే. ఈ విషయమున నేను మీకొక సత్యఘటనమును జెప్పెదను."

విశ్వనాథుని పురియగు కాశీక్షేత్రమందు ఘూర్జర ప్రాంతీయ బ్రాహ్మణుఁ డొకఁడుండెను. బ్రాహ్మణుఁడు

భాగుగాఁ జదివినవాఁడు గొప్పపరివారమును గలదు. ఆతనికి భూమియును గలదు. అచ్చటనే ఒక గొప్ప భూఖామందు నివసించుచుండెను. ఆగ్రామమునకు సమీపముననే యీ బ్రాహ్మణునకును భూమి కలదు. ఒక పెద్దతోటయు నుండెను. వాస్తవమున నది భూమి పతిది కాని దానిమీఁదనధికారము బ్రాహ్మణున కుండెను. భూమిపతి చెళ్లపిళ్లరాయఁడు. ఆఁతఁడు భూమికి సంబంధించిన కార్యములను జూచుట లేదు. అంతయును తన నౌకరులే చూచుకొందురు. ఈ పండితుఁడనిన నాతనికి చాల ప్రేమ. ఒకానొక దినమున నొక నౌకరువచ్చి యిట్లనెను:—"అయ్యా! ఈ బ్రాహ్మణుఁడు మీతోఁట నాక్రమించినాఁడు."

అంత భూమిపతి యిట్లనెను:—"పండితవర్యా! చెప్పుడు తోట యెవ్వరిది? పండితుఁడు దృఢముగ నిట్లనెను:—"అయ్యా! నాదియే?"

నౌకరిట్లనెను:—"మీ దెట్లైనదయ్యా! రాజ ద్వారముననున్న ఫలకముమీఁద మామహారాజు పేరు వ్రాయబడియున్నది."

పండితుఁడిట్లనెను:—"పేరెవరిది వ్రాసిన నేమి? తోట నాదియే."

నవ్వి భూమిపతియిట్లనెను:—"అయితే, ప్రధాన న్యాయస్థానములో నభియోగమును గావింపవలెను.

పండితుఁడిట్లనెను:—"వ్యాజ్యమును వేయుఁడు మహా రాజా! నిశ్చయముగ విజయమునాదే.

భూమిపతి నౌకరుతో నిట్లనెను:—" సరియే, ఈతని మీఁద మాతోటను నక్రమముగా నాక్రమించినాఁడని వ్యాజ్యమును వేయుము "

కొంత తగాదాజరిపింపవలయునని నౌకరు కోరు కొనుచునే యుండెను. వ్యాజ్య మారంభమయ్యెను పండి తుఁడును బ్రయత్న మునర్చు చుండెను. ధనమవసరమగుచో భూమిపతినే వ్యాజ్యమునకు గావలయునని అడుగితీసుకొంద మనుకొనెను.

చివరకు న్యాయాలయములోఁదోటభూమిపతిదే, అతనికే చెంద వలయునని తీర్పు చెప్పఁబడెను. నవ్వి భూమిపతియిట్లడి గెను:—"పండితప్రవరా! విజయమెవరిది?"

పండితుఁడు దృఢముగ నిట్లనెను:—" నాదేనండీ! "

భూమిపతినవ్వి యిట్లడిగెను:—"అయ్యా! తోటయెవ రిది?"

పండితుఁ డిట్లనెను:—" మామిడి పండ్లనెవరు తినిన వారిది తోట. అయ్యా! చూచెదరు మామిడి పండ్లనెవరు తినఁ గలరో?"

ఆతోటమీఁద గట్టికాపుండ నేర్పాటు చేసెను. ఆ భూమిపతి. నౌకరులు తోటను దమ స్వాధీనము లోనికిఁ దెచ్చుకొనిరి."

రెండుమూఁడు మాసములైన మీఁద శ్రావణము వచ్చెను. పండితుఁడు రక్షాబంధమును దీసికొని భూమిపతి కడకు వచ్చెను వచ్చి రక్షాబంధము నాతని చేతికిఁ గట్టి యీమంత్రమును బఠించెను

శ్లో॥ యేన బద్ధో బలిః రాజా దానవేంద్రో మహాబలిః।
తేన త్వాం ప్రతి బధ్నామి రక్షేమా చల మాచల॥

ఇతర బ్రాహ్మణులకు భూమిపతి యిచ్చిన వానికంటె నెక్కుడుగ పది, పదునైదు మొహరీలను బండితునకొసంగెను.

పండితుఁ డిట్లనెను:—“ అయ్యా! నాకీ సువర్ణముద్ర లవసరము లేదు.”

భూమిపతి నవ్వి యిట్లనెను:— “ అయితే, మీకేమి కావలయును స్వామీ!”

పండితుఁ డిట్లనెను:— “ అయ్యా! నాతోట నాకొసంగుఁడు.”

ఇదివిని భూమిపతినవ్వి యిట్లనెను:—“స్వామీ! మీరు నిజముగా నన్ను బంధించివైచినారు. సరియే లెండు తోటనిచ్చి వైచితివి.”

అప్పుడు పండితుఁ డిట్లడిగెను:— “అయ్యా! విజయమెవరిదో చెప్పుఁడు.”నవ్వుచు భూమిపతి యిట్లనెను:— “పండిత శ్రేష్ఠా! బ్రాహ్మణు నెవరైన జయింప గలరా? ఆతనికి జయించినను జయమే, ఓడినను జయమే. విజయము మీదే,మీదే నండీ!”

సూతుఁ డిట్లనెను:— "కావున మానవులారా! అట్లు భగవానుఁడు త్రైలోక్యరాజ్యమును బలిని డిగ్గికొనినాఁడు. శస్త్రబలముచే గ్గికొనలేదు, ధర్మ బలమున లాగినాఁడు. ఈవిధముగ బలిచక్రవర్తి నుండి సమస్తమును గ్గికొని, భగవానుఁడు తన సోదరుఁడగు ఇంద్రునకు త్రైలోక్య రాజ్యము నిచ్చివైచెను. బ్రాహ్మణుఁడు తన కొఱకు భిక్ష మెత్తఁడు. వానికి దొఱకిన దానిని బరోపకారమునకు వినియోగించును. తక్కిన మితరుల కొసంగును. అతఁ డెల్లప్పుడును దన భిక్షతోడనే జీవించును."

శుక మహర్షి పరీక్షిన్మహారాజుతో నిట్లనెను:— "రాజా! ఇంద్రుఁడు మరల స్వర్గసింహాసనమునఁ గూర్చుండ నుండగా నప్పుడు శివుఁడును, సనత్కుమారుఁడును, దక్షుడును, భృగువును, అంగిరాది సమస్త ఋషులును, మునులును సమావేశమైరి. సమస్త దేవతలును, మానవదేవతలును, విశ్వగణమును, రాజులును, మహారాజులును, నచ్చటికి వచ్చిరి. వామనుని తల్లిదండ్రులగు నదితి కశ్యపులును, నా సమావేశమునకు వచ్చిరి. ఆ నిండుసభలో బ్రహ్మయిట్లనెను:— "ఇచ్చట సమావేశమైన మహానుభావులారా! వామనుఁడు తనబుద్ధిబలముచే బలిచక్రవర్తియొక్క సర్వస్వమును హరించినాఁడు. కావున నేటినుండి మన మీతని సమస్త లోకములకును, లోకపాలకులకును, ప్రజలకును, వేదములకును, దేవతలకును, ధర్మము, యశము

లక్ష్మి. మంగళము. వ్రత, స్వర్గాపవర్గములకును బ్రభువుగా నొనర్చు చున్నాము. ఒనర్చుటేమి? అతఁ డిదివఱకే అయి యున్నాఁడు అందఱను బాలించుటకాతఁడు సర్వథా సమర్థుఁడు. కావుని నీతనినే యింద్రపదమందు నభిషిక్తుఁ నొనర్ప వలయును."

భగవానుఁ డిట్లనెను:—"దేవగర్భా! నీవు ధర్మమర్మ మెఱిఁగిన వాఁడవు. నీవిట్టి యవినీతికార్యము నొనర్పకుము. అన్న యుండగాఁ దమ్ముఁడెట్లు సింహాసనమునఁ గూర్చుండఁ గలఁడు."

ఇంద్రుఁ డిట్లనెను:—"ప్రభూ! నీ వందఱికంటెను బెద్దవాఁడవు నిన్నుఁ జిన్నవాఁడనఁగల వాఁడెవఁడు? నేనింద్రాసనమును రక్షించుటకు సర్వథా అసమర్థుఁడను."

వామనుఁ డిట్లనెను:—"అట్లుకాదు. నీవే పెద్దవాఁడవు. నీవే యింద్రాసనమున కధికారి. నేను సేవకుఁడనై రక్షించుచుండెదను. నాభుజములచేఁ బాలింపఁబడు నీ త్రైలోక్యరాజ్యమును గన్నెత్తియైనఁ జూడఁగల వాఁడెవఁడును లేఁడు."

బ్రహ్మాది దేవత లిట్లనిరి:—"అయినను స్వామీ! మీరేదో పదవిని స్వీకరింప వలయును. పదాధికారము లేనిది కార్యమునందు మమత్వముండదు. మీకింద్రుఁ డగుటకభ్యంతర మున్నచో నింద్రునకు సహకారిగా నుపేంద్రత్వమును స్వీకరింపుఁడు."

భగవానుఁ డిట్లనెను:—"మంచిది. మీ యందఱు బల వంతముగ నేనుపేంద్రుఁడ నయ్యెదను." ఆ దినము నుండి భగవానుఁ డింద్రునకు సహాయకుఁడుగా నుపేంద్రుఁడయ్యెను. భగవానుఁ డుపేంద్రుఁడు కాఁగానే అందఱును బరమానంద మును జెందిరి. ప్రభావశాలి యగువాఁడు సంఘమందుగొప్ప పదవిని గ్రహించినను, నెచ్చటనుండినను నందఱకును మించియే యుండును. అయోగ్యుఁడగు వాఁడు సభాపతియైనను, మంత్రి యైనను స్వయముగఁ దానేమియును జాలకుండును. ఇతరుల సహాయమున నడుచును. యోగ్యుఁడగు వాఁడు సహాయకుఁ డైనను, నమూనాలు వ్రాయువాఁడైనను నందఱియం దధికార మును వహించును. ఈ యుపేంద్రుఁ డింద్రునికంటెఁ జిన్న వాఁడన్నమాటయే కాని దేవేంద్రుఁడు తన త్రైలోక్య రాజ్య మును నుపేంద్రుని బాహు బలముచేతనే సురక్షితముగఁ జేయు చుండెను. బ్రహ్మేంద్ర రుద్రాదులును, సమస్తలోక పాలురును నిరంతర ముపేంద్రుని యశమునుగాన మొనర్చుచుఁ దన వాక్కులను ధన్యము లొనర్చుకొను చుండిరి.

శ్రీ శుక దేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను:— "రాజా! నేను పరమ పుణ్యప్రదమును, సకల పాపములను నాశ మొనర్చునదియు, యశఃకీర్తి, ధన ధాన్యములను వృద్ధి పొందించునదియు, సమస్త మనోగత కామనలను బూర్ణము కావించు వామనుని పావనచరిత్రమును మీకేదో విధముగఁ

జెప్పితిని. ఆ పరాత్పరుని పూర్ణ చరిత్రమును నెవఁడు చెప్పఁగలఁడు ? ఆకాశము నుండి పడు బిందువులైనను భూమి యందలి రజఃకణములైనను లెక్కింపవచ్చును గాని ఆ మహామహిమ మహేశ్వరుని మహిమమును బూర్ణముగ నింతవర కెవఁడును వర్ణింప లేదు, ఇఁక ముందెవరును వర్ణింపనుజాలరు. ఈ చరితమన్నిటి కంటె శ్రేష్ఠమైనది. దీని నెవరు మాటి మాటి కెవరు శ్రద్ధతో శ్రవణము చేయుదురో, ప్రేమపూర్వకముగఁ బఠించెదరో వారు పరమ గతినిఁ బొందుదురు.

దేవతా కర్మములందును, పితృ దేవతలకు సంబంధించిన శ్రాద్ధతర్పణాది కర్మములందును, మనుష్యులకు సంబంధించిన పుత్రజన్మ, యజ్ఞోపవీత, వివాహాది శుభ సంస్కార సమయములందును నీపవిత్ర చరిత్రము నెవఁడు కీర్తించునో, ఆ శుభకర్మలన్నియును సమస్తవిధముల సఫలములగును.

శ్రీశుక దేవుఁ డిట్లనెను :—"రాజా! భగవంతుఁడు వామనావతారము నెట్లు ధరించినాఁడో అట్లే ఆతనికి అసంఖ్యాకములగు నవతారములు కలవు. ఆతఁడొక్కొక్కప్పుడు మనుష్యులం దవతరించును. ఒక్కొక్కప్పుడు దేవతలను, నింకొక మొక పశు, పక్షి, జడ, చేతనాదులందును నవతరించుచుండును. ఒక్కొక్కప్పుడు జలచరుఁడగును, ఒక్కొక్కప్పుడు నభచరుఁడగును. ఒక్కొక్కప్పుడు లోకజుగుప్సాకరమగు మత్స్యమగును, ఒకప్పుడు కచ్ఛపమై సలిలమందు విహరించుచుండును."

అంతట బరీక్షిన్మహారాజిట్లడిగెను :- "స్వామీ! నేను కచ్ఛపావతారకథను సముద్ర మంథన ప్రసంగమున విని యుంటిని. కాని మత్స్యావతారకథను నేటి వఱకు విస్తార పూర్వకముగ విని యుండలేదు. ప్రభూ! నేనవతార కథా రసికుడను. సమస్త లోకములకు నానందమును కలిగించు నీ మత్స్యావతారకథను నా కవశ్యము చెప్ప వలయును. భగవానుడిట్టి పగమ నిందితమగు మత్స్యదేహము నేల ధరించెను? మత్స్యమై భగవానుడే కార్యములొనర్చినాడు సమస్త జీవులు కర్మబంధములో బంధింపబడిన కారణమున నేను బదునాలుగు లక్షల యోనులలో వివశుడై జన్మించు చుండును భగవంతుడు కర్మబంధన రహితుడు. అతనికి కర్తవ్యము లేదు, అకర్తవ్యమును లేదు. అట్టియెడ నాతడు మిక్కిలి తమోగుణమునకు సంబంధించిన మత్స్య రూపమునేల ధరించినాడు?"

సూతుడిట్లనెను :- "మునులారా! పరీక్షిత్తునకు గంగా మాగురు దేవుడగు శుకమహర్షి యే విధముగా మత్స్యావతార కథను వర్ణించెనో, దానిని నేను మీసమ్ముఖ మున జెప్పెదను. మీ రందఱును బరము పుణ్య ప్రదమైనట్టియు, యశస్కరమైనట్టియు, సౌభాగ్యకరమగు నీచరిత్రమును శ్రద్ధాభక్తులతో శ్రవణము చేయుడు."

మత్స్యావతారము

(౫౮ 3)

శ్లో॥ గోవిప్ర సురసాధూనాం ఛందసామపి చేశ్వరః।
రక్షామిచ్ఛం స్తనూర్ధత్తే ధర్మస్యార్థస్య చైవహి॥

శ్రీ భాగ. ౮స్కం. ౨౪అ. ౫శ్లో॥

సీ॥ విభు డీశ్వరుఁడు వేద విప్ర గోసుర సాధు
ధర్మార్థములఁ గావఁదనువుఁ దాల్చి
గాలి చందంబున ఘనరూపముల యందుఁ
దనురూపముల యందుఁ దగిలి యుండు.

శ్రీమదాంధ్రభాగవతము.

సూర్యుఁడు చండాలుని యింటి మీఁద ప్రకాశించినను, దేవమందిరమందు ప్రకాశించినను, వాయువు పుష్పములందు విచరించినను, దుర్గంధ యుక్తములగు నస్థి మాంసముల ముక్కల యందు జరించినను అగ్ని కాష్ఠము నందు వ్యాపించినను మలమునందు వ్యాపించినను నేవిచారణము నొందదు. ఇవి విశుద్ధాతి విశుద్ధములుగనే యుండును. అదే విధముగ నిర్గుణ, నిరాకారుఁడైన ప్రభువు చిన్న, పెద్ద, హెచ్చుతగ్గులైన నే యోనియందవతరించినను వాని సంసర్గముచే నుచ్చ నీచత్వములను బొందఁడు. గుణ దోషములు సంసర్గముచే సంభవించును. సంసర్గము సదా యోగ్య న్యూనతాధిక గుణములుగల సజాతులతో జరుగును. భగవా

నుఁడు నిర్గుణుఁడు. ఆతనికి గుణములచే రచింపబడిన యోను లతో సంసర్గ మెట్లు కలుగును? కావున భగవంతుఁడే యోనులలో నవతరించినను సదా భగవానుఁడే. నానా యోనులందు అంతర్యామి రూపముననాతఁడు సదా విచరించుచునేయుం డును. ఆతఁడు లేకున్న నింక దేనికిని సత్తాలేదు. మహత్త్వము లేదు, అవస్థ లేదు, వ్యవస్థయును ప్రతిష్ఠయును లేదు, అస్తి త్వము లేదు.

సూతుఁడిట్లనెను:—" మునులారా! వామనావతార కథ సమాప్తి కాఁగానే పరీక్షిత్తుఁ మత్స్యావతారమును గూర్చి ప్రశ్నించెను. భగవానుఁడు లోక వినిందితమగు మత్స్య రూపమునేల ధారణము కావించినాఁడని ప్రశ్నిం పఁగా దానికిఁ ప్రత్యుత్తర మొసంగుచు శుక మహర్షి పరీ క్షిత్తున కవతార రహస్యమును జెప్పుచుండెను."

శ్రీశుకదేవుఁ డిట్లనెను:—రాజా! భగవంతుఁ డవత రించుటకుఁ గారణమేమి? యనునది భగవంతునికే తెలియ వలెను. కాని సాధారణముగ భగవానుఁడు గో బ్రాహ్మణ దేవ, సాధు, వేద, ధర్మార్థములను రక్షించుటకై శరీర మును ధరించును.

భగవానుఁడీ జగత్తునకు బ్రహ్మయై సృష్టినొనర్చును. అందుకనియే మరీచి, అత్రి, అంగిరాది, ప్రజాపతులు ప్రజా పతియొక్క అవతారములుగ నెన్నఁబడిరి. బ్రహ్మపుత్రు

లగు నీ ప్రజాపతులు సమస్త సృష్టిని గావించెదరు. ఉత్ప న్నమైన సృష్టిని విష్ణువె పాలించును. అందు వలన నం శావ తారము, యుగావతారము, మన్వంతరావతారము, జ్ఞానావ తారము, ఆవేశావతారము, కలావతారము, పూర్ణావతా రము మొదలగు ననేకావతారములను ధరించి శ్రీహరి యీ జగత్తు నందు క్రీడ యొనర్చుచు విశ్వమును బాలించు చుండును. గోవు లేక విశ్వ పాలనము జరుగదు. గోవునకు రెండు రూపములు. పృథివీ రూపమున నది సమస్తమును దన మీఁద ధరించును. కామధేను రూపమునఁ బ్రాణులకు నిహలోక పరలోకములందు గల్యాణమును గలిగించును. గోవు యొక్క రోమ రోమమును బవిత్రమైనది. దానిగోరస మమృతమే. మూత్ర పురీషములు సమస్త పాపములను నశింపఁ జేయును. వాని పాలచేఁ బ్రాణులకు బోషణము కలుగును. పరలోకమునందు సంబంధులును, ధన వైభవా దులును వెంట రానప్పుడును, వైతరణీ నదినిఁ బ్రాణులు దాటలేనప్పు డచ్చటను నీగోవుయొక్క తోఁకను బట్టుకొ నియే దాటుచుండును. ఆ గోవుల మీఁదఁ గ్రూర కర్ములగు వారత్యధికమగు నత్యాచారమును జేయఁ బూనునప్పుడు. భగవానుఁ డవతరించి గోవుల దుఃఖమును దూరమొనర్చును.

బ్రాహ్మణులు భగవానున కపరరూపములు. వారు భగవద్వాణి యగు వేదములను బవిత్రతతో ధారణ మొన

ర్చెదరు. ప్రపంచ మందాసక్తులగు బ్రాహ్మణులకు జ్ఞానపాఠము లను జెప్పుదురు. అజ్ఞానాంధకారమునం బడి కొట్టుకొను చున్న జీవులకు జ్ఞానాలోకమును గావించి సన్మార్గమునం బ్రవర్తింపం జేయుదురు యజ్ఞయోగములను జేయించెదరు. వారికి బూజాప్రదానము గావించి సంతుష్టుల నొనర్చెదరు. పూజితులై దేవతలు వృష్టినిం గురిపించెదరు. దాని వలన నన్నము కలుగును దానినిం బ్రాణులు తినెదరు. అన్నమును దిని ప్రాణులు జీవన ధారణ మొనర్చెదరు కావున సృష్టి రక్షణము కొఱకు బ్రాహ్మణరక్షణ మత్యావశ్యకము.

దేవతలు దివ్య గుణములను ధరించెదరు. యజ్ఞభాగములను గ్రహించి ప్రాణులకు సుఖప్రదానము గావించెదరు. పుణ్యముల నుపభోగించెదరు. దైవీ సంపత్ప్రసారమును గావించెదరు. చరాచర విశ్వ మందధిష్ఠాత్ర్య దేవునితోం గూడి యుందురు. కావున దేవతల వలన ధర్మముద్వారా జగద్రక్షణము జరుగును. దేవతలు లేకున్న ధర్మములేదు. ధర్మము లేకున్న జగత్తు లేదు.

స్వర్గమునం దింద్రాది దేవతలుకలరు. పృథివియందు సాధు బ్రాహ్మణ దేవతలు కలరు సాధు పురుషులే ధర్మమును ధరించెదరు వేద ధర్మమార్గమును జెప్పెదరు. అర్థ కామోపభోగముల వ్యవస్థను జెప్పెదరు. అందుకనియే భగవంతుండు నిర్గుణుండైనవాండు సగుణుండగును. నిరాకా

రుఁడు సాకారుఁడగును. నానారూపములం దవతరించి క్రీడిం చును. జీవులకుఁ దన దేవ దుర్లభమగు దర్శనము నొసంగి కృతార్థునిఁ గావించును భగవంతుని యొక్క ముఖ్యహే తువు భక్తుల ననుగ్రహించుటయును, తన దుర్లభ దర్శ నము నొసంగి సంసార సాగరమునుండి ముక్తుల నొనర్చుట. ఆ యవతారములు సాధారణముగ రెండు పనులొనర్చును. ధర్మము నిర్బలమై క్షీణించి నపుడు, దానిని సబల మొన ర్చుటకై దుష్టులను సంహరించును. సాధువులనురక్షించును.

అంత శౌనకుఁ డిట్లడిగెను:-"సూతా! సాధురక్షణ మును, దుష్ట శిక్షణమును భగవంతుఁడు చేయుచుండుట మంచిదే, అది భగవదిచ్ఛ చేతనే జరుగు చుండును. కాని యీ పని నాతఁ డవతరింపకయే, తన సంకల్ప మాత్రము చేతనే చేయఁగలఁడు. అట్టి యెడ భగవంతుఁ డవతరించ వలసిన పని యేమున్నది? దీని కొఱకని నిర్గుణుడు సగుణుఁ డగుటయును, నిరాకారుడు సాకారుడగుటయును నుచితము కాదు.

అంత సూతుఁడిట్లనెను :-"స్వామీ! శ్రీహరి సాకా రుఁడును నిరాకారుఁడునై యున్నాఁడు. సగుణుఁడును నిర్గు ణుఁడునై యున్నాఁడు. నిర్గుణుఁడైన నాతఁడు సగుణుఁ డగును. నిరాకారుఁడు సాకారుఁడగుననుట భ్రమమాత్రమే. ఆతఁడఖిల దివ్యగుణములకైకాశ్రయుఁడు నిత్యసాకారుడు

సదా సమూర్తిమంతుఁడై యుండును. సాధు సంరక్షణమును నసాధు వినాశనమును నాతఁడవశ్యము సంకల్పమాత్రము చేతనే అవశ్యము చేయఁగలఁడు. కాని అయినను నాతఁడు కరుణావశమున నవతరించును. భగవంతుఁడెంతో కరుణామయుఁడు. ప్రాణులయెడల నెంతో సహజ సుహృదుఁడు. ఆతఁడు జీవుల దుఃఖములను జూడఁ జాలఁడు. ఇది ఆతని అతిశయ కరుణాద్యోతకమైనది. ఈ విషయమున నేను మీకొక దృష్టాంతమును జెప్పెదను.

ప్రాచీన కాలమున నొక గొప్ప తార్కికుఁడగు రాజుండెను. ఆతనికి గొప్ప బుద్ధిమంతుఁడగు నొక బ్రాహ్మణ మంత్రి యుండెను ఆతఁ డీతనితో వివిధములగు దర్కము లొనర్చుచుండెడువాఁడు. ఒకదినమున రాజిట్లడిగెను :— "మంత్రీ! భగవంతుఁడు స్వయముగ నేల నవతరించును? ఆతఁడు ధర్మరక్షణ మొనర్పవలసియుండినను, దుష్టుల మట్టు బెట్టవలసియుండినను దన పార్షదున కొకనికి శక్తి నొసంగి పంపవచ్చునుగదా! ఈ పనుల నాతని సేవకులే చేయఁగలరు కదా? నేనే రాజుతోనైన సంధి విగ్రహమును గావింపవలసియుండినచో నేను స్వయముగఁ బరువిడిపోనే. నా ప్రతినిధిగ దూతను బంపెదను. నామీఁద నెవఁడైన దండెత్తినచో నేను స్వయముగఁ బోరుటకు బోనుగదా! సేనాపతులు వానిజయించెదరు. పేరునాకు వచ్చును. అదే

విధముగ భగవానుఁడును తనయీకార్యము నితరులచేఁ జేయింప వలసి యుండెను. స్వయముగ నేల వివిధ వేషములను ధరించి భూమిపై నవతరించును ?

ఈ ప్రశ్నను విని మంత్రి యిట్లనెను :—"మహారాజా దీనికిఁ బ్రత్యుత్తరమును నేను గొంతకాలము గడిచిన తరువాతఁ జెప్పెదను."

రాజున కొక్కఁడే పుత్రుఁడు. రాజాతనిఁ బ్రాణముల కంటె నెక్కుడుగఁ బ్రేమించుచుండును. రాజసభనుండి మధ్యమధ్య లేచి వానినిఁ జూచుటకుఁ బోవుచుండును. వానియెడల నాతనికధిక మమకారము. సదా వడిలోఁ గూర్చుండఁ బెట్టుకొని భోజన మిడుచుండును. మంత్రి మైనముతో రాజకుమారునివంటి సుందర విగ్రహమునొక దానినిఁ దయారుచేయించెను సజీవుఁడగు రాజకుమారునివలె నుండునట్లు దానికి రంగులు వేయించెను. అది సర్వ విధముల సజీవుఁడగు రాజకుమారునివలెనే యుండెను. రాజకుమారున కెట్టి వస్త్రభూషణములు కలవో అట్టివే తొడఁగఁబడెను. అంతఃపురములోని ఒక దాసిని మంత్రి కూడఁగట్టుకొనెను.

ఒకదినమున రాజు రాజోద్యానమున నొకసుందర సరోవరతీరమున మంత్రితోఁ గూర్చుండి యుండెను. సరోవరమున జలమెక్కుడుగ నుండెను కమలములు వికసించి

యుండెను. రంగుల రంగుల చేపలటునిటు బారుచుండెను. ఆ సమయమున మంత్రి తాను బాగుగా నేర్పించిన దాసితో నిట్లనెను :–"పోయి అంతఃపురమునుండి రాజకుమారుని దీసికొనిరమ్ము."

దాసి కిదివఱకే చెప్పియుండుటచే నామె యథార్థపు రాజకుమారునిఁ దీసుకొనిరాక, ఆ కృత్రిమ రాజకుమారునిఁ దెచ్చెను. మంత్రి ముందుగా మిక్కిలి యుల్లాసముతోఁ గుమారు నెత్తుకొనెను. కొంచెముసేపు వానిని మిక్కిలి లాలించి, అటునిటుఁ బ్రేమపూర్వకముగ నూగించుచుండెను. రాజు మిక్కిలి యానందించుచుండెను ఎవరైనను వచ్చి తమ పిల్లలను ముద్దులాడినచోఁ దల్లిదండ్రులును మిక్కిలిగా నానందించుచుందురు కావున రాజానందనిమగ్నుఁడై యుండెను. ఆ సమయమున మంత్రి యా పిల్లవానిని సరోవరమందు విసరివేసెను. రాజదరిపోయెను. వెంటనే ఆగుడ్డలతోడనే సరోవరములోనికి దుమికెను. దుమికి, మునిఁగి పిల్లవానిని పైకి తెచ్చెను

మంత్రి తీరముననే నిలుచుండి నవ్వుచు నిట్లనెను:– "మహారాజా! మహారాజా ఏమిది, మీరు చేసినపని యేమి? ఇంతమంది సేవకులు చుట్టుపట్ల బనిచేయుచున్నారు. వారిలో నెవనినైనను బిలిచి మీరాజ్ఞాపింప వచ్చునుగదా! మీరు స్వయముగ సరోవరమున నేలదుమికినారు? నేను మీ సేవకుడను సిద్ధముగనుంటినిగదా! నా కాజ్ఞాపింపవచ్చునుగదా!

యథార్థముగు రాజకుమారుఁడు కాడు, అది ప్రతిమ యని రాజు తెలిసికొనఁగానే అతనికి మిక్కిలి సంతోష మయ్యెను. క్రుద్ధుఁడై మంత్రితో నిట్లనెను:-"మంత్రీ! నీ విట్టి దుండగము నాయెడల నేలఁ జేసితివి?"

మంత్రి యిట్లనెను:-"అన్నదాతా! మీరు భగవంతుఁడేల నవతరించును తనపార్షదుల నెవరినైనను బంప రాదా? యని మీరడిగిన ప్రశ్నకు సమాధాన మొసంగుటకై నేనిట్లొనర్చితిని." మహారాజా! ఎవరిమీఁద నధిక ప్రేమ యుండునో వారి కార్యములను స్వయముగ నొనర్చినచో సుఖముకలుగును. ఇతరులచేఁ జేయించిన సేవచేఁ బ్రేమికి సంతోషము కలుగదు. స్వయముగఁ దన చేతులతో భోజనము పెట్టుటచేఁ గలిగిన సుఖమును, స్వయముగఁ జరణసేవ యొనర్చుటలోఁ గలిగిన సుఖము దానిని సేవకుల ద్వారా చేయించుటచే లభింపదు. భగవంతునకందఱకంటెఁ బ్రియులు భక్తులు. భక్తరక్షణార్థమై శ్రీహరి స్వయముగ నవతరింప వలసి వచ్చెను. మీవిషయమునే చూడుఁడు. మీరొక్క మాటయనిన దానిని విని వేలకొలఁది మంది రాఁగలరు సరోవరమున దుముకఁగలరు; కాని పుత్రస్నేహముచే మీరేమాత్రమును గూర్చుండఁ జాలక పోయినారు. మీరే స్వయముగ దుమికితిరి. భగవంతుఁడు తన భక్తులను గరుణించుటకే అవతరించు చుండును. భక్తులయార్త ధ్వనిని

వినిన నాతఁడు వైకుంఠము నిలువఁజాలడు. వెంటనే అతఁడవని పైకి దిగివచ్చును; భక్తులకు సుఖము నొసంగి ధర్మస్థాపన మొనర్చును.

శౌనకుఁ డిట్లనెను:—"సూతా! కరుణించియే అవతరించుట ఆతని భక్తవత్సలతయే; కాని ఆతఁడు మత్స్యరూపము నేలధరించెను? ఆ శరీరము తమోగుణ ప్రధానమై అత్యంత నిందితమును లోకులచేఁ గనఁబడునదియే?"

సూతుఁడిట్లనెను:—"స్వామీ! నేనిదివఱకనేకసారులు భగవంతున కుచ్చనీచములు లేవనియు, నాతఁడే యోనిలో నుత్పన్నము కాఁదలఁచినచో నాయోనిలో నుత్పన్నమగుననియు మీకుఁ జెప్పితిని. జీవులు సాధారణముగ నానాయోనులందు కర్మాధీనులై భ్రమించుచుందురు. ఈజీవులలోఁ జాల అనుగ్రహసృష్టి జీవులుకూడ నుందురు. వారి సంసార బంధనము భగవంతుని దర్శనము మాత్రమునఁనే వదలి పోఁగలదు. వారెనుబది నాల్గులక్షల జీవులలోఁ దిరుగ వలసిన పనిలేదు. వారా రోహణా వరోహణమున కపవాదము లగుదురు. ఆసమయమున ననుగ్రహ సృష్టికి సంబంధించిన జీవులెక్కువగ నున్నట్లు తోచుచున్నది. వానికి భగవానుఁడు మనుష్యరూపమున నుండి దర్శనమెట్లు కలుగును? అందువలన భగవంతుఁడు జలచరమయ్యెను. మత్స్యశరీరమును ధరించి భగవంతుఁడు దాని సుఖ దుఃఖములకు

నిర్లిప్తుఁడై యుండెను. రాజుయొక్క మిత్రుఁడేకో అపరాధ వశమున రాజు కర్మచారులచేఁ గారాగారమున బంధింపఁ బడఁగా, రాజునకీవార్త తెలిసి, తాను స్వయముగఁ గారా గృహమునకుఁ బోయి వారిని విడిపించెను. కారాగృహము లోని కాతఁడు పోయినను నాతఁడు కష్టమును సహింప వల సిన పని లేదు అతఁడు నిర్లిప్తుఁడై యుండెను. కారాగారము నకుఁ బోయినను నాతఁడు బంధితుల నందఱను వదలలేదు. ఎవరి మీఁదఁ గరుణాదృష్టి కలిగినదో, ఎవరినను గ్రహించి నాఁడో వారిని వెంటఁదెచ్చినాఁడు. మిగిలిన వారందఱును నాసంసారచక్రమున గర్మానుసారముగ నలిగిపోవుచున్నారు. కావున భగవానుఁడు తనాశ్రయించిన జలచరభక్తుల నిమి త్తము మత్స్యమై యుండవచ్చును. పైగా నాతఁడు సప్తర్షు లను రక్షింప వలసి యుండెను. పృథివీయందలి బీజములను రక్షింప వలసి యుండెను. అసురులు హరించిన వేదముల నుద్ధరింప వలసి యుండెను. ఇన్ని కారణములచే నాతఁడు మత్స్యావతారము నెత్తెను. ద్రవిడ దేశవాసియగు సత్య వ్రతునిపైఁ దన యనుగ్రహ దృష్టినిఁ గురిపింప వలసియుం డెను. రాబోవు కల్పసృష్టినిఁ గాపింప వలసి యుండెను. క్షయించిన ధర్మము నుద్ధరింప వలసియుండెను. అందువలన భగవంతుఁడు జలచరమయ్యెను.

భగవంతునకు ధర్మమే రూపము ధర్మము క్షయించి నప్పుడు, దాని వృద్ధికొఱకును, వేదముల నుద్ధరించుటకును

భగవానుఁడు స్వయముగ నవతరించును. ధర్మమూతని శరీరము. అతఁడు ధర్మవిగ్రహము ఒకసారి భగవానుఁడు ధర్మమునకుఁ బుత్రుఁడై నరనారాయణ రూపమునను నవతరించెను. పూర్తిగా ధర్మము నశించుట నాతఁడు చూడఁజాలఁడు. ఎప్పుడే రూపమును ధరించిన ధర్మస్థాపన మగునో అప్పుడట్టి రూపమును ధరించును. కావునఁ బ్రతియుగాంతమున యుగావతారమును, మన్వంతరాది యందు మన్వంతరావతారమును, మరల నప్పుడప్పుడు విశేషావతారము ను ధరించి ధర్మస్థాపన మొనర్చును."

శౌనకుఁడిట్లడిగెను:—"సూతా! ధర్మము నిత్యమై భగవద్విగ్రహమైనపుడు సనాతనమైనపుడు అది యేల క్షయించును? అది హెచ్చుట తగ్గుట యెందులకు?"

సూతుఁడిట్లనెను:—"స్వామీ! ధర్మమునకుఁ బతివ్రత శాపము తగిలినది. అందువలనఁ జంద్రునివలె క్షయించుచుండును. క్షయము క్రమముగ నగును; కాని దానివృద్ధి ఒక్కసారిగా నగును. కావున ఘోరకలియుగము తరువాత శుద్ధమగు కృతయుగము వచ్చును."

అంత శౌనకుఁడిట్లడిగెను:— "సూతా! ధర్మ మక్షయము, సనాతనమైనపుడు దానికి శాపమెట్లు తగులఁగలదు? ఇది సందేహింపఁదగిన విషయము."

ఇది వినినవ్వుచు సూతుఁడిట్లనెను:—"స్వామీ! ఏమి సందేహము, మీ కంతయును దెలియును. ఇదంతయును

భగవల్లీల. ధర్మముసంగతి నట్లుంచుడు. భగవంతుఁడును శాపవశమున నవతార ధారణ మొనర్ప వలయును. భృగు మహర్షి క్రుద్ధుఁడై భగవంతునిట్లు శపించెను :—‘ నీవు భూమి యందు భిన్న భిన్న రూపములుగాఁ బడి యవతారములెత్త వలయును. ఆశాప ఫలమునే భగవంతుఁడనుభవించు చున్నాఁడు భగవంతునెవరు శపింపఁ గలరు? ఆతఁ డెల్లప్పు డును కర్మ బంధ విముక్తుఁడే. అయినను ఖేలనము, కొఱకు, సంసార చక్రమును నడుపుటకై శాపమును గ్రహించును. తనయిచ్ఛచేఁ బ్రేరణచే శాపము నిప్పించును. దానికను రూపముగ లీలలనొనర్చును. ఇదేవిధముగ ధర్మమునకును భగవ దేచ్ఛచే నాల్గుయుగములను గల్పించుటకై భగవా నుఁడు పతివ్రతచే శాపము నిప్పించును.”

శౌనకుఁడిదివిని సూతుఁడిట్లడిగెను:—“ సూతా! ధర్మ మునే పతివ్రత, యేకారణమున శాప మొసంగినది? మాదీ కథను జెప్పి మీఁదట మత్స్యావతార కథను జెప్పుము.”

అంత సూతుఁడిట్లనెను:—“మునులారా! నేను మీకు ధర్మము యొక్క శాపకథను జెప్పెదను. దానిని మీరు శ్రద్ధతో శ్రవణము చేయుఁడు.”

ధర్మ క్షయించునట్లు శాపము.

(౧౮౪)

శ్లో॥ యదా యదేహ ధర్మస్య క్షయో వృద్ధిశ్చ పాప్మనః
తదా తు భగవానీశ ఆత్మానం సృజతే హరిః॥

శ్రీ భాగ. ౯స్కం. ౨౪అ. ౫౬ ॥శ్లో

వ. "రాజా! ఈప్రపంచమందెప్పుడు ధర్మము క్షయించి పాపములు వృద్ధిపొందునో అప్పుడందఱకును స్వామియగు భగవంతుఁడవనిపై నవతరించెను"

నిత్యుఁడగు ప్రభుని లీలలను నిత్యములే ఆతఁడు రచించిన జగతును నిత్యమే ఆతని క్రీడయును నిత్యమే. అయినను గుణమయమగు మాయాసంసర్గము కలుగుటచే నజ్ఞానవశమున ననిత్యమును నిత్యముగ భావించుచుఁ ప్రాణి నిత్యానకు దూరమై క్షయిష్ణువవలె నయ్యెను. ఈ ప్రపంచమా సర్వాత్ముఁడగు ప్రభువునకుఁ గ్రీడాభూమి. ఆతని రంగశాల. దీనిలో నాతఁడు నానా విధములగు నభినయములొనర్చుచుండును. ఆతని వినోదముగాక యీజగత్తున నింకేమియును లేనేలేదు. ఆతఁడు నానా రూపములను ధరించి నానాక్రీడలొనర్చుచుండును. సమస్త సంఘటనలను నెవరు భగవల్లీలలుగ భావించెదరో వారుసుఖులగుదురు. వీనినన్యథాగా భావించిన వారు భ్రమలోఁబడుచున్నారు.

సూతుఁడిట్లనెను:- "మునులారా! నన్ను ధర్మము నశించునట్లు శాపమెట్లువచ్చినదను విషయమును గూర్చి

మీరడిగితిరి నేనుదానిని మీకుఁజెప్పుచున్నాను. స్వామీ! మనువంశమందు అనరణ్యుఁడను గొప్ప తేజస్వియును, ప్రతాపవంతుడును ధర్మాత్ముఁడునగు రాజుండెను ఆరాజర్షి తన ప్రజలను బుత్రులవలెఁ బాలించుచుండెను. మహారాజునకు నూర్గురు పుత్రులు కలరు. కాని పుత్రిక లేదు. మునులారా! మీరందఱును బుట్టుకచేతనే గృహాముననున్న, గృహస్థాశ్రమమునకును దూరముగ నుంటిరి మీరెన్నడును గృహస్థజంజాటమందు పడలేదు. గృహస్థులకుఁ బుత్రికకంటెఁ బుత్రులుపుట్టినచో మిక్కిలి యానందముగ నుండును. ఇంతేకాదు. చాలమంది పుత్రికలుద్భవించినచో విషాదము కూడ కలుగును. అయినను సందిఱను నొక్కరో యిద్దరో పుత్రికలును నుండవలయునని యందురు. అన్ని దానములలోఁ గన్యాదానము శ్రేష్ఠమైనదని చెప్పఁబడినది. పుత్రుఁడు యోగ్యుఁడగుచోఁ దన కులముయొక్క కీర్తినే వృద్ధిఁబొందించును; కాని పుత్రిక యోగ్యయగుఁ బతివ్రతయగునో నామె మాతృకులమును బితృకులమును, బతికులమును నీమూఁడు కులముల కీర్తి విమలము గావించును. అందువలన సద్గృహస్థులందఱును భాగ్యవతియగు కన్యకను గోరుకొందురు. అనరణ్యమహారాజునకు నూర్గురు పుత్రులు. కాని ఆడపిల్లలులేరు. రాజదంపతులు తమకొక కన్యాకారత్నముదయింపవలయునని కోరుకొనుచుండిరి. స్త్రీల కల్గుం

్రడకు భోజన మిడుటలోనున్న యానందము పుత్రునకు భోజనమిడుటలో నుండదు. భగవంతుడు రాజదంపతుల కోరికను నెఱవేర్చెను. ఇప్పుడు వారికిఁ గన్యక జనించెను. పుత్రికయైనను నట్టిట్టిది కాదు సాక్షాల్లక్ష్మితో సమానమైన సుందరి. ఆమె నెవరు కాంచినను వారి మనస్సామెపై లగ్నమగునంతటి సుందరి. చంపకకళికవలెను, సాకారసౌందర్యమువలెను, మూర్తీభవించిన శోభవలెను నాకన్యక యుండెను. రాజదంపతులిట్టి యనన్యానుపమ రూపలావణ్యయుక్తమగు కన్యకను గాంచి పరమ ప్రసన్నులైరి శుక్లపక్షమందలి చంద్రకళవలె, శరత్కాలమందలి కమలమువలె నామె ఆ రాజభవనమున వృద్ధిపొందుచుండెను. ఆ కన్యక పెరిగినకొలఁది ఆమె సౌందర్యమును బెరుగుచుండెను. ఆమెను సాక్షాత్తుగఁబద్మహస్తయగు లక్ష్మిగా భావించి తల్లిదండ్రులును, పండిత పురోహితులును నామెకు పద్మయను నామకరణమొనర్చిరి. బాల్య, పౌగండ, కిశోరావస్థలను దాటి పద్మయౌవనావస్థలోఁ బ్రవేశించెను. యౌవనమునఁ బ్రవేశింపఁగానే ఆమె అంగప్రత్యంగముల కాంతి వెల్లివిరియుచుండెను. ఆమె వాక్కులయందును, నడకయందును, వైఖరియందును, హాసములందును, సమస్తక్రియలయందును నామెకొక విచిత్రమగు పరివర్తనము జరిగెను. తమ ప్రాణముల కంటెను ప్రియమగు దమ పుత్రిక యౌవనవతియైనదని

తెలిసికొనఁగానే, ఆమె కళరూపుఁడగు బలినిఁ జూడవలయు నని చింతకలిగెను ప్రపంచమందలి సర్వ శ్రేష్ఠుఁడగు సుందరుఁడును, బరమ పరాక్రమవంతుఁడగు రాజకుమారునకు తమకూఁతునొసంగి వివాహ మొనర్పవలయునని రాజదంపతులు తలఁచిరి. దీనికై వారు దేశదేశాంతరములందలి రాజులకడకు దూతలను బంపిరి రాజు కడ కేగుటకే రాజులే కాదు, దేవతలును వచ్చి పద్మకొఱకు ప్రార్థించిరి కాని మహారాజిట్లనెను:– 'నాకుమార్తె మర్త్యలోకవాసిని. నేను మర్త్యలోకములో సర్వశ్రేష్ఠుఁడగు వరుని కొసఁగి వివాహ మొనర్చెదను. ఇప్పుడు రాజునకు నిద్రించుచున్నను, మేల్కొన్నను, లేచినను, కూర్చుండినను తన పుత్రికకు యోగ్యుఁడగువరుఁడెచ్చట లభించునా యను చింతయే యుండెను; కాని ఆతఁడు కోరునట్టివరుఁడింతవఱకెవఁడును లభింపలేదు. అందువలన రాజదంపతులధిక చింతాయుక్తులైయుండిరి.

ఆదినములలో నామహారాజు రాజ్యమున దధీచిముని పుత్రుఁడు పిప్పలాద మహాముని ఘోరతపస్సును జేయుచుండెను దధీచిమహాముని దేవతాకార్యము కొఱకై బ్రదికి యుండఁగనే తనశరీరమును సమర్పింపఁగా నీ మహాముని తనతల్లిగర్భమునందుండెను. స్వేచ్ఛచేఁ జచ్చుటచే దధీచిముని భార్యయు మిక్కిలి చింతకలిగెను. ఆమె తన కడుపును జీల్చి

కొని గర్భస్థుఁడగు నా బాలకుని నొక పిప్పల (రావి) వృక్షముక్రింద నుంచి ఆమె పతితో సహగమన మొనర్చెను. ఆ రావిచెట్టు కధిష్ఠాన దేవతలీతనిని రక్షించిరి. అతఁడు రావి పండ్లను దిని పెరిగెను. అందువలన నాతఁడు పిప్పలాదుఁడను పేరుఁ బ్రసిద్ధిఁ జెందెను. ఆతఁడు వేయిసంవత్సరముల వఱకు గొప్ప గొప్ప కఠోర నియమములతోఁ దపస్సుచేసెను తపస్సును జేసి చేసి ఆతఁడు వృద్ధుఁడయ్యెను. ఆతఁడు వివాహమునైన జేసికొనలేదు. గృహస్థధర్మానుభవము తెలియదు. జీవితాంతమువఱకును నాతఁడు తపస్సును జేయసాగెను

సూతుఁ డిట్లనెను:—"మునులారా! ఈ మనస్సును నమ్మరాదు. అది యెప్పుడెట్లు జారిపోవునో. తాను బ్రదికి యున్నంతవఱకీ మనస్సు మనకు స్వాధీనమైనదని నమ్మరాదు దస్యుని నెట్లు విశ్వసింపరాదో అట్లే యీ మనస్సును నవిశ్వసనీయమైనది ఇప్పుడది వాసనా రహితమైనదని ఒక్కొక్కప్పుడు మనకుఁ దోచు చుండును విషయము లెప్పుడైన మరల నెదురుపడెనా మనకు తెలియకయే యిది చంచలమగును ఇది వివేకము నణఁచి జీవులపైఁ దన యాధిపత్యమును స్థాపించుకొనును. పిప్పలాదముని మిక్కిలి జితేంద్రియుఁడును, ధైర్యవంతుఁడును; కాని ప్రారబ్ధవశమున మనస్సాతని యెడల విశ్వాసఘాత మొనర్చెను. ఒక దినమున వసంత ఋతువున వనము నుండి ఫల, పుష్ప, మూలకుశ, సమిధలను గైకొని

ముని శివ యాశ్రమమునకుఁ దిరిగి వచ్చుచుండెను. దారిలో నాతఁడొక గంధర్వుఁడు, గంధర్వ స్త్రీలతోఁ గూడి యొకచోట మునఁ గూర్చుండి యుండుటను గాంచెను. కలకల నాదమొనర్చుచు స్వచ్ఛసలిలముగల సరిత్తు మందగతితోఁ బ్రవహించుచుండెను. పర్వతోపత్యకలందు పచ్చని గరిక నలు వైపుల నలుముకొని యుండెను. చిన్నవి, పెద్దవి సమస్త వృక్షములను ఫలపుష్ప భార నమితములై యుండెను. మంద, సుగంధిత సుఖకర సమీరము వీచుచుండెను నలు వైపులను బుష్పించిన లతలు కదలుచుండెను. ఆ గంధర్వ స్త్రీలా గంధర్వుని ననేక విధముల సేవించుచుండిరి. వారు తమ సర్వస్వమును సమర్పించి స్నేహభరిత హృదయముతో నాతని నుపాసించుచుండెను. ఆతఁడును వారిమీఁద మిక్కిలి ప్రేమతోఁ దన ప్రేమసంతతిను గుమ్మరించుచుండెను. కొందఱాడుచుండిరి, కొందఱు పాడుచుండిరి కొందఱు మెల్లఁ మెల్లగఁ బాదము లొత్తుచుండిరి. ఒకర్తుక తొడ మీఁదఁ దలను బెట్టి ఆతఁడు నిద్రించుచుండెను. కొందఱాతని నత్యంత ప్రేమతోఁ జూచుచుండెను కొందఱు తమ పైఁట కొంగులతో గాలిని విసరుచుండిరి ఆతఁడును దన్నుఁ దాను మఱచి వారి యనురాగమున నాత్మను మఱచి, అందఱికంటెఁ దానే అధిక సుఖమనుకొనుచుండెను అచ్చట నిరుపమముల ననురాగ ప్రవాహము వెల్లువుకు చుండెను.

పిప్పలాద మహాముని దూరమున నుండియే వారి కను నీయ కామక్రీడలను గాంచెను. మనస్సు ఆగిపోయెను. పాదములు సత్యాగ్రహమొనర్చెను. చిత్తము చంచలమయ్యెను. ముని యిట్లనుకొనెను:—"జీవితాంతము వఱకు కఠోరనియమములను పాలించితిని, కడుపునిండ నెన్నడును భుజింప లేదు. నవ్వుచు నెవ్వరితోడను రెండుపలుకులను బలుక లేదు. కఠోర నియమ బంధనమున నా హృదయమును పాషాణము వలె నైనది. పాషాణము నీ పర్వత ఖండములకును భేదమేమున్నది? సరసత లేని హృదయము లోహసారము, పాషాణము, నిర్జీవము. వీరిక్రీడలను జూచినంతనే నాకు నానంద మిన్ని దినములు తపస్సు చేసినను నాకెన్నడును గాలేదు. నేను మాత్రమీ గృహస్థ కర్మలలోని యానందము నేల ననుభవింప రాదు. చాల కాలముతిక్త కషాయములగుపచ్చికాయలను దిని తపస్సు చేసితిని, ఇప్పుడు కొంచెము సరసత ననుభవింప వలయును."

సూతుడిట్లనెను:—"మునులారా! హృదయ మెంత నిర్వికారముగ నుండునో, దానిలో గోరిక జనించినచో నంతటి అధిక తీవ్రప్రతిక్రియయును జరుగును. ముని సమిధల కట్టను విసరివైచెను. ఫలపుష్పములను నేలగొట్టెను. ఇప్పుడాతడు వివాహాన్వేషణమునకై బయలుదేరెను. పోగా పోగా నాతనికి పుష్పభద్రానాయక యను నది తటస్థించెను. అది మిగుల వేగముతో దేలిక బాలికవలె పరుగెత్తుచే బరువిడు

చుండును. దైవ యోగమును నాదినము పర్వదినము పద్మ తన సఖులతోఁ బుష్పభద్రా నదికి స్నానార్థమై వచ్చెను. దైవ వశమున నా ముని దృష్టి ఆ రాజకుమారిపైఁ బడెను ఆమె అనవద్య సౌందర్యమును, అనుపమరూపలావణ్యమును గాంచి, ముని మంత్రముగ్ధుని వలె నామెనే చూచుచుఁ జూచుచు నిలిచి పోయెను. ఇట్టి సౌందర్యమూర్తినికి దేవతా స్త్రీలయందును గన బడలేదు నేఁటికిట్టి సుందరవతి యగు స్త్రీ నాతఁడు చూడనే చూడలేదు ముని రాజసేవకులవలన నారాజకుమారి విషయమును దెలిసికొని, ఆమె యింకను అవివాహితయని యుఁ దెలిసికొనెను. వెంటనే తొందఱతొందఱగా నరణ్యమహారాజు యొక్క రాజసభకు మునివరుఁడు వెడలెను.

పిప్పలాదముని రాకనుగాంచి వెంటనే రాజు సింహాసనమును వదలి నిలుచుండెను. ఆతఁడర్ఘ్యపాద్య, మధుపర్కాదులచే మునినిఁ బూజించెను అనేకవిధములగు స్తుతివచనములను బలికి, ముని యాగమన కారణమును దెలిసికొనఁ దలఁచెను. రాజిట్లనెను:—"మునివరా! మాబోటి అధమ గృహస్థులను గృతార్థుల నొనర్చుటకై మహా పురుషులు పర్యటన మొనర్చుచుందురు. మా దేవ దుర్లభమగు దర్శనము నొసంగి మీరీ సేవకునిపైఁ గృప జూపితిరి. నన్నుఁ గృతార్థునిఁ గావించితిరి. మీరేదైన విశేష ప్రయోజనమునవచ్చితిరేమో దానినిఁ దెలిసికొనఁ దలఁచుచున్నాను."

ముని గంభీరుఁడై యిట్లనెను:—"రాజా! నేను నేఁడొక విశేషమగు కోరిక తోడనే నీకడకు వచ్చియుంటిని. నీవాకోరికను నెరవేర్చవలసి యుండును.

అత్యంతోల్లాస స్వరమున రాజిట్లనెను :—"స్వామీ! అదినా యదృష్టము. నేఁడు కృతార్థుఁడనైతిని. మహాత్ములు నన్ను సేవాయోగ్యునిఁగాఁ జేసికొనినారు. ద్విజవరా! నా రాజ్యము, కోశము, సర్వస్వమును మీవియే. మీరేది యడుగఁ దలఁచితిరో నిస్సంకోచముగ నడుగుఁడు"

పిప్పలాదమహాముని యిట్లనెను :—"నృపవర్యా! ఇట్టి వచనములను నీవే పలుకఁగలవు నీద్వారమునుండి యాచకుఁడెన్నడును విముఖుఁడై పోఁడు మహారాజా! నాకుగృహస్థ సుఖములనుభవింపవలయునని కోరిక కలిగినది. కావున నీవు నీకూఁతురగు పద్మను నాకొసఁగి వివాహమొనరింపుము.

ఇది వినఁగానే రాజు కింకర్తవ్యవిమూఢుఁడయ్యెను. అతని శరీరమంతయును జెమటలు పోసెను. అతనికిఁ బ్రపంచమంతయును శూన్యముగఁ దోచుచుండెను అతఁడవును అనలేక పోయెను, 'కాదు' అనజాలక పోయెను అతఁడు మెదలక తలవంచుకొని నేలను జూడసాగెను.

ముని రాజు భావమును గ్రహించెను. సంవత్సరము, ఆఱునెలల తపస్సునకే యెంతో అభిమాన మేర్పడును. ఈ మునికడ వేలకొలఁది సంవత్సరముల తపరికోశము సంచితమై

యున్నది. ఆతని సమ్ముఖమున రాజులును మహారాజులు నేమి లెక్క? తన యిచ్ఛకు విఘాతము కలుగఁగానే శామియగు మునికి క్రోధము వచ్చెను. ఆతఁడు కన్నులెఱ్ఱ చేసి యిట్లనెను:–
"రాజా! నీ భావమును నేను గ్రహించితిని. నీవు నాకోరికకు విఘాతమును గావించితివేని నేను నీకు శాపము నొసంగి నీ సర్వస్వమును నశింపఁ జేసెదనని విశ్వసింపుము."

ఈ మాటతో మహారాజున కున్న ధైర్యము కూడ సడలి పోయెను. ఆతఁడు పిల్లలవలె వెక్కి వెక్కి యేడ్వ సాగెను. నేను నా ప్రాణముల కంటె నెక్కుడుగఁ బ్రేమించు సుకుమారి కన్యను గూర్చి యోచించుచుంటిని ఎన్నో మనోరథములతో నీమెను బెంచితిని. సర్వగుణసంపన్నుఁడగు వరుఁడు రావలయునని నేను స్వప్నమును గాంచుచుంటిని. నేఁడు పుష్పమువలెఁ గోమలముగ నుండు నాయీ కుమార్తెను వృద్ధావస్థచే జర్జరుఁడై దున్నపోతువలెఁ గఠోర చర్మము కలిగి, రూక్షమై, గడ్డములు, మీసములు, జడలు, గలిగిన నీమునికొసంగి నేనెట్లు జీవింపఁగలను. ఎంతో గారాబముగా బెంచినగోవును జివరకుఁ గసాయివాని కొసంగి నట్లున్నది. రాజు భయముచే గడగడ వణఁకుచుండెను. ఆతని నేత్రముల నుండి నిరంతర మశ్రువులు ప్రవహించుచుండెను. క్షణములో నీవిషయమంతటను వ్యాపించెను. అంతఃపురము లోని రాణులీ సమాచారమును వినఁగానే అందఱును గుఱరిపత్నీ

వలె రోదనము సల్పసాగిరి. ఆపిల్ల తల్లి శోకముచే మూర్ఛిత యయ్యెను. రాజసభయందు సర్వత్ర నిశ్శబ్దముగ నుండెను. సమాచారమును విని పురోహితుఁడును, రాజుయొక్క కులగురువును వచ్చిరి. వారిద్దరును రాజీస్థితిలో నుండుటను గాంచి మిక్కిలి చింతించిరి. వారనేక మధుర వచనములను బలికి రాజునకు ధర్మతత్త్వమును జెప్పిరి. వారిట్లనిరి:—మహారాజా! నేఁడు కాకుండిన రేపో, రేపు కాకుండిన నెల్లుండో కన్యకను నీ వెవరికో ఒకరికిచ్చి వేయవలయును. వయస్సువచ్చిన పిల్లను నింట నెవరుంచుకొందురు. తండ్రి కుమార్తెను నితరుల కొఱకే పెంచును. మహారాజా! శ్రేష్ఠుఁడగు వరుఁడు దొఱికినప్పుడు తండ్రి వెంటనే కన్యకనిచ్చివేయ వలయును. యువతియగు కన్యను నెక్కువ దినములింట నుంచుకొనుట యుచితముకాదు. రాజా! బ్రాహ్మణునకు మించిన సత్పాత్ర యింక నీప్రపంచమున నెవరు లభింపఁగలరు? ఇంతటి గొప్ప తపోధనుఁడగు ముని స్వయముగ మీయింటికి వచ్చి కన్యను యాచించుట అది నీకు సౌభాగ్యము. మోహావశమున నీవు కన్యక నీయకున్నచో నీతఁడు క్రుద్ధుఁడై నీసర్వస్వమును నాశనమగునట్లు శాప మొసంగఁగలడు. మహారాజా! క్రుద్ధుఁడైన బ్రాహ్మణ తపస్వి పెద్దపులి కంటెను మిక్కిలి భయంకరుఁడు. కావున నొక్క కన్యకై నీవు నీ రాజ్యము నంతను నాశము చేసికొనకుము. సంతోషముతో నీకన్యక నీతని కొసంగుము,”

రాజు బుద్ధిమంతుఁడు. గురుని యనుశాసనమున నడుచు వాఁడు. అన్నిటిని వెనుక ముందు లాలోచించుకొని, దీని లోనే తనకును దన రాజ్యము నకును గల్యాణము కలదని తెలిసికొని యాతఁడు తనకన్యకను ముని కొసంగుట కంగీ కరించెను. మనస్సులో మాత్రమాతని కానందము కలుగ లేదు. కాని యిట్లను కొనెను:—"ఒక్కదాని నొసంగి సర్వస్వ మును రక్షించు కొనఁగలిగినచో నొక్కదాని నొసంగు టయే బుద్ధిమంతుని లక్షణము. అందువలన నాతఁడు కన్య వస్త్రాభూషణములచే విధ్యుక్తముగ నలంకరించి శాస్త్రీయ రీతిని మునికామెను సమర్పించెను. ఇప్పుడు లక్ష్మీదేవివలె నున్న పద్మను గాంచి పిప్పలాద మహాముని పరమ ప్రసన్నుఁ డయ్యెను. ఆమెను ఆతఁడు తన యాశ్రమమునకుఁ గొని పోయెను. ఇచ్చట రాజునకు మిక్కిలిగ మానసిక పరితాపము కలిగెను. ఆతఁడప్పుడే రాజ్యమును దనపుత్రుఁడగు కీర్తి మంతున కొసంగి, వనములకుఁ దపస్సు చేసుకొనుటకుఁ బోయెను. కన్యక యొక్క తల్లి దుఃఖశోక కారణమున నచ్చటనే తన ప్రాణములను ద్యజించెను. అనరణ్య మహా రాజు భగవదారాధన మొనర్చుచుఁ జివరకు పరలోకవాసి యయ్యెను.

ఇచ్చటఁ బిప్పలాద మహాముని తన ప్రియయగు పద్మతోనుండి గృహస్థ ధర్మసుఖములను పభోగించుచుండెను.

సంస్కార వశమున నాతని కిట్టి బుద్ధిపుట్టినది కాని కాకున్న నాతఁడు సదాచారియును, దపస్వియును, దృఢవ్రతుఁడు నగు మునికదా! అందువలన నాతఁడు ధర్మపూర్వకముగ వివాహ మొనర్చుకొని, శాస్త్రీయ విధిచేగృహస్థధర్మమును బాలించు చుండెను. ఇంతటి సుందరియగు పద్మను బొందియును నాతఁడు లంపటుఁడు కాలేదు. తన చిత్తమును వశమందుంచు కొని ధర్మ పూర్వకముగ వ్యవహార మొనర్చు చుండెను. పద్మ యును మునియే తనకు సర్వస్వమని యెంచు కొనెను. ఆమె సర్వాత్మ భావమునఁ దనను ముని చరణములకు సమర్పించు కొనెను. మునితో నెప్పుడు వచ్చెనదో అప్పుడే తాను రాజ పుత్రికను భావమును వదలెను. తాను భార్యనని భావించు కొని ప్రతికార్యమును దనచేతితోడనే చేయుచుండును. పగ లంతయును మునిసేవలోనే మునిఁగి తేలుచుండును. తన యొక్క యీసేవచే మునివరుఁడగు పిప్పలాదుని పరమ సంతుష్టు నొనర్చెను. ఆమెకుండను దీసికొనిపుష్ప భద్రా నదికిఁబోయి, నీరు దీసికొని స్వయముగ మోసుకొని వచ్చును.

ఒకదినమున నామెఁ నీరు దేఁబోవుచుండఁగా మార్గ మందామెకు సువర్ణమండిత రథమందత్యంత తేజస్వియును రూపవంతుఁడును నగు నొకరాజును గాంచెను. ఈఘోరా రణ్యమందిట్టి మలిన వసనమును ధరించిన నింతటి సుందరిని గాంచఁగనే రాజుయొక్క ఆశ్చర్యమునకు మేఱలేకుండెను.

అతఁడు గబగబ పద్మ సమీపమునకు వచ్చి అత్యంత వినీత భావముతో నిట్లనెను:—"దేవీ! నీవు రాణివి కావలసిన దానవు. సుభగా! నీవీ నిర్జనవనమునకు వచ్చి యెచ్చటఁ జిక్కుకొంటివి. అనుపమ లావణ్య యుక్తమును, సర్వశ్రేష్ఠమగు యువావస్థయెక్కడ? మరణోన్ముఖుఁడగు నీవృద్ధముని యెక్కడ? తన్వంగీ! నేనునిజము చెప్పుచున్నాను. నీవీ ముసలితాపసికి యోగ్యవు కావు. ఇదినీయెడల నన్యాయము జరిగినది. యౌవన మున్నందులకు సఫలత యెప్పుడు? యువతికి రతిప్రియుఁడగు పురుషుఁడు ప్రాప్తించి నప్పుడును, పురుషునకు సర్వాంగ సుందరియు, సులక్షణయు, అనురూపయు, స్థిర యౌవనవతియగు బత్ని లభించి నప్పుడే భామినీ! నేనొక దేశమునకు రాజును, నాకడ ననేకులు రాణులుకలరు. నీవును నాభవనమునకువచ్చి అచ్చట నందఱి కధీశ్వరివై యుండుము. వృద్ధావస్థచే జర్జరుఁడై, ముసలి తొక్కుగా నున్న నీమునిని వీడి నన్ను నీకింకరునిఁగ జేసికొనుము. నాతోగూడి నిర్జన వనోపవనములందును, కాననములందును, రమ్యపర్వతీయ ప్రాంతముల దుచు, నదీ, నిర్ఝర తటములందును, విహరించుము. ఆమోద ప్రమోదము లొనర్పుము. నీయౌవనమును సఫలము కావించుకొనుము. ఈ ధర్మకర్మల గోలను వదలిపెట్టుము. ప్రాతివ్రత్యమును నదిస్వార్థులు పెట్టిన నడక. ఇంద్రియ సుఖమును లభింపఁ జేయు

నదియే ధర్మము.'' ఈవిధముగా నాతఁడనేక విధములఁ బద్మచిత్తమును మోహపెట్ట నెంచెను.

ఆతని యీవాక్యములనువిని శ్రద్ధయై సర్పిణివలె నాతని తన యెట్టుగ నుండుచున్నట్టుండు నేత్రములతోఁ గాంచుచుఁ బద్మయిట్లనెను:–''ఓరీ! నీచా! నీవిచ్చటినుండి తక్షణము తొలఁగిపొమ్ము పాపాత్మా! నీవు నన్నుఁ గామభావముతోఁ జూచునెడల నీవీ క్షణముననే భస్మము కాఁగలవు. ఇదేమి ధర్మవిరుద్ధపు పలుకులు పలుకుచున్నావేమి? నేనీ తపోధనుఁ డగు మహర్షియెడల మనస్సుతోనైనను శ్రద్ధనహింపఁ జాలనా? నీవంటి స్త్రీజితుని, గామలంపటుని, నీచునిఁజూచి నను శాపమే నీచనీచతనంబు జూచితివి. నీవునన్ను మాతృబుద్ధితోఁ జూడవలసినది. నీవు నన్ను స్త్రీబుద్ధితోఁ జూచితివి కావున నీవుక్షయించెదవు గాక!''

ఇదివినఁగానే ఆతఁడు తన ధర్మవేషమును త్యజించి యదార్థ రూపములోనికి వచ్చెను. వాస్తవమున నాతఁడు రాజుకాఁడు. సాక్షాత్తుగా ధర్ముఁడే పద్మను బరీక్షించుటకై వేషమును మార్చుకొని వచ్చియుండెను. వృద్ధ పతినిఁబొంది పద్మ హృదయ పూర్వకముగ సంతోషించుచున్నదా లేదా యని ఆతఁడు తెలిసికొనఁ దలఁచెను. ఇచ్చటకు పరీక్షింప వచ్చి శాపమును బొందెను. ధర్మదేవుఁడు మిక్కిలి భయపడి తన సాక్షాద్రూపమునఁ బద్మ సమ్ముఖమున నిలుచుండి వినీత

వచనములతో వణఁకుచు నిట్లనెను:-" అమ్మా! నేను సాక్షా త్తుంగ ధర్మమును. నేను కేవలము పరీక్షించుటకై వచ్చితిని. నా కేమియును దూషితభావము లేదు. నీవు నీ పాతివ్రత్య ప్రభావముచే నాకు శాప మొసంగితివి. నీవు ఉచితమునే కావించితివి. విధి విధానమట్లున్నది. సర్వాత్ముఁడగు ప్రభుని యిచ్ఛయిట్లున్నది. జగత్కల్యాణ మొనరుశివుఁడు సృష్టికొఱకు నన్ను శుయిష్టువుగా నొనర్పఁదలఁచి నాఁడు. ఆతఁడు నీవలన శాపమును బెట్టిం బూర్తి కావించెనుదీనినిఁబట్టి సర్వేశ్వరుఁడు నానావతారములను ధరింపగలఁడు. ఈచరాచర విశ్వమును లీలగాఁ బాలన పోషణ మొనర్చు నాసర్వాత్ముఁడగు ప్రభు వునకుఁ బ్రణామము." అని యీవిధముగఁ బలికి ధర్ముఁడు శాంతుఁడై పతివ్రత సమ్ముఖమున నిలువఁబడెను.

పిప్పలాదుని పత్నిపద్మ తన సమ్ముఖమున మూర్తీ భవించిన ధర్మునిఁగాంచి చకితయయ్యెను. అత్యంతాశ్చర్య ముతో నామెయిట్లనెను. "ధర్మదేవా! నీవు సమస్త ప్రాణుల పాపపుణ్యములకును సాక్షివి. అట్టియెడ నీవు నాకడ నిట్టి యధర్మవాక్యముల నేలఁబలికితివి. ఏల నామనస్సును మథించి చిత్తమును విలోడితము కావించుచున్నావు. ప్రభూ! నేను నిన్నెఱుఁగక శాపమొసంగితిని. కావున నన్ను క్షమింప వల యును, నా శాపము మిథ్య కాఁబోదు, ఇప్పుడిట్టి వ్యవస్థ

జరుగుగాక! నీకు కృతయుగమున నాలుగు పాదములు నడుచు గాక! క్రమముగఁ త్రేతాయుగమున మూఁడు, ద్వాపర యుగమున రెండు, కలియందొకటి, కలియుగాంతమున నీకు నాల్గుపాదములును నశించునుగాక! మరలఁ గృతయుగమున నాలుగు పాదములుండు గాక! భగవంతుఁడు నిన్ను రక్షించుఁగాక! మంచిది. ఇఁక నీయింటికిఁబొమ్ము. నాకు పతి సేవ కాలస్యమగుచున్నది.''

ఇది విని ధర్ముఁడత్యంత ప్రసన్నుఁడై యిట్లనెను:- ''దేవి! నేను నీపాతివ్రత్యమునకు మెచ్చితిని. నీపతి పరమ సుందరుఁడగు యువకుఁడగు గాకయని వర మొసఁగితిని. నీకు పదుగురు కొడుకులు కలుగుదురు గాక! నీకంతటను సమృద్ధి కలుగుగాక! నీకు సదా నాయందు బుద్ధియుండుఁగాక! నీకే వస్తువును గొదువయుండఁ బోదు. నీకు చిరసౌభాగ్యముండుఁ గాక!''

ధర్ముని నోట నీవరములను విని పద్మ మిక్కిలి సంత సించెను. ఆమె ధర్మునకు ప్రణామము కావించి, ప్రదక్షిణ మొనర్చి, ధర్ముని ఆజ్ఞనుబొంది పుష్పభద్రనుండి నీరముగొని ఆశ్రమమునకు వచ్చెను. వచ్చి చూడఁగా నామె పతి మన్మథునివలె సుందర యువకుఁడై మందహాస మొనర్చు చుండెను. నలువైపులను సంపత్తి నిండియుండెను. మంచి మంచి భవనములుండెను. తన ప్రాణప్రియ పత్నియొక్క

యీ పాతివ్రత్య ప్రభావమును యోగమున ముని తెలిసికొని పరమ ప్రసన్నుఁడయ్యెను కాలాంతరమునఁ బద్మగర్భమునఁ బదుగురు ముని పుత్రులుదయించిరి.

సూతుఁడిట్లనెను:—" మునులారా! నేను సంక్షేపమున ధర్ముఁడు తపయించిన కథను మీకుజెప్పితిని. భగవానుఁడిట్లు క్షీణించిన ధర్మమును స్థాపించుటకే అవతారమును గ్రహించుచుండును. ఎప్పుడెట్లవసరమగునో అప్పుడట్టి రూపమును ధరించి ప్రభువు ధర్మస్థాపన మొనర్చుచుండును. మత్స్య రూపమును ధరించి భగవంతుఁడే యేకార్యము లొనర్చెనో దానిని బరీక్షిన్మహా రాజునకుఁగా నాకురుదేవుఁడగు శుక మహర్షి యెట్లువర్ణించెనో దానిని మీకు సర్వమును జెప్పెదను. మీరు దీనిని దత్తచిత్తులరై వినుఁడు."

సత్యవ్రతునిపై మత్స్య భగవానుని కృప

(౫౧)

శ్లో॥ ఏకదా కృత మాలాయాం కుర్వతే జలతర్పణమ్।
తస్యాం జలభ్యుదకే కాచిచ్ఛఫర్యేకాభ్యపద్యత॥
సత్యవ్రతోఽంజలి గతాం సహ తోయేన భారత।
ఉత్ససర్జ నదీతోయే శఫరీం ద్రవిడేశ్వరః॥

శ్రీభాగ. స్కం. ౮అ. ౨౪. ౧౩శ్లో

వ॥ మఱియు నొక్కనాఁడమ్మునివీ శాంతుఁడు కృతమాలిక యను నేటి పొంత హరి సమర్పణంబుగా జలతర్పణంబు సేయుచున్న సమయంబున నా రాజు దోసిట నొక్కమీను పిల్ల దవిలి వచ్చిన నులికిపడి మరలం దరంగిణీజలంబు నందు శకుల శాబకంబు విడిచె.

శ్రీమదాంధ్ర భాగవతము.

భగవంతుఁడే రూపమును ధరించినను దాని కను రూపముగ నగును, కాని అతని యనంతైశ్వర్యము దాచినను దాఁగఁబోదు. అగ్ని నెన్ని గుడ్డమడతలందు దాచియుంచినను నల్పకాలముననే ప్రకటమగును. భగవానుఁడే దేహమందవతార మెత్తినను దన మహిమచే నాతఁడు ప్రకటమగుచునే యుండును. అతఁడే సుకృతియును భాగ్యశాలికో దర్శన మొసంగి కృతార్థు నొనర్చును. అతని దర్శనమును జేసిన వాఁడు మరల నాతని యంత్రితమై పోవును. యంత్రమున కందఱు నాతని యంత్రితములే. అతని యిచ్ఛలేక ఒక్క ఆకైనఁ గదలదు. అయినను నజ్ఞానులీ రహస్యము నెఱుఁగఁ జాలరు. ఆతని యాశ్రితులను భక్తులీ విషయమును తెలిసికొని సమస్త కార్యములందును నాతని చేయి పట్టుకొని నిశ్చింతులై శాంతులగుదురు ఇదియే భేదము.

శ్రీశుక మహర్షి పరీక్షిన్మహారాజుతో నిట్లనెను:- "రాజా! వర్తమాన శ్వేతవారాహ కల్పమునకు ముందు

కల్పనమున బ్రహ్మకొక దినము సమాప్త మయ్యెను. రాత్రి రాఁగానే ఆతఁడు యోగనిద్రలోఁ బడుండఁ బోవునంతలో నవఁగాఁ గల్పాంత ప్రళయము రాఁగా నిద్రించుచున్న బ్రహ్మ ముఖమునుండి హయగ్రీవుఁడను నొక దైత్యుఁడు వలనుండి విడివడిన మత్స్యమువలెను పంజరములోని పక్షి తప్పించుకొను నట్లును, ఇంటి తలుపులను దెఱచి చోరుఁడు సామాను తీసికొని పాఱిపోవునట్లును, బాఱి పోవుచుండెను. సమీపముననే అచ్చట వేదములు పడి యుండెను. దైత్యుఁ డిట్లనుకొనెను:—"ఏది దొఱకిన నదియే చాలుననుకొని ఆతఁడు వేదములను దీసికొని పాఱిపోయి పాతాళమున దాగెను. బ్రహ్మ నిద్రపోవు చుండెను. ఆతనికి ఈచోరుని సంగతి తెలియదు. కాని అందఱును నిద్రించుచుండ నెవఁడు నిరంతరము మేల్కొని యుండునో ఆ శ్రీహరికా దుష్టుని సంగతులన్నియును దెలియును. అందువలన మత్స్యరూప మును ధరించి పాతాళ జలములలోనికిఁ బోయెను. అచ్చట వానినిఁ జంపి వేదములను దెలిసికొని వచ్చెను.

అంత శౌనకుఁ డిట్లడిగెను:—"సూతా! ఈవిషయము మాకర్థ మగుట లేదు. మూఁడు లోకములకును బ్రళయము వచ్చినప్పుడే రాక్షసుఁ డెచ్చట నుండి వచ్చినాఁడు. అప్పు డెవరును జీవులు లేరు కదా? బ్రహ్మ ప్రకటనఁ బడియుండిన వేదములను హరించినాఁడని చెప్పుచున్నావు 'వేదముల

పుస్తకములను గొని పోయినాఁడా? వేదముల పుస్తకము లనే తీసుకొనిపోయినచో నవి జలములలో నేలఁదడియ లేదు? భగవానుఁడు మత్స్యమై యెట్లుద్ధరించెను ఆదైత్యుఁడెచ్చట నుండును. పాతాళ మప్పుడు లేదుకదా!

ఇది విని సూతుఁడు నవ్వుచు నిట్లనెను.—"స్వామీ! ఇవన్నియును సూక్ష్మ జగద్విషయములు. ప్రలయ కాల మందు జీవులెచ్చటకిఁ బోలేరు. వారందఱును బ్రహ్మయుద రమందే నివశించెదరు. పచారీదుకాణమందలి వస్తువుల నన్నిటిని రాత్రి కాఁగానే ఆ దుకాణదారుఁడు వానినా దుకాణములోనే యుంచి యెట్లు నిదిచునో, మరల తెల్ల వారగనే మరల యథాస్థానముగ నుంచునో అట్లే కల్పాంతమునఁ గర్మానుసారముగ జీవులు మరలఁ బుట్టు చుందురు. ధాత యథాపూర్వకముగ జగత్తునందలి సమస్త వస్తువులను గల్పించును. ఇదే విధముగ నీప్రవాహ మనాది నుండి నడుచుచున్నది. చాలమంది దేవ, దైత్య, దానవులు కల్ప జీవులుగ నుందురు చాల మంది బ్రహ్మాయువు వఱకు నుందురు. చాలమం దనేక బ్రహ్మలను జూచిన వారును గలరు ప్రలయ మందును జాలమంది దేవ, దైత్య, దానవు లకును, ఋషి, మునులకును జ్ఞానముండును వారు సూక్ష్మ శరీరమున బ్రళయ జలమందుండ గలరు సమస్త వస్తువుల కును నధిష్ఠాతృలు దేవతలు, వేదములకును దేవతలే అధిష్ఠా

తృలు. పుస్తకములందు వైదిక జ్ఞానము లిఖింపఁ బడినది పుస్తకమే వేదముకాదు. మనము "పం" 'డు' అను రెండక్షరములు వ్రాసి ఇదేమి? యని అడిగినచో "పండు" అందుము. వాస్తవమున నది 'పండు' కాదు. పండీయక్షరములకు వేఱుగా నున్నది. అయినను నదిజగత్తునందు త్పన్నమగు ఫల ద్యోతకమే. అదే విధముగా వేదపుస్తకములు వేదద్యోతకములే. ఇప్పుడు మనకు దొఱకిన సంహితలే కాదు వేదములు. వేదము లనంతములు. హయగ్రీవుఁడను రాక్షసుఁడు సూక్ష్మశరీరముతో వేదముయొక్క అధిష్ఠాతృదేవతను గొని పోయెను. బ్రహ్మ వేద హీనుఁడయ్యెను. వేదము లేకున్న నాతఁడు లేచు టెట్లు? లేచి సృష్టి నెట్లు చేయఁగలఁడు? సృష్టి ప్రవాహ మాగిపోవలు లేదు. కావున భగవానుఁడు మత్స్యావతారమును ధరించి వేదముల నుద్ధరించెను. ఆసమయమునఁ బృథివి జలమగ్నమై యుండెను. సప్త సముద్రము లొక్కటయ్యెను. ఆదైత్యుఁడు నీటిలోనికిఁ బోయి దాగి యుండెను. అగాధ జలములోనికి చేఁపయే పోఁగలదు. కావుననే భగవానుఁడీ జల చర రూపమును ధరించెను."

పరీక్షిన్మహారాజు శుకమహర్షితో నిట్లనెను:—
ప్రభూ! మీరునాకు మత్స్యావతార కథను క్రమముగఁ జెప్పవలయును."

అంత శ్రీ శుకుఁ డిట్లనెను:- "రాజా! ఈ శ్వేతవరాహ కల్పమునకుఁ బూర్వకల్పమున సత్యవ్రతుఁడను నొకరాజుండెను. అతఁడు గొప్ప ధర్మాత్ముఁడు, యశస్వి, సత్యవాది, దక్షిణమునఁగల ద్రవిడ దేశమున కాతఁడధిపతి. రాజ్యమును వీడి అతఁడు కృతమాలయను పుణ్యనదీ తటమందుండి భగవదారాధన మొనర్చుచుండెను. అతఁడన్నమును, ఫలపుష్పములు మొదలగు వానినన్నిటినిఁ బరిత్యజించెను. కేవలము జలమును ద్రావి తపోనిరతుఁడై యుండెను.

ఒక దినమున నాతఁడు కృతమాలా జలముతో దేవర్షి పితృతర్పణ మొనరించుచుండెను. ఇంతలో నాతని అంజలి లోనికొక చిన్నచేఁప గళగళ మెఱయుచు వచ్చెను. రాజిట్లనుకొనెను:- "చేప చాల అందముగనున్నది; కాని దీనికాధారము జలమే. నేను దీనిని జలములనుండి బయటకుఁ బడవైచినచో నిది చచ్చిపోఁగలదు." అనుకొని యాతఁడు దాని నంజలి జలముతోఁ గృతమాలా జలములోనికి వదలెను. అంత నామత్స్యకిశోరము మనుష్య భాషణములతో నత్యంత కరుణా స్వరమున నిట్లనెను:- "రాజా! నీవు ధర్మాత్ముఁడవు. దీనులయందు దయఁజూపు వాఁడవు శరణాగత ప్రతిపాలకుఁడవు. శరణు వేఁడిన వారిని రక్షించుట మీ వ్రతము. అట్టియెడ నీవు నన్నేలఁ బరిత్యాగ మొనర్చుచున్నావు. పెద్దచేఁపలు చిన్నచేఁపలను దిను

చుండును. చిన్నవారివలననే పెద్దలు బలియుచుందురు. నేనా
శ్రయ హీననై తిరుగుచున్నాను. నీవునన్ను రక్షింపుము.
కానిచో నాజాతిలోని పెద్దజంతువులే నన్ను భక్షింపఁ
గలవు."

సత్యవ్రత మహారాజు మానవ వాక్కులతో మాట
లాడిన చేఁప నోటినుండి వచ్చిన మాటలను వినఁగానే
మిక్కిలి ఆశ్చర్యపడెను. అయినను దానిని గూర్చి అతఁడు
సామాన్యమగు మత్స్యమే యని భావించెను. అందువలన
నాతఁడు దానిని రక్షించుటకు నిశ్చయించుకొని, ఆతఁడు
కరుణావశమున నామత్స్యమును జలమునుండి తీసెను.
స్నానమొనర్చి జలమును దెచ్చుకొనుట యొక ఆవశ్యక
కృత్యము. ఆతఁడు జలములను గొనుటకై తెచ్చిన నాచిన్న
కమండులువులో నీటిని నింపుకొని, ఆ చేఁపను దానిలోఁబడ
వైచెను. అనంతర మాతఁడు నిత్యకర్మలను బూర్తి
కావించుకొనెను. సాయంకాల స్నానాదిక కృత్యము
లొనర్చుకొని మహారాజా చేఁపను గమండులువులోఁ దీసు
కొని తన యాశ్రమమునకుఁ బోయెను. చేప పెరిగినది. కమం
డులువు చిన్నదని రాజు తెలిసికొని యాతఁడు దాని నొక
పెద్ద కలశములో నుంచెను. కలశమందుంచి సత్యవ్రత
మహారాజు నిద్రించెను."

శ్రీ శుకదేవుఁ డిట్లనెను:—"రాజా! భగవానుఁడు
తన రూపము నెట్లు విస్తారము కావించెనో దానిని నేను

ముందు జెప్పెదను. మీరీ సుఖద, రోచక, పుణ్య ప్రదమగు ప్రసంగమును ప్రేమ పూర్వకముగ శ్రవణ మొనర్పుఁడు.''

మత్స్యభగవానుని అమిత రూపము.

(౫౮౬)

శ్లో॥ నైవం వీర్యో జలచరో దృష్టోఽస్మాభిః శ్రుతోఽపి చ।
యో భవాన్ యోజనశత మహ్నాభివ్యానశే సరః॥
నూనం త్వం భగవాన్ సాక్షాత్ హరి ర్నారాయణోఽవ్యయః।
అనుగ్రహాయ భూతానాం ధత్సే రూపం జలౌకసామ్॥
(శ్రీభాగ. ౮స్కం.౨౪అ. ౨౬, ౨౭శ్లో.)

సీ॥ ఒక దినంబున శత యోజన మాత్రము
విస్తరించెదు నీవు విస్మయము చూడ
మిటువంటి ఘషముల నెన్నఁడు నెఱుఁగము
మీన జాతుల కిట్టి మేను గలదె
యేమిటి కెవ్వఁడ వీలీలఁ ద్రిప్పెదు
కరుణ నాపన్నులఁ గావ వేఁడి
యంభశ్చరంబైన హరివి నే నెఱిఁగితి
నవ్యయ నారాయణాభిధాన

తే॥ జనన సంస్థితి సంహార చతుర చిత్తి
దీనులకు భక్తులకు మాకు దిక్కు నీవ

నీదు లీలావతారముల్ నిఖిల భూతి
భూతి హేతువుల్ మ్రొక్కెదఁ బురుష వర్య॥

శ్రీమదాంధ్ర భాగవతము.

భగవానుని పరాక్రమమునకంతు లేదు, హద్దు లేదు. ఈ క్షుద్ర ప్రాణి తనను బట్టియే లోకమునంతను దూచును, తనను బట్టియే లోకము నంతను గొలుచును. తానెంతో లోకమంత భగవంతుఁడు బలిసదన యడుగుతో మూఁడడుగులడుగంగా బలి యిదివిని నవ్వి "పాపమీ వటు వామనుఁడు మూఁడడుగులేనా అడుగవలసిన దని నవ్వెను. అతఁడాతనిపాదములతోడనె యే భావించెను. మనము తనవారు పెరవారను భేదమును త్యజించి, అందఱను నాయ నంతా చ్యుత అపరిమేయ ప్రభుని కొలతచేఁ గొలువఁగా నప్పు డాశ్చర్య విస్మయము లుండఁజాలవు.

శ్రీ శుకదేవుఁడిట్లనెను:- "రాజా! సత్యవ్రతుఁడు రాత్రి యందు మత్స్య భగవానుని ఒక పెద్దమట్టి కుండలో నుంచెను. ప్రాతఃకాలమున నాతఁడు బ్రహ్మముహూర్తమున లేవఁగానే మత్స్యభగవానుఁడచ్చట నుండియే యిట్లనెను:- "రాజా! నీవు నాకాశ్రయమొసంగి పీక నొక్కి యేలఁజంపెదవు? నేనీ కుండలో నిముడఁజాలను. ఏదైన విశాలమగు జలాశయములో నన్ను వదలుము." ఇది విని రాజు సమీపమున నున్న నొక చెఱువులో నావిచిత్రమత్స్యమునువదలి స్నానము నకుఁ బోయెను.

ఆతఁడు స్నానమునకుఁ బోయి తిరిగిరాఁగానే ఆతనికి మత్స్య భగవానుని వాక్కులు వినఁ బడెను:-"రాజా! నాకీ జలాశయము నిర్వాహము జరుగదు. నన్ను దీనికంటెఁ బెద్ద జలాశయమందు విడుపుము."

రాజు పోయిచూడఁగా నాయోజన విస్తృతి కలిగిన యా సరోవర మందు మత్స్యము తన శరీరమును వ్యాపింపఁ జేసెను. ఇప్పుడాతనికి చింత కలిగెను:-"ఇంతటి పెద్ద చేఁపను నేనొంటరిగా నెట్లెత్త గలను!" మహారాజు మనస్సులో నీసంకల్పము రాఁగానే మత్స్యహరి యిట్లనెను :-"రాజా! నీవు నన్నెత్తుము చింతింపకుము."

రాజాతని నెత్తఁగా నాతఁడు పుష్పము వలెఁ దేలికై పోయెను. రాజాతని దశ యోజనవిస్తీర్ణముగల సరోవరమున వైచెను. అర్ధముహూర్తములోనే రాజ చూచు చుండఁగనే మత్స్యము పది యోజనముల సరోవరము నాక్రమించెను. ఇప్పుడును నాతఁ డెత్తుటకుఁ బోయెను. పది యోజనముల శరీరము నాతఁడెత్తఁగా పుష్పమువలెఁ దేలికయ్యెను. ఇప్పుడాతఁడు బది యోజనముల సరోవరమందు వదలెను. మరల నంతగాఁ బెరిగెను. అప్పుడు నూఱు యోజనముల సరోవరమందు వదిలెను. అదియును నాతనికిఁ జాలలేదు. దీనవచనములతో నాతఁడిట్లనెను.-"రాజా! నన్నేదైన నదీయ జలధారలోవదలిపెట్టుము. అప్పుడు రాజాతనిసముద్రమందు విడిచి

వైచెను. ఆశ్చర్యకరముగ నాతఁడు నూఱు యోజనముల శరీరముకలవాఁడయ్యెను. రాజట్లు చూచుచుండఁగా నాతఁడు పుష్పము వలె లేచుచుండెను.

రాజు మత్స్యభగవానుని సముద్రజలమందు వైవఁగా మత్స్యభగవానుఁడిట్లనెను :- "రాజా! దయయుంచి నీవు నన్నిచ్చట సముద్రమందు నిరాశ్రితునిఁగా వదలవలదు. నన్నిచ్చట నెవరైనఁ దినివేయఁగలరు, నూఱు యోజనములు పెరిగిన బుష్పమువలె లేవఁగా, నట్టి వాని నోట నిట్టిదిన వాణిని వినఁగానే ఆ సత్యవ్రతమహారాజునకు తెలివి కలిగి యిట్లనెను:—"ఒక్క రోజులోనే నూఱు యోజనములు పెరిగి, యెత్తినఁ బుష్పమువలె నగుచు, స్పష్టముగ మానవ భాషలోఁ బలుకుచుండు నీతఁడు సాధారణ జలచరజీవి కాఁడు ఏమైనఁగాని యీతఁడు సాక్షాత్తుఁగ శ్రీమన్నారాయణుఁడే." అందువలన నాతఁడు వినీత భావముతో నిట్లనెను:— "ప్రభూ! నీవు మత్స్యరూపమును ధరించితివి, నీవలౌకిక కార్యములొనర్చుచున్నావు. నీవెవరు? మత్స్య శరీరముచే నన్ను మోహమునఁ బడవేయుచున్నావు. ఇట్టిబల, పరాక్రమములను, అపారైశ్వర్యమును నేను నేఁటివఱకెచ్చటను నే జలచరమందును జూడలేదు. ఒక్క దినములో నీశరీరమును నూఱు యోజనములు పెంచితివి. అవశ్యము నీవు జీవివి కావు. సాక్షాచ్ఛ్రీమన్నారాయణుఁడవు. నీవజుఁడవు, అచ్యుతుఁడవు, అవినాశివి. భూమాపురుషుఁడవు."

నవ్వి మత్స్యభగవానుఁడిట్లనెను :—"నేను జన్మించితిని. అట్టినన్న జన్ముఁడ వచ్యుతుఁడవని యేలఁజెప్పుచున్నావు?"

రాజర్షియగు సత్యవ్రతుఁ డిట్లనెను:— "స్వామీ! నీవజుఁడవయ్యును లోకకల్యాణార్థమై అప్పుడప్పుడు భూమిపై నవతరించుచుందువు. నీవజన్ముఁడవయ్యు ధర్మ సంస్థాపనార్థము జన్మమును గ్రహించుచుందువు. నీవు తప్పక జీవులను గృపజూచుటకై నీవీ జలచరరూపమును ధరించితివి."

ఇది విని నవ్వుచు మత్స్యభగవానుఁ డిట్లనెను:— "రాజా! నీవు సత్యసంకల్పుఁడవు, నీవచనము మిథ్య కాఁజాలదు."

భగవంతుఁడు మత్స్యావతారము నెత్తినాఁడని రాజున కిప్పుడు నిశ్చయమయ్యెను. భగవానుని భక్తవత్సలతను స్మరించి ఆనందాబ్ధిలో మునిఁగెను. ఆతని నేత్రములనుండి నిరంతరము ప్రేమాశ్రువులు ప్రవహించుచుండెను. శరీర మంతయును బులకించెను ఆతఁడు గద్గద కంఠముతో భగవంతుని స్తుతింపసాగెను. మాటి మాటికి సాష్టాంగప్రణామ మొనరించుచుండెను. ఆతఁడిట్లనెను:— "ప్రభూ! మావంటి శరణాగత భక్తులకు నీవొక్కఁడవే గతి. నీవే మా సర్వస్వమవు. నీవే యీ చరాచర విశ్వము నుత్పన్నము గావించితివి. నీవే నానావతారములను ధరించి పాలించుచుందువు. చివరకు రుద్రరూపమున నీవే సంహారమును కూడ గావించెదవు.

నీప్రతి చేష్టయందును లోకోపకారము సన్నిహితమైయున్నది. అశరణ శరణా! నీయీ యద్భుత జలచరావతారమేవిశేష కారణముచే వచ్చినది? నీలీలన్నియును సుఖకరములు. అట్టి లీలలను ప్రాణులు గానమొనర్చి, సంసారసాగరమును సరళముగ దాటుదురు. అయినను నీవిచిత్రావతారమునకేదైన విచిత్రకారణముండియుండవలయును. ఈయర్థముని నీవను గ్రహింపఁగా నట్టి నిన్ను వీడి నేనింకెవరి నాశ్రయింపఁగలను. జగత్తున కాశ్రయము నీవే. నీవు నీయవతారమునకు విశేష ప్రయోజనమేమైన నుండినఁజెప్పుము. నన్ను నీసేవకునిఁగా భావించి స్వీకరింపుఁడు."

అంత జలవిహారమొనర్పఁదలఁచు చున్న మత్స్యభగవానుఁడు తనకనన్యాశ్రిత భక్తుఁడగు సత్యవ్రతునితో నిట్లనెను:—"రాజా! నేను నీ జలప్రవాహమునుండ రక్షించుటకు వచ్చియున్నాను."

ఆశ్చర్యముతో రాజిట్లడిగెను:—"జలప్రవాహ మేమి స్వామీ! భగవానుఁడిట్లనెను:—"నేటి కేడవదినమున బ్రహ్మ యొక్క యీ కల్పము సమాప్తము కాఁగలదు. భూర్భువస్సువర్లోకములు మూఁడును నశింపఁగలవు చరాచర జీవులను బ్రహ్మ తన యుదరమున నుంచుకొని యోగనిద్రలో నిద్రించును. నేను నీకు ప్రళయకాలదృశ్యమును జూపఁగోరుచున్నాను రాఁబోవు కల్పమందు నేను నిన్ను మనువుగా నొనర్చెదను. కావున నీవు పృథివి యందలి అల్పాధిక సమస్త

బీజముల నిప్పటినుండియే రక్షింపుము. సప్తర్షులతోఁ గూడి నిన్ను నీవు రక్షించుకొనుము. నాతోఁగూడి ప్రళయ పర్యంతము జలవిహార మొనర్పుము."

సత్యవ్రతుఁ డాశ్చర్యచకితుఁడై యిట్లనెను:-"నేనట్టి ప్రళయ జలమున నిలువఁగలను? నేనీ యుత్తాల తరంగముల నెట్లు సహింపఁగలను? సప్తర్షులను నేనెచ్చట వెదుకఁగలను?"

భగవానుఁ డిట్లనెను:-"నీవు వెదకవలసిన గిదుకవలసిన పని లేదు. ప్రళయకాల సముద్ర ఉత్తాల తరంగములను నీవు సహింపవలసిన పని లేదు. నేఁటి యేడవ దినమున నొక గొప్ప సుందర సుదృఢమగు నౌకవచ్చి నీ సమీపమున నాగఁగలదు. సమస్తవసువుల బీజములను గైకొని సప్తర్షిగణము స్వయముగ నీ సమీపమునకు రాగలరు. నీవా దివ్యనౌక మీఁదకు వారందఱితో నెక్కవలయును. ఆ నౌకను వాసుకీ రూపమగు త్రాడుతో నాకొమ్మునకు గట్టవలయును. అంత నేనా నౌకను లాగుచు విహార మొనర్చెదను. అటు నిటుఁ ద్రిప్పెదను. ఆనందాస్వాదనమును గావింపఁ జేసెదను. సుందర సుందర అత్యద్భుత కథలను జెప్పెదను. నీవా సమయమున నే ప్రశ్నల నడిగిన వానికన్నిటికిని నిశ్చింతుడనై యేకాంతమందు నేను యథార్థముగాఁ బ్రత్యుత్తర మొసంగెదను. నేను నీపైఁ గృపనుజూపి నీకు పరబ్రహ్మమయమగు నామహిమను సాక్షాదనుభవము గావింపఁ జేసెదను."

శ్రీ శుకదేవుఁ డిట్లనెను:-"రాజా! ఈవిధముగా ద్రవిడేశ్వరుఁడను సత్యవ్రతునకు మత్స్య భగవానుఁడీ విధముగ నాదేశించి వెంటనే అచ్చటి నుండి అంతర్ధాన మయ్యెను. ఇప్పుడు రాజర్షి యగు సత్యవ్రతుని యానందమునకు మేఱ లేకుండెను. ఆతఁడు భగవత్కృప ననుభవించుచు నానంద మగ్నుఁ డయ్యెను. ఆతనికి క్షణ క్షణము భారముగఁ దోఁచెను. ఆతఁడు మాటిమాటికి నెప్పుడు వారము దినములు గడచునా యెప్పుడు మత్స్యభగవానుని దర్శనమగునా యని యువ్విళ్ళూరు చుండెను. ప్రతీక్ష గడియలు దూరమగును. అందువలన నెంతో కష్టముతో నాతఁడు దీర్ఘ కాలమును గడిపెను. తూర్పు ముఖముగా నున్నగు శాసనము మీఁద స్వస్థ చిత్తుఁడై కూర్చుండి, తాను తూర్పు ముఖముగా నుఁడి నిరంతరము మత్స్య భగవానుని చారు చరణములను జింతించుచు నా యనుపమ కాలమును నుత్సాహముతోఁ బ్రతీక్షించుచుండెను.

మత్స్య భగవానుని ఉపదేశము--జలవిహారము

(౫౮౭)

శ్లో॥ సోనుధ్యాతస్తతో రాజ్ఞా ప్రాదురాసీన్మహార్ణవే।
ఏక శృంగ ధరో మత్స్యో హైమో నియుత యోజనః॥
నిబధ్య నావం తచ్ఛృంగే యథోక్తో హరిణా పురా।
వరత్రేణాహినా తుష్టస్తుష్టావ మధుసూదనమ్॥

—శ్రీ భాగ. ౮ స్కం. ౨౪ అ. ౪౪,౪౫ శ్లో॥

క. కుఱు గఱులు వలుద మీసలు
చిఱు దోఁకయుఁ బసిఁడి యొడలు సిరిగల పొడలున్
నెఱి మొగము నొక్క కొమ్మును
మిఱు చూపులుఁ గలిగి విభుఁడు మీనం బయ్యెన్॥

వ. అట్లు లక్ష యోజనాయతం బయిన పాఠీనంబై విశ్వంభరుండు జలధి సొచ్చి.

వ. కని జల చరేంద్రుని కొమ్మున నొక్క పెనుబాఁపతోట నన్నావఁ గట్టి సంతసించి డెందంబు నివురుకొని తపస్యులు దాను నారాచపెద్ద మీనాకారుండగు వేల్పు జేని నిట్లని పొగడం దొడంగె.

శ్రీమదాంధ్ర భాగవతము.

భజనము, భోజనము, ప్రేమభావము ఏకాంతమందే జరుగును అందఱ సమ్ముఖమున నందఱును జూచుచుండఁగా నెవరు భజన మొనర్చెదరో అది నియమపూర్తికై ననుగావలయును లేక దంభముచేత నైనను గావలయును. అందఱిలోఁ

గూడి భోజన మొసఁగుట శిష్టాచారముచే నైనఁ గావలయును, విశేష ఉత్సవపర్వములలో నైనఁ గావలయును. అదే విధముగ నందఱు యెడుటఁ బ్రేమను బ్రదర్శించిన నది భక్తిభావముచే నైనఁ గావలయును దానిలో శిష్టాచారము, స్వార్థము, దంభము, ప్రదర్శన మధికముగ నుండును. ఏకాంతమున భార్య భర్త సమ్ముఖమునందిన హృదయమును విప్పి యుంచును పతియును నామెయందిన సర్వస్వమును సమర్పించును. అదేవిధముగ సచ్ఛిష్యుఁడేకాంతమున గురుసమ్ముఖమునఁ దన హృదయగత భావమును బ్రకటించును. సద్గురువు రహస్య వస్తువును గూర్చిన యుపదేశమును శిష్యునకే కాంతమున నొనర్చును. ఏకాంతమున హృదయ నిర్ఝరిణీ ప్రవాహము వెల్లుబుకి, వేగముగఁ బ్రవహించును.

శ్రీశుక డిట్లనెను:- "రాజా! సత్యభగవానుఁడు రాజర్షి యగు సత్యవ్రతున కాదేశమొసఁగి అంతర్ధానుఁడు కాఁగా మహారాజు గొప్ప యుత్సాహముతో నౌకయొక్కయు భగవానుని యొక్కయు రాకకొఱకై ప్రతీక్షించుచుండెను. ఏదోవిధముగ నాతఁడేడు దినములను గడిపెను. ఏడు దినములు పూర్తికాఁగానే ఆకాశమందు గొప్పగా ఢణ ఢణ శబ్దము వినఁబడెను. ఆశబ్దము భూమిని బ్రద్దలు చేయుచున్నట్లుండెను. వర్షము వేగముగఁ గురియుచు మిన్ను మిన్నొక్కటయ్యెను. ఏనుఁగు తొండములంత ధారగా

నుండెను. ఇట్టిధార అంతటను బడుచుండెను క్షణములో భూమి యంతియును జలమయ మయ్యెను. జీవులందఱును జలములో మునిఁగిపోయిరి. మనుష్య, పసు, పక్షి, వృక్ష లతాదులేవియును గనఁబడుట లేదు. క్రిందనుండి పాతాళగంగ యుబికెను. పైనుండి ఆకాశ గంగ బడు చుండెను. సప్త ద్వీపములను జలములలో మునిఁగిపోయెను. సప్తసముద్రములును గలిసి ఏకమయ్యెను. సత్యవ్రత మహారాజు భయపడుచుండెను. ఇంతలోనే ఆతఁడు జలములో సప్తర్షులు వచ్చుటను గాంచెను. అప్పుడు రాజునకు ధైర్యము కలిగెను. ఆసమయమునసే ఆతనికి సుందరమైనదియును, సుదృఢమైనదియును, దెబ్బల తాఁగునదియును నొక నౌక తన వైపునకు వచ్చుటను గాంచెను. సప్తర్షులు రాజుతో నిట్లనిరి:—రాజా! ఇప్పుడిఁక నాలస్యము చేయరాదు, నీవు మాతోఁగూడ ఈనౌక నధి రోహించుము.

ఋషుల యాజ్ఞలనుబొంది రాజా నౌక మీఁదకెక్కెను. అంత సమస్తౌషధుల బీజములను ప్రళయము నుండి రక్షించుటకై మునులు పొట్లములు గట్టుకొని యుంచియుండిరి. ఆ పొట్లములను గైకొని సప్తర్షులును దాని పై కెక్కిరి. ఇంతవఱకు రాజు ప్రళయము యొక్క ప్రచండ తరంగములను గాంచి గడగడ వణఁకుచుండెను. ఆతఁడిట్లు భయభీతుఁడై కంపించుటను గాంచి ఋషులిట్లనిరి:—" రాజా! నీవు భయమునకుఁ

దిలాంజలి నిమ్ము. ధైర్యమును వహించుము. మధుసూదనుని స్మరింపుము. ఆతఁడు నిన్ను సర్వవిధముల రక్షింపఁగలఁడు. ఆతఁడు మనలను సమస్త సంకటముల నుండి రక్షింపఁగలఁడు మన కాధారమా అజ, అచ్యుత, భూమాపురుషుఁడే."

రాజు స్వస్థుఁడై యిట్లనెను:-"లేదు స్వామీ! భయపడవలసిన పని లేదు. భగవానుఁడు నన్నాదేశించినాఁడు ఆతఁడిప్పుడే మత్స్య రూపమున నిచ్చటకు రాఁగలఁడు. ప్రళయ పయోధిలో విచరించు నా ప్రభువును నేను ధ్యానించెదను ఆతఁడు భక్తుల ధ్యానమాత్రముననే వెంటనే ప్రత్యక్షము కాఁగలఁడు" ఇట్లు పలికి రాజర్షి యగు సత్యవ్రతుఁడు భగవంతుని ధ్యానము చేయసాగెను. ఆతఁడు ధ్యానము చేయఁగానే అచ్చట మత్స్య భగవానుఁడు ప్రత్యక్షమయ్యెను.

ఆతని శ్రీయంగము సహస్రవిద్యుత్తుల కంటెను నెక్కుడుగ మెఱయుచుండెను. సౌందర్య మంతయును నాతని శరీరములో లీనమైనదాయనునంత సుందరుఁడు. ఆతనిఁ గొలుచుటకు వేఱొక సాధనము లేనంత పెద్దవాఁడు. ఆతఁడు సముద్రములో నొక లంకవలె లక్షలకొలఁది యోజనములు వ్యాపించియుండెను. ఆతనిమాటున నొక గొప్ప చక్కని మెఱయు నునుపాటి శృంగము కలదు. ఈ రూపమున భగవంతుని దర్శించి అందఱును బరమానందమును జెందిరి. ఆ ప్రళయజలమందీదుచు వచ్చుచున్న వాసుకియును నచ్చటికి వచ్చెను. రాజు గబక్కున

నా మహాసర్పమును బట్టుకొనెను. వీని నే మందరమునకు త్రాడుగా గట్టి సముద్రమును మధించినది. వాసుకియును ప్రళయపు దెబ్బలకు భయపడి కంపించుచుండెను. అతండు దాని బట్టుకొనంగనే నౌక మీంద కెక్కెను. ఇంతలోనే మత్స్యభగవానుండును వచ్చెను. రాజు వాసుకీ ముఖము వైపు భగవానుని కొమ్మునకుం జుట్టంబడెను. తోంక వైపు గట్టిగా నౌకకు గట్టంబడెను. ఇంకే మున్నది అలంకారము పూర్తి యయ్యెను. సుందర శకటము వలె నయ్యెను. ఇంక జల విహారము ప్రారంభ మయ్యెను. మానవుండు మస్తకమున చందన బిందువును బెట్టుకొని యెంత తేలికగం దిరుగునో భగవానుని నౌక అంత చులకనగా నుండెను. ఇప్పు డేకాంతమున రాజు భగవానునితో వినయ పూర్వకముగం బ్రశ్నించుట కారంభించెను. ముందుగా రాజు భగవానుని స్తుతించెను."

మహారాజిట్లనెను:—"స్వామీ! ఈ జీవ. యీ భయానకమగు భవాటవి యందెప్పటి నుండి తిరుగుచున్నాండు. అనాదియగు నవిద్య జీవుని సహజ జ్ఞానము నాచ్ఛాదింపం జేసెను. అజ్ఞానియగు పురుషుండీ యసత్యములగు స్త్రీ. ధన, పుత్రాది పదార్థముల యందు నిత్యత్వ బుద్ధినుంచి, యెప్పటి నుండియో నానావిధ క్లేశముల ననుభవించు చున్నాండు. సత్య స్వరూపములగు నీ చరణారవిందములను మఱచి యీ జీవి, అసద్వస్తువులకొఱకు బరువు లెత్తుచున్నాండు.

దారి తెన్ను గానక తిరుగుచున్నాఁడు. దైవవశాత్తుగ నీ యను గ్రహము లభించినచో నీ సంసార బంధనము శాశ్వతముగ వీడి పోవును. మాయా బద్ధుఁడగు ప్రాణి అజ్ఞానమను గుబురువీడి విముక్తుఁడగును. ఇదంతయును గురుకృపచే జరుగవలయును. కావున మేము నిన్నే గురువుగా వరించితిమి."

ఇదివిని భగవానుఁడు నవ్వి యిట్లనెను:—" గురువుగాఁ జేసికొని మంచి పనిఁ జేసినారు. ఇప్పుడు నన్ను మత్స్యమనక గురుఁడనుఁడు."

మహారాజిట్లనెను:—"లేదు, స్వామీ! ఇంతతో నే పని కాదు. ఏ యాసక్తిచే నీయజ్ఞాన మూలకములగు కర్మలను సుఖ సాధనములని భావించి మేము కన్నులను మూసికొని అంధుల వలె నైతిమో ఆ యజ్ఞానమయ బుద్ధిని మీరు నశింపఁ జేయవలయును. మాహృదయమునందుఁ బడియుండిన మాయాగ్రంథిని, మాయాపతియగు నాప్రభువే విడదీయవలయును. గురుగ్రంథిని గురురూపుఁడవును శ్రీహరివగు నీవే యూడదీయ వలయును. కావున నీవు మాహృదయగ్రంథిని ఛేదింపవలయును."

భగవానుఁ డిట్లనెను:—"నాయనా! ఇంకెవరి నైన మీరు గురువుగాఁ జేసికొనుఁడు. నన్నే యింతపట్టు పట్టుచున్నా వేల?"

ఇదివిని రాజర్షియగు సత్య వ్రతుఁడిట్లనెను:— "స్వామీ! గనిలోనుండి వచ్చిన బంగారమందు బంగారపు

టంకయుండును, దానితోఁగూడి యితరమలమును నుండును. అగ్నిగాక యింకెవరైన సువర్ణములోని మలినమును బోఁగొట్టిన మనిన నదిఅసంభవము. అగ్నియే సువర్ణములోని మలినమును బోఁగొట్టఁగలదు. అదేవిధముగ సచ్చిదానంద స్వరూపుఁడగు నీజీవి యంతఃకరణమందుండిన నజ్ఞాన రూపమగు మలమునుబోగొట్టుటకు శుద్ధస్వరూపుఁడవగు నీకే సామర్థ్యము కలదు. నీసేవా రూపమగు తాపము చేతనే అజ్ఞాన రూపమగు మలము పోఁగలదు. లోకములో వివిధవిద్యలకుఁ జాలమంది గురువు లుందురు. కాని ఆగురువు లందఱకంటెను బరమ గురువును, నలినాశియును, నీశ్వరుఁడవు నగు నీవే మాకు పరమ గురుఁడవు. నిన్ను శరణు వేఁడిన నాఁడే మా నేత్రమందలి యజ్ఞానాంధకారము దూరము కాఁగలదు.''

భగవానుఁడిట్లనెను:—''నాయనా! ప్రపంచములోఁ జాలమంది యింద్రాది దేవతలున్నారు, విద్యా గురువులు, శిక్షాగురువులు, దీక్షాగురువులు మొదలగు జాలరకముల గురువులున్నారు. మీరు వారిని శరణు వేఁడుఁడు''

రాజర్షియగు సత్యవ్రతుఁ డిట్లనెను:—''వారి నాశ్రయించుట సుఖప్రదమే; కాని వారందఱును నీశరణమునకు వచ్చెదరు. వారును నీకృప లేక నిసుమంతైనను వారను గ్రహింపఁ జాలరు. నీవే అందఱకును బరమ గురుఁడవు, పరమేశ్వరుఁడవు. కావున నేను నీచరణములను శరణు వేఁడుచున్నాను.''

భగవానుఁ డిట్లనెను:-"నాయనా! ఎంతటి వివేక హీనుఁడైన పురుషుడైనను గురువుగాఁ జేసికొనిన నాతఁ డుద్ధరింపఁగలడు."

ఇదివిని రాజిట్లనెను:-"స్వామీ! ఇట్టి నిష్ఠ కల వానికి నేను శిరస్సాష్టాంగ నమస్కారము చేసెదను. కాని నాకట్టి నిష్ఠ లేదు. గ్రుడ్డివాని ననుసరించి పోయిన వందఱును గోతిలోఁ బడిపోయెదరు. అట్లే అజ్ఞానుని, వివేక హీనుని గురువుగా నొనర్చుకొనుట తన్నుఁదాను బంధించుకొనుట యేయగును. నీవు ప్రకాశవంతుఁడవు. భాగ్యవశమున మీ యహైతుక కృపచే మాసమ్ముఖమునఁ బ్రకటమైతిని అందువలన మేము నిన్నే మాగురువుగాఁ జేసికొంటిమి"

భగవానుఁడిట్లనెను:-"నాయనా! మంత్రదాతయే గురువగుచున్నాఁడు."

సత్యవ్రతుఁడిట్లనెను:- "ప్రభూ! తారకమంత్ర ప్రదాతయగు మంత్రదాతయగు గురువు పూజ్యుఁడే కాని, అతఁడు తారకమంత్రమును కేవల మర్థకామాది విషయ ప్రాప్తి లోభముచే నేదో అవకతవకగా మంత్రమును జెప్పినచో నాతఁడు శిష్యుని యజ్ఞానము నపహరింపక ధర్మాపహరణమునే చేయుచున్నాఁడు. ఇట్టివాఁడు గురువైనచో నాతఁడును గూలును, దనశిష్యులను గూల్చును."

లోభియగు గురువును, నింద్రియ లోలుండగు శిష్యుండును వీరిద్దరును నరకములో నొక్కచో జెనవైచుకొని యుందురు ఇట్టివాండు గురువు కాండు నీవమోఘ జ్ఞానము నుపదేశించువాండవు. నీకృపచేతనే మానవుండాత్మ స్వరూపమును బ్రాప్తించును.''

భగవానుడిట్లనెను:—''అయితే, మీరు నన్ను గురువుగా నెంచుకొనెదరా? ఈశ్వరునిగా భావించెదరా?''

రాజిట్లనెను:—'ప్రభూ! నీవే తల్లివి, తండ్రివి, నీవే నాతోడు నీడ నీవేసఖుండవు, నీవేగురుండవు దైవము, నీవే, నాపతియు గతియునిజముగ స్వామీ! ఆత్మయును నీవే యని చెప్పుదును. నీవే సర్వస్వమవు. ఉన్నదినీవే. నీవుతప్ప యింకెవరును లేరు. నీవే ప్రాప్యుండవు ప్రాప్తింపం జేయువాండవును నీవే. నీవు సర్వ వస్తువులందును సాక్షిచైతన్యుడవుగ నున్నావు; కాని మోహాంధకారమునం దిరుగు విషయాశక్తుడగువాండు నిన్ను జూడజాలనట్లు వాని అంతఃకరణమందట్టి మాయా జవనికను వేసియున్నావు. పరమాత్మా! నీవు నీయుపదేశామృత వర్షమును గురిపించి నాశుష్కహృదయము నుజిగిరింపం జేయుము. నా యజ్ఞానాంధకారమును దూరము చేయుము. సమస్త సంశయములను ఛేదించుము. హృదయములోని మోహరూప గ్రంథని విప్పుము మధుమయమగు నుపదేశ పూర్ణములగు వచనములను బలుకుము.''

శ్రీశుకదేవుఁ డిట్లనెను:- "రాజా! ఈ విధముగు రాజర్షియగు సత్యవ్రతుని యీ పట్టుదలను గాంచి, ఆతఁడు తత్త్వజ్ఞానమున కధికారియని తెలిసికొని మత్స్యభగవానుఁ డిట్లుపదేశించెను."

మత్స్యావతార చరిత్రోప సంహారము

(౫౮౮)

శ్లో॥ ప్రలయ పయసి ధాతుః సుప్త శక్తేర్ముఖేభ్యః
శ్రుతి గణమపనీతం ప్రత్యుపాదత్త హత్వా।
దితిజమకథయద్యో బ్రహ్మసత్యవ్రతానామ్
తమహ మఖిల హేతు జిహ్మమీనం నతోఽస్మి॥

శ్రీ భాగ. ౮స్కం. ౯అ. ౪౩శ్లో॥

మ॥ ప్రళయాంభోనిధిలో మేల్మఱచి నిద్రం జెందు వాణీశు మో
ముల వేదంబులు గొన్న దైత్యుని మృతిం బొందించి
సత్యవ్రతుం
డలరన్ బ్రహ్మము మాటలం దెలిపి సర్వాధారుఁడై
మీనమై
జలధిం గ్రుంకుచుఁ దేలుచున్ మెలఁగు రాజ్యన్మూర్తి
కిన్ మ్రొక్కెదన్॥

—శ్రీమదాంధ్ర భాగవతము.

భగవద్వచనములనే వేదము లందురు. భగవదవతార చరిత్రల వర్ణన మున్నవి పురాణములు పురాణములకు బది లక్షణములు చెప్పఁబడినవి; కానిముఖ్యలక్షణము లేవనఁగా దేనిలో బురాణ పురుషుని పుణ్యమయమగు మహిమము వర్ణింపఁ బడినదో దానినిఁ బురాణమందురు. అదియే మానవులకు వినుటకు యోగ్యమైనది. దానిచే నజ్ఞానము దూరమగును. ముఖ్యమగు తత్త్వజ్ఞానము కలుగును. భగవానుఁడే బ్రహ్మకు సమస్త పురాణముల నుపదేశించెను. ఇదియే అన్నిటి కంటెఁ బ్రాచీన మైన జ్ఞానము అందువలన నేదీనినిఁ బురాణ మనిరి. ప్రాచీనస మైనను నిది నిత్య నూతనముగ గోచరించును. నిత్య నిరంతరము వినుచున్నను నెన్నడును బ్రాతదిగఁ దోచనిది పురాణము.

శ్రీశుకదేవుఁ డిట్లనెను:—"రాజా! సత్యవ్రత మహారాజు సప్తర్షులతోఁ బ్రళయ జలమందు నౌకలోఁ గూర్చుండఁగా నానౌక వాసుకియను రజ్జువుచే మత్స్య భగవానుని కొమ్మునకు బంధింపఁ బడి యుండెను. అప్పుడు భగవంతుడు దాని నిటు నిండి అటు, అటునుండి యిటుఁ ద్రిప్పుచుండెను. అదే సమయమున మహారాజు భగవానుని తత్త్వ జ్ఞానమును గూర్చి ప్రశ్నించెను. భగవానుఁడును మహారాజడుగఁగా సృష్టియొక్క యదార్థరహస్యమును జెప్పి ఆతనిప్రశ్నలన్నిటికిని సమాధానము చెప్పెను. వేయియుగముల పర్యం

తము బ్రహ్మకు రాత్రి. అంత వఱకు భగవానుఁడు సప్తర్షులతో మహారాజున కుపదేశించు చుండెను. దానినే మత్స్యపురాణ సంహిత యందురు. రహస్య యుక్తమగు నీమత్స్యపురాణము మిక్కిలి దివ్యమైనది. దీనిలో సాంఖ్య యోగ కర్మ కాండలకు సంబంధించిన సమస్త వర్ణలును గలవు.

ఇది విని శౌనకుఁ డిట్లనెను:—సూతా! కృత, త్రేతా, ద్వాపర, కలియుగములు వేయిసార్లు తిరిగిన నీబ్రహ్మకు రాత్రియని నీవు చెప్పితివి. అంతకాలము వఱకును భగవానుఁ డుపదేశించుచునే యుండెను. భగవానుని యాయుపదేశము నకే మత్స్య పురాణమందురు. ఇప్పు డున్న మత్స్యపురాణ మందు దాదాపుగా పదునాల్గువేల శ్లోకములు మాత్రమే కలవు. ప్రళయరాత్రి యంతయును భగవానుఁ డిది యేనా యుపదేశించినది? దీనిని మానవుఁడు దీక్షగాఁ జదివినచో రెండుమూఁడు రోజులలోనే పూర్తియగునే అనఁగా నవ్వుచు సూతుఁడిట్లనెను:—" మహాభాగా! మత్స్యపురాణ మింతయే కాదు. మత్స్యపురాణము భగవంతునివలె ననంతమైనది, అయినను నట్టి యనంత జలరాశినుండి వేదవ్యాస భగవానుఁడు లోకకల్యాణార్థము వేఱుగా నొకసంహితను బ్రాణుల హితార్థమై నిర్మించెను. ఆయల్ప గ్రంథముచేతనే వీరి మనూరథములు పూర్తి కాఁగలవు. వీరికి జ్ఞానమును గలుగఁ గలదు.

అంత శౌనకుం డిట్లనెను:—"అయితే యీమత్స్య పురాణము పూర్ణమైనది, కాదుకదా! సంక్షిప్తమగునీ లఘు గ్రంథమున సమస్త జ్ఞానము దొరకదు, కాంజాలదు. ఏల ననఁగా రాజర్షులగు సత్యవ్రతునకును, సప్తర్షులకును జ్ఞానము సహస్రయుగ పర్యంతము చెప్పిన పూర్ణ పురాణము విని ననే కలిగినది."

అంత సూతుఁడునవ్వుచునిట్లనెను:— " మహాభాగా! ఇదియును బూర్ణ పురాణమే. దీని తోడనే సమస్త జ్ఞానము నశింపఁగలదు.

శౌనకుఁ డిట్లనెను:—"అదెట్లు?"

సూతుఁ డిట్లనెను:—"స్వామీ! సగరుని అఱువదివేల మంది పుత్రులును నశించిరి. వారి యుద్ధారము కొఱకు గంగను దేవలసి యుండెను. సగరుని పౌత్రుఁడగు నంశు మంతుఁడు గంగను దెచ్చుటకై వేలకొలఁది సంవత్సరములు తపస్సుజేసెను. కాని తేలేక పోయెను. అంశుమంతునిపుత్రుడు దిలీపుఁడు దిలీపుఁడును గంగను దెచ్చుటకు వేలకొలది సంవత్సరములు ఘోరతపస్సును జేసెను. తపస్సును జేసి మరణిం చెను. ఆతఁడును గంగను దేలేకపోయెను. దిలీపుని పుత్రుఁడు భగీరథుఁడు. ఆతఁడును వేలకొలది సంవత్సరములు ఘోర తపస్సును జేసెను. అప్పుడాతఁడు గంగను దెచ్చి, ఆ యమృతమయ జలముచేఁ దన పితరుల నుద్ధరించెను. భగీర

ఘుఁడు తెచ్చిన గంగలో ననంత జలము కలదు. ఆగంగ లోనే అందఱును వచ్చి స్నానమాడి తమ పాపములను బోఁగొట్టుకొందురు. స్నానముసల్పి యింటికిపోవునపుడుకొంద ఱిత్తడి పాత్రలయందును, కొందఱు రాగి పాత్రలయందును, కొందఱు గాజుపాత్రలయందును, చిన్న చిన్న మట్టిపాత్రల యందును గంగా జలమును గైకొని యింటికిఁ బోయెదరు. మేము గంగను దెచ్చితిమని అందఱితో నందరు. అదిపూర్ణ గంగకాదుగదా? దానిలో ఒక్క-జలకణము సమస్తపాపము లను నశింపఁ జేయుఁ జాలదా? దానినిఁ గూడ పూర్ణ గంగయనియే చెప్పవలెను. అనంతగంగలో నేగుణమున్నదో దీనిలోను నదియే గుణము కలదు. అదేవిధముగామత్స్య పురాణ రూపముగు నిరంతరము ప్రవహించు ననంత జ్ఞాన రాశియగు ప్రవాహము నుండి సాధారణ లోకులందుగల కృపతో వేదవ్యాస భగవానుఁడు సంహితను నిర్మించెను. గంగా జలములోని ఒక కణము సమస్త పాపముల నెట్లు నశింపఁ జేయగలదో, అదే విధమున నీసంహితచే సమస్త అజ్ఞానము పోఁగలదు.

అంత శౌనకుఁడిట్లనెను:—“ సూతా! ప్రళయ సమయ మున నేజీవియును బ్రదుకఁడు కదా। ఈ సత్యవ్రతుఁ డెట్లు బ్రతికెను?”

సూతుఁడిట్లనెను: "స్వామీ! భగవత్కృప యుండేది యును నసంభవము కాదు. ఈ రాజర్షి ఘోరతపంబొనరించెను. ఈతని తపస్సునకుఁ బ్రసన్నుఁడై బ్రహ్మ ఆతని యెదుట ప్రత్యక్షమై వరమును గోరుకొనుమనెను. ఆతఁడిట్లువరమును గోరుకొనెను:– "స్వామీ! ఈసమస్త ప్రళయకాల దృశ్య మును నాకన్నులతో నేను జూడవలయును. ప్రళయాంత మందు సమస్త జీవుల యుత్పత్తి నావలనఁ గావలయును." బ్రహ్మ తథాస్తని అంతర్ధానమయ్యెను. ఆవరదాన ప్రభావ ముచే భగవానుఁడు కృపతో మత్స్యరూపమును ధరించి రాజర్షి యగు సత్యవ్రతమునకుఁ దనమహిమ యంతయును జూపెను. ఆరాత్రి అంతము కాఁగా నారా జేవర్తమాన కల్ప మందు సూర్యపుత్రుఁడగు శ్రాద్ధదేవుఁడై విఖ్యాతినిఁ జెందెను. ఆతనినే భగవానుఁడు మనుపదమున నియమించెను. నేఁడు మనమందఱమును నీమను శాసనమును క్రిందనుండి యీ భాగ వత కథా చర్చ నొనర్చుచున్నాము ఇప్పుడుముందు మా గురుదేవుఁడగు శుకమహర్షి మత్స్య భగవానుని చరిత్రము నెట్లుచెప్పెనో దానినిఁ జెప్పి, ఆతరువాతనీవివస్వంతుని పుత్రుఁ డగు శ్రాద్ధదేవుని మనువంశమును గూర్చి చెప్పెదను."

శ్రీ శుకదేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను:– "రాజా! ఈవిధముగఁ బ్రళయరాత్రిపర్యంతము భగవంతుఁ డుపదేశించుచుండెను. ప్రళయరాత్రి అంతము కాఁగానే

బ్రహ్మ నిద్రలేచు సమయ మాసన్నమయ్యెను. అప్పుడు భగవంతునకు జ్ఞప్తికి వచ్చెను. :-"ఓహో! వేదములను తమః ప్రధానుఁడగు హయగ్రీవుఁడు హరించినాఁడు. ఈతఁడు నిద్రించునంతవఱకు వేదవిహీనుఁడే అప్పుడుసృష్టి యేమున్నది. కావున నంతః కరణ రూపమగు పాతాళమునఁ బ్రభువు ప్రవేశించి ఆలస్యరూపమగు నసురునిఁజంపి జ్ఞాన రూపమగు వేదమును దెచ్చి బ్రహ్మను మేల్కొలిపెను. నిద్రనువీడి, కన్నులను నలుచుకొనుచు బ్రహ్మనిద్రలేచెను. చేత నాజ్ఞానము కలుగుటచే లేవఁగానే మరలసృష్టి కార్యమున నిమగ్నుఁడయ్యెను. విచార సాగరమున మత్స్య భగవానుఁడు నిత్య విహారమొనర్చుచుండెను. సత్యవ్రతము కలవాఁడే ఆతనిని సాక్షాత్కరింపఁ జేసికొనఁగలఁడు.

నిత్యమును హయగ్రీవరూపుఁడగు నాలస్యము మన జ్ఞానవేదమును లేక బోధను హరించును. మనము బోధ హీనులమై చచ్చినట్లు నిద్రకు వసులమయ్యెదము. ఎన్నడును నిద్రించని అమృత్స్యభగవానుఁడు నిత్యమూ హయగ్రీవుఁడగు దైత్యునిఁజంపి మనకు బోధకలుగఁజేయును. జ్ఞానప్రదానము కావించును. మనము రేపటి రోజునవియపూర్ణ కార్యములను బూర్ణ మొనర్చుటలో మగ్నులము య్యెదము; కాని జీవితము జరుగుచున్నను మనపని పూర్తికాదు. ఏలనఁగా మన మపూర్ణము శ్రయించితిమి. పూర్ణముశ్రయించి పూర్ణమునుండి పూర్ణమును దీసివైచినను బూర్ణమును గలిపినను బూర్ణమే మిగులును ఇదియే యీమత్స్యావతార చరిత్రమున కాధ్యాత్మిక రహస్యము.

ఈసత్యవ్రతుని యొక్కయు, మాయా మత్స్య స్వరూపుఁడగు శ్రీహరియొక్కయు, సుఖసంవాదము నెవరు వినెదరో, జదివెదరో, చదివించెదరో, శ్రద్ధా సహితముగ గాన మొనర్తురో, గాన మొనరింపఁజేసెదరో, వారి సంసార బంధములన్నియు నవిలంబముగఁ దెగిపోవును. ఇందుకు సందేహము లేదు, సంశయము లేదు, భ్రమ లేదు, అత్యుక్తి లేదు, స్వార్థప్రలోభనము లేదు, ఇది ధ్రువసత్యము. ఇది అందఱకు నానందమును గొల్పు మత్స్య భగవానుని పావనకథ. దీనిని శ్రద్ధతో నెవరు కీర్తించెదరో వారికి సమస్త మనోరథములు పూర్తియగును. ఇప్పుడు మీకు నేను మత్స్యావతార కథనతి సంక్షేపముగఁ జెప్పితిని. ఇప్పుడింక మీరేమి వినఁదలఁచు చున్నారు ?"

అంతఁ బరీక్షిన్మహారా జిట్లనెను:— "స్వామీ! మీరా మధ్యలో వదలిన కథను బూర్తి చేయవలయును. మీరు దీనికి తరువాత వర్ణన మొనరించెదనని చెప్పి వదలి వైచితిరి. దానినిఁ బూర్తి చేయుఁడు."

అంత శ్రీశుకుఁడిట్లనెను:— "రాజా! నాకు జ్ఞాపకము లేదు. కథా ప్రవాహమున నేను మఱచుచుందును. నీవు జ్ఞాపకము చేయుము."

అంతఁ బరీక్షిన్మహారా జిట్లనెను:— "స్వామీ! మీరొక కల్పమునఁ బదునాలుగు మన్వంతరములని చెప్పిరి. వానిలో గడచిన నేడు మన్వంతరముల కథను మీరిది వఱకే వర్ణించిరి. రాఁబోవు నాఱు మన్వంతరములను మీరు కేవలము నామనిర్దేశము గావించితిరి. జరిగిన దానివలనఁ గొంత శిక్షణను

బొందవచ్చును. రాఁబోవు కథ భవిష్యద్గర్భమున నిమిడి యున్నది. దానిని గూర్చిచింతించుటవ్యర్థము. కావలసినదియు నిర్వహించుకొనవలసినదియు వర్తమానవిషయము. కావున నే నేసివర్తమాన వైవస్వత మన్వంతరకథను జెప్పవలసినదని నేను మిమ్మడిగితిని కానితరువాతబలివామనప్రసంగమును, మత్స్యావతార ప్రసంగమును జరిగినది. దానివలన రాజర్షి యగుసత్యవ్రతునకుమత్స్యభగవానుఁడు తత్త్వము నుపదేశించెననియు. నాతఁడేవచ్చియీ కల్పమున వివస్వంతునిపుత్రుఁడు వైవస్వత మనువయ్యెననియుఁ దెలిసినది. మీరచ్చటనే వైవస్వతమనువునకే ఇక్ష్వాకాది పుత్రులు జన్మించిరని చెప్పితిరి. కావున నిప్పుడీ రాజర్షులందఱ చరిత్రములను నాకు విస్తారముగఁ జెప్పుడు. ఏలననఁగా నీమనువే మాపూర్వజుఁడు. మేమును నీతని వంశము వారమే. ఈమనువంశ చరిత్రమును వినిన మాకానందము కలుగును. ఈ మన్వంతరమునఁ జాల యవతారములు వచ్చినవి. కావున నింత వఱకే రాజులు వచ్చిరో, ఇప్పుడున్న రాజులెవరో, ఇఁకముందే రాజులుద్భవింపఁ గలరో వారందఱ చరిత్రములను జెప్ప వలయును. పవిత్రకీర్తి కలిగిన నీరాజర్షులపై భగవానుఁడు కృపను జూపి యుండెను. వీరి కొఱకై భగవానుఁడు అనేకవతారములను ధరించి యుండెను. ఈ వంశ మందే పూర్ణావ తారుఁడును నానంద కందుఁడునగు శ్రీకృష్ణ చంద్రుఁ డవతరించి నాక్రీడ

లోనర్పినాఁడు. కావున ముందుగా నీతని వంశమును గూర్చి చెప్పి, ఆతరువాత నారాధ్యదైవమగు భగవానునిచారుచరిత్రమును నాకర్ణములందు ప్రసరింపుఁడు. ఇప్పటికి నాల్గవ దినము పూర్తియైనది. భగవంతుని యొక్కయు, నాతని నాశ్రయించిన భక్తులయొక్కయు కథలను వినుచునే నేను ప్రాణములను బరిత్యాగము చేసెదను."

సూతుఁడిట్లనెను:-"మునులారా! నాగురు దేవుఁడగు శుకమహర్షి ప్రాయోపవేశ వ్రతమొనర్చియున్న పరీక్షిన్మహారాజిట్లు ప్రశ్నింపఁగా నా రాజుయొక్క యుత్సాహమును గాంచి మిక్కిలి ప్రసన్నుఁడై రాజును మిక్కిలిగఁ బ్రశంసించుచు నిట్లనెను:-"రాజా! నీవు కథాతంతువును దెగనీయవు ప్రసంగమును సాగించెదవు. అప్రాసంగిక ప్రశ్న నడుగవు. మనువంశవర్ణనము వేయి సంవత్సరములకైనను బూర్తికాదు. అట్టియెడ నీమూఁడునాల్గు దినములలో నేను మనువంశమునంతను నెట్లువర్ణింపఁగలను? అవసరమును లేదు. వీరిలో ముఖ్యము లగు భగవద్భక్తులను బుణ్యకీర్తులగు రాజుల చరిత్రములను జెప్పుచుటతో నీకు భగవచ్చరిత్రమును జెప్పెదను మీరు ధ్యానముతో వినుఁడు." అని రాజుతోఁ బలికి శుకదేవుఁడాతనికి వైవస్వతమన్వంతర రాజుల వంశావళిని, చరిత్రములను వినుటకు నుద్యుక్తుఁడయ్యెను.

ఇది భాగవతకథలో బలిచక్రవర్తి

సమాప్తము